
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 151

సోమవారం 21-8-2017



రేపు బ్యాంకులు బంద్!

సమ్మెతో సేవలకు బ్రేక్. యథావిధిగానే ప్రైవేటు బ్యాంకులు... - బిజినెస్‌లో



లంకపై నిర్దాక్షిణ్యంగా..

భారత్‌కు మరో భారీ విజయం.. ధావన్ సెంచరీ.. రాణించిన కోహ్లి - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ నగర్ జిల్లాలో వరద బీభత్సం (విహంగ వీక్షణం)

వరద విలయం

బిహార్, యూపీ, అస్సాంలో 473 మంది మృత్యువాత

కజిరంగ పార్కులో 346 జంతువులు మృతి

నిర్లక్ష్యమే కారణం

మానవ తప్పిదం వల్లే 'ఉత్కళ్' రైలు ప్రమాదం

ప్రమాద మృతులు 22, క్షతగాత్రులు 156



ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో కొనసాగుతున్న బోగీల తొలగింపు

- ఫుల్‌అవుట్ IVలో

అండగా ఉంటా..

నంద్యాలలో ముస్లింలతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఆదివారం నంద్యాలలో బలిజల సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై మంత్రులు గంటా శ్రీనివాసరావు, కాలవ శ్రీనివాసులు, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు

సాక్షి బృందం, నంద్యాల

నంద్యాల నియోజకవర్గంలోని మైనారిటీలకు తాను అండగా ఉంటానని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా నంద్యాలలో ముస్లింలతో ఆయన సమావేశం నిర్వహించారు. నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీకి ఓట్లు వేసి గెలిపిస్తే ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాను అధికారంలోకి వచ్చాక మైనారిటీ వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టానన్నారు. అభివృద్ధి చేయడం తన ఒక్కరితోనే సాధ్యమని, ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలపించాలని మైనారిటీలకు విజ్ఞప్తి చేశారు. కాగా, కర్నూలు జిల్లాలో ముస్లింలకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోగా, రాష్ట్ర మంత్రివర్గంలోనూ చోటు కల్పించకపోవడం పట్ల సమావేశంలో పాల్గొన్న ఆ వర్గం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో

మిగతా 9వ పేజీలో ▶



ఆదివారం నంద్యాలలోని నందమూరినగర్‌లో రోడ్‌షోకు హాజరైన జనసందోహంలో ఓ భాగం.. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి

చెప్పిందేమిటి.. చేస్తున్నదేమిటి?

సీఎం చంద్రబాబు వైఖరిపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ నిలదీత

- మోసం చేయడం కోసం బాబు ఏ గడ్డి తినడానికైనా వెనుకాడరు
- చంద్రబాబు హైటెక్ పాలనలో ఫోన్ కొడితే చాలు మద్యం హోం డెలివరీ
- పేదవారికి భరోసా దొరికింది దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే
- టీడీపీ దౌర్జన్యాలను దేవుడు చూస్తున్నాడు.. మొట్టికాయలు తప్పవు
- మోసకారి బాబుకు గుణపాఠం చెప్పి.. విశ్వసనీయతకు పట్టం కట్టండి
- 12వ రోజు రోడ్‌షోలో ప్రజలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష నేత జగన్

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'అధికారంలోకి రావడానికి చంద్రబాబు 2014 ఎన్నికలప్పుడు ఎన్నెన్నో హామీలిచ్చాడు. రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్నాడు. ఇంటికో ఉద్యోగం ఇస్తానన్నాడు. అలా ఇవ్వలేకపోతే రూ.2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఇలా ఒక్కటి కాదు.. రెండు కాదు.. వందలాది హామీలు గుప్పించాడు. అరచేతిలో స్వర్గం చూపిస్తూ అన్ని వర్గాల వారి ఓట్లు వేయించుకుని

మిగతా 7వ పేజీలో ▶

అస్త్ర శస్త్రాలు.. వ్యూహాలు!

తార స్థాయిలో నంద్యాల ఉప పోరు.. చంద్రబాబు మోసాల్ని వివరిస్తూ జగన్ ప్రచారం

మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి ఒక్క హామీనీ నెరవేర్చలేదని నిలదీసిన విపక్ష నేత

హామీలు నెరవేర్చకుండా మళ్లీ హామీలు గుప్పించిన సీఎం.. భవనాల కూల్చివేతలే అభివృద్ధి

పరాకాష్టకు చేరిన అధికార దుర్వినియోగం.. ప్రలోభాలు.. లొంగకపోతే బెదిరింపులు

రూ.వందల కోట్లు మంచి నీళ్లలా ఖర్చు.. నేటితో ప్రచార పర్వానికి తెర..



2లో

రూ.4 కోట్ల సిగరెట్లు దోపిడీ

- రేణిగుంట వస్తున్న లారీపై దాడి చేసిన దుండగులు
- లారీ నుంచి మరో లారీలోకి మార్చుకుని పరార్
- హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై పెద్ద అంబర్‌పేట్ వద్ద ఘటన

8లో

23, 24న కోస్తాంధ్రలో భారీ వర్షాలు!

నేడు, రేపు తేలికపాటి వానలు
మహారాష్ట్ర వైపు అల్పపీడనం

సాక్షి, అమరావతి/విశాఖ: కోస్తాంధ్రలోని పలుప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తా యని వాతావరణ విభాగం తెలిపింది. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో జల్లులు, తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు ఈనెల 23, 24వ తేదీల్లో కోస్తాం ధ్రలో విస్తారంగా, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని ఆదివారం ప్రకటించింది. 'ఉత్తరాంధ్ర, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి మహారాష్ట్రలోని ఆగ్నేయ విదర్భలో కేంద్రీకృతమైంది. దీనికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. ఇది కోస్తాంధ్రవైపు మళ్లే అవకాశం ఉన్నందున 23, 24వ తేదీల్లో కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది' అని తెలిపింది. అల్పపీడనం మహారాష్ట్ర వైపు మళ్లినా రుతుపవన ద్రోణి ఆంధ్రప్రదేశ్ తీరంలోనే ఉన్నందున వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఆదివారం 31 మిల్లీమీటర్ల గరిష్ట వర్షపాతం నమోదైంది. చిత్తూరు జిల్లా రేణిగుంటలో 26 మి.మీ. వైఎస్సార్ జిల్లా ఓబులవారిపల్లెలో 24 మి.మీ. నెల్లూరు జిల్లా ఓజిలిలో 20 మి.మీ. చిత్తూరు జిల్లా కరకంబాడిలో 19.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



అర్చకులకూ బయోమెట్రిక్

ఏ–కేటగిరీ ఆలయాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలు

- వంశపారంపర్య అర్చకులకూ వర్తింపు
- సీఎం ఆదేశాల మేరకు దేవాదాయశాఖ ఉత్తర్వులు
- తప్పుపడుతున్న అర్చక సంఘాలు



2లో

అరకొరగా ఉప ప్రణాళిక

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు కేటాయింపులు తప్ప వ్యయం శూన్యం

- గిరిజన ప్రాంతాల్లో మంచినీటికి జీరో వ్యయం
- ఎస్సీ యువతకు ఆర్థిక సాయంలేదు
- నిధులు మురిగిపోవడమే ప్రభుత్వ లక్ష్యం!



8లో

గ్రూప్–2 అభ్యంతరాలు బుట్టదాఖలు



- పట్టించుకోకుండా రివైజ్డ్ కీ విడుదల
- ఆందోళన చెందుతున్న వేలాది మంది అభ్యర్థులు
- న్యాయపోరాటం చేస్తామంటున్న నిరుద్యోగులు

8లో

ఒంటరైనా ప్లానింగ్ తోడుండాలి

ఒంటరి మహిళలు లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడి పెట్టాలి



– బిజినెస్‌లో

రేపటి నుంచి సాక్షి ఎడ్జ్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

SAKSHI edge Finishing School

సాక్షి, హైదరాబాద్: ఏ భాషలోనైనా మన అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తం చేయాలంటే చక్కటి నైపుణ్యం ఉండాలి. ఇంగ్లిష్‌లో అలాంటి ప్రావీణ్యాన్ని సంపాదించేందుకు 'సాక్షి ఎడ్జ్' ఆధ్వర్యంలోని స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ దోహదం చేస్తుంది. మీలో అంతర్గతంగా నిక్షిప్తమై ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, ఇంగ్లిష్‌పై పట్టు సాధించే దిశగా మిమ్మల్ని నడిపిస్తుంది. ఇంగ్లిష్ నేర్చుకోవాలనే తపన ఉన్న వారికి 'సాక్షి ఎడ్జ్' వినూత్న శిక్షణ అందజేస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి విజేతలుగా నిలబెడుతుంది. ఈ స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులో భాషా పరిచయంతో పాటు, ఉచ్చారణలో దొర్లే తప్పులు, ఫ్లూయెన్సీ లింకింగ్‌ను అధిగమించడం, గ్రామర్ వంటి ముఖ్య అంశాలలో శిక్షణనిస్తారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు. తరగతులు 22వ తేదీ (మంగళవారం) నుంచి ప్రారంభమవుతాయి.

కాలపరిమితి: ఆగస్టు 22వ తేదీ నుంచి 30 రోజుల పాటు

వేళలు: సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటల వరకు

కోర్సు ఫీజు: రూ.4,600

రిజిస్ట్రేషన్లు, తరగతులు: సాక్షి ప్రధాన కార్యాలయం, సాక్షి టవర్స్, రోడ్ నం.1, కేర్ ఆస్పత్రి సమీపంలో, బంజారాహిల్స్, హైదరాబాద్.

వివరాలకు: ఫోన్ నంబర్ 9603533300లో (ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు) లేదా sakshiedge@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

అస్త్ర, శస్త్రాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు!

తార స్థాయిలో నంద్యాల ఉప పోరు ● చంద్రబాబు మోసాల్ని వివరిస్తూ జగన్ ప్రచారం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా పరిణమించిన నంద్యాల శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక పోరులో అధికార, ప్రతిపక్షాల మధ్య హోరెత్తుతున్న ప్రచారం తార స్థాయికి చేరుకుంది. ప్రచారానికి మరొక్క రోజే గడువు ఉండటంతో వైరి వర్గాలు తమ అస్త్ర, శస్త్రాలకు మరింత పదునెక్కించాయి. మాటల తూటాలు పేలుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న టీడీపీ.. ఓటర్లను మభ్య పెట్టే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. మూడున్నరేళ్ల పాలనలో ఒక్క హామీ నెరవేర్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ మాయ మాటలు చెబుతూ నంద్యాల ఓటర్లకు గాలం వేస్తున్నారు. ప్రజాబలం, వారి ఆదరణే అండగా వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కుటిల నీతిని ఎండగడుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తరఫున జగన్ రంగంలోకి దిగి ప్రచారం సాగిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి పక్షాన ముఖ్యమంత్రితో పాటు లోకేశ్ మినహా యావత్ మంత్రివర్గం నంద్యాలలో మకాం వేసి తమ అధికార బలాన్ని ప్రయోగిస్తోంది. బాలకృష్ణ కూడా రోడ్‌షో నిర్వహించారు. అడ్డదారి తొక్కైనా సరే విజయం సాధించాలనే తమ నాయకుడి ఆదేశాలను అక్షరాలా పాటించే దిశగా మంత్రులు వెళ్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక నేతలతో పాటు ఓటర్లనూ కొనుగోలు చేసేందుకు బరితెగించి వ్యవహరిస్తున్నారు.

మళ్లీ హామీలు.. ప్రలోభాలు.. బెదిరింపులు..

అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. 2014 ఎన్నికలకు ముందు మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలు, జిల్లాల వారీగా ఇచ్చిన హామీలు, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలన్నీ అటకెక్కించారు. అప్పులు మాఫీ చేస్తామని రైతులు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలను, ఇంటికో ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రారంభమైన సంక్షేమ పథకాలు.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రిగా కర్నూలు జిల్లాకు పలు హామీలు ఇచ్చారు. వీటన్నింటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. ఇపుడు నంద్యాల ఉప ఎన్నిక రాగానే చంద్రబాబు మళ్లీ హామీలు గుప్పిస్తూ ప్రజల ముందుకు వచ్చారు. రోడ్ల వెడల్పు పేరుతో భవనాలు కూల్చేస్తూ దానినే అభివృద్ధిగా చూపుతూ ప్రచారం చేస్తున్నారు. కనీసం మార్కెట్ ధర ప్రకారం కూడా నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వలేదు. ఎన్ని చేసినా నంద్యాల ప్రజలు నమ్మడం లేదని భారీ ఎత్తున ప్రలోభాల పర్వానికి తెర తీశారు. స్థానికంగా చిన్నా చితక నేతల కొనుగోలుకు కోట్లాది రూపాయలు గుమ్మరించారు. అదే రీతిలో ఓటర్లనూ కొనుగోలు చేయడానికి బరితెగించారు. ఇందుకు ససేమిరా అన్న వారి ఇళ్లపై పోలీసుల ద్వారా దాడులు చేయించారు. వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు.

దుష్ప్రచారానికీ ఒడిగట్టారు. రాష్ట్ర క్యాబినెట్ అంతా నంద్యాల్లోనే తిష్ట వేసి ఈ అరాచక కార్యక్రమాలు సాగిస్తోందంటే సర్కారు పెద్దలు ఎంతగా భయపడుతున్నారో తేటతెల్లమవుతోంది. ఈ అంశాలన్నింటినీ ఎండగడుతూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఒక్కో అంశాన్ని స్పష్టంగా వివరిస్తూ.. పాలకుల మోసకారితనాన్ని తూర్పారబట్టారు. వైఎస్సార్‌సీపీ బరిలో లేకపోయింటే నంద్యాలకు ఒక్క పైసా కూడా విదిల్చి ఉండేవారు కాదని స్థానికులు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

ఆకట్టుకున్న ప్రతిపక్ష నేత ప్రచారం

మూడేళ్లలో ఒకే ఒక్కసారి నంద్యాలకు వచ్చిన ముఖ్యమంత్రి.. ఉప ఎన్నికలనగానే నెలన్నరలోపు మూడు సార్లు పర్యటించి వేడిని రాజేశారు. రంజాన్ నెలలో నాటకీయంగా ముస్లింలకు నంద్యాలలోనే 'ఇఫ్తార్' విందు ఇచ్చి రాజధానిలో ఇవ్వాల్సిన విందు సంప్రదాయానికి స్వస్తి చెప్పారు. షెడ్యూలు వెలువడటానికి సరిగ్గా రెండు రోజుల ముందు వచ్చి ఒక రోజు పర్యటించి వెళ్లారు. తాజాగా ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో 19, 20 తేదీల్లో రోడ్ షోలు, వివిధ వర్గాల సమావేశాల్లో పాల్గొని ప్రచారం చేశారు. ప్రతిపక్ష నేత జగన్ ఈ నెల 3వ తేదీన ఎస్పీజీ మైదానంలో భారీ బహిరంగ సభలో ప్రచారం ప్రారంభించి హోరాహోరీ సమరానికి తెర లేపారు. ఆరోజు ఆయన చేసిన ప్రసంగం అన్ని వర్గాల ప్రజలనూ ఆకట్టుకుంది. ఇది చూసి గుండెలదిరిన అధికారపక్షం నానా యాగీ చేసింది. ఆయన ప్రభుత్వంపై చేసిన ఏ విమర్శకూ అధికార పక్షం నుంచి సమాధానమే లేకుండా పోయింది. జగన్ తన రెండో విడత ప్రచారానికి 9వ తేదీన నంద్యాలకు చేరుకున్నారు. అప్పటి నుంచి ప్రచారం కొనసాగిస్తున్నారు. జగన్ తొలుత రోడ్‌షోలు నిర్వహించాలని భావించినప్పటికీ దారి పొడవునా వెల్లువెత్తుతున్న ప్రజాదరణ, వృద్ధులు, యువత, మహిళల స్పందన చూశాక అన్ని వీధుల్లోకి వెళ్లక తప్పలేదు. తమ వీధిలోకి రావాల్సిందేనని, తమ ఇంట్లోకి రావాల్సిందేనని.. తమతో సెల్ఫీ దిగాల్సిందేనని పలువురు పట్టుబట్టడంతో ఆయన ఓపికగా అందరితో మాట్లాడుతూ ముందుకు సాగుతున్నారు. దీంతో షెడ్యూలు ప్రకారం జరగాల్సిన కార్యక్రమాలన్నీ బాగా ఆలస్యమయ్యాయి. ప్రతి రోజూ సుమారు 10 గంటల పాటు ఆయన ప్రజల మధ్యే గడిపారు. చంద్రబాబు మాత్రం రోడ్‌షో.. అధికారిక కార్యక్రమాలు, సమావేశాలకే పరిమితమై ప్రచారం సాగించారు. కాగా, సోమవారంతో ప్రచార పర్వానికి తెర పడనుంది. బుధవారం పోలింగ్ జరగనుంది.



నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పీసీసీ చీఫ్ రఘువీరా తదితరులు

డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు

అధికార పార్టీపై పీసీసీ చీఫ్ రఘువీరా ఆగ్రహం

నూనెపల్లె (నంద్యాల): నంద్యాల ఉప ఎన్నికలో అధికారపార్టీ నేతలు డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ టీడీపీ నేతలు చర్చిలు, మసీదులు, దేవాలయాలకు డబ్బులు ఇస్తున్నారన్నారు. ఎన్నికల నామినేషన్ పత్రాల్లో కూడా తప్పుడు వివరాలు చూపించారన్నారు. ఈ ఎన్నికలకు రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్నా.. అధికారులు కేవలం రూ.18.76 లక్షలు మాత్రమే పట్టుకున్నామని చెప్పడం శోచనీయమన్నారు. ప్రతి ఓటరుకు వెయ్యి రూపాయల నుంచి రూ. 2వేల వరకు ఇస్తున్నారన్నారు. అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలను అధికారులు సీజ్ చేయడం లేదని ఆరోపించారు. చట్టానికి విరుద్ధంగా కుల సంఘాలతో సమావేశం నిర్వహించడం, కౌన్సిలర్లకు హామీలు ఇస్తుండడం శోచనీయమన్నారు. అనంతరం ఈ విషయాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఓడిస్తేనే.. దళితుల సత్తా ఏంటో తెలుస్తుంది

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

తుని రూరల్: నంద్యాల ఉపఎన్నికలో తెలుగు దేశం పార్టీని ఓడించాలని.. అప్పుడే దళితుల సత్తా ఏంటో చంద్రబాబుకు తెలుస్తుందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ అన్నారు. దళితులను కించపరిచేలా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిని వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా తునిలో ఆయన మాలమహానాడు కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి ఆదినారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సై సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆదినారాయణరెడ్డి దళితులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాజేశ్ డిమాండ్ చేశారు. మంత్రిపై ఇప్పటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదో సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర నాయకులు కొల్లపు వేణు, బి.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

2018 నుంచి ఐఐటీ ప్రవేశపరీక్ష ఆన్‌లైన్‌లోనే

చెన్నై : ఐఐటీ ప్రవేశపరీక్షను 2018 నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని జాయింట్ అడ్మిషన్ బోర్డు(జేఏబీ) తెలిపింది. ఐఐటీల్లో అడ్మిషన్ల విధివిధానాలను రూపొందించే జేఏబీ ఆదివారం నాడిక్కడ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మద్రాస్ ఐఐటీ డైరెక్టర్, జేఏబీ చైర్మన్ ప్రొ.భాస్కర్ రామమూర్తి ఈ విషయమై మీడియాతో మాట్లాడుతూ.. 'ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షను 2018 నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని నిర్ణయించాం. ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఇతర అంశాలను సమయానుగుణంగా వెల్లడిస్తామ'ని పేర్కొన్నారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఇంతకుముందే విద్యార్థులకు ఐఐటీ–జేఈఈ మెయిన్స్ పరీక్షను ఆన్‌లైన్‌లో రాసే అవకాశం కల్పించింది. అయితే ఈ ఏడాది మెయిన్స్ రాసిన 13 లక్షల మంది విద్యార్థుల్లో కేవలం 10% మంది మాత్రమే ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకున్నారు.

అర్చకులకూ బయోమెట్రిక్

- ఏ–కేటగిరీ ఆలయాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలు
- వంశపారంపర్య అర్చకులకూ వర్తింపు
- సీఎం ఆదేశాల మేరకు దేవాదాయశాఖ ఉత్తర్వులు
- తప్పుపడుతున్న అర్చక సంఘాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆలయాల్లో పనిచేసే అర్చకులకూ బయోమెట్రిక్ హాజరును రాష్ట్రప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో మూడు కేటగిరీల ఆలయాలుండగా.. ఏడాదికి రూ.25 లక్షలకు పైబడి ఆదాయం వచ్చే (ఏ–కేటగిరీ)ఆలయాల్లో సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి ఈ నిబంధన అమలులోకి రానుంది. ఈ మేరకు దేవాదాయశాఖ ఆర్సీ నంబర్ ఏ3/3789 ఉత్తర్వులను జారీ చేసింది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి బయోమెట్రిక్ యంత్రాల్లో నమోదైన హాజరును బట్టే అర్చకులకు జీతాలు చెల్లిస్తామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. నెలసరి జీతాల ప్రాతిపదికన అర్చకుల్ని నియమించుకున్న ఆలయాలతోపాటు వంశపారంపర్య అర్చకత్వం కొనసాగుతున్న ఆలయాల్లోనూ ఈ నిబంధనను అమలు చేయనున్నట్టు తెలిపింది. ఆగస్టు 2న సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్టు పేర్కొంది. పీఆర్సీ అమలు చేస్తున్న 11 ఆలయాల్లో మాత్రమే మొదటగా బయోమెట్రిక్ హాజరు అమలుకు ఏడాదిక్రితం శ్రీకారం చుట్టగా.. ఇప్పుడు ఏ–కేటగిరీలోని ఆలయాలన్నింటిలోనూ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయి. తదుపరి దశల్లో మిగిలిన ఆలయాల్లోనూ ఈ నిబంధన వర్తింపజేసే వీలుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అర్చక సంఘాల అభ్యంతరం..

ఇదిలా ఉండగా వంశపారంపర్య అర్చకత్వం కొనసాగుతున్న ఆలయాల్లో బయోమెట్రిక్ అమలు చేయాలన్న ఆలోచనను అర్చక సంఘాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి. అర్చకులుగా పనిచేస్తున్న వారందరికీ ప్రభుత్వం అధికారికంగా వారాంతపు సెలవుల్ని అమలు చేయట్లేదని, కేవలం పీఆర్సీ ద్వారా జీతాలు పొందే అర్చకులకే వారాంతపు సెలవు అమలులో ఉందని అవి పేర్కొంటున్నాయి. వంశపారంపర్య అర్చకులుగా కొనసాగుతున్నవారికి వారాంతపు సెలవు అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిబంధనలు రూపొందించలేదన్నాయి. దీనికితోడు వంశపారంపర్య అర్చకత్వం కొనసాగుతున్న ఆలయాల్లో అధికారికంగా ఒకరిద్దరే అర్చకులుగా దేవాదాయశాఖ వద్ద నమోదవగా.. ఆయా కుటుంబాల్లోని అన్నదమ్ములు వంతులవారీగా ఆలయ పూజా కార్యక్రమాలో పాల్గొంటూ ఆ ఇచ్చే జీతాన్ని సమంగా పంచుకునే పరిస్థితులున్నాయని చెబుతున్నాయి. బయోమెట్రిక్ హాజరువల్ల ఇలాంటి ఆలయాల్లో తీవ్ర ఇబ్బందులు ఉత్పన్నమవుతాయని అర్చక సంఘ ప్రతినిధులు అంటున్నారు.

అర్చకులకు బయోమెట్రిక్ సరికాదు

అందరు ఉద్యోగుల మాదిరిగా ఏ–కేటగిరీ ఆలయాల్లోని అర్చకులకూ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాం. భక్తుల రద్దీనిబట్టి అర్చకులం కనీసం 18 గంటలు పనిచేస్తున్నాం. పర్వదినాల్లో రోజంతా పనిచేస్తాం. సూతకం వచ్చినా, అనారోగ్యం ఏర్పడినా మా కుటుంబీకులనో, ఇతరులతోనో అధికారుల అనుమతితో మా స్థానంలో పనిచేయించడం ద్వారా భక్తులకు ఇబ్బందుల్లేకుండా చేస్తున్నాం. విపత్కర సమయాల్లో మా స్థానంలో ఇతరులు పనిచేసినప్పుడు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు నమోదుకు సంబంధించి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని దేవాదాయశాఖ కమిషనర్‌ను కలసి కోరాం. సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం.

– కె.ఫణికుమార్, అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు

ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు!

- స్థానికేతర ఉద్యోగుల పరస్పర మార్పిడికి కసరత్తు
- తెలంగాణ, ఏపీల మధ్య సరిసమాన పంపకానికి అంగీకారం
- విధివిధానాలపై కసరత్తు చేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీలో పని చేస్తున్న ఉద్యోగుల పరస్పర మార్పిడిపై కసరత్తు మొదలైంది. రాష్ట్ర విభజన అనంతరం కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యోగుల పంపిణీ ప్రక్రియ ముగిసింది. దామాషా పద్ధతి, పోస్టుల సంఖ్య, ఉద్యోగుల ఆప్షన్లు, స్థానికతను పరిగణనలోకి తీసుకోవటంతో తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి, ఏపీ స్థానికతకు చెందిన వారు తెలంగాణకు పంపిణీ అయ్యారు. కమలనాథన్ కమిటీ ఇచ్చిన తుది కేటాయింపులు కావటంతో రెండు రాష్ట్రాలు ఆమోదించినా స్థానికేతర రాష్ట్రాలకు పంపిణీ అయిన ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. తిరిగి తమను సొంత రాష్ట్రానికి పంపాలని కమలనాథన్ కమిటీకి అర్జీలు పెట్టుకున్నారు. ఇటీవల రెండు రాష్ట్రాలు మంత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సమక్షంలో జరిపిన చర్చల్లో ఈ అంశం చర్చకొచ్చింది. తుది సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏపీ నుంచి ఎంత మంది ఉద్యోగులొస్తే.. తెలంగాణ నుంచి అంతమంది ఉద్యోగులను పంపాలని రెండు రాష్ట్రాలు ఓ అంగీకారానికొచ్చాయి. అంటే సమాన సంఖ్యలో పరస్పర మార్పిడి చేసుకునేందుకు నిర్ణయానికొచ్చాయి. అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

13 మంది గెజిటెడ్ అధికారుల మార్పిడి..

ఇప్పటివరకు వచ్చిన అర్జీల ప్రకారం.. ప్రస్తుతం ఏపీ స్థానికత ఉండి తెలంగాణలో పని చేస్తున్న గెజిటెడ్ అధికారుల్లో 117 మంది ఏపీకి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఏపీలో పని చేస్తున్న గెజిటెడ్ అధికారుల్లో తెలంగాణకు చెందిన వారు 13 మంది. సమాన సర్దుబాటు ప్రకారం ఏపీలో ఉన్న 13 మందిని తెలంగాణకు పంపి, తెలంగాణలో పనిచేస్తున్న 117 మందిలో 13 మందిని ఏపీ తీసుకోవాల్సి ఉంటుంది. నాన్ గెజిటెడ్ అధికారుల్లో 61 మంది ఏపీకి చెందిన వారు తెలంగాణలో పనిచేస్తుండగా, 240 మంది తెలంగాణ వాళ్లు ఏపీలో పనిచేస్తున్నారు. 61 మందిని తీసుకుని 240 మందిలో 61 మందిని ఏపీకి పంపించాల్సి ఉంటుంది. నాలుగో తరగతి ఉద్యోగుల్లో ఏపీ వాళ్లు నలుగురే తెలంగాణలో పనిచేస్తుండగా, ఏకంగా 800 మంది ఉద్యోగులు తెలంగాణ స్థానికత కలిగిన వారు ఏపీలో ఉన్నారు. ఆ 800 మందిలో ఎవరిని పంపాలన్న విషయంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. కొత్తగా రెండు రాష్ట్రాలు తీసుకున్న ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి స్థానిక ఉద్యోగులను సర్దుబాటు చేసుకోవాల్సిన రెండు రాష్ట్రాలు ఉద్యోగుల పంపిణీ సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాపుల గొంతు కోసింది చంద్రబాబే

మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ విమర్శ

నంద్యాల వ్యవసాయం: కాపుల గొంతు కోసింది టీడీపీ అధినేత చంద్రబాబేనని, ఆ విషయాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యే బోండా ఉమానే స్వయంగా చెప్పారని మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరాహార దీక్ష చేస్తున్న వంగవీటి రంగాను కత్తులు, గొడ్డళ్లతో నరికి చంపించింది చంద్రబాబేనని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఎన్నికల ముందు కాపులకు రిజర్వేషన్ కల్పిస్తానని హామీ ఇచ్చి.. ఇప్పుడేమో మంజునాథ నివేదిక రావాలంటున్నారని దగా చేస్తున్నారన్నారు. ముద్రగడ ఇంటినే జైలుగా మార్చి ఆయనను హింసించి వేధిస్తున్నారన్నారు. అలాంటి పార్టీకి కాపులు, బలిజలు ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. హోల్‌సేల్‌గా అబద్ధాలు ఆడే చంద్రబాబును నంద్యాల ప్రజలు ఓటు ద్వారా తరిమి కొడతారన్నారు. దేశంలో మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వని ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబేనన్నారు. మైనార్టీలకు మంత్రి పదవుల్లో పెద్దపీట వేసి, నాలుగుశాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని ఆయన గుర్తు చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకొని జెండాలు లేకుండా ప్రచారాలు చేయాలంటూ నంద్యాలలో కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. ముస్లింలు, మత పెద్దలు జాగ్రత్తగా ఆలోచించి చంద్రబాబు మోసాలు, వంచనలు తిప్పికొట్టి ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ర్యాలీలో పాల్గొన్న విశ్వరూప్ తదితరులు

టీడీపీ ఎమ్మెల్యే స్వగ్రామంలో వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం

ఉప్పలగుప్తం (అమలాపురం): టీడీపీకి చెందిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వగ్రామం ఎస్.యానాంలో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామానికి చెందిన మత్స్యకారుల నాయకుడు లంకే శ్రీను నాయకత్వంలో మల్లాది చంద్రశేఖర్, లంకే కాసుబాబు, దుర్గాప్రసాద్, మణికంఠ, అంగాని ప్రసాద్, శ్రీను, నరసింహస్వామి, సంగాని నరసింహమూర్తి, శ్రీను, క్రి రమేష్, ఓలేటి రాంబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ వారికి కండువాలు వేసి ఆహ్వానం పలికారు. వారు పార్టీలో చేరిక సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు.

'దేశం' దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు విజయసాయిరెడ్డి పిలుపు
- కాకినాడలో ప్రచారానికి శ్రీకారం

కాకినాడ

నంద్యాల, కాకినాడల్లో తమకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అధికార తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీ వి.విజయసాయిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులు, ఐదు జిల్లాల సమన్వయకర్తలతో ఆదివారం జరిగిన సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. గడచిన మూడున్నరేళ్లలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయకపోవడంతో ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన చంద్రబాబు సర్కార్, ఓటమి భయంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పై పథకం ప్రకారం బురద జల్లేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన ఏడాదిన్నరలో సాధించేది ఏమీలేదన్నారు. ఈ వాస్తవాన్ని ప్రజలకు తెలియజెప్పి వైఎస్ స్వర్ణయుగం జగన్‌తోనే సాధ్యమన్న వాస్తవాన్ని ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు నంద్యాల, కాకినాడ ఎన్నికలు ఎంతో కీలకమన్నారు. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. కుతంత్రాలు, దౌర్జన్యాలతో ఎన్నికల్లో గెలుపొందలేరన్నారు. మాజీమంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు.



34వ డివిజన్‌లో వృద్ధులతో ముచ్చటిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ధర్మానకృష్ణదాస్ తదితరులు

ఒకే డోర్ నంబర్‌తో 350 ఓట్లు: చెవిరెడ్డి


ఎన్నికల్లో గెలిచేందుకు మద్యం, డబ్బు పంపిణీతోపాటు దొంగ ఓట్ల ద్వారా తెలుగుదేశం పార్టీ ఎన్నో కుతంత్రాలకు పాల్పడుతోందని కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. ఒకే డోర్ నంబర్‌తో 350కి పైగా ఓట్లు నమోదు చేయించిన విషయం బయటపడిందన్నారు. ఇటువంటి అవకతవకలను గుర్తించి అక్రమాలకు అడ్డుకట్టవేయాలన్నారు. ఈ విషయంలో సమన్వయకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలతోపాటు జగన్ నాయకత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని అనుకూలంగా మలచుకునే బాధ్యత పార్టీ శ్రేణులదేనన్నారు. కాగా, కాకినాడ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోగలమనే ధీమాను కన్నబాబు వ్యక్తం చేశారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చలమశెట్టి సునీల్ మాట్లాడుతూ, వేల కోట్లతో కాకినాడను స్మార్ట్‌సిటీ చేస్తానని గొప్పలు చెప్పిన పాలకులు స్మార్ట్‌గా మోసం చేశారని విమర్శించారు. తెలుగుదేశం అసమర్థ విధానాలతోపాటు స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అవినీతి, దౌర్జన్యాలను కూడా ప్రజల దృష్టికి తీసుకువెళ్తామని కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి చెప్పారు. మరో కో–ఆర్డినేటర్ ముత్తా శశిధర్ మాట్లాడుతూ, అందరికీ ఇళ్లు, ఇంటింటికీ మంచినీటి కుళాయి పేరు వంటి ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలుచేయలేకపోయారని టీడీపీ ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు పినిపే విశ్వరూప్, మాజీ మంత్రులు పార్థసారథి, మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, దాడిశెట్టి రాజా, వంతల రాజేశ్వరి, విశ్వాసరాయి కళావతి, రాజన్నదొర, రక్షణనిధి, గిడ్డి ఈశ్వరి, ముత్యాల నాయుడు, కోన రఘుపతి, కంబాల జోగులు, మేకా ప్రతాప్, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఐదు జిల్లాల నుంచి వచ్చిన సమన్వయకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రచారం

కాగా, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున విజయసాయిరెడ్డి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 34వ డివిజన్ అభ్యర్థి పసుపులేటి వెంకటలక్ష్మి విజయానికి కృషిచేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆ వార్డులో రాత్రి 10 గంటల వరకు ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు బెదిరిస్తున్నారు

పోలీసులకు హాస్యనటుడు వేణుమాధవ్ ఫిర్యాదు



కర్నూలు(టౌన్): వైఎస్సార్‌సీపీ నాయకులు తనను చంపేస్తామని ఫోన్లలో బెదిరిస్తున్నారంటూ సినీ హాస్యనటుడు వేణుమాధవ్ ఆదివారం కర్నూలు డీఎస్పీ రమణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నాలుగైదు రోజులుగా తాను కర్నూలులో ఉంటూ నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ తరఫున ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన కొంతమంది నాయకులు తనకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. వేణుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ అభిమాని అరెస్టు

ఫేస్‌బుక్‌లో సీఎంపై పోస్టు పెట్టాడని అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివాదానికి కారణమైన పోస్టు



బసవరాజు

శాంతిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఫేస్‌బుక్‌లో వ్యంగ్యంగా పోస్టు పెట్టాడంటూ వైఎస్సార్‌సీపీ అభిమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారం క్రితం ఫేస్‌బుక్‌లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా అధికార టీడీపీకి చెందిన ఒకరు పోస్టు పెట్టారు. ఆ పోస్టును చూసి సహించలేనిచిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కాలిగానూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని బసవరాజు దాన్ని ఖండిస్తూ ఫేస్‌బుక్‌లో సీఎంపై ఓ ఫొటో కామెంట్ పోస్ట్ చేశాడు. దీనిపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో దర్జీగా పనిచేస్తున్న బసవరాజుకు ఫోన్ చేసి పిలిపించారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు పోలీసు స్టేషన్ వద్దకు రాగానే లోపల కూర్చోబెట్టారు. 3 గంటలకు సీఐ పిలుస్తున్నారంటూ కుప్పం తీసుకువెళ్లారు. అక్కడి నుంచి గుడుపల్లి స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించి రాత్రి విడుదల చేశారు. వైఎస్ జగన్‌పై సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిని వదిలేసి, దాన్ని ఖండించిన వ్యక్తిని అరెస్ట్ చేయడం దారుణమని బసవరాజు కుటుంబీకులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేధింపులను సహించం..

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న రాజకీయ వేధింపులను సహించబోమని కుప్పం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.చంద్రమౌళి తేల్చిచెప్పారు. అధికార పార్టీ దురాగతాలపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. ప్రతి కార్యకర్తనూ, అభిమానిని కాపాడుకుంటామన్నారు.

సెలవు రోజు వెబ్ కౌన్సెలింగ్‌పై అభ్యర్థుల ఆందోళన

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియలో భాగంగా వెబ్ కౌన్సెలింగ్ తేదీల ఖరారుపై ముస్లిం మైనార్టీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. 3వ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం (ఆగస్ట్ 21) వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఆదివారం సెలవు కావడంతో ఎక్కడా ఆన్‌లైన్ సెంటర్లు పనిచేయలేదు. పైగా దీన్ని అత్యాధునిక వెర్షన్ కంప్యూటర్లలో మాత్రమే నమోదు చేయాల్సి ఉంది. ఉదాహరణకు రాజమహేంద్రవరం మొత్తానికి ఇలాంటి కంప్యూటర్లున్న సెంటర్లు రెండే ఉన్నాయి. అవి రెండూ ఆదివారం మూసివేసి ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తాము ఎక్కడి నుంచి దరఖాస్తు చేయాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం 21వ తేదీ సాయంత్రం వరకైనా సమయం ఇవ్వకుండా మధ్యాహ్నం 2 గంటలకే గడువు ఇచ్చారని తెలిపారు. దీనిపై ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అధికారులు పునరాలోచించాలని కోరుతున్నారు.

• అల్మారా

తెలుగు పత్రికలకు ఇంగ్లిష్ తెగులు



విశ్లేషణ: కె.ఎల్.రెడ్డి; పేజీలు: 148; వెల: 110; ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్–68. ఫోన్: 24224453

డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మరణలో
రచయిత్రుల కొత్త కథలు



సంకలనం: డాక్టర్ తెన్నేటి సుధాదేవి; పేజీలు: 314; వెల: 200; ప్రచురణ: వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్. ప్రతులకు: జ్యోతి వలబోజు; ఫోన్: 8096310140

నాటికలు–హాస్య నాటికలు



రచన: యాముజాల రామచంద్రన్; పేజీలు: 288; వెల: 220; ప్రతులకు: రచయిత, విల్లా నం. 47, మేపుల్ టౌన్ గేటెడ్ కమ్యూనిటీ, సన్ సిటీ, బండ్లగూడ, హైదరాబాద్–86. ఫోన్: 9247485690

• స్మరణ

తెలుగు కథకు చార్మీనార్ నెల్లూరి



> **నెల్లూరి కేశవస్వామి కథల్లో ఆనాటి దేవిడీలు, కోఠీలు, దివాన్ ఖానాలు, నానా ఖానాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. నవాబులు, నవాబ్ పాషాలు, దుల్హన్ పాషాలు, బేగం సాహెబాలు, ఖాజీలు, హకీం సాబ్‌లు, ఇమామ్‌లు, మౌల్వీలు, ఉస్తాద్‌లు ఈ రోజు లేరు. వారు ధరించిన షల్వార్‌లు, దుపట్టాలు, కమీజులు, చమ్కీలు, ఘాఘ్రాలు వాడుకలో పెద్దగా లేవు. అయినా కేశవస్వామి సాహిత్యంలో ఇవన్నీ భద్రపరచబడి ఉన్నాయి. ఆయన కథలు చదువుతూ ఉంటే సాలార్‌జంగ్ మ్యూజియంలో గత వైభవ చిహ్నాల్ని చూసి తబ్బిబ్బయినట్లు ఉంటుంది.**

నెల్లూరి కేశవస్వామి (1920–1984) హైదరాబాదు దక్కన్‌లో పుట్టి, హైదరాబాదులోనే పెరిగి, ఇక్కడే నీటి పారుదల శాఖలో ఇంజనీర్‌గా ఉద్యోగం చేసి, ఉన్నత శ్రేణి కథకుడిగా ఎదిగారు. నిజాం పాలన నాటి రోజుల్ని, స్వతంత్ర భారతంలో క్రమంగా మారుతూ వచ్చిన పరిస్థితుల్ని స్వయంగా చూసిన వ్యక్తి. ముఖ్యంగా 13–17 సెప్టెంబర్ 1948న యూనియన్ సైన్యాలు హైదరాబాద్ నగరాన్ని చుట్టు ముట్టి ఆక్రమించుకోవడం, నిజాం లొంగిపోయి తన స్వతంత్ర రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చెయ్యడం... వాటిని పూసగుచ్చినట్లు 'యుగాంతం' కథలో అక్షరీకరించిన రచయిత. ఫ్యూడల్ రాజ్యానికి చరమ గీతం పాడిన సృజనకారుడు.

అప్పుడు జరిగిన మార్పుల్లో శుక్రవారం సెలవు ఆదివారానికి మారింది. దక్కన్ రేడియో ఆలిండియా రేడియో అయ్యింది. కల్దారు నాణాలు చెల్లకుండా పొయ్యాయి. పాఠశాలల్లో ఉరుదూ మీడియం మారిపోయింది. షేర్వాణీలు, రూమీ టోపీలు మాయమవుతూ వచ్చాయి. ఒక గొప్ప ఫ్యూడల్ రాచరికపు చిహ్నంగా చార్మీనార్ తలెత్తుకు నిలబడింది. అయితే కేశవస్వామి దాన్ని ఉన్నదున్నట్లుగా శ్లాఘించలేదు. ఆ వ్యవస్థలోని అవలక్షణాల్ని ఈసడిస్తూనే మనుషులుగా హిందూ ముస్లింల స్నేహాన్ని ఆకాంక్షించారు. ఒక చారిత్రిక నేపథ్యాన్ని ఒక సాంస్కృతిక నేపథ్యాన్ని తన కథల్లో నిక్షిప్తం చేస్తూనే, ఒక మహారచయిత ఎదగాల్సిన స్థాయికి ఎదిగారు. కానీ ఎందువల్లనో ఆయనకు రావాల్సినంత గుర్తింపు రాలేదేమోనని అనిపిస్తుంది.

నెల్లూరి కేశవస్వామి కథల్లో నాటి కట్టడాలు, భవనాలు, తినుబండారాలు, ఆస్తులు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఆనాటి దేవిడీలు, కోఠీలు, దివాన్ ఖానాలు, నానా ఖానాలు ఈ అరవైయేళ్ళలో చాలావరకు ధ్వంసమైపొయ్యాయి. నాటి నవాబులు, నవాబ్ పాషాలు, దుల్హన్ పాషాలు, బేగం సాహెబాలు, ఖాజీలు, హకీం సాబ్‌లు, షేక్ ఇమామ్‌లు, మౌజ్జన్‌లు, మౌల్వీలు, మామాలు, ఉస్తాద్‌లు ఈ రోజు లేరు. వారు ధరించిన షల్వార్‌లు, దుపట్టాలు, కమీజులు, చమ్కీలు, ఘాఘ్రాలు వాడుకలో పెద్దగా లేవు. అయినా కేశవస్వామి సాహిత్యంలో ఇవన్నీ భద్రపరచబడి ఉన్నాయి. ఆయన కథలు చదువుతూ ఉంటే సాలార్‌జంగ్ మ్యూజియంలో గత వైభవ చిహ్నాల్ని చూసి తబ్బిబ్బయినట్లు ఉంటుంది. హైదరాబాదులోని ఇన్ని సాంస్కృతిక వైరుధ్యాలు ఇంత ప్రతిభావంతంగా మరే తెలుగు రచయిత తమ కథల్లో వ్యక్తీకరించలేదని అంటే అతిశయోక్తి కాదు. దలావర్, నజ్మీ, అమీనా లిబ్నా, హసన్, రజియా, కమల్‌రాయ్, బిల్కిస్, మహబూబ్‌రాయ్ సక్సేనా, ఇక్బాల్, గులాం, రమణి, బిందు, రాధ వంటి పాత్రలు ఈయన కథల్లో కనిపిస్తాయి. డబీర్‌పురా, మీర్ ఆలంమండి, చార్ కమాన్ లాంటి సంఘటనా స్థలాలు తారసపడతాయి. చాయ్, పాన్, ఖూబానీకా మీఠా, నవాజ్, షర్బత్, ఈద్ లాంటి మాటలు నాటి సాంస్కృతిక చిహ్నాలుగా ఇప్పటికీ మనకు హైదరాబాద్‌లో వినిపిస్తూ ఉన్నాయి.

ఆ రోజుల్లో మామూలుగా వినిపించే తఖల్, చాదర్, ఖుష్కా, మెహద్ జౌహరీ, పాతెహా... ముస్లిం పరదాల వెనుక, బుర్ఖాల వెనక, వినబడే అనేకానేక మాటలు, పలుకుబళ్ళు, సామెతలు, నానుడులు, జీవనగాథలు, వెతలు కేశవస్వామి కథల్లో నమోదై ఉన్నాయి. కేవలం ఆయన మాత్రమే ఎలా నమోదు చేయగలిగారంటే ఆయనకు చిన్నప్పటి నుండి బాల్య స్నేహితులు ఎక్కువ మంది ముస్లింలు ఉండటం, తెలుగుతో పాటు ఉరుదూ కూడా ధారాళంగా మాట్లాడగలగడం, ఇంజనీర్‌గా ఉన్నతోద్యోగంలో ఉండడం వల్ల నవాబ్‌లతో స్నేహం పెరగడం, వారితో విందులు, వినోదాలలో పాలు పంచుకోవడం వగైరా ఎన్నో కారణాలున్నాయి. భాష పట్ల, మానవ ప్రవృత్తి పట్ల, రచయితగా ఒక పరిశీలనా దృష్టి ఉండటం వల్ల ఆయన హైద్రాబాద్ సంస్కృతి నేపథ్యంలోంచి కథలు రాయగలిగారు. ఆయనకు మాత్రమే వీలయ్యింది. తన కెదురైన జీవితాన్ని రచయితగా అశ్రద్ధ చేయలేదు.

హిందూ ముస్లిం విభేదాల్ని పక్కన పెట్టి, షియా సున్నీ భేదం పక్కన పెట్టి మేం ''కేవలం మనుషులం'' అని ప్రకటించి ఒక ప్రేమికుల జంట ఒకటవుతారు. మతాలు మారకుండానే భార్యా భర్తలుగా మనగలమని 'కేవలం మనుషులం' కథలో ధైర్యంగా ప్రకటిస్తారు. 'వంశాంకురం' కథ మత సంప్రదాయాలకు అతీతమైన మానవీయ సంబంధాలను ఎలుగెత్తి చాటింది. హైద్రాబాద్ డబీర్‌పురాలోని అమీన అనే అమ్మాయి దుబాయ్‌లో షేక్ ఇంట్లో ఆయన అనేక మంది భార్యల్లో ఒకతి కావడం, విముక్తి కోసం పెనుగులాడడం 'ఆఖరి కోరిక'లో వివరించబడింది. నవాబుల ఇళ్ళలో సంగీత సాహిత్యాల అభిరుచి, ఆ స్థాయి, ఆ దర్జా వర్ణించాలంటే సామాన్యులకు వీలుకాదు. ఆ వాతావరణంలో మెలిగి, ఆ మనుషుల అంతరాత్మలు అధ్యయనం చేసిన కేశవస్వామి లాంటి వారికే సాధ్యం! 'రూహీ–ఆపా' చదివితే ఆయన కథాకథన వైభవం పాఠకుడి మనసులో జీవితాంతం నిలిచిపోతుంది.

నవాబుల ఇళ్ళలో దాసీలను ఆటవస్తువులుగా వాడుకునే ఆచారాలన్నీ తిరస్కరించిన సుల్తాన్ అనే విద్యావంతుడు దాసీనే పెండ్లాడి అలీఘడ్ పారిపోయి ఉద్యోగిగా స్థిరపడడం 'విముక్తి'లో చూస్తాం. 'ప్రతీకారం'లో పాషా నవాబు గారి అక్రమ సంతానం లచ్చూ అనే హిందూ మహిళకు పుడతాడు. అతను నవాబు కొడుకైనా వారసత్వ హక్కులేవీ ఉండవు. ఆ కసితో ప్రతీకారం తీసుకోవాలను కుంటాడు. నవాబుగారి అసలు కోడలు గుడ్డీరాణిని తన బాహువుల్లోకి ఆకర్షిస్తాడు. మరో కథ 'అదృష్టం'లో నవాబు పశుబలంతో సర్రాఫ్ (కాషియర్) భార్య శీలాన్ని హరిస్తే, నవాబు రెండో భార్య తనకన్నా పన్నెండేళ్ళు చిన్నవాడైన సర్రాఫ్ కొడుకుని చేరదీసి, పెండ్లి చేసుకుంటుంది. చట్టానికి దొరకకుండా, ఆస్తిపాస్తులు ఇతరులకు పోకుండా, ముస్లిం మత ఆచారాల ప్రకారం జాగ్రత్త పడుతుంది.

షరీఫా అనేది అద్భుతమైన కథ, రాత్రి మందు పార్టీలో పాల్గొన్న ఒకతను ఇంటికి వెళుతూ ఉంటే రిక్షావాడు ఆపి, రిక్షాలో ఉన్న వేశ్యను చూపిస్తాడు. ఆమె అతణ్ణి తన గదికి తీసుకువెళ్ళి, బట్టలిప్పుకుని పక్కన కూర్చుంటుంది. అతను ఆమె వక్షోజం తాకుతాడు. అతని ముఖం మీద పాలు చిమ్ముతాయి. ఆమె అతనికి క్షమాపణ చెప్పి, పరదా వెనుక ఏడుస్తున్న చంటి వాడికి పాలు కుడుపుతుంది. అతను తన జేబులోని డబ్బంతా తీసి ఆమె చేతిలో కుక్కి వడివడిగా బయటపడతాడు. బయట ఉన్న రిక్షావాడు ''వెళ్ళొద్దు సాబ్, నా భార్య మొండి ముండ సాబ్, నేను సర్ది చెబుతాను సాబ్'' అని ప్రాధేయపడతాడు. ''నేనెవరి దగ్గరా భిక్షం తీసుకోను'' అని బయటకి వచ్చిన షరీఫా క్రోధంగా కేకలేస్తుంది. 'ఆ ఇచ్చిన డబ్బు తనకు కాదని చంటిబాబుకు కానుక' అని చెప్పి, విటుడు చీకటిలో మాయమవుతాడు. నాలుగు పేజీల చిన్న కథలో ఒక పూర్తి జీవితాన్ని చిత్రించిన తీరు ఒక అద్భుతమైతే, ప్రతి పేజీలో ఒక మలుపుతో ఉత్కంఠ భరితంగా రాయడం మరో ఎత్తు. బీదరికం, ఆకలి చెప్పకుండానే చెప్పడం, సెక్స్‌కథలా నడిపించి దాన్ని మాతృత్వంలోకి మళ్ళించడం, భర్త అనుమతితో వ్యభిచరించి డబ్బు గడిస్తున్న స్త్రీకి కూడా ఒక నీతి ఉండడం, చివరిగా వారి పరిస్థితిని అర్థం చేసుకుని ఆ విటుడు డబ్బిచ్చి చంటి బాలుడికి కానుక అనడం వల్ల, రచయిత ఉదాత్తంగా, హుందాగా కథను ముగించినట్లయ్యింది. ఇది హైదరాబాదు పాతబస్తీలోని సందుల్లోంచి తీసుకున్న ఇతివృత్తమైనా, ఇందులో విశ్వజనీనత ఉంది. మానవ జీవితంలోని దైన్యం, విషాదం ఉన్నాయి. మనం మనుషులమని గర్వంగా చెప్పుకో గలిగే అంశమూ ఉంది. హైద్రాబాద్ సాంస్కృతిక చిహ్నంగా చార్మీనార్ నిలబడినట్లే కేశవస్వామి కథల సంపుటి 'చార్మీనార్' కూడా అలాగే నిలబడింది. ఇందులో హైదరాబాద్ తెలుగు భాష ఒక మినార్, సంస్కృతి ఒక మినార్, రాజకీయ నేపథ్యం ఒక మినారయితే సామాజికాంశాలు మరో మినార్!

❖ డాక్టర్ దేవరాజు మహారాజు
9908633949

• కవిత



చెప్పిన మాట వినకుండా
చెట్టాపట్టాలేసుకు పోతుంది
అచ్చంగా నీదే అయిన దేహం నిన్ను విడిచి

మనిషికో మాట
గుండెకి ఒక దెబ్బ
పెడ చెవికే హెచ్చరిక

పిచ్చి పెదవుల ప్రేలాపనలు
గాలికి మాత్రమే ఉక్కబోత!

ఉద్వేగాలకు కళ్లెం వేసి
నిభాయించుకోవాలి అంతరాత్మని

ముఖకవళికలని పెన్సిల్‌తో దిద్దేస్తే
నవ్వులు ముద్దమందారంలా పూస్తాయి
జీర్ణించుకున్న వాస్తవాల్ని
నిట్టూర్పుల్లో వదిలేసి
ఒక్కక్షణం కళ్ళుమూసుకుంటే,
స్వప్నాలు రెప్పలమీద వాలతాయి

అడుగులకు నమ్మకాన్ని పరచుకుంటూ
తప్పిపోవచ్చు అక్కడే మళ్ళా

పునర్నిర్మించుకున్న ఎల్లల్లో
కట్టుకున్న తోటల పరిమళాన్ని
వెతికి పట్టుకోడానికి...
మందిలో ఒంటరిగానే ఉన్నా,
ఎంతో కొంత దొరికించుకోడానికి...

❖ రాళ్ళబండి శశిశ్రీ
7416399396

• అనువాద కవిత



బుద్ధారాధన

యుద్ధ భేరీ నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి
సైనికులు మృత్యుదేవత యముని ప్రసన్నత కోసం
తరలి వెళ్తున్నారు.
వారి యుద్ధ దుస్తులు భీతి గొల్పుతున్నాయి.
వారు పళ్ల పటపటా కొరుకుతున్నారు.
క్రౌర్యోజ్వల జ్వాలలతో అవిశ్రాంతంగా వున్నారు.
అలాగే, దయా సముద్రుడు శాక్యముని
ఆశీస్సులూ పొందగోరుతున్నారు.
కయ్యానికి కాలుదువ్వే రీతిలోనే
బుద్ధ దేవాలయం వైపు కవాతు చేస్తున్నారు.
బాకాలూ ఢంకాలూ మహోగ్రంగా మ్రోగుతున్నాయి.
భూగోళమే భయంతో ప్రకంపిస్తున్నది.

సమర ఘోషలోనే వారిలా వేడుకున్నారు:
మానవ బంధాల్ని ముక్కలు చేస్తూ
నివాస గృహాల నుండి ఆర్తనాదాలు మారుమ్రోగాలి.
ఆకాశమే వైశ్వానర కీలల్ని వర్షించి
జనావాసాలు భస్మీపటలం కావాలి.
విజ్ఞాన నిలయాలు వినాశనం కావాలి.
అందుకోసమే వారు అనుకంపమూర్తి
తథాగతుని దర్పంగా పూజిస్తున్నారు.
బాకాలూ ఢంకాలూ మహోగ్రంగా మ్రోగుతున్నాయి.
భూగోళమే భయంతో ప్రకంపిస్తున్నది.
విజయ దుందుభుల అనుస్వరంలో
శవాలు గణించబడుగాక!
స్త్రీ బాల వృద్ధుల ఛిద్రదేహాలు
ఆహ్లాద నృత్యాన్ని ప్రేరేపించుగాక!

(1937లో యీ గేయానికి రవీంద్రుడు స్వయంగా రాసుకున్న పాదలేఖనం యిలా వున్నది: ''ఒక జపనీయ పత్రికలో జనం విజయాన్ని కాంక్షిస్తూ బుద్ధ దేవాలయానికి వెళ్తున్నట్టు చదివాను. వారు తమ భీకరాయుధాల్ని చైనీయులకూ, ప్రార్థనా బాణాల్ని బుద్ధ భగవానుడికీ గురి పెడుతున్నారు''.)

మూలం: రవీంద్రనాథ్ టాగూర్
తెలుగు: టి.షణ్ముఖరావు
9949348238

• చదువరుల శీర్షిక

నాకు నచ్చిన ఐదు పుస్తకాలు



కాసుల ప్రతాపరెడ్డి
9848956375

నాకు నచ్చిన పుస్తకాలు ఇటు తెలుగు సాహిత్యంలోనూ అటు పాశ్చాత్య సాహిత్యంలోనూ చాలానే ఉన్నాయి. రాస్తే ఇలా రాయాలని అనిపించిన పుస్తకాలు కూడా ఉన్నాయి. వీటిలోంచి ఐదు పుస్తకాలను ఎంపిక చేసుకుని మాట్లాడటం కష్టమే. కానీ, ఆ పని చేయడానికే పూనుకున్నాను.

The Other side of me

ఇది సిడ్నీ షెల్డన్ ఆత్మకథ. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ జీవించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుంది. ప్రపంచాన్ని ఆర్థిక మాంద్యం పట్టిపీడిస్తున్న కాలంలో ఆయనకు 17 ఏళ్లు. తీవ్రమైన నిరాశా నిస్పృహలకు గురై ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. అది ఆయన తండ్రి కంటపడుతుంది. ఆ సమస్యను తండ్రి పరిష్కరించిన తీరునూ, ఆ తర్వాత బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతూనే షెల్డన్ దాదాపు 90 ఏళ్లు జీవించడమూ ఇందులో చూస్తాం. ఏదైనా పుస్తకం చదువుతున్నప్పుడు పేజీ తిప్పితే ఏ విధమైన మలుపు ఉంటుందోననే ఉత్కంఠ కలుగుతుంది, అలాగే రేపటి మన జీవితం కూడా ఏ మలుపు తిరుగుతుందో చెప్పలేం, దాన్ని అర్థాంతరంగా ముగించడం సరి కాదని తండ్రి ఇచ్చిన సందేశమే సిడ్నీ షెల్డన్ అనే రచయితను మనకు ఇచ్చింది.

One Hundred years of Solitude

ఒక ప్రాంతం అనామకంగా మారిపోవడం, ఆ ప్రాంతానికి చెందినవారు పరాయీకరణకు గురి కావడం అనే ఇతివృత్తంతో నడిచిన నవల. కొన్ని తరాల జీవితాలనూ ఆ ప్రదేశంలో ప్రజల పరాయీకరణనూ చెప్పడానికి మార్మిక వాస్తవికత (మేజిక్ రియలిజమ్) శైలిని ఎంచుకున్నారు మార్క్వెజ్. వర్తమాన వాస్తవికతను నర్మగర్భంగానే కాకుండా గుండెను తాకే విధంగా చెప్పడానికి ఇది అద్భుతమైన శైలి. ఒక రచయిత జీవితంలో ఇటువంటి నవలను ఒక్కటైనా రాయాలనే తపనను కలిగించే రచన. కొలంబియా, తెలంగాణ పరిస్థితుల మధ్య సామీప్యం కూడా ఈ నవల నచ్చడానికి కారణం.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర

సాహిత్యాధారాల ద్వారా ఆయా యుగాల్లో తెలుగు ప్రజల జీవన విధానాలను, ఆచారాలను, సంప్రదాయాలను మాత్రమే కాకుండా పాలనా వ్యవహారాలను కూలంకషంగా చర్చించిన గ్రంథం. సాహిత్య గ్రంథాల నుంచి ఆధారాలను స్వీకరించి హేతుబద్ధంగా ప్రజల చరిత్రను పాఠకుల ముందుంచారు సురవరం ప్రతాపరెడ్డి. ప్రజలకూ చరిత్ర ఉంది, ప్రజలు కూడా చరిత్రకెక్కదగినవారే అనే ఎరుకతో రాశారు.

మూగవాని పిల్లనగ్రోవి

డాక్టర్ కేశవ రెడ్డి నవలల్లో ఇదే బాగుందంటే కూడా చెప్పడం కష్టం. ఆయన రాసిన మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె మధ్య పోటీ పెడితే మనసు చివరి గుడిసెవైపూ, శరీరమూ మనసూ కలిసి మూగవాని పిల్లనగ్రోవి వైపూ లాగుతున్నాయి. నేను రైతు కుటుంబం నుంచి వచ్చినవాడిని కావడం వల్ల కావచ్చు, దాన్ని నేను ఎంపిక చేసుకోవడానికి ఇష్టపడ్డాను. ఈ నవల ఓ కావ్యస్థాయిని అందుకుంది.

త్రిపుర కథలు

త్రిపుర కథలు 1978 ప్రాంతంలో పుస్తకంగా వచ్చి ఉంటాయి, 13 కథలతో. ఆ తర్వాత మరో రెండో మూడో చేర్చి రెండో ముద్రణ వేశారు. నాకు మొదటి పుస్తకమే ఇష్టం. ఆయన కథల్లోని మనసుల అంతరంగాల లోతులు నన్ను ప్రభావితం చేశాయి. ఒక విధమైన సఫర్ వీటిల్లో ఎప్పటికీ తెగని దారంలా సాగుతూ ఉంటుంది. కథకి కొత్త డిక్షన్ వెతుక్కోవాల్సి వచ్చినప్పుడు నాకు త్రిపుర కనిపించాడు.

• పుస్తక పరిచయం

సంక్షిప్తంగా సమస్త మానవాళి చరిత్ర



టూకీగా ప్రపంచ చరిత్ర–రెండవ భాగం; రచన: ఎం.వి.రమణారెడ్డి; పేజీలు: 288(హార్డ్ బౌండ్); వెల: 300; ప్రతులకు: కవిత పబ్లికేషన్స్, 3/75, ఖాదరాబాద్ (పి.ఒ.), ప్రొద్దుటూరు –516362. ఫోన్: 9063077367

మానవ నాగరికత పరిణామక్రమాన్ని శాస్త్రీయంగా తెలుగులో చెప్పడానికి చేసిన గొప్ప ప్రయత్నం డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి 'టూకీగా ప్రపంచ చరిత్ర'. ఇది ఇప్పటికి రెండు భాగాలుగా వచ్చింది.

జీవశాస్త్రంలో వచ్చిన పరిశోధనలు, చరిత్ర రచనకు జరిగిన వాదోపవాదాలను పరిశీలించి భారతీయ దృక్పథం నుంచి ఈ రచన చేశారు. సంఘటనలన్నిటినీ గుదిగుచ్చినట్టు చెప్పడం కాకుండా, వాటికి చోదకశక్తులైన ఆర్థిక, సామాజిక, ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించారు. వందలాది సంవత్సరాలుగా మత విశ్వాసాలకూ, విజ్ఞానానికీ మధ్య జరిగిన పోరాటంలో విజ్ఞానమే ఎలా విజయం సాధించిందో వివరించారు. మొదటి భాగంలో సృష్టి రహస్యాన్ని ఛేదించడం నుంచి, పనిముట్ల తయారీలో వచ్చిన మార్పులు, ధనుర్బాణాల నుంచి తుపాకుల దాకా జరిగిన పరిణామం, జంతువులను మచ్చిక చేసుకోవడం, పశుపోషణ, వ్యవసాయం, భాష పుట్టుక, లిపి గురించి వివరించారు. ఒక వైపు మారణాయుధాలతోపాటు బౌద్ధిక ప్రపంచంలో చోటు చేసుకుంటున్న మార్పులను రెండో భాగంలో విశ్లేషించారు.

క్రీ.పూ. 8వ శతాబ్దం నాటికే మానవుడు నక్షత్రాల గమనాన్ని పసిగట్టడం, 'వేగుచుక్క' ద్వారా కాలాన్ని లెక్కించడం నేర్చుకున్నాడు. నక్షత్రాలను బట్టి నౌకాయానం సాగించాడు. జవాబు దొరకని ప్రశ్నలకు పరలోకం ఉందనే భావనతో సమాధానపరచుకున్నాడు. 'థాలిస్' చరిత్రకందిన తొలి తాత్వికుడు. 'సంకెళ్లు లేని ఆలోచన'ను అందించిన సోక్రటీస్‌తో సామాజిక అంశాలు పట్టించుకోవడం మొదలైంది. 'గ్లాడియేటర్ స్కూలు' విద్యార్థి స్పార్టకస్ తిరుగుబాటు చెప్పుకోదగ్గది. గ్రీకు, రోమన్ సామ్రాజ్యాల మధ్య ఏర్పడిన అగాథం, నరమేధం క్రైస్తవ మతానికి ప్రాబల్యం ఏర్పడేదాకా సాగాయి.


చైనాలో రైతు కుటుంబం నుంచి వచ్చిన లియుబ్యాంగ్ మూలపురుషుడిగా హన్ వంశీయుల ఏలుబడి (క్రీ.పూ.206 – క్రీ.శ.220) స్వర్ణయుగంగా గుర్తింపుపొందింది. ఈ కాలంలోనే చైనా వ్యవసాయంలో 'విత్తనం గొర్రు' ప్రవేశించడంతో సాగు విస్తీర్ణం పెరిగి, ప్రభుత్వ ఖజానా నిండింది. చంద్రగుప్తుని విజయపథాన నడిపిన చాణక్యుడు, అర్థశాస్త్రం రాసిన కౌటిల్యుడు ఒకరు కాదు. చాణక్యుడి తర్వాత 300 ఏళ్ల అనంతరం అర్థశాస్త్రం వచ్చిందనేది పరిశోధకుల వాదన. వింధ్య పర్వతాలు దాటుకుని ఆర్యులు దక్షిణాదికి గుంపులు గుంపులుగా రాలేదు. ఆర్యీకరణ కోసం వచ్చిన తొలి ఆర్యుడు అగస్త్యుడు. ఆర్యీకరణ తర్వాత కూడా ద్రవిడ సంప్రదాయాలు కొనసాగాయి. ఇలాంటి ఆసక్తికర అంశాలతో ఈ రెండో భాగం సాగుతుంది.

చరిత్ర చదివేముందు చరిత్రకారుడి గురించి తెలుసుకోవాలి. మార్క్స్ ప్రభావం ఈ రచనపై బలంగా పడింది. చరిత్రను భౌతికవాద దృష్టితో చూడటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

❖ రాఘవశర్మ
9493226180

• కొత్త పుస్తకం

వేటూరి పాట



రచన: జయంతి చక్రవర్తి; పేజీలు: 390(హార్డు బౌండు); వెల: 500; ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. రచయిత ఫోన్: 9390526272

తెలుగు సినిమా పాటను సుసంపన్నం చేసిన వేటూరి సుందర రామ్మూర్తి పాటను సమగ్రంగా పరిచయం చేసిన పుస్తకం ఇది. వేటూరి పాటలోని ప్రమాణాలు, సాహితీ విలువలు, శైలి, వస్తు వైవిధ్యం సూక్ష్మంగా పరిశీలించారు రచయిత. వేటూరి పాటల్లోని అలంకారాలను, యమకాలను, ఛందో వైచిత్రిని శ్రద్ధగా పరిచయం చేశారు.

• ఈవెంట్

డిట్రాయిట్ వ్యాసరచన ఫలితాలు

డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి–యు.ఎస్.ఎ. నిర్వహించిన 'తెలుగు సాహిత్య వ్యాసరచన' పోటీల్లో చామర్తి మానస, జిజ్ఞాస సోమనాథం మొదటి బహుమతి (ఒక్కొక్కరికీ రూ.27,231) గెలుచుకున్నారు. రెండవ బహుమతి(రూ.17,232) జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి(విహారి), మూడవ బహుమతి(రూ.11,213) రెంటాల శ్రీవేంకటేశ్వరరావు గెలుచుకున్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ

భూతం ముత్యాలు కథల సంపుటి 'దగ్ధం', నాటకం 'కులాటకం' ఆవిష్కరణ ఆగస్టు 27న ఉదయం 11 గంటలకు రవీంద్రభారతిలో జరగనుంది. ఆవిష్కర్త: ఎస్వీ సత్యనారాయణ. జి.వి.రత్నాకర్, అంబటి సురేంద్రరాజు, దెంచనాల శ్రీనివాస్, నిమ్మ బాబూరావు పాల్గొంటారు.

ఎడ్ల గురవారెడ్డి పురస్కారానికి

ఎడ్ల గురవారెడ్డి స్మారక పురస్కారం కోసం 2015, 16ల్లో ప్రచురించిన కవితా సంపుటాల 3 ప్రతులను ఆగస్టు 31లోపు పంపాల్సిందిగా వెన్నెల సాహితి సంగమం,సిద్దిపేట కోరుతోంది. చిరునామా: కొండి మల్లారెడ్డి, 19–61/5/సి, విద్యానగర్, రోడ్ నం. 3, కుషాల్ నగర్, సిద్దిపేట–502103. ఫోన్: 9441905525

బి.ఎస్.కు పల్లేరు పురస్కారం

పల్లేరు స్వయంప్రభ సాహితీ పురస్కారాన్ని బి.ఎస్.రాములుకు ఆగస్టు 26న మధ్యాహ్నం 12 గంటలకు పరకాలలోని స్వర్ణ గార్డెన్స్‌లో ప్రదానం చేయనున్నారు. దేవులపల్లి ప్రభాకర్‌రావు, టి.రంగస్వామి, పసునూరి దయాకర్, జి.గిరిజా మనోహర్‌బాబు, చల్లా ధర్మారెడ్డి, బన్న అయిలయ్య పాల్గొంటారు. ఇందులోనే ఏరుకొండ శశిరేఖ కథాసంపుటి 'పల్లె పిలుస్తుంది'ని పత్తిపాక మోహన్ ఆవిష్కరిస్తారు.

మిర్గం ఆవిష్కరణ - పురస్కారం

తెలంగాణ కవుల కవితా సంపుటి 'మిర్గం' ఆవిష్కరణ ఆగస్టు 27న సాయంత్రం 5:30కు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఇందులోనే, తెలంగాణ సాహిత్య కళావేదిక వార్షిక పురస్కారాన్ని వనపట్ల సుబ్బయ్యకు ప్రదానం చేయనున్నారు. ఏనుగు నరసింహారెడ్డి, ఘంటా చక్రపాణి, రాజేందర్ జింబో, నాళేశ్వరం శంకరం, యాకూబ్, అమ్మంగి వేణుగోపాల్ పాల్గొంటారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం. తిథి అమావాస్య రా.12.16 వరకు, తదుపరి భాద్రపద శు.పాడ్యమి. నక్షత్రం ఆశ్లేష సా.4.56 వరకు, తదుపరి మఖ. వర్జ్యం ఉ.6.10 నుంచి 7.40 వరకు, తిరిగి తె.4.34 నుంచి 6.08 వరకు(తెల్లవారితే మంగళవారం). దుర్ముహూర్తం ప.12.28 నుంచి 1.19 వరకు, తదుపరి ప.3.01 నుంచి 3.50 వరకు. అమృత ఘడియలు ప.3.24 నుంచి 4.56 వరకు. పోలాల అమావాస్య.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు



ఫజర్	4.45
జొహర్	12.19
అసర్	4.46
మగ్రీబ్	6.38
ఇషా	7.53

మెడ్‌టెక్ అక్రమాలపై లీకులిచ్చినవారికి బెదిరింపులు

- ఇప్పటికే జోన్ మాజీ ఉపాధ్యక్షుడిపై కేసులు
- తాజాగా మరో వ్యక్తికి బెదిరింపులు
- తప్పుడు సమాచారం ఇచ్చానంటూ లేఖ రాయించుకున్న మంత్రి!

సాక్షి, అమరావతి

విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై మీడియాకు సమాచారం ఇచ్చిన వారిని మంత్రులు, ఉన్నతాధికారులు బెదిరిస్తున్నారు. ఇప్పటికే మెడ్‌టెక్ జోన్ మాజీ ఉపాధ్యక్షుడు జుడిష్ రాజుపై కేసులు బనాయించి జైల్లో పెట్టించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో వ్యక్తిని సంబంధిత మంత్రే బెదిరించి లేఖ రాయించుకున్నట్టు తెలిసింది. మెడ్‌టెక్ జోన్ అక్రమాలపై ఎవరు ఎక్కడ లీకులు ఇచ్చినా వారిని వదిలేది లేదని బెదిరించినట్టు సమాచారం. సదరు వ్యక్తిని బెదిరించి.. తాను తప్పు చేశానని, ప్రభుత్వంపై బురద జల్లానని, మంత్రిని అపార్థం చేసుకున్నానని, తప్పుడు వ్యక్తుల సాహచర్యంతో ఇలా తప్పుడు సమాచారం మీడియాకు అందించానంటూ లేఖ రాయించుకున్నట్టు అధికారవర్గాల సమాచారం. ఆ లేఖను మంత్రి పేషీ అధికారులే మీడియాకు ఇవ్వడం గమనార్హం కాగా.. ఆ వ్యక్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి కావడంతో విషయం మరింతగా చర్చనీయాంశమైంది. మెడ్‌టెక్ జోన్‌లో అక్రమాలతో పాటు మెడాల్ రక్తపరీక్షలు, ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రాలు, చంద్రన్న సంచార చికిత్స, 108 అంబులెన్సులు.. ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి అక్రమాలను మంత్రి నియంత్రించలేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలావుండగా మెడ్‌టెక్ జోన్ విషయంలో మీడియాతో మాట్లాడిన వారి ఫోన్ నంబర్ల కాల్‌డేటాను మంత్రి తెప్పించుకుని పరిశీలించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో మరి కొంతమందిని కూడా మంత్రి పేషీనుంచే ఫోన్లు చేసి బెదిరించినట్టు తెలుస్తోంది. మెడ్‌టెక్ జోన్‌లో రూ.1,722 కోట్ల నిధుల దుర్వినియోగం వెనుక పలువురు పెద్దలకు సైతం సంబంధం ఉండటంతో మంత్రి ఎలాగైనా ఈ విషయాలు బయటకు పొక్కకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

విజయవాడ నుంచి మెరీనా బీచ్‌కు వెళ్లిన ముగ్గురు బాలురు

- తల్లిదండ్రులకు చెప్పని వైనం
- ఒక బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన చెన్నై రైల్వే పోలీసులు
- మరో ఇద్దరి కోసం గాలింపు

తిరువొత్తియూరు (చెన్నై): చెన్నైలోని మెరీనా బీచ్‌ను చూసేందుకు విజయవాడ నుంచి ఒంటరిగా వచ్చిన బాలుడు(8)ని ఆదివారం చెన్నై సెంట్రల్ రైల్వే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఏపీలోని విజయవాడకు చెందిన మున్నా చౌదరి కుమారుడు రాజా చౌదరి (8) అక్కడి పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. మెరీనా బీచ్‌ను చూడాలనే కోరికతో రాజా, తన ఇద్దరు మిత్రులతో కలసి విజయవాడ నుంచి చెన్నై వచ్చే రైలు ఎక్కాడు. వీరు ఆదివారం ఉదయం చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దిగారు. ఆ సమయంలో రాజా చౌదరి ఒంటరిగా నిలబడి బిత్తర చూపులు చూస్తుండటంతో, ఇది గమనించిన రైల్వే పోలీసులు బాలుడిని రైల్వే ఇన్‌స్పెక్టర్ శేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ల వద్దకు తీసుకెళ్లారు. విచారించగా మెరీనా బీచ్ చూడాలనే ఆసక్తితో చెన్నైకి వచ్చినట్లు తెలిపాడు. పోలీసులు ఆ బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆదివారం ఉద యం చెన్నైకి చేరుకున్న తల్లిదండ్రులకు పోలీసులు బాలుడిని అప్పగించారు. రాజాతో వచ్చిన మరో ఇద్దరు బాలురు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నంద్యాలలో ప్రజాస్వామ్యం ఖూనీ

- 11 రాష్ట్రాలకు హోదాను పొడిగిస్తే.. మన రాష్ట్రానికి హోదా ఊసే లేదు
- ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల టౌన్: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆరోపించారు. నంద్యాల ఉప ఎన్నికలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే రీతిలో అధికార తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా డబ్బు వెదజల్లుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా బాపట్ల పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీరు ఓట్లు ఎవరికి వేసేదీ మాకు తెలిసిపోతుంది.. తర్వాత మీ ఇష్టమనే రీతిలో బెదిరిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా నంద్యాలలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపటం ఎవరి తరం కాదన్నారు. నంద్యాల ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయాల మార్పుకు నాంది కాబోతోందన్నారు.


డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ప్రత్యేక హోదాపై బాబు మౌనం

తాజాగా, దేశంలోని ఈశాన్య రాష్ట్రాలతోపాటు, జమ్మూ, కశ్మీర్, ఉత్తరాఖండ్‌లతో కలిపి మొత్తం 11 రాష్ట్రాలకు కొనసాగుతున్న ప్రత్యేక హోదాను మరో పదేళ్లపాటు పొడిగించారని ఉమ్మారెడ్డి గుర్తుచేశారు. కానీ, మన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక హోదాపై మౌనం పాటించడం బాధాకరమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి ఏడాదీ కృష్ణాడెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉండగా, ప్రస్తుతం 7 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారన్నారు. రాష్ట్రంలో 2015లో ఆగస్టు 15 నాటికి 23 లక్షల 19 వేల హెక్టార్లలో, 2016లో ఆగస్టు 16 నాటికి 23.39 లక్షల హెక్టార్లలో నాట్లు వేశారని తెలిపారు. కానీ, ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి కేవలం 19.93 లక్షల హెక్టార్లలో నాట్లు వేశారని చెప్పారు.

రసగుల్లా.. రుచి చూడరా మళ్లా..

సాక్షి, హైదరాబాద్: రసగుల్లా అంటే ఇష్టపడనివారుండరు.. ఈ బెంగాలీ స్వీట్ అంటే దేశమంతా పడిచస్తారు. ఇన్నాళ్లూ మనం తిన్న, చూసిన రసగుల్లా వేరు.. ఇప్పుడు చెప్పుకోబోయేది వేరు.. మీరు చాలాసార్లు హాట్ అండ్ సౌర్ సూప్ తాగి ఉంటారు.. మరి హాట్ అండ్ సౌర్ రసగుల్లా తిన్నారా.. పోనీ న్యూడిల్స్ రసగుల్లా.. మిరప రసగుల్లా.. ఈ మాత్రానికే ఆశ్చర్యపోతే ఎలా.. కోల్‌కతాకు చెందిన స్వాతి సరాఫ్ వద్ద రసగుల్లాల్లో వందల వెరైటీలు ఉన్నాయి మరి.. అన్ని రకాల ఫ్రూట్, ఐస్‌క్రీమ్ ఫ్లేవర్లతోపాటు బబుల్‌గమ్, కిళ్లీ, మల్లెపూలు రసగుల్లాలు కూడా ఉన్నాయి. స్వాతి ఏడాదిన్నర క్రితం వరకూ గృహిణి.. మరిప్పుడు ఓ విజయవంతమైన వ్యాపారవేత్త..రసగుల్లా రోజు తినీ.. బెంగాలీల్లో ఈ స్వీట్ అంటే ఆసక్తి తగ్గడాన్ని స్వాతి గమనించారు. ఈ పరిస్థితులనే తన వ్యాపారానికి అనుకూలంగా మలుచుకున్నారు. రసగుల్లా తయారీలో మార్పులు చేసి.. పంచదార వినియోగాన్ని తగ్గించి.. హెల్దీ రసగుల్లా కాన్సెప్ట్‌ను తెచ్చారు. కాకర, లవంగాలు, జీలకర్ర ఇలా ఎన్నో రకాల రస గుల్లాలను తయారుచేసి రోజుకు వేల సంఖ్యలో విక్రయిస్తున్నారు.



‘బాబు’ బెదిరేలా ఉద్యమిద్దాం

కాపు ఉద్యమనేత ముద్రగడ

కిర్లంపూడి(జగ్గంపేట): రాష్ట్రంలో చంద్రబాబు సాగిస్తున్న నిరంకుశ పాలన దేశంలోని ఏ రాష్ట్రంలో లేదని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం విమర్శించారు. తీవ్ర అణచివేతకు పాల్పడుతున్న బాబుకు భయం పుట్టేలా నిరసనలు తెలపాలని కాపులకు పిలుపునిచ్చారు. కాపు రిజర్వేషన్లకు సంబంధించి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్న డిమాండ్‌తో ముద్రగడ తలపెట్టిన ‘చలో అమరావతి’ నిరవధిక పాదయాత్రను అడ్డుకుని ఆదివారానికి 26 రోజులైంది. నిత్యం చేస్తున్నట్టే ముద్రగడ తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన ఇంటి గేటు వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి కాపులు పెద్ద సంఖ్యలో మోటారు సైకిళ్లపై, కార్లపై ర్యాలీగా తరలివచ్చారు. సాయంత్రం వారినుద్దేశించి ముద్రగడ మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలు కోసం ఒత్తిడి పెంచకపోతే ముఖ్యమంత్రి తప్పుడు విధానంలో వెళతారన్నారు. రాష్ట్రంలో కాపుజాతి సంఖ్యను తక్కువగా చూపించేందుకు కుట్ర పన్నుతున్నాడన్నారు. ఉద్యమం తాటాకు మంటలా కాక తుమ్మకర్ర మంటలా కాలాలన్నారు. ఆ మంట చంద్రబాబు కుర్చీ కింద, నిదురపోయే మంచం కింద తగలాలని, అప్పుడే కాపు జాతి సమస్య చంద్రబాబుకు గుర్తుంటుందని అన్నారు. నిరవధిక పాదయాత్ర పేరుతో ఎంతో మంది పిల్లలను స్టేషన్‌లకు రప్పించుకుని రౌడీ షీట్లు ఓపెన్ చేయడం, బైండోవర్ కేసులు పెట్టడం, కౌన్సెలింగ్ చేయించడం వంటి వాటితో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారు కాపు ఉద్యమానికి మద్దతునిస్తున్నారన్నారు. అందరూ కసితో ఉద్యమిస్తే చంద్రబాబు దిగిరాక తప్పదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి యేసుదాసు, ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు, కల్వకొలను తాతాజీ, ఆరేటి ప్రకాష్, జీవీ రమణ, గౌతు స్వామి, తుమ్మలపల్లి రమేష్, మలకల చంటిబాబు, గోపు అచ్యుత రామయ్య పాల్గొన్నారు.


తన ఇంటి గేటు వద్ద కాపు నేతలతో కలిసి 26వ రోజు నిరసన తెలుపుతున్న ముద్రగడ

నంద్యాలలో టీడీపీ అధికార దుర్వినియోగం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు



ముత్తుకూరు (సర్వేపల్లి): తెలుగుదేశం పార్టీ పరిస్థితి దినదిన గండంగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. అందుకే నంద్యాల ఉప ఎన్నికలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు దళితవాడలో ఆదివారం థర్మల్ విద్యుత్ కేంద్రాల వైఖరికి వ్యతిరేకంగా జరిగిన బహిరంగసభలో మధు మాట్లాడారు. ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన స్థానిక టీడీపీ నేతలు ఇప్పుడు కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారని మండిపడ్డారు. థర్మల్ ప్రాజెక్టుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా సెప్టెంబర్‌లో పాదయాత్ర చేయనున్నట్టు తెలిపారు. కాగా, నంద్యాల ఉప ఎన్నికలో గెలిచేందుకు టీడీపీ రూ. కోట్లు వెదజల్లుతోందన్నారు. సీఎం చంద్రబాబు సహా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడ తిష్ట వేశారని, అయితే టీడీపీ గెలుపు అంత తేలిక కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇస్తే సహించం

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన

నెల్లూరు (సెంట్రల్): కాపులకు బీసీ రిజర్వేషన్లు ఇస్తే సహించేదిలేదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హెచ్చరించారు. ఈ విషయంలో ఎంతవరకైనా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పారు. బీసీల్లోనే చాలా మంది వెనుకబడి ఉన్నారని వ్యాఖ్యానించారు. పదవులు అనుభవిస్తోన్న కాపులకు బీసీల రిజర్వేషన్లతో పనేంటని ప్రశ్నించారు. సమావేశంలో సంఘం నాయకులు ఆదిశేషు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

2 నెలల్లో రామమందిర నిర్మాణం

వీహెచ్‌పీ నేత ప్రవీణ్ తొగాడియా



హైదరాబాద్: అయోధ్యలో రామ మందిర నిర్మాణ పనులు రెండు నెలల్లో ప్రారంభమవుతాయని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ తొగాడియా అన్నారు. హిందువులు రామ మందిరం కోసం కాకుండా, రామ జన్మభూమి కోసం కొట్లాడుతున్నారని చెప్పారు. ఆదివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో జరిగిన బజరంగ్‌దళ్ శక్తి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రామమందిర నిర్మాణానికి పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని, చట్టం ద్వారానే మందిర నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ముస్లింలకు మాదిరిగానే హిందువుల కోసం హిందూ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆర్టికల్ 370ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, సైనికులపై రోజూ దాడులు చేస్తున్నా ఏం చేయలేకపోతున్నారని అన్నారు. మానవ హక్కులు కేవలం మైనారిటీలకే ఉన్నాయా.. హిందువులకు ఉండవా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు గుణంపల్లి రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల ముందు చంద్రబాబు ఎన్నో హామీలిచ్చారు. ప్రజలు నమ్మి ఓటేశారు. మూడున్నరేళ్లయింది. నంద్యాలలో ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చంద్రబాబు మరలా అనేక హామీల వర్షం కురిపిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ మూడేళ్లలోనే అమలు చేసేశామని కూడా చెబుతున్నారు. అసలు చంద్రబాబు మేనిఫెస్టోలో ఏం చెప్పారు? రాజధానిని ప్రకటిస్తూ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ఏం చెప్పారు? ఆ హామీల పరిస్థితి ఏమిటి? అన్న దానిపై రాష్ట్రంలో విస్తృత చర్చ జరుగుతోంది. అసెంబ్లీలో జిల్లాలకు సంబంధించి ఇచ్చిన హామీలలో ముఖ్యమైనవాటి పరిస్థితి చూద్దాం..

– సాక్షి, అమరావతి



అసెంబ్లీ హామీల్లో అమలైనవెన్ని?

సిక్కోలుకు ఒట్టిచేయి...

సిక్కోలు (శ్రీకాకుళం) స్మార్ట్ సిటీగా అభివృద్ధి, జిల్లాలో నూతన పారిశ్రామిక నగరం ఏర్పాటు, భావనపాడు, కళింగపట్నంలో పోర్టుల నిర్మాణం కల్లలుగానే మిగిలిపోయాయి. జిల్లాలో ఎయిర్‌పోర్టు, ఫుడ్‌పార్కు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ ఏర్పాటు జాడే లేదు. వంశధార, నాగావళి నదులపై నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి.. ఒట్టి హామీగానే మిగిలిపోయింది. తేలినీలాపురం పక్షుల సంరక్షణ, బౌద్ధ కట్టడాలు, శ్రీకూర్మం, అరసవెల్లి దేవాలయాలను, బారువ బీచ్‌ను కలుపుతూ పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి పట్టించుకున్న పాపాన పోలేదు.

విజయనగరం 'స్మార్ట్' కలే..

జిల్లా కేంద్రమైన విజయనగరం పట్టణాన్ని స్మార్ట్ సిటీగా మార్చుతామన్న బాబు మాట నిలబెట్టుకోలేదు. వైద్య కళాశాల ఏర్పాటు మూడేళ్లుగా కలగానే మిగిలింది. పారిశ్రామిక నగరం నిర్మాణం హామీ అమలు ఊసే లేదు. ఫుడ్‌పార్కు జాడ లేదు. గిరిజన యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు, సంగీత లలిత కళల అకాడమీ, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు తదితర బాసలన్నీ గాలికి వదిలేశారని జిల్లా వాసులు అంటున్నారు.

విశాఖ మెగా సిటీ ఏదీ?

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖపట్నం మెగా సిటీగా అభివృద్ధి అన్న బాబు హామీలు బాసలుగానే మిగిలాయి. వీసీఐసీ పారిశ్రామిక వాడ ఏర్పాటు, మెట్రోరైలు ప్రాజెక్టు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, మెగా ఐటీ హబ్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ కేంద్రం, ఫుడ్ పార్కు, ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్, గంగవరం ఎల్. ఎన్.జి. టెర్మినల్.. ఊసే లేదు. విమానాశ్రయానికి కూడా అంతర్జాతీయ స్థాయి హోదా ఇంకా రాలేదు.

'తూర్పు'నకు ఒట్టి మాటలే..

కాకినాడ, రాజమండ్రి నగరాలు స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి. పెట్రోలియం యూనివర్సిటీ, పెట్రోలియం కారిడార్, కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్, తునిలో నౌకా నిర్మాణ కేంద్రం, పోర్టు, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు, వీసీఐసీ కారిడార్‌లో కాకినాడ, తెలుగు విశ్వవిద్యాలయం, కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమ, ఫుడ్ పార్కు, భూ ఉపరితల జలమార్గాలు, ఆక్వా కల్చర్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు.. మాటలుగానే మిగిలాయి. జిల్లాకు సీఎం ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.

పశ్చిమ బాసలు గోదాట్లోనే...

పశ్చిమ గోదావరి జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, క్రాఫ్ట్, నర్సాపూర్‌లో పోర్టు, తాడేపల్లిగూడెంలో ఎయిర్‌పోర్టు, సిరామిక్, ఆయిల్‌పామ్ పరిశ్రమలు, కొల్లేరు సరస్సు పర్యాటక ప్రాంతం, జలమార్గాల అభివృద్ధి, చింతలపూడిలో బొగ్గు వెలికితీత, కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమలు, మెట్ట ప్రాంతాల్లో డ్రిప్ ఇరిగేషన్, ఆక్వాకల్చర్ ప్రాసెసింగ్ యూనిట్, ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు కమీషన్ల బారిన పడి నిర్మాణం నత్తనడకన సాగుతోంది.

హామీలు కృష్ణార్పణం

కృష్ణా జిల్లాలో మచిలీపట్నం పోర్టు, ఆయిల్ రిఫైనరీ, క్రాకరీ యూనిట్, వీజీటీఎం మెట్రోరైలు, ఆటోమొబైల్ , లాజిస్టిక్‌హబ్, ఫుడ్‌పార్కు, మెగాసిటీ, స్మార్ట్ సిటీ, ఆక్వా కల్చర్ ప్రాసెసింగ్ యూనిట్, టెక్స్‌టైల్ పార్కు, భవానీ దీవుల టూరిజం సర్క్యూట్, అవనిగడ్డలో మిస్సైల్ పార్కు, ఐటీ హబ్, కూచిపూడి అకాడెమీ, నూజివీడులో మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటు, గన్నవరం విమానాశ్రయం అంతర్జాతీయ విమానాశ్రయంగా విస్తరణ హామీలు నీటి మూటలుగానే మిగిలాయి.

గుంటూరులో జాడలేని ఎయిమ్స్

గుంటూరు జిల్లాలో టెక్స్‌టైల్‌పార్కు, ఫుడ్ పార్కు, నాగార్జున కొండ అమరావతి టూరిజం సర్క్యూట్, నాగార్జున సాగర్ థీమ్ పార్కు, సౌర విద్యుత్కేంద్రం మాటలకే పరిమితమయ్యాయి. వీజీటీఎం మెట్రోరైలు, ఎయిమ్స్, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, స్మార్ట్ సిటీ, ఫుడ్ పార్కు, నాగార్జున సాగర్ ఎయిర్ పోర్టు ఉత్తిమాటలుగా మారాయి.



కర్నూలులో కర్మాగారాలెక్కడ?

కర్నూలు జిల్లాకు బాబు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. స్మార్ట్ సిటీగా కర్నూలు, కొత్త విమానాశ్రయం ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, అవుకులో పారిశ్రామికవాడ, హైదరాబాద్ బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో కర్నూలు, టెక్స్‌టైల్ క్లస్టర్, కోయిలకుంట్లలో సిమెంటు ఉత్పత్తుల హబ్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, పర్యాటకాభివృద్ధి, విత్తనోత్పత్తి కేంద్రం, రైల్వే వ్యాగన్ల మరమ్మతుల కర్మాగారం, మైనింగ్ స్కూలు, ఫుడ్ పార్కు, స్విమ్స్ తరహాలో కర్నూలులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి... అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

సీఎం సొంత జిల్లాకూ మొండిచేయి

సీఎం సొంత జిల్లా చిత్తూరు జిల్లాకు ఇచ్చిన హామీలు కూడా ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. కుప్పం ఎయిర్‌పోర్టు, అపోలో హెల్త్ సెంటర్, హార్టికల్చర్ జోన్, తిరుపతి మెగా సిటీగా అభివృద్ధి. ఫుడ్ పార్కు, మెట్రో రైలు, శ్రీకాళహస్తి , తిరుపతి, కాణిపాకం, ఆధ్యాత్మిక, పర్యాటక సర్క్యూట్ ఏదీ అమలు కాలేదు.

కల్లలుగా నెల్లూరు హామీలు

నెల్లూరు జిల్లాకు చేసిన బాసలు కలగానే మిగిలాయి. విశాఖపట్నం చెన్నై, బెంగళూరు చెన్నై పారిశ్రామిక వాడల ఏర్పాటు, ఆటోమొబైల్ హబ్, ఎయిర్‌పోర్టు, దుగరాజపట్నం పోర్టు, పులికాట్ సరస్సు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి, స్మార్ట్ సిటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, మెరైన్ ఇన్‌స్టిట్యూట్, ఎరువుల కర్మాగారం హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు.

వైఎస్సార్ జిల్లాకు ఉత్తిచేయి..

వైఎస్సార్ జిల్లాలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటు హామీ నీటి మూటగా మిగిలింది. స్టీల్‌ప్లాంటు ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ కేంద్ర ప్రభుత్వంపై కనీస ఒత్తిడి తేవడంలేదు. సిమెంటు పరిశ్రమలు, ఖనిజాధార పరిశ్రమలు, పారిశ్రామిక స్మార్ట్ సిటీ, ఫుడ్ పార్కు, ఉర్దూ యూనివర్సిటీ, గార్మెంట్ క్లస్టర్. రేణిగుంట రాజంపేట కడప మధ్య నాలుగులేన్ల రహదారుల నిర్మాణం హామీలేవీ అమలు కాలేదు.

'అనంత' హామీలు కాగితాల్లోనే..

దేశంలోనే అత్యంత కరువు ప్రాంతంగా అల్లాడుతున్న అనంతపురం జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. జిల్లాలో ఉద్యాన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ అనుబంధ కేంద్రం, నూతన పారిశ్రామిక నగరం, స్మార్ట్ సిటీ, బెంగళూరు చెన్నై కారిడార్‌లోకి హిందూపురం. టెక్స్‌టైల్ పార్కు, ఫుడ్ పార్కు, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ క్లస్టర్, సౌర, పవన విద్యుదుత్పత్తి. పెనుగొండలో ఇస్కాన్ ప్రాజెక్టు, పుట్టపర్తి ఆధ్యాత్మిక నగరం, పుట్టపర్తిలో విమానాల నిర్వహణ, మరమ్మతుల కేంద్రం, కుద్రేముఖ్ ఇనుప ఖనిజ ఆధారిత ప్రాజెక్టు, హంద్రీ నీవా ప్రాజెక్టు పూర్తి. వంద శాతం డ్రిప్, తుంపరసేద్యం హామీలు నీటిమూటలుగానే మిగిలాయి.

ప్రకాశంలో పారిశ్రామిక నగరం ఏది?

ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. దొనకొండ పారిశ్రామిక నగరం, మైన్స్ యూనివర్సిటీ, మినరల్ సైన్సెస్, ఒంగోలు ఎయిర్‌పోర్టు, కనిగిరిలో జాతీయ పెట్టుబడులు, ఉత్పత్తి జోన్, రామాయపట్నం పోర్టు, ఫుడ్ పార్కు, వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ఏడాదిలో పూర్తి. స్మార్ట్ సిటీ, ఆక్వా కల్చర్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి.



డీప్.. డీప్.. డిప్రెషన్!

ఒత్తిడికి చిత్తవుతున్న యువతరం



సాక్షి, హైదరాబాద్: ''సెంచరీలు కొట్టే వయస్సు మాదీ.. బౌండరీలు దాటే మనస్సు మాదీ..''అని పాడుకోవాల్సిన యువతరం ఇప్పుడు తీవ్ర ఒత్తిడితో చిత్తవుతోందట. మార్కులు, ర్యాంకులు.. కెరీర్, ఉద్యోగం.. టీనేజ్ లవ్, వైఫల్యాలు ఇలా సవాలక్ష సవాళ్లతో సతమతమవుతోందట. ఏకాగ్రత కోల్పోయి.. ఏ పనిమీదా మనసు లగ్నం చేయలేక.. ఒంటరితనం.. నెగెటివ్ ఆలోచనలు చుట్టుముట్టి డిప్రెషన్‌కు లోనవుతోందట. ఒత్తిడి శ్రుతిమించితే కొందరు బలహీన మనస్కులు ఆత్మహత్యకు సైతం పాల్పడటం వంటి విపరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తాజా అధ్యయనంలో తేలింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ మానసిక వైద్యశాల 'కాస్మోస్'దేశవ్యాప్తంగా 500 కళాశాలల్లో నిర్వహించిన అధ్యయనంలో యువత ఒత్తిడితో కుంగిపోతున్నట్లు వెల్లడైంది. ఈ జాబితాలో మన నగరానికి చెందిన సుమారు 20 కళాశాలలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడుపుతున్న కుర్రకారు ఆత్మీయ సంబంధాలు, స్నేహితులతో ఆటపాటలకు దూరమవుతూ ఒత్తిడి అనే ఉపద్రవంలో చిక్కుకుంటోందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రధానంగా 18–25 ఏళ్ల మధ్యనున్న యువతరంలో ఏకంగా 64 శాతం మంది ఇలాంటి పరిస్థితితో బాధపడుతుండటంతో ఆందోళన కలిగిస్తోందంటున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి కళాశాలలో సీటు సాధించడం మొదలుకుని మార్కులు, ర్యాంక్‌లు తెచ్చుకోవడం.. అత్యుత్తమ కెరీర్ ఎంచుకోవడం.. క్యాంపస్ సెలక్షన్స్‌లో మంచి ఉద్యోగం సాధించడం.. ఆ మధ్యలో టీనేజ్ లవ్‌లు.. ప్రేమ వైఫల్యాల వంటి సవాళ్లు యువతరాన్ని చుట్టుముడుతున్నాయని పేర్కొంటున్నారు.

యువతలో ఒత్తిడికి కారణాలివే..

- సామాజిక మాధ్యమాల్లో గంటల తరబడి గడపడం.
- మార్కుల రేస్‌లో తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి చేయడం.
- తెలిసీతెలియని వయసులో డ్రగ్స్, తాగుడు, పోర్న్ సైట్స్ వంటివాటికి అలవాటుపడటం.
- టీనేజ్‌లో ఆకర్షణకు లోనుకావడం. వన్‌సైడ్ లవ్.
- మంచి కళాశాలలో సీటు సాధించలేకపోవడం.
- కెరీర్‌పరంగా ఒడిదుడుకులు. చదువును నిర్లక్ష్యం చేయడం.
- చదువుకు అనుగుణంగా ఉద్యోగం దొరక్కపోవడం.
- తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఇంట్లో వారి నుంచి సరైన మార్గదర్శనం లభించకపోవడం.

25-44 ఏళ్ల మధ్య వయసు వారిలో ఇలా..

ఇక 25–44 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిలో ఆర్థిక సమస్యలు, ఉద్యోగానికి సంబంధించి అధిక పని ఒత్తిడి, కొన్నిసార్లు ఉద్యోగం కోల్పోవడం, దాంపత్య సమస్యలు, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమవ్వడం వంటి కారణాలతో సుమారు 50 శాతం మంది ఒత్తిడితో సతమతమవుతున్నట్లు సర్వేలో తేలింది.

ఇలా చేస్తే ఒత్తిడిమాయం..

- సామాజిక మాధ్యమాల్లో రోజుకు అరగంటకు మించి గడపరాదు.
- చదువు, మార్కులు, ర్యాంకులు, కెరీర్ ఎంచుకునే విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు, యాజమాన్యాలు ఒత్తిడి చేయరాదు.
- యువతరంతో తల్లిదండ్రులు, టీచర్లు స్నేహితుల్లా మెలిగి.. వారు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలను పరిష్కరించేందుకు తోడ్పాటును అందించాలి.
- దురలవాట్లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం. చెడు స్నేహాలను వదిలేయడం.
- నెగెటివ్ ఆలోచనలకు దూరంగా ఉండాలి. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించాలి.
- ఎంచుకున్న రంగం, కెరీర్‌లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి విజయగాథలను తెలుసుకోవాలి. వాటి నుంచి స్ఫూర్తి పొందాలి.
- వివిధ రకాల ఆకర్షణలకు దూరంగా ఉండాలి.
- ప్రతి రోజూ వ్యాయామం, యోగా, నడక, మార్షల్ ఆర్ట్స్, ధ్యానం వంటిలో ఏదో ఒకదానికి నిర్ణీత సమయం కేటాయించాలి.
- మానసిక విశ్రాంతికి అధిక ప్రాధాన్యతనివ్వాలి. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, గార్డెనింగ్ వంటి కార్యకలాపాలతో బిజీగా ఉండాలి.
- ఇష్టమైన పుస్తకాలు చదవాలి.
- నలుగురితో సరదాగా మాట్లాడటం, నవ్వడం, నిర్ణీత వేళకు ఆహారం తీసుకోవడం, నిద్రపోవడం వంటి సూత్రాలను విధిగా పాటించాలి.



– డాక్టర్ అనిత
సైకియాట్రిస్ట్, అసోసియేట్ ప్రొఫెసర్, రిమ్స్

సీఎం 'కాఫీ' హామీ అమలేది?

లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు సాగు చేయిస్తామన్న చంద్రబాబు
ప్రస్తుతం 10 వేల ఎకరాల్లోనే సాగు

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా అరకు ప్రాంతంలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో కాఫీ తోటలను సాగు చేయిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. హుద్‌హుద్ తుఫాన్ సందర్భంగా కాఫీ తోటలు భారీగా దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త తోటల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ప్రకటించారు. కాఫీ తోటల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.524 కోట్లు మంజూరు చేసింది. కేంద్రం ప్రభుత్వం నుంచి రూ.160 కోట్లు వచ్చాయి. కాఫీ బోర్డు కూడా సహకారం అందిస్తోంది. అయినా ప్రస్తుతం కేవలం 10 వేల ఎకరాల్లోనే కాఫీ తోటలు సాగవుతున్నాయి. కాఫీ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే పదేళ్లు పడుతుంది. కాఫీతోటల పెంపకానికి కూలీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారు. నీడనిచ్చే చెట్ల పక్కనే కాఫీ తోటలను సాగు చేయాల్సి ఉంటుంది. నీడనిచ్చే చెట్లను పదేళ్లపాటు పెంచితే గానీ కాఫీతోటలను పూర్తిస్థాయిలో సాగు చేయలేమని అంటున్నారు. ప్రస్తుతం అరకు ప్రాంతంలో 12 వేల ఎకరాల్లో సిల్వర్ ఓక్ చెట్లు పెంచుతున్నారు. ఇవి ఫలసాయాన్ని ఇచ్చేవి కావు. మామిడి, బత్తాయి, నారింజ వంటి చెట్లను నాటితే గిరిజనులకు ఫలసాయం కూడా అందుతుందని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మాత్రం సిల్వర్ ఓక్ చెట్ల పెంపకంపైనే దృష్టి పెట్టింది. కాఫీ తోటల పెంపకంపై గిరిజనులకు శిక్షణ ఇవ్వడం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

2,500 మందితో ఆంజనేయస్వామి కీర్తనాలాపన

- శ్రీ మఠంలో ఘనంగా నిర్వహణ
- 9 ప్రపంచ రికార్డుల్లో స్థానం పొందడమే లక్ష్యం

మంత్రాలయం రూరల్: భక్తుల హృదయాంతరాల్లోంచి ధ్వనించిన కీర్తనలతో మంత్రాలయం పులకించింది. తొమ్మిది ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించే లక్ష్యంగా ఆదివారం కర్నూలు జిల్లా మంత్రాలయంలోని శ్రీ మఠంలో ఆంజనేయస్వామి కీర్తనాలాపన ఘనంగా చేపట్టారు. శ్రీ మఠంలోని యోగీంద్ర సభా మంటపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ముందుగా పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మైనపు విగ్రహానికి పుష్పాభిషేకం చేసి ప్రారంభించారు. హరిదాసర కీర్తనాలాపనతో భక్తులకు దేవుడి అనుగ్రహం లభిస్తుందని శ్రీ మఠం పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు ప్రవచించారు. దేవుడి అనుగ్రహానికి వారధిగా గురువు ఉంటారని, రాఘవేంద్రస్వామి గురుస్థానంలో వెంకటేశ్వరస్వామి భక్తి పరిమళాలు విరబూయించడానికి శ్రీ మఠం ఎల్లవేళలా కృషి చేస్తుందని అన్నారు. గురుసార్వభౌమ దాససాహిత్య అకాడమీ డైరెక్టర్ పి.నారాయణ ఆచారి మధ్యాహ్నం 12 గంటలకు కీర్తనాలాపనను ప్రారంభించారు. ఈ కార్యక్రమం రాత్రి ఎనిమిది గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన 2,500 మంది మహిళలు 108 హనుమాన్ కీర్తనలు ఆలపించారు. సంప్రదాయ దుస్తుల్లో ఏకకాల ఉచ్చారణతో సాగిన కీర్తనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు చైర్‌పర్సన్ డాక్టర్ చింతపట్ల వెంకట ఆచారి, రికార్డు పరిశీలకులు డాక్టర్ సాయిశ్రీ పర్యవేక్షించారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, ఇండియన్ టాలెంట్ ఆర్గనైజేషన్ రికార్డు, వండర్ బుక్ ఆఫ్ రికార్డు, వరల్డ్ రికార్డు ఇండియా, మిరాకిల్ వరల్డ్ రికార్డు, గోల్డెన్ స్టార్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డు, మార్వెలెస్ రికార్డులో స్థానం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. శ్రీ మఠంలో నిర్వహించిన ఆంజనేయస్వామి కీర్తనాలాపనకు తొమ్మిది ప్రపంచ రికార్డుల్లోనూ స్థానం దక్కినట్లు శ్రీ గురుసార్వభౌమ దాస సాహిత్య ప్రాజెక్ట్ నిర్ణేతలు డీవీ సుబ్బారావు ప్రకటించారు. అందుకు సంబంధించిన పత్రాలను శ్రీ మఠం పీఠాధిపతి సుభుధేంద్రతీర్థుల చేతుల మీదుగా దాస సాహిత్య ప్రాజెక్ట్ వారికి అందజేశారు.



కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

నదులు బతకాలంటే ఇసుక తవ్వకం నిలిపేయాలి

- కృష్ణానది నీరు తాగడానికే కాదు.. బట్టలుతకడానికి కూడా పనికిరాదు
- జల్ బిరదారి కో ఆర్డినేటర్ బొలిశెట్టి

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): నదులను రక్షించుకోకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని జల్ బిరదారి కో ఆర్డినేటర్ బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో వాటర్‌మెన్ రాజేంద్రసింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'విజయపుర డిక్లరేషన్–2017' ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యకోరలనుంచి నదులకు విముక్తి కల్పించాలని రాజేంద్రసింగ్ 35 ఏళ్లుగా శ్రమిస్తున్నారన్నారు. దేశంలోని 101 నదులను 21 భాగాలుగా విభజించి సుదీర్ఘచర్చల అనంతరం డిక్లరేషన్‌ను రూపొందించడం జరిగిందన్నారు. జాతీయ జలవిధానం తీసుకురావాలనే ఉద్దేశంతోనే డిక్లరేషన్‌ను రూపొందించినట్లు చెప్పారు. మానవ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు నేరుగా నదుల్లో కలుస్తున్నాయన్నారు. కృష్ణానదిలో నీరు తాగడానికే కాదు.. చివరికి బట్టలు ఉతకడానికి కూడా పనికిరాదన్నారు. కృష్ణానది జన్మస్థలం నుంచే కలుషితమవుతోందని, దీన్ని కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలో నదులు బతకాలంటే ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని, జలస్వతంత్రం కావాలన్నారు. నదులకు సంబంధించి రాష్ట్రాల మధ్య వివాదాలు ఉంటే వాటిని రాజకీయాలకు అతీతంగా పరిష్కరించుకోవాలన్నారు. ఆక్రమణలకు గురికాకుండా నదులు, ఉపనదులను పవిత్ర స్థలాలుగా ప్రకటించాలన్నారు. నదులను పరిరక్షించుకునేందుకు జల బిరదారి ఆధ్వర్యంలో జలనాయక్, జల యోధ, జలప్రేమ, జల దూత్, జలసేవక్ పేరుతో కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. రాజధాని ప్రాంత రైతు నాయకుడు అనుమోలు గాంధీ మాట్లాడుతూ సముద్ర జలాలు వెనక్కు వచ్చి డెల్టా ప్రాంతంలో ఉప్పునీరు చేరుతోందని, ఫలితంగా భూసారం తగ్గిపోతోందన్నారు. సమావేశంలో రైతులు బోసు రెడ్డి, జంగా నాగిరెడ్డి, వి. శివారెడ్డి పాల్గొన్నారు.



విజయపుర డిక్లరేషన్‌ను ఆవిష్కరిస్తున్న బొలిశెట్టి సత్యనారాయణ, అనుమోలు గాంధీ తదితరులు



నంద్యాలలోని నందమూరి నగర్ రోడ్‌షోలో జోరువానలో వైఎస్ జగన్ అభివాదం



ఆదివారం రాత్రి నంద్యాలలోని వైఎస్సార్ కాలనీలో రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

చెప్పిందేమిటి... చేస్తున్నదేమిటి?

> “
> నంద్యాల ఉప ఎన్నికలో గెలవడానికి టీడీపీ పెద్దలు చవకబారు రాజకీయాలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేరును పోలి ఉన్న 10 మంది (ఎస్ మోహన్) వ్యక్తులతో నామినేషన్లు వేయించారు. ఓటర్లను తికమక పెట్టేందుకు కుట్రలు పన్నారు. అవినీతితో సంపాదించిన డబ్బుల మూటలతో ఓటర్లను కొనుగోలు చేయడానికి టీడీపీ నేతలు వస్తున్నారు. ఓటుకు రూ. 2 వేలు, 3 వేలు, 5 వేలు ఇస్తున్నారు. నంద్యాల ఓటర్లు టీడీపీ దుర్బుద్ధిని తిప్పికొట్టి.. న్యాయం వైపే నిలబడి శిల్పామోహన్‌రెడ్డిని గెలిపించి చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలి.
>
> – వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

తీరా ముఖ్యమంత్రి అయ్యాక అందరినీ మోసం చేశాడు. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా దారుణంగా అందరినీ వంచించాడు. ముఖ్యమంత్రి హోదాలో కర్నూలులో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని జిల్లాకు పలు హామీలిచ్చారు. వాటిలో కూడా ఒక్కటీ నెరవేర్చలేదు. ఇపుడు నంద్యాల అసెంబ్లీకి ఉప ఎన్నిక వచ్చిందని మళ్లీ పాత టేప్ రికార్డర్‌లా అవే అబద్ధాలు.. అవే మోసాలు వల్లె వేస్తున్నారు. చంద్రబాబూ.. ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా 12వ రోజు ఆదివారం వైఎస్ జగన్ రోడ్‌షో.. సంఘమిత్ర నుంచి ప్రారంభమై ప్రియాంకనగర్, డేనియల్‌పురం చర్చి, సంజీవనగర్ గేట్, రాణి మహారాణి, నందమూరినగర్ మీదుగా వైఎస్ నగర్ వరకు సాగింది. ఈ సందర్భంగా నందమూరినగర్, వైఎస్ నగర్‌లో జగన్ మాట్లాడారు. మోసం చేయడం కోసం చంద్రబాబు ఏ గడ్డి తినడానికైనా వెనుకాడరని మండిపడ్డారు. మోసకారి చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలంటే ప్రజలు విశ్వసనీయతకు పట్టం కట్టి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఎన్ని అబద్ధాలైనా చెబుతారు..

''ఎన్నికల్లో గెలవడానికి చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా ఆడుతారు. వందల సంఖ్యలో మోసపు వాగ్దానాలు చేస్తారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావడానికి రాష్ట్ర ప్రజలను మోసం చేశారు. ఎన్నికల ముందు బాబు చెప్పినదానికి.. అధికారంలోకి వచ్చాక చేస్తున్న దానికి పొంతనే లేదు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు డిగ్రీ పొందారు. మోసం చేయడానికి ఏ గడ్డి అయినా తినడానికి వెనకాడరు. ఇటువంటి అబద్ధాలు, మోసాలు చేసే వ్యక్తిని వెనక్కు పంపకపోతే వ్యవస్థ బాగుపడదు. మోసం చేసినా పర్వాలేదని ఓటు వేస్తే, వచ్చే ఎన్నికల్లో బాబు ప్రజల వద్దకు వచ్చి ఇంటికో మారుతి కారు, కేజీ బంగారం ఇస్తానంటారు. పనైపోయాక వెన్నుపోటు పొడుస్తారు. జీవితంలో అబద్ధం చెప్పని వ్యక్తిని సత్యహరిశ్చంద్రుడు అంటాం.. జీవితంలో నిజం చెప్పని వ్యక్తిని చంద్రబాబు నాయుడు అంటారు. ఇలాంటి మోసకారి వాగ్దానాలతో ప్రజల్ని మోసం చేస్తే కాలర్ పట్టుకుంటారనే సంకేతం నంద్యాల ఉప ఎన్నిక నుంచే ప్రారంభం కావాలి. చంద్రబాబు ఇప్పటి వరకు చెప్పిందేదీ చేయలేదు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు కర్నూలు ప్రజల్ని మోసం చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాక ముందు నంద్యాలలో 21,800 పింఛన్లు ఉండేవి. బాబు అధికారంలోకి వచ్చాక ఈ మూడున్నరేళ్ల పాలనలో అవి 15 వేలకు కుదించారు. ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికలు రాగానే.. వైఎస్సార్‌సీపీ పోటీ పెట్టడంతోనే చంద్రబాబుకు ఇక్కడి ప్రజలు గుర్తుకు వచ్చారు. కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డులు ఇస్తానంటున్నారు. ఎన్నికలయ్యాక వాటిని తొలగిస్తారు. గతంలో కర్నూలును స్మార్ట్ సిటీ చేస్తానన్న బాబు ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి నంద్యాలను స్మార్ట్ సిటీ చేస్తానంటున్నారు.

అందరినీ వెన్నుపోటు పొడిచాడు..

చంద్రబాబు ఎన్నికల్లో గెలవడం కోసం ఎవ్వరినీ వదిలిపెట్టలేదు. రైతులు, పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలు, నిరుద్యోగులు, విద్యార్థులు.. ఇలా అందరినీ మోసం చేశాడు. రైతులకు సంబంధించిన వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు, పొదుపు సంఘాలకు సంబంధించిన రూ. 14 వేల కోట్లను మాఫీ చేస్తానన్నారు. పేదలకు పక్కా ఇల్లు.. 3 సెంట్ల స్థలం.. వ్యవసాయ భూములు పంచుతానన్నారు.. బెల్టు షాపులు తీసేస్తానన్నారు.. కానీ వీటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. బెల్టు షాపులు రద్దు కాకపోగా.. ఫోన్ కొడితే ఇంటి వద్దకే మద్యం తెచ్చి ఇచ్చే పరిస్థితి వచ్చింది. నిరుద్యోగ భృతి కింద ప్రతి ఇంటికి రూ.76 వేలు బాకీ పడ్డారు. ఎన్నికలయ్యాక ప్రజలను పక్కన పెట్టి వెన్నుపోటు పొడిచారు.

వైఎస్ హయాంలోనే పేదలకు భరోసా..

పేదలెవరూ విద్య, వైద్యం విషయంలో అప్పులపాలు కాకూడదని తపించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టారు. పేదవాళ్లు ఇంజినీరింగ్, డాక్టర్, కలెక్టర్ వంటి గొప్ప చదువులు చదువుతానంటే నేను తోడుగా ఉంటానంటూ వైఎస్సార్ ఆ విద్యార్థులకయ్యే ఫీజు మొత్తాన్ని ఆ పథకాల ద్వారా చెల్లించారు. పేదవాడికి తోడుగా నిలవడంతో ఎందరో పేదవాళ్లు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారు. ఇప్పుడు బాబు హయాంలో ఇంజినీరింగ్ చదివేందుకు ఏటా రూ.లక్షదాకా ఖర్చవుతుంటే.. బాబు మాత్రం ముష్టి వేసినట్లు కేవలం రూ.35 వేలు మాత్రమే ఇస్తున్నారు. అది చెల్లించడానికి ఏడాదికిపైగా సమయం తీసుకుంటున్నారు. పైగా మిగిలిన సొమ్ము కట్టకపోతే చదివే పరిస్థితి లేదు. అందుకోసం ఇల్లు, పొలం అమ్ముకుంటారులే అని హేళనగా మాట్లాడుతున్నారు. ఆరోగ్యం బాగోలేక ఏ పేదవాడైనా మంచం పట్టి.. 108కు ఫోన్ చేస్తే 20 నిమిషాల్లో వచ్చి కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి.. చిరునవ్వుతో ఇంటికి పంపించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారు. చంద్రబాబు హయాంలో ఇవాళ ఆరోగ్యశ్రీ నిర్వీర్యమవుతోంది. 8 నెలలుగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ప్రైవేటు డాక్టర్లు ఆపరేషన్లు చేయడానికి వెనకాడుతున్నారు. కాక్లియర్ ఇంప్లాంట్, కిమోథెరపీ, డయాలసిస్ వంటి వాటికి చంద్రబాబు సర్కారు షరతులు పెట్టింది. చంద్రబాబు దారుణ పాలనలో వైద్యం అందక పేదవాళ్లు చనిపోయే దుస్థితి నెలకొంద''ని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

రాబందుల నుంచి రక్షిస్తా..

నంద్యాలలో పేదల ఇళ్లు, స్థలాలపై రాబందుల కన్ను పడింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేద వాళ్లకు పక్కా ఇళ్లు కట్టించారు. నంద్యాలలోని వైఎస్ నగర్, నందమూరి నగర్‌లో 6,500 ఇళ్లు కనిపిస్తున్నాయంటే దానికి కారణం వైఎస్సార్ అని గర్వంగా చెప్పవచ్చు. ఆయన దివంగతులయ్యాక అసంపూర్తిగా మిగిలిన ఇళ్లు, నిర్మాణం ప్రారంభం కాని స్థలాలు, బాడుగకు ఇచ్చిన ఇళ్లపై అధికార పార్టీకి చెందిన రాబందుల కళ్లు పడ్డాయి. వాటిని లాక్కునే కార్యక్రమం చేస్తున్నారు. వైఎస్ నగర్, నందమూరి నగర్ ప్రజలకు అన్ని రకాలుగా నేను అండగా ఉంటాను. రాబందుల నుంచి మిమ్మల్ని రక్షిస్తా. ఆగిపోయిన ఇళ్లను అధికారంలోకి వచ్చిన వెంటనే కట్టిస్తాను. రిజిస్ట్రేషన్ పేపర్లు కూడా లబ్ధిదారుల చేతుల్లో పెడతాను. వైఎస్ నగర్‌లో టీడీపీ దౌర్జన్యాలు పెరిగిపోయాయి. సాక్షి టీవీ కూడా ప్రసారం కాకుండా అడ్డుకుంటున్నారు. దేవుడు చూస్తున్నాడు.. ఏదో ఒకనాడు మొట్టికాయలు పడతాయి.



నంద్యాలలోని నందమూరి నగర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న వైఎస్ జగన్, చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి



నంద్యాలలోని నందమూరి నగర్‌లో ఉన్న మసీదులో ముస్లిం సోదరులతో కలిసి దువా చేస్తున్న వైఎస్ జగన్

అద్దె బస్సుల కండిషన్ తనిఖీ!

- ఆర్టీసీకి నోటీసులు ఇవ్వనున్న రవాణా శాఖ
- బస్సుల ఫిట్‌నెస్‌పై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ అద్దె బస్సుల కండీషన్ తనిఖీకి రవాణా శాఖ సిద్ధమవుతోంది. జిల్లాల వారీగా నోటీసులు జారీ చేయనుంది. ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. గతేడాది 0.09గా ఉన్న ప్రమాదాల రేటు గత ఆర్నెల్లలో 1 శాతం దాటింది. వీటిలో అద్దె బస్సులే ఎక్కువగా ఉన్నట్లు రవాణా అధికారులు గుర్తించారు. బస్సులు సరైన కండీషన్‌లో లేకపోవడం, సరైన రీతిలో శిక్షణ పొందని ప్రైవేటు డ్రైవర్ల వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. వాస్తవానికి ఆర్టీసీకి అద్దెకిచ్చిన యజమానుల్లో చాలామంది బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండానే అప్పగించేశారు. మరోవైపు ఆర్టీసీ అధికారులు బస్సులు ఉన్న పరిస్థితిని పట్టించుకోలేదు. దీంతో ప్రయాణీకుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అద్దె బస్సుల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, బస్సుల్లో సరైన సౌకర్యాలు లేవని ఇటీవల అధికార పార్టీ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి ధ్వజమెత్తడం గమనార్హం. రవాణా అధికారులు సరిగా తనిఖీలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలకు సిద్ధమవడం కొందరు అధికార పార్టీ నేతలు, ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవరపరుస్తున్నట్టు తెలిసింది.

ఆర్టీసీలో 2,788 అద్దె బస్సులు

ఆర్టీసీ మొత్తం 2,788 అద్దె బస్సుల్ని వివిధ రూట్లలో తిప్పుతోంది. ఇందులో ఇంద్ర బస్సులు 27, సూపర్ లగ్జరీ–142, అల్ట్రా డీలక్స్–101, ఎక్స్‌ప్రెస్–901, తెలుగు వెలుగు–1,436, మెట్రో ఎక్స్‌ప్రెస్–59, సిటీ ఆర్డినరీ–122 బస్సులు ఉన్నాయి. వీటిలో ఒక్క దూర ప్రాంత సర్వీసులుగా తిప్పే ఇంద్ర, సూపర్ లగ్జరీ బస్సులు మినహా మిగిలిన బస్సుల కండీషన్ అధ్వాన్నంగా ఉన్నట్లు రవాణా శాఖకు ఫిర్యాదులు అందాయి. గుంటూరు రీజియన్‌లో ఈ అద్దె బస్సుల్ని రవాణా శాఖ తనిఖీ చేయగా, అసలు కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ లేదని తేలింది. బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు కూడా లేవని, ఏపీ మోటారు వాహనాల చట్టం మేరకు ప్రమాణాలు పాటించడం లేదని రవాణా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అద్దె బస్సుల కండీషన్‌ను తనిఖీ చేసేందుకు వీలుగా ఆర్టీసీకి నోటీసులు జారీ చేయనున్నారు.

టీడీపీ నేతలు, అధికారుల్లో కలవరం

ఆర్టీసీలో అద్దె బస్సుల్లో అధిక శాతం ఓ అమాత్యుడి బినామీవే కావడం గమనార్హం. సమీప బంధువులైన ఇద్దరు అమాత్యులు ఆర్టీసీకి తమ బినామీల ద్వారా అద్దె బస్సుల్ని సమకూర్చిన విషయం ఆర్టీసీలో అందరికీ తెలిసిందే. మరోవైపు ఆర్టీసీ అద్దెకు బస్సులు తీసుకుంటుండటంతో కొందరు సంస్థ అధికారులు తాము బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చారు. తాజాగా రవాణా శాఖ అధికారులు తనిఖీల పేరిట రంగంలోకి దిగడం వీరిని ఆందోళనకు గురిచేస్తున్నట్టు ఆర్టీసీ వర్గాల సమాచారం.

పల్స్ సర్వే రిపోర్టు వెల్లడించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సామాజిక వేత్త పున్నారావు లేఖ

సాక్షి, అమరావతి: పల్స్ సర్వే రిపోర్ట్‌ను వెల్లడించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సామాజిక వేత్త ఎ పున్నారావు లేఖ రాశారు. పల్స్ సర్వేలో కులాల వారీ వివరాలు ఉన్నాయని, కాపు, ఒంటరి, బలిజ, తెలగ కులాల్లోని ఆయా కుటుంబాల స్థితిగతులు ఈ సర్వేలో వెల్లడవుతాయన్నారు. దీన్ని ఆధారంగా చేసుకొని బీసీ కమిషన్ తయారు చేసే నివేదిక ఉంటుందనే అభిప్రా యాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని కమిషన్ సభ్యులతో కలిసి చర్చిస్తే తనకు చెప్పినట్లు ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. పల్స్ సర్వే చేసే వారికి ప్రభుత్వం ట్యాబ్‌లు ఇచ్చిందని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 4600 ట్యాబ్‌లు ఇవ్వగా 700 ట్యాబ్‌లు పనిచేయలేదని ఉద్యోగులు వెల్లడించారని, మరో 700 ట్యాబ్‌లు కనిపించలేదని తేలిందన్నారు. దీని వల్ల ఈ రెండు జిల్లాల్లో పల్స్ సర్వే ఆలస్యమైందని, ప్రభుత్వం చెప్పిన విధంగా 2016లో కాకుండా 2017లో సర్వే రిపోర్ట్ ప్రభుత్వానికి అందినట్లు తెలిసిందన్నారు. ఎప్పటిలోగా బీసీ కమిషన్ రిపోర్ట్ ఇస్తారనే విషయాన్ని ప్రశ్నిస్తూ మూడు సార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. పల్స్ సర్వే రిపోర్ట్ బీసీ కమిషన్‌కు ఎప్పటిలోపు ఇస్తారో చెప్పాలని చీఫ్ సెక్రటరీకి ఆర్టీఐ చట్టం కింద లేఖ రాస్తే దానిని బీసీ సంక్షేమ శాఖకు పంపించారని, ఇంతవరకు తనకు అందుకు సంబంధించిన సమాచారం రాలేదన్నారు.

గ్రాండ్ మారథాన్

ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్ సూపర్ సక్సెస్

- ఉల్లాసంగా ఉత్సాహంగా సాగిన పరుగుల పోటీలు
- ఫుల్ మారథాన్ విజేతలు ఇంద్రజీత్‌యాదవ్.. జ్యోతి గవాటే



ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్ సందర్భంగా ఆదివారం ఉదయం పంజాగుట్ట ఫ్లైఓవర్ మీదుగా పరుగులు తీస్తున్న ఔత్సాహికులు

సాక్షి, హైదరాబాద్: మారథాన్.. మారథాన్.. మారథాన్.. ఆదివారం భాగ్యనగరం మారథాన్ మేనియాతో ఊగిపోయింది. ఒకవైపు చిరుజల్లులు.. మరోవైపు యువతీయువకులు, చిన్నారుల కేరింతలతో ఎయిర్‌టెల్ మారథాన్ ఏడో ఎడిషన్ ఆద్యంతం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఫుల్ మారథాన్(42.2 కి.మీ.), హాఫ్ మారథాన్(21.1 కి.మీ.), 10కె రన్ పేరిట మూడు ఈవెంట్లుగా నిర్వహించిన ఈ మారథాన్‌లో సుమారు 16 వేల మంది రన్నర్లు పాలుపంచుకున్నారు. ప్రొఫెషనల్ రన్నర్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా హైదరాబాదీలు పెద్ద సంఖ్యలో రన్‌లో పాల్గొన్నారు. మొత్తంగా రాజధాని హైదరాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించిన ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్ రన్ విజయవంతమైంది. నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద ఆదివారం ఉదయం ఐదు గంటలకు నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి జెండా ఊపి ఫుల్ మారథాన్‌ను ప్రారంభించారు. పీపుల్స్ ప్లాజా వద్దే ఉదయం ఆరు గంటలకు హాఫ్ మారథాన్ ప్రారంభమైంది. హైటెక్స్ ఎక్స్‌పో గ్రౌండ్ వద్ద ఉదయం 7 గంటలకు 10కె రన్‌ను సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. మారథాన్‌లో గెలుపొందిన స్త్రీ, పురుషులకు మూడు విభాగాల్లో మొత్తంగా రూ.7.2 లక్షల ప్రైజ్‌మనీని అందజేశారు.

మారథాన్ విజేతలు వీరే..: 42.2 కి.మీ. ఫుల్ మారథాన్ పురుషుల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రజీత్ యాదవ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇంద్రజీత్ రెండు గంటల 31 నిమిషాల తొమ్మిది సెకన్లలో రేస్ పూర్తి చేశాడు. వైఎస్సార్ జిల్లా చెన్నుపల్లి గ్రామానికి చెందిన దాసరి ఓబులేష్ రెండు గంటల 34 నిమిషాల ఎనిమిది సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలిచాడు. బీఏ మూడో సంవత్సరం విద్యార్థి పి.క్రెస్టార్జునే మూడోస్థానం సాధించాడు. హాఫ్ మారథాన్‌లో యూపీకే చెందిన సమ్రూ యాదవ్.. 10కె రన్‌లో షన్‌షర్‌లాంగ్ వాలంగ్ విజేతలుగా నిలిచారు.

మహిళా విజేతలు వీరే...: మహిళల విభాగం ఫుల్‌మారథాన్‌లో మహారాష్ట్రకు చెందిన జ్యోతి గవాటే మొదటి స్థానంలో నిలిచారు. 3 గంటల ఎనిమిది నిమిషాల రెండు సెకన్లలో ఆమె గమ్యం చేరుకున్నారు. యూపీకి చెందిన జ్యోతి సింగ్ ఇక రెండోస్థానంలో అలహాబాద్‌కు చెందిన ఆరాధనా పూల్‌చంద్ మూడో స్థానంలో నిలిచారు. హాఫ్ మారథాన్‌లో అమందీప్ కౌర్.. 10కె రన్‌లో వి.నవ్య విజేతలుగా నిలిచారు. ఫుల్ మారథాన్‌లో 1,000 మంది, హాఫ్ మారథాన్‌లో 5 వేల మంది, 10కె రన్‌లో 6,500 మంది రన్నర్స్‌గా నిలిచారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

- శ్రీ కమలానంద భారతి స్వామి పిలుపు
- నెల్లూరు జిల్లాలో దేవాలయ సందర్శన యాత్ర ప్రారంభం



గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీ కమలానంద భారతి స్వామి

వెంకటగిరి రూరల్: హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, సమరతా సేవా ఫౌండేషన్ సహకారంతో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు గ్రామంలో సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన యాత్రను హిందూ దేవాలయ ప్రతిష్ఠ పీఠం పీఠాధిపతి శ్రీకమలానంద భారతి స్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లోని అన్ని దేవాలయాలను క్రియాశీలం చేయాలనే సంకల్పంతో భక్తి ఉద్యమంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దేవాలయాలను శక్తి పీఠంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేయనున్నట్లు తెలిపారు. హిందూ సంప్రదాయాలను ఆచరించి, హిందూ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని సీసీ కండ్రిగ, శివలింగాపురం, సిద్ధవరం గ్రామాల్లోని పలు ఆలయాలను ఆయన సందర్శించారు. సోమవారం పారవోలు, బాలసముద్రం, చింతగుంట, పాలెంకోట, దళితవాడ ప్రాంతాల్లో స్వామి పర్యటించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

ఆలయాల పరిరక్షణ కోసం రథయాత్ర

వెంకటగిరిలోని ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సభలో శ్రీ కమలానంద భారతి స్వామి మాట్లాడారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం 2012లో రథయాత్రను ప్రారంభించి, ఇప్పటివరకు వేలాది గ్రామాల్లో దేవాలయాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగినేని కృష్ణయ్య, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పి.రాజేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ కార్యవాహక్ ఈశ్వరయ్య, కృష్ణ, భాస్కర్, ప్రణితి సాహితీ సేవా సంఘం అధ్యక్షుడు సుంకర రవి పాల్గొన్నారు.

జగన్‌ను సీఎం చేయడమే ధ్యేయంగా పనిచేస్తా

- ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం
- నంద్యాలలో వైఎస్సార్‌సీపీ అధినేతతో భేటీ



నంద్యాలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన శివరామ సుబ్రహ్మణ్యం

తాడితోట (రాజమహేంద్రవరం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, సీనియర్ నేత శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రకటించిన నవరత్నాల పథకాలను ఇంటింటా ప్రచారం చేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. శివ రామసుబ్రహ్మణ్యం తన మద్దతుదారులతో శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నంద్యాలలో కలసి పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. రాజమహేంద్రవరం నుంచి తన అనుచరులతో కలసి సుమారు 50 కార్లలో వెళ్లిన ఆయన జగన్‌తో భేటీ అయ్యారు. నంద్యాల ఉప ఎన్నిక అనంతరం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు జగన్‌ను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. సభకు ఏర్పాట్లు చేసుకోవాలని, తప్పక వస్తానని జగన్ మాట ఇచ్చినట్టు చెప్పారు. శివరామ సుబ్రహ్మణ్యం చేరికతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుంది. ఆయన చిన్నప్పటి నుంచి వైఎస్ అభిమాని. ఆయనతో పాటు కార్పొరేటర్ నందూరి రమణ, తాడి మరియ, అగురు పద్మావతి, అగురు ధనరాజ్, మాజీ కార్పొరేటర్ కొయ్యల రమణ, ఎం.సత్యనారాయణ, జిల్లా మహేష్‌బాబు ఫాన్స్ అధ్యక్షుడు సోర్నపూడి హరిగోపాల్, నగర అధ్యక్షుడు ఎం.టైసన్, కాంగ్రెస్ నాయకులు కొల్లిమళ్ల రఘు, అడపా రాజు తదితరులు నంద్యాలలో జగన్‌ను కలిశారు.

రూ.4 కోట్ల సిగరెట్లు దోపిడీ

- లారీ నుంచి మరో లారీలోకి మార్చేసుకుని మరీ దొంగతనం
- తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా చౌటుప్పల్ వద్ద ఘటన



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం
ఇన్‌సెట్‌లో డ్రైవర్ అఖిలేశ్‌యాదవ్

చౌటుప్పల్, హైదరాబాద్: శనివారం అర్ధరాత్రి.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి.. దారిపక్కన రెండు సుమోలు కాచుకుని ఉన్నాయి.. వాటిల్లో ఉన్న 20 మంది అటుగా వస్తున్న ఓ లారీని అటకాయించారు.. డ్రైవర్‌ను చితకబాది లారీని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు.. అందులోని రూ.4 కోట్ల విలువైన సిగరెట్లను దోచుకున్నారు.. అప్పటికే సిద్ధం చేసుకున్న మరో లారీలోకి ఆ సిగరెట్ల పెట్టెలను వేసుకుని ఉడాయించారు.. రద్దీగా ఉండే రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట వద్ద సినీ ఫక్కీలో ఈ సంచలన దోపిడీ జరగడం గమనార్హం.

పక్కా ప్రణాళికతో..

హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఉన్న ఐటీసీ కంపెనీ నుంచి శనివారం అర్ధరాత్రి ఒక లారీ సిగరెట్ల కాటన్లను తీసుకుని.. ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంటకు బయలుదేరింది. జాతీయ రహదారిపై పెద్ద అంబర్‌పేట వద్ద నిర్మానుష్య ప్రాంతానికి ఆ లారీ చేరుకోగానే.. అప్పటికే అక్కడ కాపుకాస్తున్న సుమారు 20 మంది దుండగులు దానిని ఆపారు. బిహార్‌కు చెందిన డ్రైవర్ అఖిలేశ్‌యాదవ్ (35)ను చితకబాది లారీని లాక్కున్నారు. ఈ లారీతో పాటు తాము అప్పటికే సిద్ధం చేసుకున్న కంటైనర్ లారీని తీసుకుని చౌటుప్పల్ ప్రాంతం వైపు వచ్చారు. ఇంకా ముందుకు వెళ్తే టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు, సీసీ కెమెరాలతో ప్రమాదం ఉంటుందని గ్రహించి... దండుమల్కాపురం గ్రామ శివార్లలోని గుట్టల ప్రాంతం వైపు తీసుకెళ్లారు.

సిగరెట్లన్నింటినీ వేసుకుని..

దండుమల్కాపురం గ్రామ శివార్లలోని గుట్టల ప్రాంతంలో రెండు లారీలను నిలిపి.. సిగరెట్ల కాటన్లను తమ కంటైనర్ లారీలోకి మార్చుకున్నారు. లారీ డ్రైవర్‌ను కళ్లకు గంతలు కట్టి.. చేతులు, కాళ్లు కట్టేశారు. ఆ లారీని చౌటుప్పల్ వైపు తీసుకొచ్చి ఖైతాపురం వద్ద వదిలేశారు. తమ కంటైనర్‌ను తీసుకుని పారిపోయారు. అయితే చివరకు ఎలాగో కట్లు విప్పుకున్న లారీ డ్రైవర్ అఖిలేశ్‌యాదవ్.. సమీపంలోని దాబా హోటళ్ల వద్దకు చేరుకుని, వారి సాయంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో రాచకొండ పోలీస్ జాయింట్ కమిషనర్ తరుణ్‌జోషి, క్రైం డీసీపీ జానకి, భువనగిరి డీసీపీ పాలకుర్తి యాదగిరి తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి.. వివరాలు సేకరించారు. వేలిముద్రల నిపుణులు, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. దొంగలను పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ దొంగలు పాతవారేనా? కొత్తగా ఏదైనా ముఠా ఈ ప్రాంతానికి వచ్చిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఇది రెండో 'సిగరెట్'దోపిడీ

2012 అక్టోబర్ 18న చౌటుప్పల్ మండలంలోని కొయ్యలగూడెం శివారులో కూడా సిగరెట్ల లారీ చోరీకి గురైంది. అప్పట్లో రూ.19 లక్షల విలువైన సిగరెట్లను దోచుకెళ్లారు. దీనికి పాల్పడిన 11 మంది దొంగలను పోలీసులు అదే ఏడాది నవంబర్‌లో అరెస్టు చేశారు. వారంతా నల్లగొండ జిల్లాలోని మర్రిగూడెం, చింతపల్లి మండలాలకు చెందినవారే.

గ్రూప్-2 అభ్యంతరాలు బుట్టదాఖలు

- అభ్యంతరాలు పట్టించుకోకుండా రివైజ్డ్ కీ విడుదల
- ఆందోళన చెందుతున్న వేలాది మంది అభ్యర్థులు
- న్యాయపోరాటం చేస్తామంటున్న నిరుద్యోగులు



సాక్షి, అమరావతి: ఈఏడాది నిర్వహించిన గ్రూప్–2 మెయిన్స్ విషయంలో ఏపీపీఎస్సీ తీరును అభ్యర్థులు తప్పుబడుతున్నారు. పరీక్ష పేపర్‌ను తప్పుల తడకగా రూపొందించడమే కాకుండా.. కమిషన్ ఇచ్చిన కీలో తప్పులు దొర్లాయని, దీనిపై తమ అభ్యంతరాలను పట్టించుకోకుండానే రివైజ్డ్ (సవరించిన)కీ అంటూ ఇటీవల మరోదానిని విడుదల చేశారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీపీఎస్సీ తీరుతో తమ ఆశలు గల్లంతుఅవుతాయని ఆవేదన చెందుతున్నారు. తాము ఇచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, తప్పులు లేకుండా తుది కీని విడుదల చేస్తే సరేనని, లేదంటే న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని అభ్యర్థులు చెబుతున్నారు. 2017 జులై 15, 16వ తేదీలలో జరిగిన గ్రూప్–2 మెయిన్స్‌కు సుమారు 50 వేల మంది అర్హత సాధించారు. పరీక్ష పత్రంలో తప్పులు ఉంటే చెప్పాలని ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా కోరింది. ప్రశ్నాపత్రంలో సుమారు 30 వరకూ తప్పులు ఉన్నాయని, వీటిని సరిదిద్ది చర్యలు తీసుకోవాలని సుమారు ఆరువేల మందికి పైనే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటిని పరిగణనలోకి తీసుకుని సరిదిద్దాల్సిన అధికారులు అభ్యంతరాలను పట్టించుకోలేదు. ఒక్క అభ్యంతరాన్ని కూడా పట్టించుకోకుండా రివైజ్డ్ కీని వెబ్‌సైట్‌లో పెట్టారు. రివైజ్డ్ కీలో తప్పులు యథాతదంగా ఉన్నాయని అభ్యర్థులు పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ తప్పులు.. అభ్యర్థుల అభ్యంతరాల్లో కొన్ని..

- ప్రశ్న కీ నం.7984072 6533: రాష్ట్రంలో ఎన్ని రేషన్ దుకాణాలు ఉన్నాయి అనేది ప్రశ్న. వాస్తవానికి 29,054 ఉన్నాయి. జవాబుల్లో 29 వేలు అని ఉండగా పలువురు దానిని జవాబుగా పేర్కొన్నారు. కానీ కీలో మాత్రం 30 వేలు సరైనది అని పెట్టారు.
- ప్రశ్న కీ నం. 7984072 6520: జీఎస్‌డీపీలో ఎకానమి ప్రకారం ఎన్ని రంగాలుగా విభజించారు అనేది ప్రశ్న. ప్రధాన రంగాలు అయితే 9, మొత్తం రంగాలు అయితే 17. ఈ రెండు జవాబులో ఉండగా 17ను ఆన్సర్‌గా పెట్టారు. కానీ కీలో 9 కరెక్టు అని ఇచ్చారు.
- ప్రశ్న కీ నం.7984072 6554: ఏపీలో సెజ్‌లు లేని జిల్లాలు ఏవి అనేది ప్రశ్న. జవాబుల్లో కర్నూలు, వైఎస్సార్ కడప, పశ్చిమగోదావరి, అన్ని జిల్లాల్లో ఉన్నాయి అని ఇచ్చారు. ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అన్ని జిల్లాల్లో సెజ్‌లు ఉన్నాయి అని ఉంది. కానీ 2016–17 ఏపీ ఆర్థిక సర్వేలో కర్నూలు, కడప, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సెజ్‌లు లేవు అని ఇచ్చారు. దీని ప్రకారం పైన పేర్కొన్న మూడు జిల్లాలూ కరెక్టే. కానీ మూడు జిల్లాలు కరెక్టే అన్నది జవాబులో లేదు.



శ్రీవారి ఆలయం వద్ద కుటుంబసభ్యులతో జస్టిస్ నవీన్‌రావు

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, తిరుమల: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో న్యాయమూర్తి ఆలయానికి వచ్చారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం శ్రీవారిని, వకుళమాతను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తి వెంట తిరుమల ప్రొటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ఉన్నారు.

జగనన్నా... జననేత మీరేనన్నా!



డేనియల్‌పురంలో జగన్‌తో తల్లీబిడ్డ సెల్ఫీ



నందమూరి నగర్‌లో ఓ వికలాంగుడి బాధలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

- నంద్యాలలో హోరు వానలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారం
- వెల్లువెత్తిన ప్రజాభిమానం
- మహిళలు, యువతతో కిక్కిరిసిన వీధులు



నంద్యాలలోని నందమూరి నగర్‌లో జోరువానలోనూ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

నంద్యాల నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: ఉప ఎన్నికలో ప్రచారానికి ఇక ఒక్కరోజే మిగిలి ఉండడంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తరఫున ఆదివారం నంద్యాలలో ముమ్మరంగా ప్రచారం చేశారు. హోరున వర్షం కురుస్తున్నా వెనక్కి తగ్గకుండా ఆయన చేస్తున్న ప్రచారం చూసిన నందమూరినగర్ వాసులు 'జగనన్నా... ప్రజా నాయకుడంటే మీరేనన్నా.. జై జగన్'' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జగన్ ఆదివారం ఉదయం ప్రచారాన్ని ప్రారంభించిన సమయంలోనే వర్షం మొదలైంది. మధ్యలో కొంత తెరపి ఇచ్చినా నందమూరినగర్, వైఎస్సార్ నగర్‌లో పర్యటించేటప్పుడు భారీ వర్షం కురిసింది. వర్షంలో తడుస్తూనే జనం జగన్ కోసం నిరీక్షించారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని కలుసుకోవాలనే ఉద్దేశంతో జగన్ ప్రధాన రహదారులపై రోడ్‌షో నిర్వహించారు. చిన్న వీధులు, సందుల్లోకి వచ్చేటప్పటికి వాహనం నుంచి కిందకు దిగి గడప గడపకూ వెళ్లారు. ఆయన వెంట పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఉన్నారు. ప్రధానంగా మహిళలు, యువత అధికంగా కనిపించారు. ఇళ్లపై నిల్చొని జగన్ కాన్వాయ్‌పై పూల వర్షం కురిపించారు. యువతీ యువకులు జగన్‌తో సెల్ఫీ తీసుకోవడం కోసం ఓపిగ్గా ఎదురు చూశారు. జగన్ ఒక వీధిలో ప్రచారం ముగించుకొని మరో వీధిలోకి ప్రవేశి స్తుండగా, గృహిణి ఒకరు ఇంటిలోపలి నుంచి వడివడిగా వస్తూ 'జగనన్నా' అంటూ కేక వేశారు. వెనక్కి తిరిగిన జగన్ ఆమెను దగ్గరకు పిలిచారు. ఆమె సెల్ఫీ తీసుకునే వరకూ ఆగారు.

టీడీపీ నేతలకు అభివాదం

అధికార టీడీపీ ప్రముఖులు విడిది చేసిన నంద్యాలలోని ఓ ప్రైవేట్ హోటల్ పక్క నుంచి తన కాన్వాయ్ సాగుతున్నప్పుడు జగన్ అందరికీ అభివాదం చేశారు. ఆ హోటల్ పైనుంచి టీడీపీ నేతలు రెండు వేళ్లు ఊపుతూ జగన్‌కు చూపారు. ఆయన చిరునవ్వులు చిందిస్తూ చేతులు పైకెత్తి వారికి దండం పెట్టారు. నిష్క్రమిస్తున్నపుడు వారు కూడా 'బై.. బై' అని వీడ్కోలు పలికారు.

అరకొరగా ఉప ప్రణాళిక వ్యయం

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు కేటాయింపులు తప్ప వ్యయం శూన్యం

సాక్షి, అమరావతి: ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక వ్యయం అంతంత మాత్రంగానే ఉంది. ఆర్థిక సంవత్సరం చివరి వరకు ఖర్చు పెట్టకుండా నిధులు మురిగిపోయేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆ వర్గాలకు చెందిన ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీల ఇళ్ల కోసం చేసిన కేటాయింపులను కూడా వ్యయం చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 10,030 కోట్లను కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు కేవలం రూ. 2,770 కోట్లే వ్యయం చేశారు. అలాగే ఎస్టీ ఉప ప్రణాళిక కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 3,796 కోట్లను కేటాయించారని, ఇప్పటి వరకు రూ. 929 కోట్లే వ్యయం చేశారని ఉద్యోగులు తెలిపారు. ఎస్సీ ఉప ప్రణాళికలో సంక్షేమ కార్యక్రమాలకు రూ. 3,160 కోట్లను కేటాయిస్తే ఇప్పటి వరకు రూ. 513 కోట్లే వ్యయం చేశారు. అలాగే ఎస్టీల సంక్షేమ కార్యక్రమాలకు రూ. 1,181 కోట్లను కేటాయిస్తే ఇప్పటి వరకు రూ. 219 కోట్లనే వ్యయం చేశారు. గిరిజనుల వ్యవసాయానికి రూ. 99.14 కోట్లు కేటాయించగా కేవలం రూ. 29 కోట్లే వ్యయం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కోసం రూ. 105 కోట్లను కేటాయించగా ఇప్పటి వరకు పైసా కూడా వ్యయం చేయలేదు. అలాగే గిరిజన యువతకు ఆర్థిక సాయం అందించేందుకు కేటాయింపులు చేసినా పైసా వ్యయం చేయలేదు. ఎస్సీ బాలికా సంరక్షణ కింద, నైపుణ్య అభివృద్ధి శిక్షణ, ఎస్సీ యువతకు ఆర్థిక సాయం కింద, అలాగే ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద కేటాయింపులే తప్ప ఇప్పటి వరకు పైసా వ్యయం చేయలేదు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక వ్యయం తీరు తెన్నులపై ఇప్పటి వరకు ముఖ్యమంత్రి గానీ సంబంధిత మంత్రులు గానీ సమీక్షలు నిర్వహించలేదని, ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నిధులన్నీ మురిగిపోయేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ వైఖరి కనిపిస్తోందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

ఎస్సీ ఉప ప్రణాళికలో కేటాయింపులు-వ్యయం (రూ. కోట్లలో)

రంగం	కేటాయింపులు	వ్యయం
గృహ నిర్మాణం	558.23	4.06
యువత సంక్షేమం	65.20	---
నైపుణ్య శిక్షణ	84.35	---
ఎన్టీఆర్ సుజల స్రవంతి	25.00	----
పీఎంఎవై ఇళ్లు	52.57	---
అన్న క్యాంటీన్లు	52.57	---
వ్యవసాయం	275.69	50.27
సాంఘిక సంక్షేమం	3,160	583.00

ఎస్టీ ఉప ప్రణాళికలో కేటాయింపులు-వ్యయం (రూ. కోట్లలో)

రంగం	కేటాయింపులు	వ్యయం
వ్యవసాయం	99.14	29.59
యువత సంక్షేమం	58.45	----
మహిళా శిశు సంక్షేమం	172.83	11.35
గృహ నిర్మాణం	229.87	1.15
గ్రామీణ మంచినీటి సరఫరా	105.00	---
మాధ్యమిక విద్య	163.58	38.91
ఎస్టీ సంక్షేమం	1,181.00	219.00
పంచాయతీరాజ్	1,299.31	525.09

విస్తరణ అధికారులకు పదోన్నతులు కల్పించాలి

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: వ్యవసాయశాఖలో అక్రమ పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్‌ఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అర్హులైన వ్యవ్యవసాయ విస్తరణాధికారులకు.. వ్యవసాయ అధికారులుగా పదోన్నతి కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మురళీకృష్ణ, కోశాధికారి సుభాస్, సహాధ్యక్షుడు సుధాకర్, ప్రచార కార్యదర్శి వేణుమాధవరావు మాట్లాడారు. గ్రేడ్–1, గ్రేడ్–2 వ్యవసాయ విస్తరణాధికారుల జాబ్ చార్టును వెంటనే విడుదల చేయాలని, 1993 తర్వాత నియమితులైన వీరికి ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, సెప్టెంబర్ 1వ తేదీ విజయవాడలో నిర్వహించే సీపీఎస్ మిలియన్ మార్చ్‌కు హాజరవ్వాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు.

టీడీపీ రాగానికి కాంగ్రెస్ తాళం!

ఉప ఎన్నిక వాయిదా వేయాలని ఫిర్యాదు చేసిన కాంగ్రెస్

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల నియోజకవర్గంలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ హింసకు పాల్పడుతోందంటూ అధికార టీడీపీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎన్నికల సంఘానికి(ఈసీ) ఫిర్యాదులు చేసింది. ఈ ఉపఎన్నికను వాయిదా వేయించేందుకు గట్టిగా ప్రయత్నించింది. సీన్ కట్ చేస్తే... రెండు రోజులు గడిచాయి. నంద్యాల ఉప ఎన్నికను రద్దు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ కూడా ఈసీకి ఫిర్యాదు చేసింది. టీడీపీ రాగానికి కాంగ్రెస్ తాళం వేయడాన్ని గమనిస్తే రెండు పార్టీల మధ్య డీల్ కుదిరిందనే ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా నంద్యాల ఉప ఎన్నికలో ఓట్లను చీల్చేందుకు వీలుగా కాంగ్రెస్ పెద్దలకు, రాష్ట్రంలోని కీలక మంత్రికి మధ్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం. వారం రోజులుగా జరుగుతున్న వరుస పరిణామాలను గమనిస్తే అధికార తెలుగుదేశం పార్టీకి కాంగ్రెస్ వంతపాడుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికార పార్టీకి సహకరించేందుకే...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్‌సీపీని స్థాపించారు. కాంగ్రెస్‌కు చెందిన మెజారిటీ ఓటర్లు జగన్ వెంటే నడిచారు. కాంగ్రెస్‌కు నామమాత్రంగా కొన్ని ఓట్లు పడుతున్నాయి. నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేయకపోతే ఆ ఓట్లన్నీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పోలవుతాయి. అందుకే ఎలాగైనా కాంగ్రెస్ అభ్యర్థిని బరిలో నిలిపేలా కాంగ్రెస్ సీనియర్ నేతలతో టీడీపీ మంత్రి రాయబారం నడిపినట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా భారీగా డీల్ కుదిరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీలో జరుగుతున్న ఈ పరిణామాలను చూసి కాంగ్రెస్‌లోని వృద్ధతరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు టీడీపీకి వ్యతిరేకంగా పోరాడి, ఇప్పుడు అదే పార్టీకి సహకరిస్తుండడం చూస్తే బాధ కలుగుతోందని వాపోతున్నారు. తెలుగుదేశం పార్టీకి సహకరించేందుకే నంద్యాల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీళ్లున్నా.. కన్నీరే!

- కమీషన్లు దండుకునేందుకు జీవో 22
- ముఖ్యనేత ఎత్తుగడను అస్త్రంగా చేసుకున్న కాంట్రాక్టర్లు
- భారీగా లాభం రాని డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తిచేయని వైనం
- ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఆయకట్టుకు నీళ్లందించలేని దుస్థితి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ముఖ్యనేత కమీషన్ల కక్కుర్తి రైతులకు శాపంగా మారుతోంది. పనులను వేగవంతం చేసే ముసుగులో కాంట్రాక్టర్లకు అదనపు లబ్ధి చేకూర్చి కమీషన్లు దండుకునే ఎత్తుగడలో భాగంగా ముఖ్యనేత జారీ చేయించిన ఉత్తర్వులు (జీవో 22) సాగునీటి ప్రాజెక్టులకు గుదిబండగా మారాయి. భారీగా మిగులుకు అవకాశం ఉన్న పనులను మాత్రమే చేస్తున్న కాంట్రాక్టర్లు.. తక్కువగా గిట్టుబాటయ్యే డిస్ట్రిబ్యూటరీల (పిల్ల కాలువ) పనులను చేయలేమని, జీవో 22 నుంచి వాటిని మినహాయించాలని ప్రతిపాదిస్తున్నారు. ఉన్నత స్థాయి ఒత్తిడి మేరకు డిస్ట్రిబ్యూటరీల పనులను ఎస్‌ఎల్‌ఎస్‌సీ (స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ) 60సీ నిబంధన కింద తొలగిస్తోండటంతో.. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ఆయకట్టుకు అందించలేని దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్, సిమెంట్, డీజిల్‌తోపాటు కార్మికులు, యంత్రాలు, మెటీరియల్‌కు ధరల సర్దుబాటును వర్తింపజేసి కాంట్రాక్టర్లకు అదనపు నిధులు ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఫిబ్రవరి 23, 2015న జీవో 22ను జారీ చేసింది. అయితే కాంట్రాక్టర్లు కొన్ని డిస్ట్రిబ్యూటరీల పనులు చేయలేమని.. వాటిని మినహాయించాలని కోరిందే తడవుగా వాటిపై అధ్యయనం చేసి సముచిత నిర్ణయం తీసుకోవాలని ఎస్‌ఎల్‌ఎస్‌సీని కోరింది. దీన్ని అవకాశంగా మలుచుకున్న కాంట్రాక్టర్లు.. భారీగా గిట్టుబాటు కాని డిస్ట్రిబ్యూటరీల పనులను తొలగించాలని ఎస్‌ఎల్‌ఎస్‌సీకి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఆ ప్రతిపాదనలను ఆమోదించాలంటూ ముఖ్యనేత, కీలక మంత్రి ఎస్‌ఎల్‌ఎస్‌సీపై ఒత్తిడి తెస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆయా డిస్ట్రిబ్యూటరీల పనులను తొలగించేస్తున్నారు.

రైతులకు తప్పని కన్నీళ్లు

డిస్ట్రిబ్యూటరీల పనులకు మళ్లీ కొత్తగా అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాల్సి ఉండగా జలవనరుల శాఖ పిలవడం లేదు. ఆయకట్టుకు నీళ్లందకపోవడంతో రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలోని బుట్టాయిగూడెం మండలం చింతలగూడెం వద్ద బైనేరుపై 227.38 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యంతో పోగొండ రిజర్వాయర్‌ను రూ.85.51 కోట్లతో 2014 నాటికే పూర్తి చేశారు. కానీ 4 వేల ఎకరాలకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తికాలేదు. జీవో 22ను అడ్డుపెట్టుకుని కాంట్రాక్టర్ డిస్ట్రిబ్యూటరీల పనులు చేయలేదు. దీంతో రిజర్వాయర్‌లో ప్రస్తుతం నిండుగా నీళ్లున్నా ఆ 4 వేల ఎకరాలకు నీళ్లందించలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు తోటపల్లి ప్రాజెక్టులో నీళ్లున్నా.. గజపతినగరం బ్రాంచ్ కెనాల్ కింద డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తికాని కారణంగా 15 వేల ఎకరాలకు నీళ్లందించలేని దుస్థితి ఉంది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేయకపోవడం వల్ల ఆయకట్టుకు నీళ్లందడం లేదు.



తోటపల్లి ప్రాజెక్ట్


1.98 లక్షల ఎకరాలకు నీళ్లందించకుండా..

హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం తొలి దశ పూర్తయింది. ప్రధాన కాలువకు అనుబంధంగా డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తి చేస్తే కర్నూలు, అనంతపురం జిల్లాల్లో 1.98 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని డిస్ట్రిబ్యూటరీల పనులను చేయకుండా కాంట్రాక్టర్లు తప్పుకున్నారు. మూడేళ్ల నుంచి ఈ పనులను చేపట్టని సర్కార్.. గత ఏప్రిల్ 20న హంద్రీ–నీవా ప్రధాన కాలువ విస్తరణకు రూ.1,098 కోట్లను మంజూరు చేసింది. ఆ పనులను మూడు ప్యాకేజీల కింద కోటరీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టేసింది. మట్టి తవ్వే పనులే కావడంతో కాంట్రాక్టర్లకు భారీ ఎత్తున మిగులుతుంది. వీటిని పరిశీలిస్తే కమీషన్లు వచ్చే పనులపైనే ముఖ్యనేత దృష్టి పెడుతున్నట్టు స్పష్టమవుతుంది.

జిల్లా కమిటీల ఎన్నికలకు కమిటీ

ఏపీ మహిళా, శిశు భివృద్ధి ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పదవీ కాలం పూర్తయిన జిల్లా కమిటీలకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఏపీ మహిళా, శిశు అభివృద్ధి ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల కమిటీని నియమించింది. ఆదివారం గుంటూరులోని కమిషనర్ కార్యాలయ ఆవరణలో జరిగిన అసోసియేషన్ సమావేశానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో తొమ్మిది అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. మహిళా శిశు అభివృద్ధి ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయాల్లో సిబ్బందిని హెడ్ ఆఫీసుకు డిప్యుటేషన్‌పై పంపడాన్ని నివారించాలనే అంశంపై చర్చించారు. ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు ప్రత్యేకంగా సంఘం పెట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంఘం బలోపేతానికి ప్రతి సభ్యుడి నుంచి వార్షిక చందాను వసూలు చేయాలని తీర్మానించారు. జీవో నంబర్ 10లోని లోపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించారు. గ్రేడ్–1 సూపర్‌వైజర్ పోస్టుల ఖాళీలను వారి కోటా ప్రకారం గ్రేడ్–2 సూపర్‌వైజర్ల నుంచి ప్రమోషన్‌పై నియమించాలని తీర్మానించారు. రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు అనంతపురం జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించారు.



అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

టీడీపీ ఎంపీలకు స్పష్టం చేసిన భన్వర్‌లాల్

మాపై ఆరోపణలు చేయడం సరికాదు

ఎన్నికలను సజావుగా నిర్వహిస్తాం.. • ఎలాంటి ఫిర్యాదు వచ్చినా తక్షణం స్పందిస్తాం

సర్వేల పేరుతో ఓటర్లను ప్రభావితం చేయడం చట్టవిరుద్ధం



సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీకి ఎన్నికల సంఘం ఝలక్ ఇచ్చింది. ఎన్నికల సంఘంపైనే ఆరోపణలకు దిగిన అధికారపక్షానికి ఈసీ వద్ద గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే ఏస్థాయి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని టీడీపీ నేతలకు ఈసీ వార్నింగ్ ఇచ్చింది. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని, అనవసరంగా తమపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికింది. సర్వేలు, ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం ఎత్తివేయాలన్న టీడీపీ డిమాండ్‌ను తోసిపుచ్చింది. తెలుగుదేశం పార్టీ ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేశినేని నాని ఆదివారం ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిశారు. వైఎస్సార్ సీపీ నిబంధనలను అతిక్రమిస్తోందని, ఆ పార్టీపై చర్యలు తీసుకోవాలని కోరారు. డబ్బులు తరలిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ చేసిన ఫిర్యాదుపై గంటలోనే స్పందించారని, అందులో నిజం లేదని తేలినా ఆపార్టీపై చర్యలు తీసుకోలేదని, ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఈ వ్యాఖ్యలపై భన్వర్‌లాల్ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని, ఈ క్రమంలో ఫిర్యాదు వచ్చిన తక్షణమే స్పందిస్తే దాన్ని కూడా తప్పుబడితే ఎలా అని ప్రశ్నించడంతో టీడీపీ నేతలు గతుక్కుమన్నారు. ఎన్నికల సంఘం ఉదాసీనంగా వ్యహరిస్తోందని ఏ ఆధారంతో ఆరోపిస్తున్నారని టీడీపీ ఎంపీలను భన్వర్‌లాల్ నిలదీసినట్టు తెలిసింది.

సర్వేలపై దర్యాప్తునకు ఆదేశం..

నంద్యాల ఉప ఎన్నికల్లో సర్వేలు, ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే ఎవరికి ఓటు వేస్తారని ఓటర్లను అడగడం చట్టవిరుద్ధమని ఈసీ చెప్పినట్లు తెలిసింది. సర్వే పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, భయపెట్టడం లాంటి చర్యలకు దిగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందటంతోనే సర్వేలు, ఒపీనియన్ పోల్స్ నిషేధించామని టీడీపీ నేతలకు భన్వర్‌లాల్ వివరించారు. ఇప్పటివరకూ జరిగిన ఇలాంటి వాటిపై దర్యాప్తునకు ఆదేశించినట్టు ఆయన స్పష్టం చేశారు. నంద్యాల ఉప ఎన్నిక జరిగే ఈ నెల 23వ తేదీ సాయంత్రం వరకూ ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్ నిర్వహించవద్దని, వాటిని ఏ చానల్ ప్రసారం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కారణంగానే డీఎస్పీని బదిలీ చేయాల్సి వచ్చిందని, ఇందులో కమిషన్ ప్రజాస్వామ్య బద్ధంగానే వ్యవహరించిదని ఆయన వివరించారు.

మైనార్టీలకు అండగా ఉంటా: చంద్రబాబు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ ఫరూక్, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడికి అవమానం

సాక్షి బృందం, నంద్యాల: అధికార తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అమీర్‌బాబుకు అవమానం జరిగింది. నంద్యాలలో ఆదివారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు అమీర్‌బాబు వెళ్లగా, స్థానిక ఎమ్మెల్సీ ఫరూక్ అడ్డుకున్నారు. ఇది కడప కాదు.. నంద్యాల అంటూ బలవంతంగా వెనక్కి పంపించారు. దీంతో అమీర్‌బాబు అవమానానికి గురై అలకబూనారు.



సదస్సుకు హాజరైన ముస్లింలు

సీఎం కాలికి గాయం

సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన సీఎం చంద్రబాబు మెట్లు ఎక్కబోతూ కిందపడబోయారు. అంతలో సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని లేపారు. ఈ ఘటనలో చంద్రబాబు కుడికాలికి చిన్న గాయం కావడంతో ఇబ్బంది పడ్డారు.

రుణమాఫీ చేశా.. ఓట్లు వేయండి

తాను అధికారంలోకి వచ్చాక డ్వాక్రా రుణాలను మాఫీ చేశానని, నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా మహిళలను కోరారు. ఆయన ఆదివారం నంద్యాలలో డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. ఐదేళ్లపాటు మహిళల సంక్షేమం కోసం పనిచేస్తానని, ఒకసారి మాత్రమే ఓటు వేయాలని కోరతానని అన్నారు. భవిష్యత్తులో మరింత ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఇప్పుడు తాను చెప్పినట్లు వినాలని సూచించారు. డ్వాక్రా సంఘాలను తాను ఏర్పాటు చేశానని, ఏ పని చెప్పినా చేసేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

బోగస్ న్యూస్ చానెళ్లపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలి

అంబటి రాంబాబు డిమాండ్

నంద్యాలవ్యవసాయం: ఆల్ బోగస్ న్యూస్ చానెళ్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికపై సర్వేలు, అభిప్రాయ సేకరణ నిర్వహించరాదని చెప్పినా 'ఆల్ బోగస్ న్యూస్ చానెళ్లు' మాత్రం ప్రసారం చేస్తున్నాయని, వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పిచ్చి అంకెలతో టీడీపీని పైకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయని, అవాస్తవాలు చెప్పి ప్రజలను ప్రభావితం చేయాలని చూస్తున్నాయని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆ చానెళ్లపైన ఈసీ కఠినంగా వ్యవహరించాలన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అంబటి

టీడీపీకి అనుకూలంగా, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తోన్న బోగస్ చానెళ్ల ప్రసారాలు వెంటనే నిలిపి వేయాలన్నారు. నంద్యాల ప్రజలు ఎప్పుడో డిసైడ్ అయిపోయారని, చంద్రబాబు సభలకు జనం రాకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. దౌర్భగ్యమైన ఈ చానెళ్ల ప్రసారాలను ఎవరూ నమ్మవద్దని, చంద్రబాబు అండ్‌కో ఎన్ని కుట్రలు చేసినా ఉప ఎన్నికలో శిల్పా మోహన్‌రెడ్డిదే అంతిమ విజయమని స్పష్టం చేశారు.

ముస్లింలపై బాబుది కపట ప్రేమ!

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి

- ఓట్లు, సీట్ల కోసం ఎంతటికైనా తెగిస్తారు
- సీఎం చంద్రబాబుపై ముస్లిం ప్రజాప్రతినిధుల మండిపాటు
- నాటి ఎన్నికల్లో ముస్లింలకు ఒక్క సీటే కేటాయించారు
- మైనార్టీ మంత్రి లేని కేబినెట్ చంద్రబాబుదే
- టీడీపీని నమ్ముకున్న వారిపై చిన్నచూపు
- నంద్యాల ఎన్నికల నేపథ్యంలోనే ఇప్పుడు హామీలు

''ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ ఎండకు ఆ గొడుగు పట్టేరకం. ఎన్నికల కోసం కులాలను మతాలను ఉపయోగించుకునే అవకాశవాది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ముస్లిం మైనార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించని ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబే. ఇప్పుడు నంద్యాలలో ముస్లింలపై కపట ప్రేమ చూపుతున్నారు'' అంటూ ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు విమర్శిస్తున్నారు. దీనిని రాజకీయ విశ్లేషకులు కూడా సమర్థిస్తున్నారు. అవసరమైతే వాడుకోవడం, ఆపై కరివేపాకులా తీసిపారేయడం చంద్రబాబుకు అలవాటేనని వారు చెబుతున్నారు. దీనికి చంద్రబాబు హామీలే రుజువు అని వివరిస్తున్నారు. ఇస్లామిక్ డెవెలప్‌మెంట్ బ్యాంకు పెట్టి మైనార్టీలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటివరకూ దాని ఊసేలేదని విశ్లేషకులు చెబుతున్నారు. మైనార్టీలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించకపోగా, హిందూపురంలో అబ్దుల్‌ఘనీకి సైతం అన్యాయం చేశారు. తన వియ్యంకుడు నందమూరి బాలకృష్ణ కోసం సిట్టింగ్ సీటు త్యాగం చేస్తే.. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మంచి పదవి ఇస్తానని ఘనీని నమ్మించి మోసం చేశారని వివరిస్తున్నారు.

నారాయణ, లోకేశ్‌కు ఉన్నస్థాయి మైనార్టీలకు లేదా?

ఎలాంటి పదవి లేకపోయినా నారాయణకు మంత్రివర్గంలోకి తీసుకొని ఆపై ఎమ్మెల్సీని చేశారు. లోకేశ్‌ను ఎమ్మెల్సీ చేసి ఆపై మంత్రి పదవి ఇచ్చారు. ముస్లింలపై నిజంగా ప్రేమ ఉంటే ఒక్క మైనార్టీ సోదరుడినైనా ఎందుకు మంత్రివర్గంలోకి తీసుకోలేదు. ఎమ్మెల్సీగా సీనియర్లు మైనార్టీ వ్యక్తులున్నా వారికి మంత్రి వర్గంలోకి తీసుకోలేదు ఎందుకు? దీనిని బట్టే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముస్లిం మైనార్టీల పట్ల ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు.

– ఎమ్మెల్యే ఎస్.మహమ్మద్ ముస్తఫా

మైనార్టీల ద్రోహి చంద్రబాబు

బీజేపీతో పొత్తు పెట్టుకొని చారిత్రక తప్పిదం చేశాను, మరోమారు తప్పిదం చేయనని 2004లో ప్రకటించిన చంద్రబాబు.. 2014లో మాటతప్పి బీజేపీతో పొత్తుపెట్టుకున్నారు. 15 మందికి ఎమ్మెల్యే టికెట్లు ఇస్తానని చెప్పి, పీలేరులో మాత్రమే ఒక సీటు కేటాయించారు. అదికూడా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో లోపాయికారి ఒప్పందం మేరకు మైనార్టీలను చీల్చాలనే ఉద్దేశంతో ఆపని చేశారు. టీడీపీనే నమ్ముకున్న లాల్‌జాన్‌బాష కుటుంబాన్ని పట్టించుకున్న పాపానపోలేదు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో ఉన్న ఎన్ఎండీ ఫరూక్‌కు ఈ మూడున్నర ఏళ్లలో ఇంటర్వ్యూ ఇవ్వని చంద్రబాబు.. నంద్యాలలో ఎన్నికలు కాబట్టే ఓట్ల కోసం ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే ముస్లిం మైనార్టీల ద్రోహి.

– అంజాద్ బాషా, ఎమ్మెల్యే

విశ్వాసానికి మారుపేరు ముస్లింలు

మైనార్టీలు మేలు చేసిన వారిని గుర్తుంచుకుంటారు. కీడు చేసిన వారిని మరువరు. అత్యంత విశ్వాసపాత్రులుగా ఉంటారు. ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చేయూతనిచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే. ఫీజురీయింబర్స్‌మెంట్ పథకంతో అనేక మంది ముస్లిం ఉన్నత విద్య అభ్యసించారు. ఇప్పటికీ ఆ మహానేత మా ముస్లింల గుండెల్లో ఉన్నారు. 2014లో ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి అభిమానం చాటుకున్నారు. మరోమారు నంద్యాలలో సైతం అదే విశ్వాసాన్ని ముస్లింలు వైఎస్సార్ సీపీపై తమ ప్రేమను చూపేందుకు సంసిద్ధంగా ఉన్నారు.

– హెచ్.నదీం అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

చంద్రబాబు వల్లే భూమా మరణం

నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



నంద్యాల వ్యవసాయం: చంద్రబాబు ఒత్తిడి, వేధింపుల వల్లే భూమా నాగిరెడ్డి మరణించారని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. శోభా నాగిరెడ్డి బతికి ఉంటే ఆయన పార్టీ మారేవారు కాదన్నారు. నంద్యాల ఉప ఎన్నికకు చంద్రబాబే కారణమని మండిపడ్డారు. ఆదివారం ఆయన కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ కుటుంబంతో భూమా కుటుంబానికి చాలా అనుబంధం ఉందన్నారు. వైఎస్ జగన్ నైతిక విలువలను పెంపొందిస్తుంటే.. చంద్రబాబు వాటిని కాల రాస్తున్నారని మండిపడ్డారు. శిల్పా చక్రపాణిరెడ్డిని పార్టీలోకి తీసుకునే ముందు ఎమ్మెల్సీ పదవికి జగన్ రాజీనామా చేయించారని, అదే చంద్రబాబు 21 మంది ఎమ్మెల్యేలతో ఇంత వరకు రాజీనామా చేయించలేదని గుర్తు చేశారు. విలువల గురించి చంద్రబాబు మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటారన్నారు. చంద్రబాబు లాంటి వారు రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాస్వామ్య మనుగడ కష్టాల్లో ఉంటుందన్నారు. ఫిరాయింపు దారులకు మంత్రి పదవులు ఇచ్చి ప్రజాస్వామ్య విలువలను కాలరాశారని ధ్వజమెత్తారు. ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారన్నారు. వాడుకొని వదిలేయడం చంద్రబాబు నైజమని, నంద్యాల ప్రజలు ఇవన్నీ గమనించాలని కోరారు. పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన చరిత్ర అని గుర్తు చేశారు. ఆ సమయంలో ఎన్టీఆర్ తనయుడు హరికృష్ణకు మంత్రి పదవి ఇచ్చారని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రి పదవి నుంచి తప్పించారని తెలిపారు. మంత్రి అఖిలప్రియకు కూడా అదే పరిస్థితి వస్తుందన్నారు. నంద్యాలలో కండువాలు లేకుండా ప్రచారం చేయాలని బీజేపీ నేతలకు చెబుతున్నారని, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం కండువాలు వేసుకోవాలని సూచించారని మేకపాటి తెలిపారు. ముస్లింలు, దళితులు, కాపులు బలహీన వర్గాలు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటారని, నంద్యాలలో శిల్పామోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కాపులకు ఏం చేశారో చెప్పండి

మా కష్టాలు తెలుసుకోకుండా ప్రతిపక్ష నేతపై విమర్శలు చేస్తారా?

- సీఎంను నిలదీసేందుకు ప్రయత్నించిన బలిజలను అడ్డుకున్న పోలీసులు

సాక్షి బృందం, నంద్యాల: ''బలిజల ఆత్మీయ సదస్సుకు వచ్చి, మా స్థితిగతులు తెలుసుకోకుండా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం ఏంటి? కాపులు/బలిజలకు ఇప్పటిదాకా ఏం చేశారో చెప్పండి'' అని ముఖ్యమంత్రి చంద్రబాబును అడగటానికి ప్రయత్నించిన బలిజ సంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన ఆదివారం కర్నూలు జిల్లా నంద్యాలలో టీడీపీ నిర్వహించిన బలిజల ఆత్మీయ సదస్సులో చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సిద్ధం రాఘవయ్య నేతృత్వంలో కొందరు నాయకులు కాపుల సమస్యలపై సీఎంను ప్రశ్నించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని బయటకు పంపించేశారు. దీంతో బలిజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్ధం రాఘవయ్య మాట్లాడుతూ... బలిజలతో సమావేశమయ్యేందుకు వచ్చిన చంద్రబాబు ప్రతిపక్ష నేతపై విమర్శలు చేయడం ఏమిటని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాపులను బీసీల్లో చేరుస్తారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ.. ఇప్పుడు నంద్యాలలో కాపుల ఓట్ల కోసం కపటప్రేమ చూపడం దారుణమని ధ్వజమెత్తారు. కాపులకు ద్రోహం చేసిన వారికి ఎన్నికల్లో ఓట్లు వేయబోమని తేల్చిచెప్పారు. ఇంతలో ఆయనను పోలీసులు అడ్డుకుని బయటకు లాక్కెళ్లారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన బలిజలు

ఎన్నికలప్పుడు అందరూ వీఐపీలే: బాబు

ఎన్నికల సమయంలో అందరూ వీఐపీలే అని, వారిని పలకరించకుంటే మా ఓట్లు మీకు అవసరం లేదా అని అంటారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బలిజల ఆత్మీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరినీ పలకరించాలన్నారు. కాపుల అభివృద్ధికి పాటుపడింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. కాపు విద్యార్థులను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపిన ఘనత తమదేనని వెల్లడించారు. కాపులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చింది కూడా తామే అన్నారు. కాపుల రిజర్వేషన్ కోసం మంజునాథ కమిషన్‌ను వేశామని, కమిషన్ రిపోర్టు రాగానే కేంద్రానికి పంపి తదుపరి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కాపులను ఆర్థికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

బరితెగించిన టీడీపీ...

- నంద్యాలలో ఓటర్లకు డబ్బు పంచుతూ అడ్డంగా దొరికిన ఆ పార్టీ సర్పంచ్
- ఓటుకు రూ. 5 వేల చొప్పున పంపకం

నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ నేతలు బరితెగించారు. ఓటర్లకు డబ్బులు పంచుతూ ఆదివారం రాత్రి అడ్డంగా దొరికిపోయారు. నంద్యాల మండలం రైతునగరం గ్రామ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నేత లక్ష్మీకొండారెడ్డి స్థానిక క్రాంతినగర్‌లో ఓటుకు రూ. 5 వేలు పంచుతున్నట్లు 'సాక్షి'కి సమాచారం అందింది. అక్కడికి వెళ్లి చూడగా ఓటర్లకు ఆయన డబ్బులు పంచుతూ కనిపించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ నేతలు ఇలా బరితెగించడం చూసి గ్రామస్తులు విస్తుపోతున్నారు. రైతునగరం పంచాయతీలో 3 వేల మందికి సర్పంచ్ ఆధ్వర్యంలో ఓటుకు రూ. 5 వేలు చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. ఇక్కడే కాకుండా నంద్యాల, గోస్పాడు మండలాల్లోని గ్రామాలతో పాటు నంద్యాల పట్టణంలోని 42 వార్డుల్లో టీడీపీ నాయకులు ఓటుకు రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డబ్బు పంచుతున్న సర్పంచ్ లక్ష్మీకొండారెడ్డి

30 నుంచి గన్నవరం - చెన్నై విమాన సర్వీస్



విమానాశ్రయం (గన్నవరం): గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్ క్రమంగా సర్వీసులను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 30వ తేదీ నుంచి చెన్నైకు విమాన సర్వీసు ప్రారంభించనుంది. ఈ అలయన్స్ ఎయిర్ విమానం ప్రతి రోజూ చెన్నై నుంచి ఉదయం 10.55కి బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు గన్నవరం చేరుకుంటుదని ఎయిర్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. 20 నిమిషాల విరామం అనంతరం తిరిగి మధ్యాహ్నం 12.35కు గన్నవరం నుంచి బయలుదేరి 13.55కు చెన్నైకు చేరుకుంటుందని వెల్లడించారు. ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేసి టిక్కెట్ బుకింగ్‌ను కూడా ప్రారంభించారు. కాగా, అలయన్స్ ఎయిర్ విశాఖపట్నం కేంద్రంగా గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్‌లకు విమాన సర్వీసులు నడుపుతోంది.

'ఉపాధి' తనిఖీ బృందం పర్యటన వాయిదా

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేసేందుకు గాను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆడిట్ బృందం సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించాల్సి ఉండగా, ఆఖరి నిమిషంలో పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు సమాచారం అందింది. వారం తర్వాత తిరిగి కేంద్రబృందం పర్యటన ఉండే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. జూన్ 27 నుంచి జులై 1 వరకు నాలుగు రోజుల పాటు కర్నూలు జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు తీరును తూర్పారపడుతూ నివేదిక అందజేయడంతో పాటు రాష్ట్రానికి పథకం అమలుకు కొత్తగా నిధుల విడుదలను కూడా నిలిపివేసిన విషయం విదితమే.

ఏం చేశావని ఓటేయాలి బాబూ?

సోషల్ మీడియా వేదికగా అధికార పక్షాన్ని నిలదీస్తున్న నెటిజన్లు

విచ్చలవిడి హామీలే తప్ప అమలు ఏది? • ఇప్పుడు మళ్లీ నంద్యాల ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నంపై మండిపాటు

ప్రజలను ఆలోచింపజేస్తున్న పోస్టులు

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇప్పటివరకు ఒక్క హామీ అమలు చేయకపోగా.. ఇప్పుడు నంద్యాలకు అది చేస్తాం ఇది చేస్తామంటూ అధికారపార్టీ చేస్తున్న వాగ్ధానాలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులుగా ఏం అభివృద్ధి చేశారని మీకు ఓటు వేయాలంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఈ మేరకు అధికార పార్టీ వైఫల్యాలు, హామీల మోసాలు, మూడేళ్లుగా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో పలువురు పెడుతున్న పోస్టులు ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. ఓటుకు కోట్లు కేసు, పుష్కరాలు, పట్టిసీమ పేరుతో విచ్చలవిడి దోపిడీ, సదావర్తి భూముల వ్యవహారం, మహిళలపై దాడులు, పబ్లిసిటీ పిచ్చితో గోదావరి పుష్కరాల్లో 30 మంది అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్న తీరు, కాల్‌మనీ కేసులు, ఇసుక మాఫియాను దగ్గరుండి ప్రోత్సహిస్తుండడం దగ్గర నుంచి... అవినీతి డబ్బుతో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన ఉదంతం, ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాల్సిందేనంటూ ఎన్నికల్లో చెప్పి.. ప్యాకేజీకి అమ్ముడుపోయిన తీరుపై అనేక ఆలోచింపజేసే పోస్టులు పెడుతూ ఎందుకు టీడీపీకి ఓటు వేయాలని ప్రశ్నిస్తున్నారు.

నంద్యాల ఉప ఎన్నిక వచ్చిన క్రమం.. భూమా నాగిరెడ్డి మరణానికి దారితీసిన పరిస్థితులు, నంద్యాల్లో రోడ్ల వెడల్పుకు నిధులు కావాలంటూ రెండేళ్ల కిందట శిల్పా మోహన్‌రెడ్డి అభ్యర్థిస్తే.. ఎక్కడున్నాయి నిధులు, నువ్వు ఇస్తావా అంటూ చంద్రబాబు వ్యంగ్యంగా మాట్లాడిన ఘటనలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో హడావుడిగా ఎలాంటి సమాచారం లేకుండా ఇళ్లను కూలదోయడం.. నామమాత్రపు నష్టపరిహారాన్ని ఇస్తామంటూ మభ్యపెట్టడంపై మండిపడుతున్నారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ఆలోచింపజేస్తున్న పోస్టులు కొన్ని..

- ఓట్లు వేయలేదని మూడేళ్ల పాటు రాయలసీమకు కనీసం ఎంగిలి చేతులు కూడా విదిల్చకపోగా.. ఓటేస్తేనే మీకేదైనా చేస్తాను. నాకు ఓట్లేయకుంటే రోడ్లమీద తిరగొద్దు.. పింఛన్లు, రేషన్ తీసుకోవద్దు అని బెదిరిస్తున్న వారిని నమ్ముదామా?.. నాయకత్వం కంటే ప్రజలే ముఖ్యం అని నినదించే వాడి పక్షాన నిలబడదామా..?
- విపక్షం గెలిచినా నా ప్రమేయం లేకుండా అభివృద్ధి జరగనివ్వను అనే వాళ్లను విశ్వసిద్ధామా?.. అధికారం ఉన్నా లేకపోయినా శక్తివంచన లేకుండా అభివృద్ధికి కృషి చేస్తామనే వాళ్లకు ఓటేద్దామా?
- కోట్లు వెదజల్లి విపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, కనీసం రాజీనామా చేయమనే ధైర్యం లేని వాళ్లకు ఓటేద్దామా?.. విశ్వసనీయతకు ప్రాధాన్యతనిస్తూ ఒక పార్టీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాకే తమ పార్టీలో చేర్చుకున్న వ్యక్తికి ఓటేద్దామా?
- ''టీడీపీకి ఎందుకు ఓటేయ్యాలి?.. ఒక మంత్రి పదవి కూడా ఇవ్వనందుకు ముస్లిమ్స్ టీడీపీ కి ఓటు వేయాలా?
- బ్రాహ్మణులకు ఒక మంత్రి పదవీ ఇవ్వకుండా పైగా నిజాయితీపరుడైన మాజీ చీఫ్ సెక్రటరీ, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావును అవమానించినందుకు ఓటు వేయాలా?
- దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారు.. ఎస్టీలకు తెలివి ఉండదు.. అని సాక్షాత్తూ ముఖ్యమంత్రే దళితులను అవమానిస్తే.. దళితులు శుభ్రంగా ఉండరు, చదువుకోరు, రిజర్వేషన్లు అనుభవిస్తున్నారంటూ ఓ మంత్రి దారుణంగా మాట్లాడినందుకు టీడీపీ కి ఓటు వేయాలా?
- అధికారంలోకి వస్తే 6 నెలల్లో కాపులను బీసీల్లో చేరుస్తాను, ప్రతి ఏడాది వెయ్యి కోట్లు ఇస్తా అని చెప్పి.. హామీలు నెరవేర్చమని ముద్రగడ ఉద్యమిస్తే దారుణంగా అవమానించినందుకు ఓటెయ్యాలా?
- కోడలు మగ పిల్లాడిని కంటానంటే ఏ అత్త వద్దంటుంది అని మహిళల పట్ల చిన్న చూపు చూసినందుకు ఓటు వేయాలా? రాయలసీమ రౌడీలు అని పదే పదే ఒక ప్రాంతాన్ని అవమానిస్తున్నందుకు సీమ ప్రజలు ఓటు వేయాలా?



- సీమకు నీళ్లివ్వకుండా ఎండబెడుతున్నందుకు ఓటు వేయాలా? సీమలో హైకోర్ట్ పెట్టనందుకు ఓటు వేయాలా?
- నిరుద్యోగులకు రుణమాఫీ చేయనందుకు ఓటు వేయాలా? ఇంటికో ఉద్యోగం ఇవ్వనందుకా? నిరుద్యోగులకు నెలకు 2 వేలు చొప్పున 38 నెలలకు గాను ఒక్కో నిరుద్యోగికి 76 వేలు ఇవ్వనందుకు ఓటు వేయాలా?'' అంటూ నెటిజన్లు నిలదీస్తున్నారు.

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
సోమవారం 21-8-2017

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: బయాలజీ
- ఐబీపీఎస్- ఆర్ఆర్‌బీ: రీజనింగ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- టీఎస్‌పీఎస్సీ-ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లోని పోస్టులకు: ఆగస్టు 21
- టీఎస్‌పీఎస్సీ- తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్)లోని పోస్టులకు: ఆగస్టు 22
- వెబ్‌సైట్: www.tspsc.gov.in



వైరస్‌ను క్రియారహితం చేయాలంటే..

రేబిస్ టీకా



రేబిస్ వ్యాధి లీసా వైరస్ **Lyssa virus** వల్ల కలుగుతుంది. ఈ రేబిస్ వైరస్ కలిగిన కుక్కలు, గబ్బిలాలు, కోతులు, పిల్లులు మానవుడిని కరిచినప్పుడు, గీరినప్పుడు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఇది మెదడులోని నాడీ కణజాలాన్ని నాశనం చేస్తుంది. ఫలితంగా పక్షవాతం వస్తుంది. నీరంటే భయపడటం (హైడ్రోఫోబియా), మూర్ఛ, ఉద్రేకపడటం, భయపడటం రేబిస్ లక్షణాలు. ఈ వ్యాధి వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 24 వేల నుంచి 60 వేల మరణాలు సంభవిస్తున్నాయి. వీటిలో 95 శాతం మరణాలు ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే ఉంటున్నాయి. అమెరికాలో రేబిస్ వ్యాధి ఎక్కువగా గబ్బిలాల వల్ల వ్యాప్తి చెందుతుంటే భారత్‌లో 99 శాతం కుక్కల ద్వారా వ్యాప్తి చెందుతోంది.

సంప్రదాయ పద్ధతిలో రేబిస్ టీకా తయారీ

సంప్రదాయ పద్ధతిలో క్షీణింపజేసిన వ్యాధికారక వైరస్‌లను ఉపయోగించి టీకాను తయారుచేస్తారు. రేబిస్ వైరస్‌ను తీసుకొని క్షీణింపజేసి, నిర్వీర్యం చేసిన అనంతరం వ్యాక్సిన్‌గా ఉపయోగిస్తారు. రేబిస్ టీకా తయారీ మూడు దశల్లో ఉంటుంది. అవి..

Virus Attenuation

వైరస్ ఎటెన్యూయేషన్ అంటే వైరస్‌ను క్షీణింపచేయడం. దీనికోసం ఆఫ్రికా కోతి మూత్రపిండ కణాలను వాడతారు. వీటిని వెరో కణాలు అంటారు. రేబిస్ వైరస్‌ను కణజాల వర్ధనం ద్వారా అభివృద్ధి చేసిన వెరో కణాల పైకి విడుదల చేస్తారు. ఈ కణాల్లో రేబిస్ వైరస్ అభివృద్ధి చెందుతుంది. అనేక తరాల తర్వాత వైరస్ క్రమంగా బలహీనపడుతుంది.

Virus inactivation

వైరస్ ఇనాక్టివేషన్ అంటే వైరస్‌ను క్రియారహితంగా మార్చడం. మొదటి దశలో క్షీణింపజేసిన వైరస్‌ను 0.45 మైక్రాన్ పొర ద్వారా వడకడతారు. దీన్నే వైరల్ క్లారిఫికేషన్ అంటారు. తర్వాత అల్ట్రా ఫిల్ట్రేషన్ ప్రక్రియ ద్వారా గాఢత చెందిస్తారు. చివరగా బీ ప్రొపియో లాక్టోస్ అనే రసాయనాన్ని ఉపయోగించి రేబిస్ వైరస్‌ను క్రియారహితం చేస్తారు (అంటే చంపేయడం). ఆ తర్వాత ఇంకా సజీవంగా మిగిలి ఉన్న కొన్ని వైరస్‌లను వేరు చేస్తారు.

బల్క్ వ్యాక్సిన్ తయారీ

క్రియారహితం చేసిన వైరస్‌ను శుద్ధి చేస్తారు. తర్వాత కొన్ని పరీక్షలు నిర్వహించి అధిక మొత్తంలో వ్యాక్సిన్‌ను తయారుచేస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలను అనుసరించి ప్రతి మిల్లీ లీటర్‌కు 2.5 ఐయూ (ఇంటర్నేషనల్ యూనిట్స్) మోతాదులో వైరస్ ఉండాలి.

డీపీటీ టీకా



డీపీటీ టీకాను డిఫ్తీరియా (కంఠసర్పి), పెర్టుసిస్ (కోరింత దగ్గు), టెటానస్ (ధనుర్వాతం) అనే మూడు బ్యాక్టీరియల్ వ్యాధుల నివారణకు వాడతారు. దీన్ని ఆరు వారాలు, పది వారాలు, 14 వారాల వయసు పిల్లలకు వేస్తారు. ఈ టీకా తయారీలో ముందుగా మూడు రకాల టీకాలను విడివిడిగా సంప్రదాయ పద్ధతిలో తయారుచేసి, తర్వాత తగిన మోతాదులో వాటిని కలుపుతారు. మూడు రకాల వ్యాధులను నివారిస్తున్నందున డీపీటీని ట్రిపుల్ యాంటీజెన్ అని కూడా అంటారు. సంప్రదాయ పద్ధతిలో డీపీటీ టీకా తయారీలో కింది దశలు ఉంటాయి.

1. డిఫ్తీరియా (కంఠసర్పి) ట్యాక్సాయిడ్ తయారీ
2. పెర్టుసిస్ (కోరింత దగ్గు) యాంటీజెన్స్ తయారీ
3. టెటానస్ (ధనుర్వాతం) ట్యాక్సాయిడ్ తయారీ
4. పై మూడూ కలపడం (డీపీటీ వ్యాక్సిన్ తయారీ)

డిఫ్తీరియా ట్యాక్సాయిడ్ తయారీ

డిఫ్తీరియా.. కొరినే బ్యాక్టీరియా డిఫ్తీరియే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఇది డిఫ్తీరియా ట్యాక్సిన్ అనే విష పదార్థాన్ని విడుదల చేస్తుంది. ఈ ట్యాక్సిన్‌ను ఫార్మలిన్ అనే ద్రావణం ద్వారా నిర్వీర్యం చేసినప్పుడు డిఫ్తీరియా ట్యాక్సాయిడ్ తయారవుతుంది.

పెర్టుసిస్ యాంటీజెన్స్ తయారీ

పెర్టుసిస్ (కోరింత దగ్గు).. బోర్డటెల్లా పెర్టుసిస్ అనే బ్యాక్టీరియం వల్ల కలుగుతుంది. ఈ బ్యాక్టీరియాను నిర్వీర్యం చేసి చంపేస్తారు. చనిపోయిన బ్యాక్టీరియాను, వాటిపై ఉన్న ప్రతిజనకాలను సేకరించి శుద్ధి చేస్తారు. ఈ విధంగా తయారుచేసిన వ్యాక్సిన్‌ను హోల్ సెల్ వ్యాక్సిన్ అంటారు (చనిపోయిన బ్యాక్టీరియా కణాలు మాత్రమే ఉంటాయి). బ్యాక్టీరియా కణంపై ఉన్న ప్రతిజనకాలతో వ్యాక్సిన్‌ను తయారుచేస్తే దాన్ని ఎసెల్యులర్ వ్యాక్సిన్ అంటారు. తయారుచేసిన పెర్టుసిస్ ట్యాక్సాయిడ్‌లో గాఢత 4 ఐయూ కంటే ఎక్కువ ఉండాలి.

టెటానస్ ట్యాక్సాయిడ్ తయారీ

టెటానస్ (ధనుర్వాతం) 'క్లాస్ట్రీడియం టెటాని' అనే బ్యాక్టీరియా ద్వారా కలుగుతుంది. ఈ బ్యాక్టీరియా టెటానోస్పాస్మిన్ అనే విష పదార్థాన్ని విడుదల చేస్తుంది. ఈ ట్యాక్సిన్‌ను ఫార్మలిన్ అనే రసాయన ప్రభావానికి గురిచేయడం వల్ల విషపూరిత స్వభావాన్ని కోల్పోయి టెటానస్ ట్యాక్సాయిడ్‌గా మారుతుంది.

డీపీటీ వ్యాక్సిన్ తయారీ: డిఫ్తీరియా ట్యాక్సాయిడ్, పెర్టుసిస్ యాంటీజెన్స్, టెటానస్ ట్యాక్సాయిడ్‌లను తగిన మిశ్రమంలో కలపడం ద్వారా డీపీటీ వ్యాక్సిన్ తయారవుతుంది. అల్యూమినియం ఫాస్ఫేట్‌ను అబ్జార్బెంట్ (అధిశోషణ)గా వాడతారు. తయారైన డీపీటీ వ్యాక్సిన్‌ను శుద్ధిచేసి సురక్షితంగా వినియోగించాలి.



గ్రూప్స్ ప్రత్యేకం
జనరల్ సైన్స్

హెపటైటిస్-బి టీకా

హెపటైటిస్-బి అనేది కాలేయాన్ని నాశనం చేసి లివర్ సిర్రోసిస్, లివర్ కేన్సర్‌ను కలగజేసే ప్రమాదకర వైరస్. ఇది జాండిస్‌ను కలిగించి కాలేయం పనితీరును దెబ్బతీస్తుంది.

వ్యాధి లక్షణాలు: జ్వరం, తలనొప్పి, వాంతులు వచ్చినట్లు ఉండటం, వాంతులు, అలసట, ఆకలి లేకపోవడం, పసిరికలు (కళ్లు పసుపుగా ఉండటం), తెలికైన బూడిదరంగు మలం.



- **వ్యాప్తి:** ఈ వ్యాధి కలిగిన వ్యక్తుల రక్తం ఇతర వ్యక్తులకు అంటడం, బిడ్డ పుట్టే సమయంలో, రక్షణలేని సంభోగం వల్ల; క్రిమిరహితం చేయని నీడిల్ వాడటం వల్ల; పళ్లు తోమే బ్రష్‌లను, రేజర్లను ఇతరులతో పంచుకొని వాడటం వల్ల వ్యాప్తి చెందుతుంది.
- **వ్యాధి తీవ్రత:** ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 240 మిలియన్ల మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. ఏటా 6.86 లక్షల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారు.
- **నివారణ:** హెపటైటిస్-బి టీకా ఇవ్వడం ద్వారా నివారించొచ్చు. భారత్‌లో ఆధునిక రీకాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీ పద్ధతిలో తయారుచేస్తున్న ఏకైక వ్యాక్సిన్ హెపటైటిస్-బి వ్యాక్సిన్.

ఆధునిక పద్ధతిలో వ్యాక్సిన్ తయారీ

ఆధునిక పద్ధతిలో రీ కాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీని ఉపయోగించి హెపటైటిస్-బి వ్యాక్సిన్‌ను తయారుచేస్తారు. ఈ పద్ధతిలో హెపటైటిస్ వైరస్ నుంచి వ్యాధికారక డీఎన్ఏను సేకరించి ప్లాస్మిడ్ అనే వాహకం ద్వారా ఈస్ట్ బ్యాక్టీరియాలోకి ప్రవేశపెడతారు. ఈ బ్యాక్టీరియాను పోషకయానకంలో అభివృద్ధి చేసినప్పుడు HBS-Ag జన్యువు ఉన్న ప్రొటీన్‌ను విడుదల చేస్తుంది. ఈ ప్రొటీన్‌ను శుద్ధి చేసి వ్యాక్సిన్‌లా వాడతారు. డాక్టర్ బారుచ్ బ్లంబర్గ్ తొలిసారిగా HBV వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.

వ్యాక్సిన్ తయారీలో దశలు..

1. HBS-Ag జన్యువును వైరస్ నుంచి వేరు చేయడం.
2. వైరల్ డీఎన్ఏను ఈస్ట్ బ్యాక్టీరియాలో ప్రవేశపెట్టడం.
3. ఈస్ట్ బ్యాక్టీరియాను అభివృద్ధి చెందించడం.

- **HBS-Ag జన్యువును వైరస్ నుంచి వేరు చేయడం:** హెపటైటిస్-బి వైరస్ శరీరంపై HBS-Ag అనే ప్రొటీన్ ఉంటుంది. ఈ ప్రొటీన్‌ను ఉత్పత్తి చేసే డీఎన్ఏ/ఆర్ఎన్ఏను వైరస్ నుంచి వేరు చేస్తారు. దీనికోసం రిస్ట్రిక్షన్ ఎండోన్యూక్లియేజ్ అనే ఎంజైమ్‌ను వాడతారు.
- **వైరల్ డీఎన్ఏను ఈస్ట్ బ్యాక్టీరియాలో ప్రవేశపెట్టడం:** మొదటి దశలో వేరుచేసిన HBS-Ag అనే ప్రొటీన్ డీఎన్ఏను ఈస్ట్ బ్యాక్టీరియా డీఎన్ఏలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియలో ప్లాస్మిడ్ అనే వాహకాన్ని వాడతారు. ప్లాస్మిడ్ సహాయంతో డీఎన్ఏను ఈస్ట్ బ్యాక్టీరియాలో ప్రవేశపెడతారు. ఇప్పుడు ఈస్ట్ డీఎన్ఏను రీకాంబినెంట్ డీఎన్ఏ అంటారు. ఈ ప్రక్రియలో ఆర్-డీఎన్ఏ పరిజ్ఞానాన్ని వాడతారు.

3. ఈస్ట్ బ్యాక్టీరియాను అభివృద్ధి చేయడం: హెపటైటిస్ వైరస్ డీఎన్ఏను కలిగి ఉన్న ఈస్ట్ బ్యాక్టీరియాను పోషకయానకంలో అభివృద్ధి చేస్తారు. పోషకయానకం pH 7.3 నుంచి 7.5 వరకు ఉండేలా, ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 37 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు ఉండేలా ఏర్పాటు చేస్తారు. ఈ బ్యాక్టీరియా 2-3 రోజుల్లో బాగా అభివృద్ధి చెంది HBS-Ag అనే ప్రొటీన్‌ను ఉత్పత్తి చేస్తుంది (ఎందుకంటే వైరస్ HBS-Ag జన్యువును కలిగి ఉంది).

- **వ్యాక్సిన్‌ను తయారుచేయడం:** ఈస్ట్ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసిన HBS-Ag ప్రొటీన్‌ను సేకరించి వివిధ రసాయనాలతో శుద్ధి చేస్తారు. తర్వాత శుద్ధి చేసిన HBS-Ag స్వచ్ఛతను, సామర్థ్యాన్ని పరీక్షించి ఫైనల్ వ్యాక్సిన్‌ను తయారు చేస్తారు.

ప్రవీణ్ దత్తు
లెక్చరర్ ఇన్ జువాలజీ,
ఎల్.హెచ్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం.



BANKING AND FINANCIAL AWARENESS

Banking system in India





కాంపిటీటివ్ గైడెన్స్ ఎకానమీ

Banks and other financial organizations play a vital role in any nation's economy by performing services essential in the management of any economy.

Safeguarding, transferring, lending, and exchanging money in various forms, are the main functions that banks perform. Each of these roles has an undulate effect in the economy that helps keep money moving.

In India, Banking Sector and Money Market are controlled by RBI (Reserve Bank of India).

We have different types of banks in our system. They are...

- ☆ Commercial banks like SBI, Andhra Bank, ICICI, Axis bank etc., (both in Public Sector and Private Sector at National and International levels, Foreign Banks like HSBC, Citi bank etc.)
- ☆ RRBs (Regional Rural Banks ex. Chaitanya Godavari Grameena bank).
- ☆ Cooperative Banks.
- ☆ NABARD (National Bank for Agriculture and Rural Development).
- ☆ EXIM bank (Export and Import Bank).
- ☆ Development Banks like IDBI, SIDBI etc.,
- ☆ National Housing Bank.
- ☆ Payment Banks.

1. What is the Banking Ombudsman Scheme?

☆ The Banking Ombudsman Scheme is a speedy and inexpensive forum for bank customers for resolution of complaints relating to certain services rendered by banks.

2. What are the different categories under priority sector Lending in our banking system?

☆ Priority Sector includes the following categories:

☆ (i) Agriculture (ii) Micro, Small and Medium Enterprises (iii) Export Credit (iv) Education (v) Housing (vi) Social Infrastructure (vii) Renewable Energy (viii) Others

3. What is NEFT?

☆ National Electronic Funds Transfer (NEFT) is a nation-wide payment system facilitating one-to-one funds transfer. Under this Scheme, individuals, firms and corporates can electronically transfer funds from any bank branch to any individual, firm or corporate having an account with any other bank branch in the country.

4. What is RTGS System?

☆ The short form 'RTGS' stands for Real Time Gross Settlement, which can be defined as the continuous (real-time) settlement of funds transfers individually. 'Real Time' means the processing of instructions at the time they are received, rather than at some later time. 'Gross Settlement' means the settlement of funds transfer instructions, occurs individually.

5. What is a Non-Banking Financial Company (NBFC)?

☆ A Non-Banking Financial Company (NBFC) is a company registered under the Companies Act, 1956 engaged in the business of loans and advances, acquisition of shares/stocks/bonds/debentures/securities issued by Government or local authority or other marketable securities of a like leasing, hire-purchase, insurance business, chit business but does not include any institution whose principal business is that of agriculture activity, industrial activity, purchase or sale of any goods (other than securities) or providing any services and sale/purchase/construction of immovable property.

☆ A non-banking institution which is a company and has principal business of receiving deposits under any scheme or arrangement in one lump sum or in instalments by way of contributions or in any other manner, is also a non-banking financial company (Residuary non-banking company).

6. What are White Label ATMs (WLAs)?

☆ ATMs set up, owned and operated by non-banks are called White Label ATMs. Non-bank ATM operators are authorized under Payment & Settlement Systems Act, 2007 by the Reserve Bank of India. Ex. Indicash ATM (by TATA company) etc.,

7. What is Sovereign Gold Bond (SGB)? Who is the issuer?

☆ SGBs are government securities denominated in grams of gold. They are substitutes for holding physical gold. Investors have to pay the issue price in cash and the bonds will be redeemed in cash on maturity. The Bond is issued by Reserve Bank on behalf of Government of India.

8. What are the objectives of Payment Banks?

☆ There is a need for transactions and savings accounts for the underserved in the population. Also remittances have both macro-economic benefits for the region receiving them as well as micro-economic benefits to the recipients. Higher transaction costs of making remittances diminish these benefits.

☆ Therefore, the primary objective of setting up of payments banks will be to further financial inclusion by providing (i) small savings accounts and (ii) payments/ remittance services to migrant labour workforce, low income households, small businesses, other unorganised sector entities and other users, by enabling high volume-low value transactions in deposits and payments/remittance services in a secured technology-driven environment.

☆ **Scope of activities**

a. Acceptance of demand deposits. Payments bank will initially be restricted to holding a maximum balance of Rs. 1,00,000 per individual customer.
b. Issuance of ATM/debit cards. Payments banks, however, cannot issue credit cards.
c. Payments and remittance services through various channels.
d. Distribution of non-risk sharing simple financial products like mutual fund units and insurance products, etc.,

9. What are Prepaid Payment Instruments?

☆ Prepaid payment instruments are payment instruments that facilitate purchase of goods and services against the value stored on such instruments. The value stored on such instruments represents the value paid for by the holder, by cash, by debit to a bank account, or by credit card.

☆ The Prepaid instruments can be issued as smart cards, magnetic stripe cards, internet accounts, internet wallets, mobile accounts, mobile wallets, paper vouchers and any such instruments which can be used to access the prepaid amount.

10. What is NPCI?

☆ National Payments Corporation of India (NPCI) is an umbrella organization for all retail payments system in India. It was set up with the guidance and support of the Reserve Bank of India (RBI) and Indian Banks' Association (IBA).

☆ The core objective was to consolidate and integrate the multiple systems with varying service levels into nation-wide uniform and standard business process for all retail payment systems. The other objective was to facilitate an affordable payment mechanism to benefit the common man across the country and help financial inclusion.

11. What is BHIM App?

☆ Bharat Interface for Money (BHIM) is an app that lets us make simple, easy and quick payment transactions using Unified Payments Interface (UPI). We can make instant bank-to-bank payments and Pay and collect money using just Mobile number or Virtual Payment Address (VPA).

12. What is RuPay card?

☆ RuPay, a new card payment scheme (debit card) launched by the National Payments Corporation of India (NPCI), has been conceived to fulfil RBI's vision to offer a domestic, open-loop, multilateral system which will allow all Indian banks and financial institutions in India to participate in electronic payments.

☆ The benefits of RuPay debit card are the flexibility of the product platform, high levels of acceptance and the strength of the RuPay brand-all of which will contribute to an increased product experience.

ABBREVIATIONS

1. MUDRA – Micro Units Development and Refinance Agency Limited
2. PMMY – Pradhan Mantri Mudra Yojana
3. IMPS – Immediate Payment Service
4. BBPS – Bharat Bill Payment System
5. AEPS – Aadhaar Enabled Payment System
6. APBS - Aadhaar Payment Bridge System
7. NACH – National Automated Clearing House



బి.శ్రీనివాసరావు,
లెక్చరర్ (ఎకనామిక్స్),
పి.ఆర్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, కాకినాడ.



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించి విస్తృతంగా ఉండే సిలబస్‌ను అధ్యయనం చేయడానికి మెటీరియల్‌ను ఎలా ఎంపిక చేసుకోవాలి?

– ఎస్.రామ్‌కుమార్, హైదరాబాద్.

గ్రూప్స్ దగ్గరి నుంచి వీఆర్వో, వీఆర్ఏ వరకు పరీక్షల్లో విజయం సాధించడంలో సరైన మెటీరియల్ ఎంపిక కీలకపాత్ర పోషిస్తుంది. మార్కెట్లో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పేపర్ల వారీగా పుస్తకాలు లభిస్తున్నాయి. అధిక శాతం మంది అభ్యర్థులు ఒక పేపర్‌లో పొందుపర్చిన అన్ని సబ్జెక్టుల సమాచారం లభిస్తుందని వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఇది సరైన వ్యూహం కాదు. మెటీరియల్ ఎంపికకు ముందు అభ్యర్థులు సిలబస్‌ను ఆసాంతం పరిశీలించాలి. పేపర్ల వారీగా పేర్కొన్న సబ్జెక్టులను గుర్తించాలి. ఆ తర్వాత సంబంధిత సబ్జెక్టులకు సంబంధించి వేర్వేరుగా సమగ్ర సమాచారం ఉండే పుస్తకాల కోసం అన్వేషణ సాగించాలి. ఒకే పేపర్‌లోని పలు సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాల ఎంపిక విషయంలోనూ జాగ్రత్త వహించాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలన్నీ సంబంధిత పుస్తకంలో ఉన్నాయో? లేదో? గమనించాలి. తర్వాత ఆయా అంశాలకు సంబంధించి గణాంక సహిత సమాచారం, నేపథ్యాల వివరణ ఉందో? లేదో? పరిశీలించాలి. ప్రధానంగా ఎకానమీ, జనరల్ ఎస్సే, సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్దిష్ట అంశంతోపాటు వాటి నేపథ్యం గురించి అవగాహన కలిగి ఉండటం పరీక్షలో విజయానికి ఎంతో దోహదం చేస్తుంది. పూర్తిస్థాయి సిలబస్ స్వరూపం తెలిసింది కాబట్టి వెంటనే అందుబాటులో ఉన్న పుస్తకాలతో ప్రిపరేషన్‌కు ఉపక్రమించకుండా.. ప్రామాణిక పుస్తకాలను సమకూర్చుకుని వాటి ఆధారంగా ప్రిపరేషన్ ప్రారంభించాలి. దీని కోసం అవసరమైతే వారం, పది రోజుల సమయం కేటాయించడానికి కూడా వెనుకాడొద్దు. మరో ముఖ్య విషయం.. ఒక సబ్జెక్టుకు రెండు లేదా మూడు కంటే ఎక్కువ పుస్తకాలు చదవడం అనవసరపు శ్రమకు గురి చేస్తుందని గ్రహించాలి. సమగ్ర సమాచారం ఉండే పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి. బిట్ బ్యాంక్స్, కొశ్చన్ అండ్ ఆన్సర్ తరహాలో ఉండే గైడ్స్, ఇన్‌స్టంట్ మెటీరియల్‌వైపు మొగ్గు చూపకూడదు. కారణం కొన్ని పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉన్నా.. అందులో అడిగే ప్రశ్నల స్వరూపం సంబంధిత అంశం నేపథ్యం, పూర్వాపరాల గురించి అవగాహనను పరీక్షించే విధంగా ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు డిస్క్రిప్టివ్ తరహా పుస్తకాల అభ్యసనానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాతే రివిజన్ కోణంలో గత ప్రశ్నపత్రాలు-సమాధానాలు, ప్రాక్టీస్ బిట్స్ పుస్తకాలు చదవడం ఉపయుక్తం. ఈవిధంగా మెటీరియల్ ఎంపిక నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే పరీక్షల్లో విజయావకాశాలు మెరుగవుతాయి. ఏ పరీక్షకైనా ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలంటే తొలుత పాఠశాల స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ముఖ్యం.

దూరవిద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్).. ఎంతో మందికి ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తూ.. కెరీర్ పరంగా భరోసా కల్పిస్తున్న విధానం. వివిధ కారణాల వల్ల మధ్యలో చదువుమానేసిన వారికి, అదే విధంగా ఉద్యోగం చేస్తున్న వారు అదనపు విద్యా అర్హతలను అందుకునేందుకు దూరవిద్య అద్భుత మార్గంగా నిలుస్తోంది. ఈ విధానంలో మూస ధోరణికి స్వస్తి పలికి.. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్), సెమిస్టర్ వైజ్ గ్రేడింగ్, క్రెడిట్స్.. ఇలా వివిధ కొత్త పద్ధతుల అమలు దిశగా యూనివర్సిటీలు అడుగులేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో సీబీసీఎస్ విధానంపై విశ్లేషణ..

దూరవిద్యలో.. సీబీసీఎస్!

అమలు దిశగా అడుగులేస్తున్న వర్సిటీలు

గ్రాడ్యుయేట్స్ స్పెషల్



ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్).. అంటే కోర్ సబ్జెక్టులను ఎంపిక చేసుకున్న విద్యార్థులు.. తమకు ఆసక్తి ఉన్న ఇతర సబ్జెక్టులను చదివే అవకాశం కల్పించడం. దీని ప్రధాన లక్ష్యం విద్యార్థులకు ఇంటర్ డిసిప్లినరీ నైపుణ్యాలు అందించడమే. రెగ్యులర్ కోర్సులకు సంబంధించి సెంట్రల్, మరికొన్ని ఇతర యూనివర్సిటీల్లో సీబీసీఎస్ విధానం రెండేళ్ల కిందటి నుంచే అమలవుతోంది. ఇప్పుడు ఈ విధానాన్ని దూరవిద్యలోనూ అనుసరించాలని యూజీసీ పేర్కొంది. ఈ మేరకు యూనివర్సిటీలు అడుగులు వేస్తున్నాయి.

అదనంగా ఎలక్టివ్ సబ్జెక్టులు




దూరవిద్యా విధానంలో డిగ్రీ కోర్సుల్లో చేరే అభ్యర్థులు ఎంపిక చేసుకున్న గ్రూప్ సబ్జెక్టులను మాత్రమే సదరు కోర్సు వ్యవధి ఆసాంతం చదవాల్సి వచ్చేది. అయితే సీబీసీఎస్ విధానంలో అభ్యర్థులు తమ గ్రూప్ సబ్జెక్టులతో పాటు అందుబాటులో ఉన్న ఇతర సబ్జెక్టుల్లో ఆసక్తి మేరకు సబ్జెక్టును ఎంపిక చేసుకొని, అధ్యయనం చేయొచ్చు. ఉదాహరణకు బీఏ గ్రూప్‌ను ఎంపిక చేసుకున్న అభ్యర్థి సైన్స్ సంబంధిత సబ్జెక్టును ఎలక్టివ్‌గా తీసుకోవచ్చు.

మార్కుల స్థానంలో క్రెడిట్స్

దూరవిద్యా విధానంలో సీబీసీఎస్ అమలు పరంగా మరో ముఖ్యమైన పరిణామం.. ఇప్పటి వరకు ఆయా సబ్జెక్టులకు మూల్యాంకనం పరంగా మార్కులు కేటాయించే విధానానికి స్వస్తి పలికి.. క్రెడిట్స్ విధానాన్ని ఆవిష్కరించడం. ఈ క్రెడిట్స్‌ను ఒక సబ్జెక్టుకు కేటాయించిన గరిష్ఠ లెక్చర్ గంటలు, అభ్యర్థులు హాజరైన గంటల ఆధారంగా గణిస్తారు.

సెమిస్టర్ విధానం


ప్రస్తుతం మూల్యాంకనం పరంగా వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే సీబీసీఎస్ విధానంలో ఇక నుంచి ఓపెన్ డిగ్రీ కోర్సుల్లోనూ సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. సెమిస్టర్‌కు సంబంధించి సబ్జెక్టుల జాబితాను అభ్యర్థులకు తెలియజేస్తారు. అభ్యర్థులు ఆ సబ్జెక్టుల జాబితాలో తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్టును ఎలక్టివ్‌గా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి సెమిస్టర్‌లోనూ అభ్యర్థి ఎంపిక చేసుకున్న ప్రధాన గ్రూప్ సబ్జెక్టుల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఇలా మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ కోర్సుకు సంబంధించి సెమిస్టర్ విధానంలో కేటాయించే క్రెడిట్స్ సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే ఇవి 125 నుంచి 160 క్రెడిట్స్ వరకు ఉంటాయి. ఈ క్రెడిట్స్ సంఖ్య ఆయా యూనివర్సిటీల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.



లాంగ్వేజ్ కోర్సులు తప్పనిసరి

డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో నచ్చిన సబ్జెక్టులను ఎలక్టివ్స్‌గా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నప్పటికీ.. లాంగ్వేజ్ కోర్సులను తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన విధంగా నిబంధనలు రూపొందించారు. ఈ క్రమంలో లాంగ్వేజ్ స్పెసిఫిక్ కోర్సుల పేరుతో ఇంగ్లిష్, హిందీలతోపాటు అభ్యర్థుల మాతృభాషకు సంబంధిన కోర్సులను అందుబాటులో ఉంచుతున్నారు.

ఏఈసీసీ కూడా తప్పనిసరి



డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. సీబీసీఎస్ విధానంలో అభ్యర్థులు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన మరో అంశం.. ఎబిలిటీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ కంపల్సరీ కోర్సులు (ఏఈసీసీ). ఈ క్రమంలో మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో జండర్ సెన్సిటైజేషన్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

మూడో ఏడాది డీఎస్ఈ కోర్సులు

సీబీసీఎస్ విధానంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు ప్రధానంగా ప్రయోజనం చేకూర్చే సమయం మూడో సంవత్సరం. ఈ సమయంలో అభ్యర్థులు డిసిప్లిన్ స్పెసిఫిక్ ఎలక్టివ్ కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి యూనివర్సిటీల విధానంపై ఆధారపడి ఉంటాయి.

నిర్దేశ వెయిటేజీ

మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో సీబీసీఎస్ విధానంలో తప్పనిసరిగా చదవాల్సిన కోర్సులకు 75 శాతం వెయిటేజీ; అభ్యర్థులు నచ్చిన విధంగా ఎంపిక చేసుకున్న ఆప్షనల్స్‌కు 25 శాతం వెయిటేజీ ఇచ్చే విధంగా యూనివర్సిటీలు అడుగులు వేస్తున్నాయి. ఇక.. పొందాల్సిన క్రెడిట్స్ పరంగా మొత్తం 160 క్రెడిట్స్‌లో తప్పనిసరిగా చదవాల్సిన సబ్జెక్టులకు 118 క్రెడిట్స్, ఆప్షనల్ సబ్జెక్టులకు 42 క్రెడిట్స్ కేటాయిస్తున్నాయి.

ఉత్తీర్ణతలో గ్రేడింగ్ విధానం

సీబీసీఎస్ ప్రకారం.. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో అత్యంత ప్రధానమైన మరో మార్పు.. డిగ్రీ ప్రోగ్రామ్ పూర్తయ్యాక.. గ్రేడింగ్ విధానం ద్వారా అభ్యర్థుల ప్రతిభను గుర్తించడం. ఇప్పటి వరకు నిర్దిష్టంగా పొందిన మార్కులనే పేర్కొనడం జరిగేది. అయితే ఇకపై గ్రేడింగ్‌లు ఇవ్వనున్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు పొందిన మార్కుల శ్రేణి ఆధారంగా గ్రేడ్ పాయింట్లు ఇవ్వనున్నారు.

అమలుపై అనుమానాలు

దూరవిద్యా విధానంలో సీబీసీఎస్ విధానాన్ని యూనివర్సిటీలు సమర్థంగా అమలు చేసే విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. యూనివర్సిటీల్లో రెగ్యులర్ కోర్సుల్లో 2015 నుంచే సీబీసీఎస్‌ను అమలు చేయాలని యూజీసీ స్పష్టం చేసింది. కానీ, ఇప్పటికీ దేశంలోని వివిధ యూనివర్సిటీల్లో ఇది సమర్థంగా అమలు కావడం లేదు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే టీచర్, స్టూడెంట్ డైరెక్ట్ ఇంటరాక్షన్ తక్కువగా ఉండే డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో సీబీసీఎస్ అమలు కొంచెం క్లిష్టమైన వ్యవహారమే అని ఏపీలోని ప్రముఖ యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ అభిప్రాయపడ్డారు.


బోధనలోనూ వినూత్నం

సీబీసీఎస్ విధానాన్ని అమలు చేసే క్రమంలో బోధనలోనూ వినూత్న విధానాలను అమలు చేస్తారు. ఆన్‌లైన్ లెర్నింగ్ మెటీరియల్‌ను విస్తృతంగా అందుబాటులో ఉంచాలని యూజీసీ పేర్కొంది. వీడియో లెక్చర్స్, స్వయంప్రభ ద్వారా టెలివిజన్ లెక్చర్స్, ఆడియో-వీడియో మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం తదితర చర్యలు చేపట్టాలని సూచించింది.

> “ దూరవిద్యా విధానంలో సీబీసీఎస్ అమలు చేస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా తమకు నచ్చిన కోర్సులను చదివే విధానంతోపాటు.. skill enhancement, ability enhancement, personality development కోర్సులను కూడా చదివే అవకాశం ఉండటంతో దూరవిద్యా విధానంలో చదివిన విద్యార్థులకు సైతం ప్రస్తుత జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు లభిస్తాయి.
>
> - విద్యారంగ నిపుణుల అభిప్రాయం.

బులెటిన్ బోర్డ్

హార్టిసెట్-2017



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ).. నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి హార్టిసెట్-2017 ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **కోర్సు పేరు:** బీఎస్సీ (ఆనర్స్).
- **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు
- **మొత్తం సీట్లు:** 23.
- **అర్హతలు:** ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ/డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి డిప్లొమా (హార్టికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి. 2017-18 విద్యా సంవత్సరంలో పూర్తిచేయబోయే విద్యార్థులు కూడా నిబంధనల మేరకు అర్హులే.
- **వయోపరిమితి:** 2017, డిసెంబర్ 31 నాటికి నిర్దేశ వయోపరిమతి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.750 (జనరల్); ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.350.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు డీడీ తదితరాలను జతచేసి కవరులో ఉంచి 'హార్టిసెట్-2017, రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030' చిరునామాకు గడువులోగా చేరేలా పోస్ట్ ద్వారా పంపాలి. లేదా నేరుగా అయినా అందించొచ్చు.
- **ఎంపిక విధానం:** ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (హార్టిసెట్-2017) ద్వారా.
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 18, 2017.
- **పరీక్ష వేళలు:** ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
- **పరీక్ష కేంద్రం:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్, రాజేంద్రనగర్, హైదరాబాద్.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** ఆగస్టు 31, 2017.
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

ఫారెస్ట్ కొలువులకు.. గెలుపు బాట!

టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్ గైడెన్స్



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా అటవీ శాఖలో కొలువుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్లు విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం మరో రెండు నెలల్లోనే పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ ఉద్యోగాల పరీక్షల్లో విజయానికి సూచనలు..

అడవుల పరిరక్షణ, విస్తరణ; వన్యమృగాలు, పర్యావరణ సంరక్షణ; విలువైన అటవీ సంపదకు భద్రత, భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అటవీ అధికారులదే. మానవ జాతి మనుగడకు పర్యావరణాన్ని కాపాడటం, జీవ వైవిధ్యం వన్య మృగాలను రక్షించటం లాంటి బృహత్తర విధులు ఉండే ఫారెస్ట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడటం ఔత్సాహికులకు చక్కటి అవకాశం. యూనిఫాం ఉద్యోగం, సమాజంలో గౌరవం, ఆకర్షణీయ వేతనాలు ఉన్న ఫారెస్ట్ కొలువులకు పటిష్ఠ ప్రణాళికతో సిద్ధమైతే సులభంగా విజయం సాధించొచ్చు అంటున్నారు నిపుణులు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్



ఇంటర్మీడియట్ విద్యార్హతతో వెలువడిన ఉద్యోగ ప్రకటన ఇది. మొత్తం 1,857 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అభ్యర్థులకు జూలై 1 నాటికి 18-31 ఏళ్ల లోపు వయసు ఉండాలి (రిజర్వేషన్లు వర్తిస్తాయి).

పరీక్ష విధానం: రాత పరీక్షల్లో భాగంగా రెండు పేపర్లు ఉంటాయి. వీటిని పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. పేపర్-1లో జనరల్ నాలెడ్జ్, పేపర్-2లో జనరల్ మ్యాథమెటిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో పేపర్ 100 ప్రశ్నలకు, 90 నిమిషాల వ్యవధిలో నిర్వహిస్తారు. మొత్తంగా రెండు పేపర్లకు 200 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున మొత్తం 200 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

డిగ్రీ ఉత్తీర్ణతతో వెలువడిన నోటిఫికేషన్ ఇది. బోటనీ/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/జువాలజీ/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/జియాలజీ/అగ్రికల్చర్‌లో ఏదో ఒక సబ్జెక్టుతో డిగ్రీ లేదా ఇంజనీరింగ్ బ్యాచిలర్స్ డిగ్రీ (కెమికల్/మెకానికల్/సివిల్) పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, శారీరక ప్రమాణాలు, వయసు మొదలైనవన్నీ బీట్ ఆఫీసర్ పోస్టు తరహాలోనే ఉన్నాయి.



ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

అటవీ శాఖలో రాష్ట్రస్థాయిలో కీలకమైన పోస్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ). 67 పోస్టులతో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్/బోటనీ/కెమిస్ట్రీ/కంప్యూటర్ అప్లికేషన్స్/కంప్యూటర్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫారెస్ట్రీ/జియాలజీ/హార్టికల్చర్/మ్యాథమెటిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/వెటర్నరీ సైన్స్/జువాలజీ సబ్జెక్టుతో డిగ్రీ లేదా ఇంజనీరింగ్ (అగ్రికల్చర్/కెమికల్/మెకానికల్/సివిల్/కంప్యూటర్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెకానికల్) పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎంపిక ప్రక్రియలో మొదట ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో ఎగ్జామినేషన్ (ఆబ్జెక్టివ్ టైప్) ఉంటుంది. ఇది అర్హత పరీక్ష. ఇందులో జనరల్ ఇంగ్లిష్, జనరల్ మ్యాథమెటిక్స్ పేపర్లుంటాయి. ఒక్కో పేపర్ నుంచి 100 ప్రశ్నల చొప్పున 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. వీటిలో నిర్దేశిత మార్కులతో క్వాలిఫై అయిన అభ్యర్థులకు జనరల్ స్టడీస్ పేపర్‌లో 150 ప్రశ్నలతో 150 మార్కులకు, ఆప్షనల్ పేపర్ 150 ప్రశ్నలతో 300 మార్కులకు మొత్తం 450 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- వీటిలో సాధించిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ 50 మార్కులకు ఉంటుంది.

శారీరక ప్రమాణాలు: మూడు నోటిఫికేషన్లకు రాత పరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎఫ్ఆర్ఓ పోస్టులకు అదనంగా ఇంటర్వ్యూ ఉంటుంది. నిర్దేశిత శారీరక ప్రమాణాలు తప్పనిసరి.

సన్నద్ధత

జనరల్ నాలెడ్జ్/జనరల్ స్టడీస్

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ ప్రకటనల్లో విరివిగా కనిపించే సెక్షన్ ఇది. ఎంపికలో రాత పరీక్షలో సాధించిన మార్కులే అత్యంత కీలకం కాబట్టి ఈ విభాగంలో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు పొందేందుకు కృషి చేయాలి. సమాజంలో జరిగే రాజకీయ, ఆర్థిక, సామాజిక, అంతర్జాతీయ అంశాలను నిశితంగా పరిశీలించగలిగే అభ్యర్థులు మంచి స్కోరు సాధించవచ్చు. గత ఆరు నెలల నుంచి చోటుచేసుకున్న ముఖ్యమైన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను అధ్యయనం చేస్తే కరెంట్ అఫైర్స్ ప్రిపరేషన్‌కు దోహదపడుతుంది. ఈ పేపర్‌లోని ఇతర విభాగాలైన జనరల్ సైన్స్, పర్యావరణం- సమస్యలు, విపత్తు నిర్వహణ, దేశ, రాష్ట్ర ఆర్థిక, భౌగోళిక అంశాలు, భారత రాజ్యాంగం - ఫీచర్స్, భారత రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వం, ఆధునిక భారత దేశ చరిత్ర (జాతీయోద్యమం ప్రత్యేక దృష్టితో), తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్ర, తెలంగాణలో ప్రవేశపెట్టిన వివిధ పథకాలపై సమగ్ర సమాచారం అవసరం. వీటితోపాటు సామాజిక స్పృహ, నైతిక విలువలు, బలహీన వర్గాలు, లింగ వివక్ష తదితర సున్నిత అంశాలపై అభ్యర్థుల అభిప్రాయాన్ని తెలుసుకునేలా ప్రశ్నలు ఉంటాయి.



- ఆధునిక భారతదేశ చరిత్రకు సంబంధించి జాతీయ ఉద్యమానికి ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యమైన సంఘటనలపై అవగాహన పెంపొందించుకోవాలి. గాంధీ శకం ప్రాధాన్యం, స్వాతంత్ర్యానంతరం ముఖ్య ఘట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి.
- దేశాలు, సరిహద్దులు, సరస్సులు, పీఠభూములు, పర్వతాలు, ఎడారులు, భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, పార్లమెంటు, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, స్థానిక స్వపరిపాలన, గ్రామీణాభివృద్ధి, ప్రణాళికలు, జాతీయాదాయం, జనాభా.. ఇలా వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- జనరల్ సైన్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీకి సంబంధించి ఏడు నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయాలి. ఇక ఎక్కువగా దృష్టి సారించాల్సినవి.. తెలంగాణ ప్రభుత్వ పథకాలు, వాటి ఉద్దేశాలు, లక్ష్యాలు. గణాంకాలతో సహా తెలుసుకోవాలి. వీటి నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చేందుకు అవకాశం ఉంది.




- మిషన్ కాకతీయ పథకం కింద ఎన్ని చెరువులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఎన్ని చేశారు. బడ్జెట్ నిధులు ఎలా సమకూర్చుకుంటున్నారు. ఈ పథకం వల్ల ఎంత మంది, ఏ విధంగా లబ్ధి పొందుతున్నారు.. ఇలా వివిధ అంశాలపై అవగాహన అవసరం. అదే విధంగా మిషన్ భగీరథ, హరితహారం, ఆసరా పెన్షన్ స్కీమ్ తదితర ప్రభుత్వ ముఖ్య పథకాలు, మేజర్ డెవలప్‌మెంట్స్‌ను గమనిస్తూ ఉండాలి. సొంత నోట్స్ సిద్ధం చేసుకోవాలి.
- కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, అడవుల ప్రాధాన్యం, అడవుల రక్షణ- సమస్యలు, వీటితో పాటు సమకాలీన పరిణామాలను అధ్యయనం చేయాలి. ఉదా: గ్లోబల్ వార్మింగ్ (భూతాపం)కు కారణాలు, ఒప్పందాలు, పారిస్ ఒప్పందం నుంచి అమెరికా నిష్క్రమణ తదితర అంశాలు.
- తెలంగాణ ప్రాచీన, మధ్యయుగ చరిత్రల్లో ఆయా రాజ్య వంశాలు, వాటి హయాంలో జరిగిన సామాజిక, ఆర్థిక అభివృద్ధి, పరిస్థితులపై అవగాహన (ఉదా: కాకతీయుల కాలంలో ప్రత్యేకత ఉన్న నీటి పారుదల వ్యవస్థ) పెంచుకోవాలి. ఆధునిక తెలంగాణ చరిత్రలో నిజాం సంస్కరణలు, శిస్తులు-విధానాలు, ఆయా రంగాల అభివృద్ధి; సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- తెలంగాణలోని కవులు-రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- తెలంగాణ జాగ్రఫీలో.. తెలంగాణలోని ప్రధాన నదులు- పరీవాహక ప్రాంతాలు; ముఖ్య పంటలు, భౌగోళిక ప్రాధాన్య ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం.
- తెలంగాణ ఎకానమీలో.. తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్య పరిశ్రమలు - ఉత్పాదకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ మ్యాథమెటిక్స్

రెండో పేపర్ ఇది. ఇందులోని ప్రశ్నల క్లిష్టత పదో తరగతి స్థాయిలో ఉంటుంది. దీనికోసం సంఖ్యలు, కసాగు, గసాభా, వడ్డీ-రకాలు, కాలం-పని, కాలం-దూరం, లాభనష్టాలు, రేఖా గణితం, సంవర్గమానాలు, త్రికోణమితి, క్షేత్ర గణితం (వైశాల్యాలు, ఘనపరిమాణాలు), స్టాటిస్టిక్స్ తదితర అంశాలను చదవాలి. సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. చాలా మంది నాన్‌మ్యాథ్స్ అభ్యర్థులు.. జీఎస్‌లో మంచి స్కోరు చేసినప్పటికీ ఇందులో వెనుకబడిపోతుంటారు. కాబట్టి సదరు అభ్యర్థులు వీలైనంత ఎక్కువ సమయాన్ని ప్రాక్టీస్‌కు కేటాయించాలి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న గణిత పుస్తకాలను చదవాలి.

ఎఫ్ఆర్ఓలో ఇంగ్లిష్, ఆప్షనల్ సబ్జెక్ట్

- మిగిలిన అన్ని పేపర్లకు భిన్నంగా ఎఫ్ఆర్ఓలో జనరల్ ఇంగ్లిష్ ఉంటుంది. ఇందులో వొకాబ్యులరీ, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సింపుల్, కాంపౌండ్, కాంప్లెక్స్ సెంటెన్సెస్, కాంప్రెహెన్షన్ తదితర అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రశ్నలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి. ఇంగ్లిష్‌పై ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. దీనికోసం బేసిక్ గ్రామర్ అంశాలపై పట్టు సాధించాలి.
- **ఆప్షనల్ సబ్జెక్టు:** పరీక్షలో అత్యధిక వెయిటేజీ ఈ విభాగానికే కేటాయించారు. అభ్యర్థి ఆసక్తి మేరకు ఆప్షనల్‌ను ఎంచుకునే అవకాశం ఉంది. ఇందులోని ప్రశ్నల క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు తమ సబ్జెక్టుకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాలను అధ్యయనం చేయడం మంచిది. లైఫ్ సైన్సెస్ అభ్యర్థులు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ సబ్జెక్టును ఎంచుకుని పరీక్ష రాస్తే అత్యధిక మార్కులు పొందొచ్చు. ఇంజనీరింగ్ విద్యార్థులు వారి సబ్జెక్టులనే ఎంచుకుంటే మంచిది. ఈ సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులకు గేట్ మెటీరియల్ చదవాలి.



రిఫరెన్స్ పుస్తకాలు

- ఎన్‌సీఈఆర్‌టీ ఆరు నుంచి 12వ తరగతి పుస్తకాలు (మ్యాథ్స్, సైన్స్, సోషల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్).
- ఇంగ్లిష్-రెన్ అండ్ మార్టిన్
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - ఆర్ఎస్ అగర్వాల్.
- మోడ్రన్ అప్రోచ్ టు వెర్బల్ రీజనింగ్-ఆర్ఎస్ అగర్వాల్.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 21-8-2017

స్టాక్ మార్కెట్లు
శుక్రవారం ముగింపు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
271 ▼	67 ▼
31,525	9,837

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	6,217	▼	5
డోజోన్స్	21,675	▼	76
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,324	▼	64
డాక్స్	12,165	▼	38
షాంఘై	3,269	▲	1
నికాయ్	19,470	▼	232

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు
రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.35	65.03
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.25	84.21
€	యూరో	ఎస్‌బీఐ	73.96	76.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.65	59.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.73	51.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.24	47.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.52	18.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.89	18.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.79	11.03

ఒంటరైనా...
ప్లానింగ్ తోడుండాలి!




ఒంటరి మహిళలకూ జీవితంలో ఎన్నో అవసరాలు, లక్ష్యాలు

విశ్రాంత జీవనం, సొంతిల్లు, ఆరోగ్యం, పర్యాటకం

వీటికంటూ ఓ ప్రణాళిక అవసరం

ముందుగా ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభిస్తే అన్నింటినీ జయించొచ్చు



రోజులు ఒకప్పటిలా లేవు. మన దేశంలో మహిళలూ ముందడుగు వేస్తున్నారు. ఒకరిపై ఆధారపడకుండా ఆర్థికంగా సర్వ స్వతంత్రంగా జీవించేందుకు ఇష్టపడే మహిళల సంఖ్య పెరుగుతోంది కూడా!!. విద్య, ఉపాధి అవకాశాల విస్తృతి ఇలా ఎన్నో కారణాలు దీనివెనుక ఉన్నాయి. దేశంలో వివాహం కానివారు, పెళ్లయి విడిపోయిన వారు, భర్తను కోల్పోయిన వారు... ఇలాంటి ఒంటరి మహిళల సంఖ్య దాదాపు 7.41 కోట్లు. 2001- 2011 మధ్య చూస్తే వీరి సంఖ్య దాదాపు 39 శాతం పెరిగింది. పెళ్లి కాని వారైనా, పెళ్లయి ఒంటరిగా మారినవారైనా జీవితంలో పెద్దగా అవసరాలేవీ ఉండవనుకుంటే పొరపడినట్టే. సొంతిల్లు, విశ్రాంత జీవనం, కారు ఈ తరహా అవసరాలు అందరికీ ఉంటాయి. తమ కాళ్లపై తాము నిలబడిన ఒంటరి మహిళలు ఆర్థికంగా స్వతంత్రులు కనుక లక్ష్యాలు నెరవేర్చుకునే వెసులుబాటు వీరికి కొంచెం ఎక్కువే ఉంటుంది. కాకపోతే అందుకు తగిన ప్రణాళిక ఉండాలనేది నిపుణుల సూచన.


– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

లక్ష్యాల్లో వెనుకంజే

ఒంటరి మహిళల్లో ఎక్కువ మందికి ఆర్థిక సామర్థ్యం ఉన్నప్పటికీ లక్ష్యాలు, వాటి ప్రణాళికల పట్ల అంత పట్టింపుతో ఉండడం లేదని ఫైనాన్షియల్ ప్లానర్ల పరిశీలనలో వెల్లడయింది. ముంబైకి చెందిన ఫైనాన్షియల్ ప్లానర్ అశ్విని బిద్వాల్కర్ ఓ సందర్భంలో ఒక క్లయింట్‌తో భేటీ అయిన అనంతరం తెలిసిన విషయం ఏమిటంటే... ఆమెకు కనీసం ఒక్క లక్ష్యం కూడా లేదని!. ఉద్యోగరీత్యా నగరాలకు వచ్చి చక్కని సంపాదన ఉండడంతో ఖరీదైన ఫ్లాట్లలో అద్దెకుండటానికి వీరు ఇష్టపడుతుంటారు. ఇలాంటి వారిపై వారి తల్లిదండ్రులు ఆధారపడిన సందర్భాలు కూడా ఎక్కువేనన్నది అశ్విని మాట. అందుకే వీరు తమ బాధ్యతలను విస్మరించకుండా అందుకు తగ్గట్టు ప్రణాళిక వేసుకోవాలి.



ఇలాంటివారు కాస్త వేరు...



ఓ హాస్పిటాలిటీ సంస్థలో హెల్త్ మేనేజర్‌గా పనిచేస్తున్న తాన్య (26) కూడా ఒంటరి మహిళే. ఇంకా వివాహం కాలేదు. ఆమెకున్న లక్ష్యాలు విదేశీ టూర్‌కు వెళ్లడం. దీనికితోడు సొంతిల్లు కూడా సమకూర్చుకోవాలని భావించిన ఆమె... అదే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డౌన్ పేమెంట్ చెల్లించడానికి అంగీకరించారు. దీంతో ప్రతి నెలా గృహరుణం ఈఎంఐ చెల్లించడానికి తాన్య సిద్ధమైంది. గృహ ఈఎంఐతో పాటు తన టూర్ ప్లాన్ కోసం ప్రతి నెలా రూ.5,000–10,000 మధ్య పక్కన పెట్టాలని ఆమె నిర్ణయించుకుంది. పాతికేళ్ల గౌతమి కూడా సొంత సంపాదనను నమ్ముకున్న మహిళే. ఆమె ఉన్నత విద్యపై దృష్టి పెట్టింది. స్నేహితులతో సరదాగా పర్యాటక ప్రదేశాలను చూసి రావాలనుకుంటోంది. మరో లక్ష్యం... జీవితంలో తాను కోరుకున్నప్పుడు విరామం తీసుకోవాలి. ఇలా లక్ష్యాల విషయంలో వీరి మాదిరి స్పష్టత అందరు ఒంటరి మహిళల్లోనూ ఉండడం లేదు.

ఆకాంక్ష (24) ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్. స్థిరమైన ఆదాయం ఉండదు. దీంతో ఆమె లక్ష్యం ముందుగా తన సొంత అవసరాలను తీర్చుకోవడమే. ఆరు నెలల కిందటి వరకూ ఆమె తన అవసరాలు, ఖర్చులకు తల్లిదండ్రుల పైనే ఆధారపడింది. కానీ, ఇటీవల తనకంటూ ఓ నిధిని సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టింది. మ్యూచువల్ ఫండ్స్ గురించి తెలుసుకున్న ఆమె వాటిలో ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధమైంది. సాధారణంగా ఒంటరి మహిళల్లో ఎక్కువ మందికి పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలని, పెద్ద వయసు వచ్చే సరికి తమకంటూ ఓ ఇల్లు ఉండాలని, దాతృత్వ కార్యక్రమాలకు విరాళమివ్వాలని, తమ వారసులకు ఎంతో కొంత సమకూర్చాలని లక్ష్యాలుంటున్నట్టు ఫైనాన్షియల్ ప్లానర్లు చెబుతున్నారు.

తప్పనిసరి అవసరాలపై దృష్టి

ఆర్థిక లక్ష్యాలన్నవి ఒంటరి వ్యక్తులకూ అవసరమే. ఊహించని పరిస్థితులు ఎదురైతే మిమ్మల్ని మీరు కాపాడుకునేందుకు వీలుగా ప్రణాళిక ఉండాలన్నది ఆర్థిక నిపుణులు సూచన. ఉదాహరణకు అనారోగ్య పరంగా ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఎంత వ్యయం అవుతుందో తెలియదు. అందుకే తగినంత కవరేజీతో హెల్త్ పాలసీ ఉండాలి. ఉద్యోగం కోల్పోతే మీ ఖర్చులు తీరేందుకు సరిపడా రిజర్వ్ ఫండ్ అవసరం. ఒంటరి మహిళలకు తల్లిదండ్రుల నుంచి సహకారం ఉండకపోవచ్చు. కనుక వీరు తప్పకుండా అత్యవసర నిధిని సమకూర్చుకోవాలి. కనీసం 9 నుంచి 12 నెలల అవసరాలకు తగ్గట్టు ఉండాలన్నది నిపుణుల మాట. ముందు ఈ రెండు అవసరాలకు ప్లాన్ చేసుకున్న తర్వాత పెట్టుబడులపై దృష్టి సారించాలి. విశ్రాంత జీవనంలో అవసరాల కోసం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లొచ్చు. సొంతిల్లు సమకూర్చుకోవాలనుకుంటే అందుకోసం ఈక్విటీ, డెట్ విభాగాల్లో ఇన్వెస్ట్‌మెంట్‌ను పరిశీలించొచ్చు. ప్రయాణాల కోసమైతే స్వల్పకాల లక్ష్యం కనుక షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చు. తక్కువ ఖర్చు, ఎక్కువ పొదుపుతో చిన్న వయసు నుంచే ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభిస్తే దీర్ఘకాలంలో భారీ నిధి సమకూరుతుంది. ప్రణాళిక విషయంలో స్పష్టత లేకపోతే అందుకోసం ఫైనాన్షియల్ ప్లానర్ల సాయం తీసుకోవడానికి వెనుకాడొద్దు.



స్వయం ఉపాధికీ... ఖర్చులవేగా?

- ఇతరుల్లాగే ఖర్చులున్నపుడు ప్రణాళిక తప్పనిసరి
- రిజర్వు నిధులతో పాటు జీవిత. ఆరోగ్య బీమా ఉండాలి
- స్థిరమైన ఆదాయం ఉన్నట్టుగానే పెట్టుబడి వ్యూహాలు
- అందుకోసం సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ ఉత్తమం
- రిటైర్మెంట్ నిధికీ ప్లానింగ్ ఉండాలంటున్న నిపుణులు


స్థిరమైన ఆదాయం లేనివారికి ఆర్థిక లక్ష్యాలను చేరుకోవటమనేది చాలా క్లిష్టమైన సవాలు. మన దేశంలో కోటిన్నర మంది స్వయం ఉపాధిని నమ్ముకున్న వారే. వీరికి స్థిరమైన ఆదాయం ఉండదు. ఒక నెల ఎక్కువగా ఉండొచ్చు. మరో నెలలో తగ్గిపోవచ్చు. కానీ, నెలసరి ఖర్చులు అలా ఉండవు కదా!!. అందుకే ఈ తరహా వ్యక్తులు అనుసరించాల్సిన ఆర్థిక ప్రణాళిక గురించి నిపుణులు కొన్ని సూచనలు చేశారు. ఆ వివరాలివీ...

అత్యవసర నిధి..




అనిశ్చిత ఆదాయంలో ఉన్న వారు ముందుగా సమకూర్చుకోవాల్సినది అత్యవసర నిధి. కనీసం 12 నెలలపాటు కుటుంబ అవసరాలకు సరిపడే మొత్తాన్ని రిజర్వ్‌గా ఉంచుకోవాలి. అవసరంలో వెంటనే నగదుగా మార్చుకోగల రూపంలో వీటిని ఉంచుకోవాలి. మీకు బీమా పాలసీలు ఉంటే వాటికి చెల్లించాల్సిన ప్రీమియం, పిల్లల స్కూలు ఫీజులు, రుణాలుంటే వాటికి చెల్లించాల్సిన ఈఎంఐలు ఈ మొత్తాలను కూడా రిజర్వ్ ఫండ్‌లో భాగంగా చేసుకోవాలి. ఈ మొత్తాన్ని లిక్విడ్ ఫండ్స్ లేదా షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోనూ ఉంచుకోవచ్చు. దీనివల్ల అవసరం ఏర్పడినప్పుడు ఒకటి, రెండు రోజుల్లోనే చేతికి నగదు అందుతుంది. నెలవారీ ఖర్చులు, పెట్టుబడులు, ఇతర అవసరాలన్నింటినీ ఒక పేపర్‌పై రాసుకుంటే అత్యవసర నిధి ఎంత అవసరమన్న స్పష్టత వస్తుంది.

ఆరోగ్య రక్షణ ఉండాలి...



ఏదైనా ఒక సంస్థలో పనిచేస్తుంటే గ్రూప్ హెల్త్ కవరేజీ ఉంటుంది. కానీ, స్వయం ఉపాధిలో ఉన్న వారికి ఈ విధమైన రక్షణను వారే కల్పించుకోవాల్సి ఉంటుంది. అందుకే తగినంత కవరేజీతో ఓ హెల్త్ పాలసీ తప్పనిసరి. అది తనతోపాటు, తనపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ వర్తించేలా ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ రూపంలో ఉండాలి. సరైన హెల్త్ పాలసీ తీసుకోకుంటే అప్పటి వరకు పొదుపు చేసిన మొత్తం హారతి కర్పూరంలా కరిగిపోతుంది. చాలా చిన్న వయసులోనే ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ తీసుకుని దాన్ని జీవితాంతం కొనసాగించాలన్నది జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్వెస్ట్‌మెంట్ అనలిస్ట్ ప్రభు సూచన.



పన్నులకు ప్రణాళిక ఉందా?




స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారు జీఎస్‌టీ సహా రవాణా, తరుగుదల వ్యయాలపై పన్ను మినహాయింపుల కోసం క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆదాయం రూ.50 లక్షల్లోపు ఉంటే సెక్షన్ 44ఏడీఏ కింద మొత్తం ఆదాయంలో 50 శాతం మేర ఊహాత్మక వ్యయాల కింద చూపించుకోవచ్చు. అందుకే స్వయం ఉపాధిలో ఉన్నవారు తమ ఆదాయం, వ్యయాల వివరాలను ఓ రికార్డు నిర్వహించడం వల్ల పన్ను రిటర్నుల సమయంలో ఏదీ మర్చిపోయేందుకు అవకాశం ఉంది.

పెట్టుబడికి ఎస్‌టీపీ బెటర్...

వేతన జీవులకు సిప్ చక్కని సాధనం. నెలనెలా క్రమం తప్పకుండా ఇంత మొత్తం పెట్టుబడి పెడుతూ వెళ్లొచ్చు. కానీ, అస్థిర ఆదాయంలో ఉన్న వారికి సిప్ సాధ్యం కాకపోవచ్చు. అందుకే వీరికి సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) అనువైనది. అధిక ఆదాయం వచ్చినప్పుడు లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి అక్కడి నుంచి నెలనెలా కొంత మొత్తాన్ని డెట్, బ్యాలన్స్‌డ్, ఈక్విటీ ఫండ్స్‌లోకి ఎస్‌టీపీ చేసుకోవచ్చు. సుదర్శన్ మార్కెటింగ్‌లో ఉన్నాడు. ప్రతీ నెలా రూ.10,000 మొత్తానికి సిప్ ఎంచుకున్నాడు. కానీ, ఏడాదిలోపే ఆ సిప్ కాస్తా రూ.5,000కు తగ్గించాడు. పరిస్థితి బాగులేకపోతే ఈ మొత్తాన్ని కూడా ఎత్తేసే అవకాశం లేకపోలేదు. అందుకే ఎస్‌టీపీ అన్నది స్వయం ఉపాధిలో ఉన్న వారికి చక్కని సాధనం.

టర్మ్ పాలసీ తప్పనిసరి!!



తమపై ఆధారపడిన వారికి ఇచ్చే అపూర్వ కానుక జీవిత బీమా. సంప్రదాయ పాలసీల్లో రూ.లక్ష కవరేజీకే రూ.6,000 వరకు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. కానీ, ఇంతే మొత్తానికి రూ.40–50 లక్షల టర్మ్ పాలసీ తీసుకోవచ్చు. బీమా కవరేజీ కూడా తగినంతగా ఉండాలి. తాను లేకపోతే, తన ఆర్జన అవసరాలు కుటుంబానికి ఇంకా ఎన్నేళ్లు అవసరమో అంత మేర టర్మ్ కవరేజీ ఉండాలన్నది నిపుణుల సూచించేది. కనీసం పదేళ్ల వార్షిక సంపాదన మేరకైనా టర్మ్ కవరేజీ ఉండాలి.

రిటైర్మెంట్ కోసం నిధి...



నిరుద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారు ఏ పింఛను పథకంలోనూ కవర్ కారు. విశ్రాంత జీవనంలో పోషణావసరాలకు, వైద్య ఇతర అవసరాలకు గాను తగిన నిధిని సమకూర్చుకునేందుకు ముందునుంచే ప్రణాళిక వేసుకోవాలి. పీపీఎఫ్, ఎన్‌పీఎస్ తరహా పథకాలను ఇందుకు పరిశీలించొచ్చు. నిధులను వెనక్కి తీసుకునేందుకు అవకాశం లేని పథకాలతోనే మలి జీవితానికి కావాల్సిన నిధి సాధ్యమవుతుంది. ఎన్‌పీఎస్ ఈ తరహాలోనే పనిచేస్తుంది. పైగా ఇందులో వ్యయాలు తక్కువ. 60 ఏళ్లకు కాల వ్యవధి తీరుతుంది. ఈక్విటీలకు గరిష్టంగా 50 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. మెచ్యూరిటీ అనంతరం వచ్చే ఫండ్‌లో 40 శాతాన్ని కచ్చితంగా యాన్యుటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. దాంతో ఆ మొత్తంపై నెలనెలా పెన్షన్ అందుతుంది. దీనిపై సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000కు పన్ను ప్రయోజనం కూడా ఉంది. సెక్షన్ 80సీ కింద రూ.1.50 లక్షల పన్ను ప్రయోజనానికి ఇది అదనం.

పసిడి... పటిష్టమే!

- రెండు వారాల్లో 43 డాలర్లు అప్
- ఫెడ్ రేటు ఈ ఏడాది పెరగదన్న అంచనాలు

అంతర్జాతీయంగా అమెరికా – ఉత్తర కొరియా మధ్య ఉద్రిక్తతలు కొంత సమసిపోయినప్పటికీ, పసిడిలోకి పెట్టుబడులు పటిష్టంగానే కొనసాగుతున్నాయి. న్యూయార్క్‌లోని అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్– నైమెక్స్‌లో ఆగస్టు 18వ తేదీ శుక్రవారంతో ముగిసిన వారంలో వారం వారీగా పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర 5 డాలర్లు పెరిగి 1,295 వద్ద ముగిసింది. శుక్రవారం ఒక దశలో 1,306 డాలర్లకు చేరినా... అక్కడ నిలబడలేదు. గడచిన రెండు వారాల్లో పసిడి 43 డాలర్లు ఎగసింది. అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది ఇక ఫండ్ రేటును (ప్రస్తుత శ్రేణి 1–1.25 శాతం) పెంచే అవకాశం లేదన్న అంచనాలు బంగారానికి తాజాగా బలాన్ని ఇస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం అనుకున్నంతగా పెరగడం లేదని, ఇది డిమాండ్ లేకపోవడాన్ని సూచిస్తుందనీ బుధవారం వెలువడిన జూలై ఫెడ్ మినిట్స్‌లో వెల్లడవడం– ''రేటు పెంపు ఈ ఏడాది ఉండకపోవచ్చు'' అన్న అంచనాలకు బలాన్నిచ్చింది. అయితే తాజాగా 1,300 డాలర్ల వద్ద పసిడికి గట్టి నిరోధం ఉందనీ, దీనిని దాటి నిలబడితే 1,340 డాలర్లను చూస్తుందని టెక్నికల్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. ఇక దిగువదిశలో 1,272, 1,242, 1,204 స్థాయిల వద్ద మద్దతు లభిస్తుందన్నది వారి అంచనా. సోమవారం నుంచీ ప్రారంభమయ్యే వారంలో లాభాల స్వీకరణ జరిగే వీలుంటుందని, అయినా ఇది కొనుగోళ్లకు అవకాశమేనని వారు అంచనావేస్తున్నారు. ఉత్తరకొరియాతో ఉద్రిక్తతలు కొనసాగే అవకాశాలతో పాటు అమెరికాలో రాజకీయ, ఆర్థిక అనిశ్చితిని ఇందుకు కారణంగా చూపుతున్నారు. ఇక డాలర్ వారం వారీగా స్వల్పంగా పెరిగి 93.36 వద్ద ఉంది. 1,204 వరకూ పడిపోయిన పసిడి తిరిగి నెలతిరక్కుండానే 100 డాలర్లు ఎగయడం గమనార్హం.



దేశీయంగా కూడా బులిష్ ధోరణే


దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– ఎంసీఎక్స్‌లో పసిడి వారంలో రూ.40 తగ్గి రూ. రూ.29,163 కి చేరింది. అయితే దేశీయ డిమాండ్ తోడు కావడంతో ముంబై ప్రధాన మార్కెట్‌లో వారం వారీగా పసిడి 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర రూ.75 ఎగసి రూ.29,285కి చేరింది. ఇక 99.5 స్వచ్ఛత విషయంలో ధర ఇదే స్థాయిలో పెరిగి రూ. 29,135కి చేరింది. వెండి కేజీ ధర కూడా స్వల్పంగా రూ.190 పెరిగి రూ. 39,300కి చేరింది.






“నచ్చిన పని చేస్తే మంచి ఫలితాలొస్తాయి.
విజయవంతమైన కెరీర్‌కు అభిరుచి ఇంధనంగా పనిచేస్తుంది”
– మెగ్ విత్‌మన్, హెచ్‌పీ కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో

పొదుపు-మదుపు



తక్కువ ఫండ్స్... రాబడికి ఫ్రెండ్స్!



పోర్ట్‌ఫోలియో ఇలా బెటర్..

పోర్ట్‌ఫోలియో నిర్మాణం సులభంగా ఉండాలి. మీ దగ్గర రూ.కోటి విలువైన పోర్ట్‌ఫోలియో ఈక్విటీ, డెట్ ఫండ్స్‌లోకి విభజించి ఉంటే, మొత్తం మీద 10-12 ఫండ్స్ మించకుండా చూసుకోవాలి. స్వల్ప కాలిక, మధ్య కాలిక అవసరాల కోసం చేసే పెట్టుబడులు కూడా ఇందులో భాగంగానే ఉండాలి. ఒకే కేటగిరీలో ఒకటి లేదా రెండు ఫండ్స్‌కే పరిమితం కావాలి.

– సురేష్ సెడగోమన్, లాడర్ 7 ఫైనాన్షియల్ అడ్వైజర్స్ డైరెక్టర్


ఫండ్ల సంఖ్య పెరిగినకొద్దీ పరిశీలన కష్టం

- పనితీరు బాగులేని పథకాలతో రాబడులపై ప్రభావం
- ప్రతి కొత్త పథకంలో ఇన్వెస్ట్ చేయడం సరైనది కాదు
- పోర్ట్‌ఫోలియో పటిష్టంగా ఉంటేనే రాబడులు
- అందుకోసం తక్కువ ఫండ్లే ఉండాలంటున్న నిపుణులు



స్టాక్ మార్కెట్లోనైనా, బాండ్లలోనైనా పెట్టుబడి పెట్టాలంటే అత్యధికులకు అనువైన మార్గం మ్యూచువల్ ఫండ్లే. చాలా మంది ఎంచుకునేది ఈ మార్గాన్నే. కాకపోతే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టేవారు తమ పోర్ట్‌ఫోలియోలో ఎన్ని ఎక్కువ ఫండ్లుంటే అంత మంచిదనుకుంటారు. ఎక్కువ ఫండ్లలో పెట్టుబడి పెడితే భద్రత ఉంటుందని, రాబడులు ఎక్కువగా ఉంటాయని భావిస్తారు. కాబట్టే చాలా మంది పోర్ట్‌ఫోలియోలలో పదుల సంఖ్యలో ఫండ్స్ పథకాలు కనిపిస్తుంటాయి. మార్కెట్లోకి వచ్చిన ప్రతి కొత్త పథకంలో రూ.5,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వెళితే కొన్నేళ్లకు పోర్ట్‌ఫోలియో చాంతాడంత అవుతుంది!!. మరి ఏ పథకం పనితీరు ఎలా ఉందో పరిశీలించే తీరిక, నైపుణ్యం ఎంత మందికి ఉంటాయి...? ఆలోచించండి!. భిన్న రకాల థీమ్‌లతో పనిచేసే రెండు మూడు పథకాల్లో మంచి ట్రాక్ రికార్డున్న ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచిది కదా!? అలా కాకుండా ఒకదాన్ని పోలిన మరో పథకంలో కొంత చొప్పున ఇన్వెస్ట్ చేస్తే లాభమేంటి? దీనిపై నిపుణులేమంటున్నారో చూద్దాం...

లెక్క ఎక్కువ... రాబడి తక్కువ



ఓ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ మాటల్లో... ‘ఒక ఇన్వెస్టర్ తన పోర్ట్‌ఫోలియోలో 120 మ్యూచువల్ ఫండ్స్ పథకాలున్నాయని చెప్పాడు. వీటి మొత్తం విలువ రూ.10 లక్షలు.ఇది ఇన్వెస్టర్లలో అవగాహన లేమిని తెలియజేస్తుంది''. నిజానికి ఫండ్స్ ఇన్వెస్టర్లలో ఎక్కువ మంది ఇలాంటివారే. ''కొత్తగా మార్కెట్లోకి వచ్చిన ఫండ్ పథకం రూ.10 విలువకే లభిస్తుంది. అప్పటికే మార్కెట్లో ఉన్న పథకాల ఎన్‌ఏవీలు ఎక్కువ ధరలో ఉంటాయి. దాంతో వాటిల్లో పెట్టుబడిపై తక్కువ యూనిట్లు వస్తాయి. కాబట్టి కొత్త పథకాలు బెటర్'' అన్న అభిప్రాయమే చాలామంది ఇన్వెస్టర్లలో ఉంది. అదే వారి పోర్ట్‌ఫోలియోని పెంచేస్తోంది. నిజానికి ఒకప్పుడు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అదే పనిగా కొత్త పథకాలను తెస్తూ ఉండేవి. డిస్ట్రిబ్యూటర్లు కమిషన్ల కోసం కొత్త పథకాల్లో పెట్టుబడి పెట్టించేందుకు ఏవేవో కల్లబొల్లి కబుర్లు చెప్పి ఇన్వెస్టర్లతో పెట్టుబడులు పెట్టించేవారు. అందులో భాగంగా ఏర్పడిన దురభిప్రాయమే కొత్త పథకం ఎన్‌ఏవీ చౌక అనేది!!. నిజానికి కొత్త ఫండ్లు అప్పుడే ప్రారంభమవుతాయి కనక చౌకగా ఉంటాయని, పాత ఫండ్లు మార్కెట్లో ఇన్వెస్ట్ చేసి ఉంటాయి కనక వాటి ఆస్తుల విలువ వాటి ఎన్‌ఏవీ విలువలో ప్రతిఫలిస్తుంటుందని చాలామంది అర్థం చేసుకోరు.

కొత్తవి తగ్గుతున్నాయ్...

ఇప్పుడు పరిస్థితి చాలావరకూ మారింది. సెబీ నియంత్రణ చర్యలతో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఒకే థీమ్‌తో పనిచేసే, ఒకే రకమైన పథకాల్లో పెట్టుబడి పెట్టే వివిధ పథకాలన్నింటినీ కలిపేస్తున్నాయి. స్థిరీకరిస్తున్నాయి. అంతేకాదు ఈ మధ్య కుప్పలు తెప్పలుగా కొత్త పథకాలు రావటం కూడా తగ్గిపోయింది. ఉన్నవాటిపైనే ఫోకస్ చేస్తూ పరిమిత సంఖ్యలో భిన్నమైన థీమ్‌లతో పనిచేసే పథకాలను తీసుకొస్తున్నాయి. ఎన్ని చేస్తున్నా ఇన్వెస్టర్లు మాత్రం అదే పనిగా ఒక పథకాన్ని పోలిన మరో కొత్త పథకాన్ని ఎంచుకోవడం జరుగుతూనే ఉంది.

ఒకటికి మరొకటి నకలు

టాప్ లార్జ్‌క్యాప్ ఫండ్స్ పెట్టుబడుల్లో ఎక్కువ భాగం ఒకే తరహా స్టాక్స్‌లో ఉంటాయి. ఉదాహరణకు బిర్లా సన్‌లైఫ్ ఫ్రంట్‌లైన్ ఈక్విటీ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ టాప్ 200, ఎస్‌బీఐ బ్లూచిప్ ఫండ్... ఈ మూడు పథకాల్లోనూ ఒక్కోదానిలో నిర్వహణ ఆస్తులు రూ.15,000 కోట్లపైనే ఉన్నాయి. వీటన్నింటిలోనూ టాప్ 10 స్టాక్స్‌ను పరిశీలిస్తే నాలుగు స్టాక్స్ అన్ని స్కీముల్లోనూ కనిపిస్తాయి. అవి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్. ఈ తరహా ఇన్వెస్టర్లకు మంచిది కాదన్నది నిపుణుల అభిప్రాయం. మీ పోర్ట్‌ఫోలియోలో ఎక్కువ పథకాలున్నాయంటే పెట్టుబడుల పరంగా డూప్లికేషన్ (ఒకే స్టాక్ ఒకటికి మించిన పథకాల పోర్ట్‌ఫోలియోలో ఉండడం) సమస్య ఎదురవుతుంది. ఈ తరహా వ్యూహం కొన్ని మార్కెట్ పరిస్థితుల్లో ఫలించకపోతే అందుకు సంబంధించిన అన్ని పథకాల పనితీరు ప్రతికూలంగానే ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎక్కువ మంది ఇన్వెస్టర్లు పనితీరులో టాప్‌లో ఉన్న ఫండ్స్‌ను ఎంచుకోవడం, తర్వాత మరో ఫండ్ పనితీరులో ముందుకు వస్తే అందులోకి మారిపోవడం జరుగుతుంటుందని, ఒక విధంగా ఇది మంచి ఫలితాలనే ఇస్తుందని వారి అభిప్రాయం.

ఎక్కువ పథకాలతో రిస్కే..

పదుల సంఖ్యలో పథకాల్లో పెట్టుబడులు విస్తరించినప్పుడు మొత్తం మీద రాబడులు కనిపించొచ్చు. కానీ, కొన్ని పేలవ పనితీరుతో కూడినవి తప్పకుండా ఉంటాయి. దీంతో మంచి పథకాలు ఇచ్చిన అధిక రాబడులను ఇవి తగ్గించేస్తాయి. పెట్టుబడులకు ఇదో క్రమబద్ధమైన విధానం కాదని, అన్ని పథకాల పనితీరును ట్రాక్ చేయడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి కేసుల్లో ఓ కచ్చితమైన పోర్ట్‌ఫోలియో నిర్మాణం జరగదని మార్నింగ్‌స్టార్ ఇండియాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ కౌస్తభ్ బేలపుర్కార్ పేర్కొన్నారు.

కష్టమైనా కుదింపుతో లాభమే



లెక్కకు మిక్కిలి పథకాల్లో పెట్టుబడుల వల్ల మొత్తం మీద ఎన్నో ప్రతికూలతలున్నాయని నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. కనుక భారీ పోర్ట్‌ఫోలియోతో ఉన్న వారు దాన్ని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టడం మేలు. ఈక్విటీ పథకాలైతే ఇది అంత సులభమేమీ కాదు. ఎందుకంటే ఇన్వెస్ట్ చేసి ఏడాది పూర్తి కాకుండా ఫండ్స్ యూనిట్లను విక్రయిస్తే ఎగ్జిట్ లోడ్ అంటూ చార్జీలు ఉంటాయి. పైగా పన్ను కూడా కట్టాల్సి వస్తుంది. అందుకని నిపుణులు పన్ను మినహాయింపు లభించే కాలం వరకూ, ఎగ్జిట్‌లోడ్ చార్జీలు తొలగిపోయే వరకూ ఆయా పథకాల్లో పెట్టుబడులను కొనసాగించి ఆ తర్వాతే పథకాలను కుదించుకోవాలని సూచిస్తున్నారు. అదే డెట్ ఫండ్స్ అయితే మూడేళ్లలోపు విక్రయిస్తే స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. కనుక డెట్ ఫండ్స్‌లో పోర్ట్‌ఫోలియో కత్తిరింపునకు మరింత సమయం పాటే వేచి ఉండాల్సి రావచ్చు. అయితే, పనితీరు బాగులేని పథకాలను కొంత మేర చార్జీలు భరించైనా సరే వాటి నుంచి బయటపడడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

● యాప్‌కీ కహానీ...

బీఎస్ఎన్ఎల్ వాలెట్



ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ ‘బీఎస్ఎన్ఎల్’ ఇటీవల మొబైల్ వాలెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం మొబి క్విక్ సాయం తీసుకుంది. ఈ ‘బీఎస్ఎన్ఎల్ వాలెట్’ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ప్రత్యేకతలు

- పోస్ట్‌పెయిడ్, బ్రాడ్‌బాండ్, డేటా కార్డు, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, ఇన్సూరెన్స్, యుటిలిటీ బిల్లులను చెల్లించొచ్చు. ప్రిపెయిడ్ మొబైల్, డీటీహెచ్ రీచార్జ్ చేసుకోవచ్చు.
- బస్సు టికెట్లను బుకింగ్ చేసుకోవచ్చు. క్యాష్‌బ్యాక్ పొందొచ్చు.
- షాపింగ్, ఫుడ్, ట్రావెల్ వెబ్‌సైట్స్/యాప్స్‌లో షాపింగ్ చేసి, ఎక్స్‌క్లూజివ్ ఆఫర్లను సొంతం చేసుకోవచ్చు.
- రెస్టారెంట్స్, కేఫ్‌లు, సూపర్‌మార్కెట్స్, గిఫ్ట్ షాప్స్, ఫిజికల్ స్టోర్స్‌లలో క్యాష్‌లెస్ చెల్లింపులు చేయవచ్చు.
- ఇతరులకు డబ్బుల్ని పంపొచ్చు.
- వాలెట్‌ను డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బులతో నింపుకోవచ్చు.

స్టాక్స్ వ్యూ


డిష్ టీవీ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.78 **టార్గెట్ ధర:** రూ.106

ఎందుకంటే: ఎస్సెల్ గ్రూప్‌కు చెందిన ఈ కంపెనీ డైరెక్ట్ టు హోమ్(డీటీహెచ్) రంగంలో అగ్రస్థానంలో ఉంది. ఈ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు పుంజుకున్నాయి. నిర్వహణ ఆదాయం 4 శాతం వృద్ధితో రూ.740 కోట్లకు పెరిగింది. ఒక్కో చందాదారుడి నుంచి వచ్చే సగటు రాబడి(ఏఆర్‌పీయూ) 10 శాతం వృద్ధితో రూ.148కు చేరడంతో పాటు నికర చందాదారుల సంఖ్య పెరుగుతుండటంతో సబ్‌స్క్రిప్షన్ ఆదాయం 11 శాతం వృద్ధితో రూ.692 కోట్లకు పెరిగింది. క్వార్టర్ ఆన్ క్వార్టర్ ప్రాతిపదికన ఇబిటా 7 శాతం వృద్ధితో రూ.201 కోట్లకు, ఇబిటా మార్జిన్ 35 బేసిస్ పాయింట్లు వృద్ధి చెంది 27 శాతానికి పెరిగాయి. కంటెంట్ సంబంధిత వ్యయాలు, మార్కెటింగ్ ఖర్చులు పెరగడంతో ఇబిటా మార్జిన్ అంచనాల కంటే తక్కువగానే వచ్చింది. మొత్తం మీద నికర నష్టాలు ఈ క్యూ1లో రూ.14 కోట్లకు తగ్గాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో పది లక్షల మంది కొత్త చందాదారులు లభిస్తారని కంపెనీ అంచనా వేస్తోంది. దీంతో ఏఆర్‌పీయూ మెరుగపడి ఆదాయం 7-8శాతం రేంజ్‌లో పెరగగలదని కంపెనీ భావిస్తోంది. అలాగే ఇబిటా మార్జిన్ 29-31 శాతం రేంజ్‌లో ఉండొచ్చని కంపెనీ అంచనా. ఈ ఏడాది అక్టోబర్ నాటికి వీడియోకాన్ డీ2హెచ్ విలీనం పూర్తి కానున్నది. ఈ విలీనం వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.180 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.510 కోట్ల మేర డిష్ టీవీకి ప్రయోజనం కలుగనున్నది. త్వరలో హైబ్రిడ్ సెట్-టాప్ బాక్స్(ఈ సెట్-టాప్ బాక్స్ ద్వారా డిజిటల్ కేబుల్ ప్రోగ్రామ్‌లను, ఇంటర్నెట్, లోకల్ ఐపీ నెట్‌వర్క్ అందించే వీడియోలను చూడొచ్చు)ను అందించనున్నది. అంతేకాకుండా కొత్త తరహాలో ఓటీటీ(ఓవర్ ద టాప్) సేవలను కూడా అందించనున్నది. ఈ జూన్ నాటికి నికర రుణ భారం రూ.690 కోట్లుగా ఉంది.

రిలయన్స్ క్యాపిటల్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.783 **టార్గెట్ ధర:** రూ.905

ఎందుకంటే: ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న విభిన్న విభాగాలు మంచి పనితీరును సాధిస్తుండటంతో ఆయా విభాగాల ఆర్ఓఈ(రిటర్న్ ఆన్ ఈక్విటీ)లే కాకుండా కంపెనీ లాభం కూడా మెరుగుపడనున్నది. ఐపీఓ ద్వారా వాటా విక్రయం, కీలకం కాని ఆస్తుల అమ్మకం ద్వారా కంపెనీకి ఈ ఆర్థిక సంవత్సరంలో మూల ధన లాభాలు, నెట్‌వర్త్ పెరగనున్నాయి. రుణ భారం తగ్గనున్నది. పెద్ద కరెన్సీ నోట్ల రద్దు, స్టాక్ మార్కెట్ జోరుగా ఉండటంతో పొదుపులు పెరిగి కంపెనీ మ్యూచువల్ ఫండ్ వ్యాపారం... రిలయన్స్ ఏఎంసీ బాగా పుంజుకుంది. ఈ వ్యాపార విభాగం మొత్తం నిర్వహణ ఆస్తులు 20 శాతం వృద్ధితో రూ.3,62,500 కోట్లకు పెరిగాయి. రెండేళ్లలో ఈ ఆస్తులు 16 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధిస్తాయని అంచనా. ఈ విభాగం ఆర్ఈఓ 25 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రిలయన్స్ ఏఎంసీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానున్నది. కమర్షియల్ ఫైనాన్స్, హోమ్ ఫైనాన్స్ విభాగాల వృద్ధి కూడా పుంజుకున్నది. హౌ'సింగ్ ఫైనాన్స్ విభాగాన్ని ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం కల్లా స్టాక్ మార్కెట్లో కంపెనీ లిస్ట్ చేయనున్నది. జీవిత బీమా వ్యాపార విభాగం బలహీనంగా ఉన్నప్పటికీ, సాధారణ బీమా వ్యాపార విభాగం మాత్రం మంచి పనితీరు కనబరుస్తోంది. సాధారణ బీమా వ్యాపార విభాగం 41 శాతం వృద్ధి చెందింది. రెండేళ్లలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం చొప్పున చక్రగతి వృద్ధితో రూ.1,426 కోట్లకు చేరవచ్చని భావిస్తున్నాం. అలాగే ఆదాయం 9 శాతం చక్రగతి వృద్ధితో రూ.20,990కోట్లకు, పెరుగుతుందని అంచనా. రెండేళ్లలో కంపెనీ రిటర్న్ ఆన్ ఈక్విటీ 7-9 శాతం రేంజ్‌లో ఉండొచ్చు. ఈ మూలధన లాభాలను కూడా కలుపుకుంటే ఆర్ఓఈ 12 శాతంగా ఉండొచ్చని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

121 కోట్లు దాటిన టెలికం సబ్‌స్క్రైబర్లు



దేశంలో టెలికం సబ్‌స్క్రైబర్ల సంఖ్య జూన్ నెల చివరకు 121 కోట్ల మార్క్‌ను అధిగమించింది. మే నెల చివరిలో 120.49 కోట్లుగా ఉన్న టెలికం యూజర్ల సంఖ్య జూన్ చివరకు 121.08 కోట్లకు పెరిగింది. టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ ఈ విషయాలను వెల్లడించింది. మొబైల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య నికరంగా 60 లక్షలకుపైగా పెరుగుదలతో 118.6 కోట్లకు చేరింది. వీరిలో 102.27 కోట్ల మంది యాక్టివ్‌గా ఉన్నారు. ఇక ల్యాండ్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2.4 కోట్లకు క్షీణించింది.

రిలయన్స్, బీపీకి 1,700 కోట్ల జరిమానా

గత ఆర్థిక సంవత్సరం కేజీడీ-6 క్షేత్రాల నుంచి నిర్దేశిత లక్ష్యాలకన్నా తక్కువగా గ్యాస్ ఉత్పత్తి చేసినందుకు గాను రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య సంస్థలపై కేంద్రం మరో 264 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,700 కోట్లు) జరిమానా విధించింది. దీంతో 2010 ఏప్రిల్ 1 నుంచి దాదాపు ఆరేళ్లుగా లక్ష్యాలను సాధించలేకపోవడం వల్ల విధించిన మొత్తం పెనాల్టీ సుమారు 3.02 బిలియన్ డాలర్లకి (దాదాపు రూ. 19,500 కోట్లు) చేరిందని చమురు శాఖ తెలిపింది.

కొత్త ప్రీమియం ఆదాయంలో 47% వృద్ధి

దేశంలోని మొత్తం 24 జీవిత బీమా కంపెనీల కొత్త ప్రీమియం ఆదాయంలో జూలై నెలలో 47.4% వృద్ధి నమోదయ్యింది. ఇది రూ.20,428 కోట్లకు చేరింది. కాగా గతేడాది ఇదే కాలంలో సంస్థల కొత్త ప్రీమియం ఆదాయం రూ.13,854 కోట్లుగా ఉంది. ఐఆర్‌డీఏ గణాంకాల ప్రకారం.. ప్రభుత్వ రంగ ఎల్ఐసీ ప్రీమియం ఆదాయం 51% వృద్ధితో రూ.10,738 కోట్ల నుంచి రూ.16,255 కోట్లకు పెరిగింది. ఇక మిగిలిన 23 ప్రైవేట్ సంస్థల ప్రీమియం ఆదాయం 34% వృద్ధితో రూ.3,117 కోట్ల నుంచి రూ.4,173 కోట్లకు ఎగిసింది.

ఉద్దేశపూర్వక ఎగవేతలు 92,000 కోట్లు



ప్రభుత్వ బ్యాంకులకు ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలు 20% పెరిగిపోయాయి. 2016-17 ఆర్థిక సంవత్సరం చివరికి 9,000 మంది రూ.92,376 కోట్ల మేర బ్యాంకులకు ఎగ్గొట్టారు. 2016 మార్చి నాటికి ఇలా ఉద్దేశ పూర్వకంగా చెల్లించని రుణాల మొత్తం రూ.76,685 కోట్లుగానే ఉంది. ఇక ఉద్దేశపూర్వక ఎగవేత కేసులు ఈ ఏడాది మార్చి నాటికి 8,915కు పెరిగాయి.

బంగారం ఎగుమతులపై కేంద్రం నిషేధం



కేంద్రం 22 క్యారెట్లకుపైన స్వచ్ఛత గల బంగారం ఉత్పత్తుల ఎగుమతులను నిషేధించింది. బంగారం ఉత్పత్తుల రౌండ్ ట్రిప్పింగ్‌ను అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 8 క్యారెట్లు నుంచి 22 క్యారెట్ల వరకు స్వచ్ఛత గల బంగారం ఎగుమతులకే అనుమతులున్నాయి.

త్వరలో కొత్త రూ.50 నోట్లు

ఆర్‌బీఐ త్వరలో మహాత్మా గాంధీ నూతన సిరీస్‌లో కొత్త రూ.50 నోట్లను తీసుకురానుంది. ఇవి నీలి (ఫ్లోరోసెంట్ బ్లూ) రంగులో ఉంటాయి. వీటిపై ఒకవైపు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా హంపీ రథం, స్వచ్ఛ భారత్ లోగో.. మరొకవైపు మహాత్మా గాంధీ, అశోక స్తంభం చిహ్నం ఉంటాయి.

కాల్‌డ్రాప్స్ ఉదంతాల్లో కఠిన చర్యలు

కాల్‌డ్రాప్స్ సమస్య పరిష్కారంపై ట్రాయ్ మరింతగా దృష్టి సారించింది. వరుసగా మూడు త్రైమాసికాలు ఆపరేటర్లు గానీ ప్రమాణాలు పాటించకపోతే రూ. 10 లక్షల దాకా జరిమానా చెల్లించాల్సి వచ్చేలా కఠినతరమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

ఇన్ఫీకి సిక్కా షాక్!



ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ విశాల్ సిక్కా తన పదవికి రాజీనామా చేశారు. తనపై పదేపదే వ్యక్తిగతంగా మాటల దాడి చేయడంతోపాటు నిరాధార ఆరోపణలు గుప్పించడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యానని.. అందుకే ఈ రాజీనామా అంటూ ఆయన పేర్కొన్నారు. సిక్కా స్థానంలో తాత్కాలిక సీఈఓ, ఎండీగా ప్రస్తుత చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యూబీ ప్రవీణ్‌రావుకు తక్షణం బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇన్ఫీ బోర్డు ప్రకటించింది. పూర్తి స్థాయి సీఈఓ, ఎండీని నియమించేందుకు 2018, మార్చి 31ని బోర్డు డెడ్‌లైన్‌గా నిర్ణయించింది. సిక్కా ఇకపై సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్‌గా కొనసాగుతారని పేర్కొంది.

స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలపై కేంద్రం దృష్టి



యూజర్ల డేటా దుర్వినియోగం కాకుండా భద్రపర్చేందుకు తీసుకుంటున్న చర్యలు, ప్రక్రియల గురించి తెలియజేయాలంటూ స్మార్ట్‌ఫోన్ కంపెనీలను కేంద్రం ఆదేశించింది. కంపెనీలు తమ వివరణ తెలియజేయడానికి ఆగస్టు 28 దాకా సమయం ఇచ్చినట్లు కేంద్ర ఐటీ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మొబైల్ ఫోన్ల నుంచి డేటా లీకవుతోందంటూ అంతర్జాతీయ స్థాయిలో నివేదికలు వస్తున్న నేపథ్యంలో తొలి దశలో డివైజ్‌లను, వాటిల్లో ముందస్తుగానే లోడ్ చేసిన సాఫ్ట్‌వేర్, యాప్స్‌ను నిశితంగా పరిశీలిస్తామని వివరించారు.

2017-18 క్యూ1 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం(కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017-18	2016-17	వృ/క్షీ(%)	2017-18	2016-17	వృ/క్షీ(%)
కోల్ ఇండియా	2,351	3,065	-23	21,774	--	--
ఐడీబీఐ బ్యాంక్	-853	241	--	6,730	8,219	-18
టాటా పవర్	164	72	126	7,000	6,790	3
అపోలో హాస్పిటల్స్	35	72	-51	1,684	1,465	14
యూనిటెక్	-38	-45	--	403	488	-17
శ్రీకాళహస్తి పైప్స్	36	--	--	446	292	53
డిష్ టీవీ	-14	36	--	748	790	-5
ఐవీఆర్‌సీఎల్	-245	--	--	522	452	15
గాయత్రి ప్రాజెక్ట్స్	45	--	--	660	440	50
ఎన్‌సీఎల్	16	9	78	227	192	18
సువెన్‌లైఫ్	29	--	--	146	137	7
గ్రాన్యూల్స్ ఇండియా	37	40	-7	386	353	9
పెన్నార్ ఇండస్ట్రీస్	13	--	--	460	338	36

ఆటో మొబైల్స్



- హెచ్‌ఎండీ గ్లోబల్.. ‘నోకియా-8’ స్మార్ట్‌ఫోన్‌ను గ్లోబల్ మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర దాదాపుగా రూ.45,000గా (599 యూరోలు) ఉంది.
- ‘ఆడి’ తన ప్రముఖ ఎస్‌యూవీ ‘క్యూ7’, సెడాన్ ‘ఏ6’లలో ‘డిజైన్ ఎడిషన్స్’ను భారత మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.81.99 లక్షలు, రూ.56.78 లక్షలుగా ఉన్నాయి. ధరలన్నీ ఎక్స్‌షోరూమ్ ఇండియావి.
- ‘మారుతీ సుజుకీ ఇండియా’ తన మిడ్‌సైజ్ సెడాన్ ‘సియాజ్’లో స్పోర్టీ వెర్షన్ ‘సియాజ్ ఎస్’ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. పెట్రోల్ వేరియంట్ ధర రూ.9.39 లక్షలుగా, డీజిల్ వేరియంట్ ధర రూ.11.55 లక్షలుగా ఉంది. ధరలన్నీ ఎక్స్‌షోరూమ్ ఢిల్లీవి.

డీల్స్..



- టీవీఎస్ మోటార్స్ బెంగళూరు కేంద్రంగా పనిచేసే స్టార్టప్ సంస్థ రెంట్‌ఆన్‌గోలో 24 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రెంట్‌ఆన్‌గో నిర్వహణ సంస్థ అయిన కండివిజన్ సొల్యూషన్స్‌లో రూ.1.5 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.
- సిగ్నా టీటీకే హెల్త్ ఇన్సూరెన్స్‌లో సిగ్నా తన వాటాను ప్రస్తుతమున్న 26 శాతం నుంచి 49 శాతానికి పెంచుకోనుంది.
- టెక్స్‌టైల్ దిగ్గజం రేమండ్.. కామసూత్ర బ్రాండ్‌ను పూర్తి స్థాయిలో దక్కించుకుంది. ఇందుకోసం రూ. 19.30 కోట్లు వెచ్చించింది.
- రిలయన్స్ నిప్పన్ లైఫ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌లో ఇండియా ఇన్ఫోలైన్ లిమిటెడ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 2.59 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.385 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.



బొమ్మ-బొరుసు


"ఇతరుల సామర్థ్యాన్ని వెలికి తీయడంలోనే అసలైన నాయకత్వ ప్రతిభ బయటపడుతుంది."
– కార్లీ ఫియోరిన, అమెరికా మహిళా వ్యాపారవేత్త



ఇన్ఫీ కొత్త చీఫ్.. కత్తిమీదసామే!

ఎంపికపై వెంటాడుతున్న మూర్తి నీడ

- ప్రమోటర్ల జోక్యంతో అభ్యర్థుల వెనుకంజ!
- ఎవరూ పెద్దగా ఆసక్తి వ్యక్తంచేయకపోవచ్చు....
- మార్కెట్ విశ్లేషకుల అభిప్రాయం...
- సీఈఓ ఎంపికకు 2018 మార్చి వరకూ గడువు



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ ప్రమోటర్లు–మేనేజ్‌మెంట్ మధ్య పోరు తీవ్రతరం కావడంతో ఇప్పుడు ఆ కంపెనీ కొత్త చీఫ్ ఎంపిక కత్తిమీద సాముగా మారుతోంది. ప్రధానంగా ఇన్ఫీ విధానాలపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తితో సహా మరికొందరు ప్రమోటర్లు నీడలా వెంటాడుతుండటంతో... కంపెనీకి సారథ్యం వహించేందుకు ఎవరూ పెద్దగా ఇష్టపడకపోవచ్చని పరిశ్రమ వర్గాలు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తనపై కంపెనీ ప్రమోటర్లు పదే పదే నిరాధార ఆరోపణలు, విమర్శల దాడి చేయడాన్ని సహించలేక సీఈఓ, ఎండీ పదవికి విశాల్ సిక్కా గత శుక్రవారం అర్ధంతరంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన గుడ్‌బై చెప్పడానికి మూర్తే కారణమని ఇన్ఫోసిస్ బోర్డు తీవ్రస్థాయిలో ఆరోపణలు కూడా గుప్పించింది. దీంతో ప్రమోటర్లకు ప్రస్తుత మేనేజ్‌మెంట్‌కు మధ్య వ్యవహారం మరింత చెడింది. కాగా, కొత్త సీఈఓ నియామకానికి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ డెడ్‌లైన్‌ను బోర్డు నిర్దేశించింది. తాత్కాలిక సీఈఓగా కంపెనీ ప్రస్తుత సీఎఫ్ఓ యూబీ ప్రవీణ్ రావుకు బాధ్యతలు అప్పగించారు. కొత్త చీఫ్ అన్వేషణలో కంపెనీలోని వ్యక్తులతోపాటు బయటివారిని కూడా బోర్డు పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. కాగా, ఇన్ఫీకి తొలి ప్రమోటరేతర సీఈఓగా ఏరికోరి తీసుకొచ్చిన సిక్కాపై ప్రమోటర్ల ధోరణిని చూస్తుంటే బయటి వ్యక్తులు అంతగా ఆసక్తి చూపకపోవచ్చనేది నిపుణుల వాదన. కంపెనీలోని వ్యక్తులకే ప్రాధాన్యం ఇస్తే గనుక... ప్రవీణ్ రావుతో పాటు సీఎఫ్ఓ డి. రంగనాథ్, డిప్యూటీ సీఓఓ రవికుమార్, కీలకమైన బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ విభాగాల హెడ్ మోహిత్ జోషి రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

బహిరంగ విమర్శలతో కష్టమే...

కంపెనీ తీసుకునే విధానపరమైన చర్యలను గుచ్చిగుచ్చి ప్రశ్నించడం, బహిరంగంగా విమర్శించడం వంటి ప్రమోటర్ల చర్యలతో ఎవరైనా మంచి నైపుణ్యం ఉన్న అభ్యర్థులు సీఈఓగా రావాలనుకున్నా జంకుతారని ఇన్‌స్టిట్యూషన్ ఇన్వెస్టర్ అడ్వయిజరీ సర్వీసెస్ అనే సంస్థ వ్యాఖ్యానించింది. ప్రమోటర్లకు నమ్మకంగా ఉండే కంపెనీలోని వ్యక్తులను ఎంపికచేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సులువైన వ్యవహారమని పేర్కొంది. అయితే, సయోధ్య కోసం ఇలా రాజీపడిపోవడం కంపెనీ పోటీతత్వం, ప్రతిష్టపై ప్రతికూల ప్రభావానికి దారితీస్తుందని అభిప్రాయపడింది. ఇన్ఫీలో కార్పొరేట్ గవర్నెన్స్‌కు సంబంధించి లోపాలు ఉన్నాయంటూ ప్రమోటర్లు ప్రధానంగా మూర్తి బహిరంగంగా ఆరోపణల దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. మరోపక్క, కంపెనీ మాజీ సీఎఫ్ఓ రాజీవ్ బన్సాల్‌కు భారీగా వీడ్కోలు ప్యాకేజీ ఇవ్వడాన్ని, సీఈఓ విశాల్ సిక్కా వేతన ప్యాకేజీ పెంపుపైనా మూర్తి బహిరంగంగా విమర్శలు గుప్పించడంతోపాటు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం చేశారు. కాగా, ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇన్ఫీకి కొత్త సీఈఓ అన్వేషణ చాలా కష్టతరమైన అంశమేనని ఐటీ పరిశ్రమ నిపుణుడు ప్రమోద్ బాసిన్ పేర్కొన్నారు.

విశ్వాసం పెంచాలి: నటరాజన్

విశాల్ సిక్కా ఆకస్మిక రాజీనామా నేపథ్యంలో కంపెనీ కార్యకలాపాల్లో ఎలాంటి సమస్యలూ లేవన్న భరోసాను, నమ్మకాన్ని కల్పించే చర్యలు ఇప్పుడు చాలా అవసరమని ఐటీ పరిశ్రమకు చెందిన గణేశ్ నటరాజన్ వ్యాఖ్యానించారు. ఇందుకోసం కొత్త సీఈఓ అన్వేషణ ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా సిక్కా వెళ్లిపోయినా... కంపెనీని ముందుండి నడిపించేందుకు, సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు చాలామంది నిపుణులు వరుసలో ఉన్నారన్న బలమైన సందేశాన్ని ఇన్ఫోసిస్ యాజమాన్యం ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రొఫెషనల్ నాయకత్వం దిశగా భారత్ కార్పొరేట్లు అడుగులేస్తున్న ప్రస్తుత తరుణంలో ఇన్ఫీలో తలెత్తిన సంక్షోభం.. చాలా కీలకమైన ప్రశ్నలను లేవనెత్తిందని ఐటీ పరిశ్రమ చాంబర్ నాస్కామ్ మాజీ ప్రెసిడెంట్ సోమ్ మిట్టల్ వ్యాఖ్యానించారు. కంపెనీ యాజమాన్య వ్యవహారాల నుంచి పూర్తిగా వైదొలగిన ఓనర్లు/వ్యవస్థాపకులు... భావి నాయకత్వ ప్రణాళికలకు సంబంధించి తమ పాత్ర ఏంటనే విషయంలో చాలా జాగ్రత్తగా, స్పష్టమైన రీతిలో వ్యవహరించాలని మిట్టల్ సూచించారు.

క్లయింట్లు చేజారే ప్రమాదం...!

ఇన్ఫీలో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలు ఉన్నాయంటూ స్వయంగా ప్రమోటర్లే గొంతెత్తడం.. చివరకు ఇది సిక్కా వైదొలగేవరకూ వెళ్లడంతో ఇప్పుడు కంపెనీలో ఉద్యోగులు, క్లయింట్లలో స్థైర్యాన్ని దెబ్బతీసే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత అనిశ్చితి నేపథ్యంలో సిబ్బంది వలసలు పెరిగిపోవడంతోపాటు కొంతమంది క్లయింట్లు కూడా చేజారే ప్రమాదం పొంచి ఉందని పేరువెల్లడించడానికి ఇష్టపడని ఐటీ రంగానికి చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు వ్యాఖ్యానించారు. 'ఇన్ఫీలో జరుగుతున్న ఉదంతంపై క్లయింట్లలో కచ్చితంగా ఆందోళన నెలకొంటుంది. పటిష్టమైన నాయకత్వం లేకపోవడంతో కంపెనీని మరిన్ని సమస్యలు చుట్టుముట్టొచ్చు. ఐటీ పరిశ్రమలో తీవ్ర పోటీ దృష్ట్యా.. ప్రత్యర్థి కంపెనీలు దీన్ని అనుకూలంగా మలచుకొని ఇన్ఫీ క్లయింట్లను తమవైపు తిప్పుకోడానికి అవకాశం లభిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. మరోపక్క, ఇన్ఫీలో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలపై అమెరికాలో క్లాస్ యాక్షన్ దావాలు దాఖలయ్యే అవకాశాలు ఉండటం కూడా అటు క్లయింట్లు ఇటు ఇన్వెస్టర్లలో భయాందోళనలు సృష్టించవచ్చని పరిశీలకులు పేర్కొంటున్నారు.

చిచ్చురేపిన పనయా డీల్!

సిక్కా సారథ్యంలో ఇజ్రాయెల్ టెక్నాలజీ కంపెనీ పనయాను ఇన్ఫోసిస్ 2015లో 20 కోట్ల డాలర్లకు(దాదాపు రూ. 1250 కోట్లు) కొనుగోలు చేసింది. అయితే, ఈ డీల్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ కంపెనీ అంతర్గత వేగులు(విజిల్ బ్లోయర్స్) ఆరోపించడం, నియంత్రణ సంస్థలకు ఫిర్యాదు చేయడంతో వివాదం రాజుకుంది. దీనిపై ఆతర్వాత ప్రమోటర్లు కూడా విమర్శలు ఎక్కుపెట్టారు. దీంతో స్వతంత్ర న్యాయ సంస్థతో కంపెనీ దర్యాప్తు జరిపించడం తెలిసిందే. అయితే, ఎలాంటి అవకతవకలూ జరగలేదని న్యాయ, ఫోరెన్సిక్ ఆడిట్ సంస్థలు నివేదిక ఇచ్చాయి. ఈ నివేదికను బహిరంగపరచాలన్న మూర్తి డిమాండ్‌ను కంపెనీ బోర్డు తోసిపుచ్చింది. నివేదికను బయటపెట్టకపోవడం అంటే దర్యాప్తు పారదర్శకంగా జరగలేదనే అర్థమంటూ మూర్తి వ్యాఖ్యానించడం, ఆయనకు మరికొందరు మాజీలు మద్దతుతెలపడంతో యాజమాన్యానికి, ప్రమోటర్లకు మధ్య విభేదాలను మరింత పెంచేలా చేసింది. ఇది కూడా సిక్కా రాజీనామాకు ప్రధాన కారణాల్లో ఒకటని పరిశీలకులు పేర్కొంటున్నారు.

22న బ్యాంకు సేవలకు

అంతరాయం!

ఉద్యోగుల ఒకరోజు సమ్మె



న్యూఢిల్లీ: ఉద్యోగులు ఒక రోజు సమ్మె తలపెట్టినందున ప్రభుత్వ రంగ బ్యాంకు సేవలకు 22న (మంగళవారం) అంతరాయం కలగనుంది. బ్యాంకుల స్థిరీకరణతోపాటు పలు ఇతర అంశాలకు సంబంధించి సమ్మె చేయనున్నట్టు తొమ్మిది బ్యాంకు ఉద్యోగుల ఉమ్మడి సంఘమైన 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్' ఇప్పటికే హెచ్చరించింది. దీంతో సేవల అంతరాయంపై చాలా బ్యాంకులు తమ ఖాతాదారులకు ఇప్పటికే సమాచారం అందించాయి. ఇక ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్, కోటక్ బ్యాంకు సేవలు సాధారణంగానే కొనసాగనున్నాయి. చీఫ్ లేబర్ కమిషనర్ ముందు చర్చలు విఫలమయ్యాయని, సమ్మె మినహా మరో మార్గం లేదని ఆల్‌ఇండియా బ్యాంకు ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్(ఏఐబీఓసీ) జనరల్ సెక్రటరీ డీటీ ఫ్రాంకో పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లలో వేటికీ ఇంతదాకా ఫలితం కనిపించలేదని, దీంతో ఈ నెల 22న సమ్మెకు సిద్ధమైనట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్(యూఎఫ్‌బీయూ) తెలిపింది. బ్యాంకుల స్థిరీకరణతోపాటు సంఘాలు లేవనెత్తిన ఇతర అంశాల్లో కార్పొరేట్ రుణాల ఎన్‌పీఏలను రద్దు చేయకుండా ఉండడం, ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలను నేరపూరిత చర్యగా ప్రకటించడం, ఎన్‌పీఏల వసూలుకు పార్లమెంటరీ కమిటీ సూచించిన సిఫారసులను అమలు చేయడం ఉన్నాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు.

ఎగవేతల్లో ఎస్‌బీఐ వాటానే 27 శాతం

తర్వాతి స్థానం పంజాబ్ నేషనల్ బ్యాంకు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన మొత్తం రుణాల్లో ఒక్క ఎస్‌బీఐ వాటానే 27%. మార్చి నాటికి ఎస్‌బీఐకి 1,762 మంది రూ.25,104 కోట్ల మేర రుణాలను చెల్లించకుండా ఎగ్గొట్టారు. ఆ తర్వాత ఆ స్థాయిలో రుణాల పరంగా నష్టపోయింది పంజాబ్ నేషనల్ బ్యాంకు. పీఎన్‌బీకి 1,120 మంది రూ.12,278 కోట్లు చెల్లించలేదు. కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల మొత్తం 2017 మార్చి నాటికి రూ.92,376 కోట్లుగా ఉంది. 8,915 మంది వీటిని చెల్లించాల్సి ఉంది. ఇందులో ఎస్‌బీఐ, పీఎన్‌బీ బ్యాంకుల వాటాయే 40% వాటా (రూ.37,382 కోట్లు).



కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-8-2017

విశాఖ	362–00
చిత్తూరు	390–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	397–00
విజయవాడ	359–00
గోదావరి	359–00
నమక్కల్	387–00
20–8–2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382–00
ఢిల్లీ	370–00
కోల్‌కతా	393–00

ఇన్ఫీ పరిణామాలు కీలకం..

- వినాయక చవితి సందర్భంగా ఈ నెల 25 సెలవు
- ట్రేడింగ్ నాలుగు రోజులే
- బైబ్యాక్, అమెరికా కోర్టుల్లో కేసులు... ఇన్ఫోసిస్‌పై దృష్టి



ఇన్ఫోసిస్ పరిణామాలు, అంతర్జాతీయ సంకేతాలు ఈ వారం మార్కెట్ కదలికలను నిర్దేశిస్తాయని నిపుణులంటున్నారు. వీటితో పాటు రుతు పవనాల విస్తరణ, ఈ వారంలో వెలువడే కంపెనీల క్యూ1 ఫలితాలు, తదితర అంశాలు కూడా మార్కెట్ గమనంపై ఒకింత ప్రభావం చూపుతాయని వారంటున్నారు. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 25(శుక్రవారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. దీంతో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ నాలుగు రోజులే జరగనున్నది.

ఇన్ఫోసిస్‌పై కేసులు...: గత శుక్రవారం అనూహ్యంగా సీఈఓ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో స్టాక్ మార్కెట్ 271 పాయింట్లు నష్టపోయింది. ఒక్కో షేర్‌ను రూ.1,150 ధరకు(శుక్రవారం ముగింపు ధర రూ.923తో పోల్చి తే ఇది 25 శాతం అధికం) 11.3 కోట్ల షేర్లను బైబ్యాక్ చేయనున్నామని కంపెనీ శనివారం ప్రకటించడం, సిక్కా రాజీనామా తదనంతర పరిణామాలు, సెక్యూరిటీల లావాదేవీలకు సంబంధించి అమెరికాలో ఇన్ఫోసిస్‌కు వ్యతిరేకంగా కొన్ని కేసులు దాఖలు కానుండటం తదితర అంశాల కారణంగా సోమవారం ఇన్ఫోసిస్‌పై అందరి దృష్టి పడనున్నది.

ఐటీ, ఫార్మా, బ్యాంక్ షేర్ల కదలికలు కీలకం

బ్యాంక్, ఫార్మా, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా స్టాక్ సూచీలు నష్టాలపాలయ్యాయని ఆద్య ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ టెక్నికల్ ఎనలిస్ట్ అభ్నిశ్ కుమార్ పేర్కొన్నారు. ఈ రంగం షేర్ల కదలికలు సమీప భవిష్యత్తులో నిఫ్టీకి కీలకం కానున్నాయని, ఈ రంగం షేర్లే భవిష్యత్తు ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని వివరించారు. స్పెయిన్‌లో జరిగిన ఉగ్రదాడి సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు.

విదేశీ ఈక్విటీ పెట్టుబడులకు బ్రేక్...

గత కొన్నేళ్లుగా సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల ఈక్విటీ పెట్టుబడుల జోరుకు ఈ నెలలో బ్రేక్ పడింది. డెట్ పెట్టుబడులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి–జూలై కాలానికి ఈక్విటీల్లో విదేశీ పెట్టుబడులు రూ.62,000 కోట్లుగా ఉన్నాయి. అయితే ఎఫ్‌పీఐలు ఈ నెలలో ఇప్పటివరకూ ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.7,300 కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ ఇన్వెస్టర్ల ఈక్విటీ పెట్టుబడులు రూ.53,610 కోట్లుగా ఉన్నాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, దేశీయంగా కొన్ని విషయాల్లో ఆందోళన కారణంగా విదేశీ ఇన్వెస్టర్లు ఈ స్థాయిలో తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అయితే డెట్ మార్కెట్లో మాత్రం రూ.9,364 కోట్లు పెట్టుబడులు పెట్టారు.

'లాట్' 127వ స్టోర్ ప్రారంభం

హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ లాట్ తన 127వ స్టోర్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఏలూరురోడ్డులోని సూర్యారావు పేటలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ప్రముఖ నటి పూజా హెగ్డే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఐదో వార్షికోత్సవం సందర్భంగా మొబైల్స్ కొనుగోళ్లపై కస్టమర్లు రూ.5 కోట్ల విలువైన బహుమతులను లక్కీ డ్రాలో గెలుపొందే అవకాశం ఉందని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే, నూతన స్టోర్ ప్రారంభించిన సందర్భంగా ఎంపిక చేసిన మోడల్ మొబైల్స్‌పై ఉచిత బహుమతులను కూడా అందిస్తున్నట్టు పేర్కొంది.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి పూజా హెగ్డే

అరవింద్ 'అన్‌లిమిటెడ్' ఇప్పుడు విజయవాడలో



హైదరాబాద్: కుటుంబ సభ్యులందరికీ ఫ్యాషన్ వస్త్రోత్పత్తులను ఒకే చోటే అందుబాటులో ఉంచే 'అన్‌లిమిటెడ్' 58వ షోరూమ్ విజయవాడలోని ఎంజీరోడ్డులో ఆరంభమైంది. అరవింద్ లైఫ్‌స్టయిల్ బ్రాండ్స్ లిమిటెడ్‌కు చెందిన అనుబంధ విభాగం ఇది. మహిళలు, పురుషులు, చిన్నారులకు సంబంధించి 30,000 ఆధునిక శ్రేణి వస్త్రాలను ఇక్కడ అందుబాటులో ఉంచినట్టు సంస్థ తెలిపింది. సంప్రదాయానికి భిన్నంగా ఈ సంస్థ కొత్త స్టోర్‌ను సమీపంలోని ఓ అనాథ శరణాలయానికి చెందిన చిన్నారులతో ప్రారంభించి ప్రత్యేకతను చాటుకుంది. ఈ సందర్భంగా సంస్థ సీఈవో శేఖర్ మాట్లాడుతూ... విజయవాడలో తమకు ఇది తొలి స్టోర్ అని, ఆంధ్రప్రదేశ్‌లో 5వ స్టోర్ అని చెప్పారు. హైదరాబాద్‌లో 6 స్టోర్లు, తెలంగాణ వ్యాప్తంగా 7 స్టోర్లు ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 35 స్టోర్లను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్టు విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు.

అంతా బాగున్నా.. అప్రమత్తత అవసరమే!

నా వయస్సు 50 సంవత్సరాలు. నేను మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. పన్ను ఆదా, లేదా పన్ను రాయితీ తదితర ప్రయోజనాలు నాకు అవసరం లేదు. నేను పదేళ్ల పాటు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇన్వెస్ట్ చేయడానికి కొన్ని మంచి మ్యూచువల్ ఫండ్స్‌ను సూచించండి. నాకు కెనరా బ్యాంక్, ఎస్‌బీఐల్లో ఖాతాలున్నాయి. నా బ్యాంక్ ఖాతాల నుంచే నేను మ్యూచువల్ ఫండ్స్‌ను కొనుగోలు చేయాలా ?

–గంగాధర్, విజయవాడ

మీరు ఏదైనా ఒక బ్యాంక్ ఖాతా నుంచి కూడా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ఒక బ్యాంక్ ఖాతా, పాన్ కార్డ్ ఉంటే చాలు. నో యువర్ కస్టమర్(కేవైసీ) ప్రక్రియ పూర్తి చేయడానికి ఇవి అవసరం. ఏదైనా మ్యూచువల్ ఫండ్ సంస్థ, ఒకసారి మీ కేవైసీ ప్రక్రియ పూర్తి చేసినట్లయితే, ఇతర సంస్థల ఫండ్స్‌లోనూ మీరు ఇన్వెస్ట్ చేయవచ్చు. మొదటి సారి ఇన్వెస్ట్ చేస్తున్నారు. కాబట్టి ముందుగా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌ను ఎంచుకోండి. ఒకటి లేదా రెండేళ్లలో మ్యూచువల్ ఫండ్స్‌పై తగినంత అవగాహన వచ్చిన తర్వాత ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. ఇక మీరు ఇన్వెస్ట్ చేయడానికి హెచ్‌డీఎఫ్‌సీ, టాటా, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, కెనరా రొబెకొ సంస్థల బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. మీ దగ్గర ఇన్వెస్ట్ చేయడానికి పెద్ద మొత్తంలో సొమ్ములున్నప్పటికీ, ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయకుండా, వాటిని సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) విధానంలో ఇన్వెస్ట్ చేయండి.

ఒక క్లోజ్‌డ్ ఎండ్ మ్యూచువల్ ఫండ్‌లో ఏడాది క్రితం నేను రూ.3 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. ఇప్పుడు నాకు అత్యవసరంగా కొంత సొమ్ము అవసరమైంది. ఈ క్లోజ్‌డ్ ఎండ్ ఫండ్ నుంచి నా ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకునే అవకాశం ఉందా ?

–మాధురి, విశాఖపట్టణం

క్లోజ్‌డ్ ఎండ్ మ్యూచువల్ ఫండ్‌లో మెచ్యూరిటీ తేదీలోపు మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకునే అవకాశం లేదు. అయితే మ్యూచువల్ ఫండ్స్ కూడా స్టాక్ మార్కెట్లో షేర్ల మాదిరే లిస్టయి ట్రేడవుతుంటాయి. ఇలా మీరు ఇన్వెస్ట్ చేసిన మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను మీరు స్టాక్ మార్కెట్ ద్వారా విక్రయించుకోవచ్చు. ఈ తరహా ఫండ్స్‌లో ట్రేడింగ్ లావాదేవీలు చాలా స్వల్పంగా ఉంటాయి. ఈ మార్గంలో మీ మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను విక్రయించుకోవడం కొంచెం కష్టమైన పనే. ఈ యూనిట్లను కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చే ట్రేడర్లు చాలా తక్కువగా ఉంటారు. ఒకవేళ ఉన్నా, ఈ ఫండ్స్.. ఎన్‌ఏవీ(నెట్ అసెట్ వేల్యూ) కంటే తక్కువగానే ట్రేడవుతాయి. ఫండ్స్ అసలు విలువ కంటే తక్కువకే మీరు అమ్ముకోవలసి రావచ్చు. మీకు కావలసిన సొమ్ముల కోసం స్నేహితులు, బంధువుల వద్ద ప్రయత్నించండి. లేదా మీరు ఈక్విటీ, హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే ఈ యూనిట్లు తనఖాగా కొన్ని బ్యాంక్‌లు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణం పొందవచ్చు. రుణ మొత్తం, కాలపరిమితి ఆధారంగా వడ్డీరేట్లు 10–12 శాతం రేంజ్‌లో ఉంటాయి. మీ యూనిట్ల విలువలో 70 శాతం వరకూ రుణం వచ్చే అవకాశం ఉంటుంది. రుణ చెల్లింపుల్లో విఫలమైతే, ఆ సంస్థ, తనఖా ఉంచుకున్న ఫండ్ యూనిట్లను విక్రయించుకొని, ఏవైనా మిగిలితే రుణ గ్రహీతకు ఇస్తుంది.



Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను గత కొంతకాలంగా నాలుగు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇప్పుడు స్టాక్ మార్కెట్‌కు సంబంధించి చాలా సానుకూలాంశాలు చోటు చేసుకుంటున్నాయి. స్టాక్ సూచీలు జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. అమెరికా, ఇతర విదేశీ మార్కెట్లు బాగా ఉన్నాయి. వడ్డీరేట్లు తగ్గుతున్నాయి. చమురు ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విధానాలు మెరుగవుతున్నాయి. ఇన్ని సానుకూలాంశాల నేపథ్యంలో సాధారణ ఇన్వెస్టర్ ఎలా వ్యవహరించాలి ?

–సురేందర్, హైదరాబాద్


స్టాక్ మార్కెట్‌కు సంబంధించి పలు సానుకూలాంశాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఇప్పుడు కొంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. స్టాక్ మార్కెట్లోకి నిధుల ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ ఉంది. కానీ ఆ స్థాయిలో కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగుపడటం లేదు. కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగుపడకుండా మార్కెట్ పెరుగుతుండటమంటే.. మార్కెట్ ఖరీదవుతుందని(అధిక వేల్యుయేషన్) అర్థం. ఇలాంటి పరిస్థితుల్లో ఫండ్ మేనేజర్లు జాగ్రత్తగానే వ్యవహరిస్తారు. మీరు నాలుగు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేశారని పేర్కొన్నారు. సాధారణంగా బ్యాలన్స్‌డ్ ఫండ్స్ తమ మొత్తం నిధుల్లో 30–35 శాతం వరకూ డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. మార్కెట్ పెరుగుతున్నప్పుడు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌ను నిర్వహిస్తున్న ఫండ్ మేనేజర్లు లాభాల స్వీకరణ చేస్తారు. అందుకని నష్ట భయం(రిస్క్) తగ్గించుకునే ఫండ్స్‌గా బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌ను పరిగణిస్తారు. ఇక సాధారణ ఇన్వెస్టర్లు నష్టభయాన్ని తగ్గించుకోవడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది.. భవిష్యత్తులో వచ్చే ఒడిదుడుకులకు సిద్ధపడి, మీ ఇన్వెస్ట్‌మెంట్ కాలాన్ని పెంచుకోవడం, ఇక రెండోది మీ మొత్తం మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌లోనే ఉన్నట్లయితే, కొంత ఇన్వెస్ట్‌మెంట్‌ను డెట్ ఫండ్స్‌లోకి మళ్లించండి. ఒకేసారి ఇలా కాకుండా దశలవారీగా ఈ మళ్లింపు ప్రక్రియను చేపట్టండి. కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగుపడితే మార్కెట్ ఎంతోకాలం ఖరీదైనదిగా ఉండదు.

తక్షణ మద్దతు 31,380 పాయింట్లు

మార్కెట్ పంచాంగం


వారం రోజుల క్రితం అతిపెద్ద కరెక్షన్ చోటుచేసుకున్నందున..గతవారం భారత్ సూచీలు ఒక చిన్నపాటి రిలీఫ్ ర్యాలీ జరిపాయి. కానీ శుక్రవారం తిరిగి అంతర్జాతీయ మార్కెట్లు ఒడుదుడులకు లోనుకావడం, ఇన్ఫోసిస్ సీఈఓ రాజీనామా చేయడం వంటి కారణాలతో రిలీఫ్ ర్యాలీకి బ్రేక్‌పడి మన మార్కెట్ క్షీణించింది. అమెరికాలో ట్రంప్ విధానాల పట్ల పలు సందేహాలు నెలకొనడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో హెచ్చుతగ్గుల తీవ్రత పెరగడం, మరోవైపు రిస్క్ సమయాల్లో రక్షణ ఇచ్చే సాధనంగా భావించే బంగారం ధర 1,300 డాలర్లస్థాయిని దాటడం వంటి అంశాలు...ప్రపంచ మార్కెట్లలో కరెక్షన్ జరిగే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఇక సూచీల సాంకేతికాల విషయానికొస్తే.., ...

సెన్సెక్స్ సాంకేతికాలు



ఆగస్టు 18తో ముగిసిన నాలుగు రోజుల ట్రేడింగ్‌వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 31,294 పాయింట్ల కనిష్టస్థాయి నుంచి గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన 31,938 పాయింట్ల గరిష్టస్థాయివరకూ రిలీఫ్ ర్యాలీ కొనసాగింది. వారంలో చివరిరోజున లాభాల్లో కొంతభాగాన్ని కోల్పోవడంతో చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 311 పాయింట్ల లాభంతో 31,525 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం మార్కెట్ క్షీణత కొనసాగితే 31,380 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ స్థాయి దిగువన ముగిస్తే 30,960 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఆలోపున 30,680 పాయింట్లస్థాయికి క్షీణించే ప్రమాదం వుంటుంది. ఈ స్థాయి సెన్సెక్స్‌కు రానున్న రోజుల్లో కీలకమైనది. ఇది వదులుకుంటే మరింత పతనం వేగంగా సంభవించే ప్రమాదం వుంటుంది. ఈ వారం ప్రస్తుతస్థాయి లేదా 31,380 స్థాయిని పరిరక్షించుకోగలిగితే 31,730 వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఆపైన ముగిస్తే తిరిగి 31,940 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు.

నిఫ్టీ తక్షణ మద్దతు 9,770



ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ గతవారం 9,752 పాయింట్ల కనిష్ట స్థాయి నుంచి గత మార్కెట్ పంచాంగంలో సూచించిన 9,948 గరిష్టస్థాయి వరకూ పెరిగింది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 127 పాయింట్ల లాభంతో 9,837 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం మార్కెట్ క్షీణత కొనసాగితే 9,770 పాయింట్ల వద్ద నిఫ్టీకి తక్షణ మద్దతు లభిస్తున్నది. ప్రస్తుత స్థాయి లేదా 9,770 పాయింట్ల మద్దతుస్థాయిని పరిరక్షించుకోగలిగితే నిఫ్టీ 9,885 పాయింట్ల తొలి నిరోధస్థాయివరకూ రిలీఫ్‌ర్యాలీ జరపవచ్చు. ఆపైన ముగిస్తే మరోసారి 9,950 పాయింట్ల వరకూ కూడా ర్యాలీ కొనసాగవచ్చు. కొత్త గరిష్టస్థాయికి పెరగాలంటే 9,950 పాయింట్లపైన నిఫ్టీ స్థిరపడాల్సివుంటుంది. ఈ వారం 9,770 పాయింట్ల మద్దతుస్థాయిని కోల్పోయి, ముగిస్తే 9,685 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఆ లోపున 9,595 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు.

– పి. సత్యప్రసాద్

ఆలిండియా ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత రుత్విక శివాని

పుణే వేదికగా జరిగిన ఆలిండియా ర్యాంకింగ్ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడా కారిణి గద్దె రుత్విక శివాని చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఖమ్మం జిల్లాకు చెందిన రుత్విక శివాని 21-10, 21-13తో ఐదో సీడ్ అనురా ప్రభుదేశాయ్ (గోవా)పై విజయం సాధించింది. విజేతగా నిలిచే క్రమంలో ఆరు మ్యాచ్‌ల్లో నెగ్గిన రుత్విక శివాని తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోలేదు. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన రుత్విక నలుగురు సీడెడ్ క్రీడాకారిణులను ఓడించింది.





11
ధావన్ కెరీర్‌లో ఇది 11వ సెంచరీ. బంతులపరంగా అతనికి ఇదే (71) వేగవంత మైన శతకం.

127
భారత్ గెలిచే సమయానికి ఇన్నింగ్స్‌లో మిగిలిన బంతులు. కనీసం 200 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఛేదిస్తున్న సమయంలో మిగి లిన బంతులపరంగా భార త్‌కు ఇదే అతి పెద్ద విజయం

నిర్దాక్షిణ్యంగా...

భారత్‌కు మరో భారీ విజయం
తొలి వన్డేలో 9 వికెట్లతో శ్రీలంక చిత్తు
శిఖర్ ధావన్ సెంచరీ
రాణించిన కోహ్లి

ఫార్మాట్ మాత్రమే మారింది... భారత్ విధ్వంసకర ఆటలో మార్పు లేదు. శ్రీలంక పేలవ ప్రదర్శన మెరుగైందీ లేదు! టెస్టు సిరీస్ తరహాలోనే మరో అద్భుత విజయంతో వన్డే సిరీస్‌లో కూడా భారత్ బోణీ చేసింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. ముందుగా బౌలర్లు సమష్టితత్వంతో లంకను తక్కువ స్కోరుకే పరిమితం చేయగా... ఆ తర్వాత ఏకంగా 21.1 ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించేసి కోహ్లి సేన మన జట్టు సత్తాను మరోసారి ప్రదర్శించింది.

94, 113, 79, 91, 125... ఈ మ్యాచ్‌కు ముందు శ్రీలంకపై శిఖర్ ధావన్ వరుసగా ఐదు వన్డేల్లో చేసిన పరుగులు ఇవి. ఇప్పుడు కూడా అదే ప్రేమను కొనసాగిస్తూ ధావన్ మరో అద్భుత శతకంతో చెలరేగాడు. 132 స్కోరులో 98 పరుగులు బౌండరీల ద్వారానే రాబట్టి తన ధాటిని ప్రదర్శించిన అతను తన కెరీర్‌లో వేగవంతమైన సెంచరీని సాధించాడు. అటువైపు తనకు అలవాటైన రీతిలో ఛేదనలో మరో చక్కటి ఇన్నింగ్స్‌తో కోహ్లి అండగా నిలవడంతో టీమిండియాకు తిరుగులేకపోయింది.

దంబుల్లా: శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్‌కు ఘనమైన ఆరంభం లభించింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 43.2 ఓవర్లలో 216 పరుగులకే ఆలౌటైంది. నిరోషన్ డిక్‌వెలా (74 బంతుల్లో 64; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. ఒక దశలో 139/1తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 77 పరుగులకే మిగతా 9 వికెట్లు కోల్పోయింది. అక్షర్ పటేల్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ అవలీలగా 28.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. వికెట్ నష్టానికి 220 పరుగులు చేసి విజయాన్ని దక్కించుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శిఖర్ ధావన్ (90 బంతుల్లో 132 నాటౌట్; 20 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీ సాధించగా, విరాట్ కోహ్లి (70 బంతుల్లో 82 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. లంక పడగొట్టిన ఒక్క వికెట్ కూడా రోహిత్ శర్మ రనౌట్ రూపంలో అదృష్టవశాత్తూ లభించిందే. సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా రెండో వన్డే పల్లెకెలెలో గురువారం జరుగుతుంది.

డిక్‌వెలా మినహా...

టాస్ గెలిచిన కోహ్లి ఫీల్డింగ్ ఎంచుకున్న అనంతరం శ్రీలంకకు ఓపెనర్లు డిక్‌వెలా, గుణతిలక (44 బంతుల్లో 35; 4 ఫోర్లు) శుభారంభం అందించారు. భారత ఆరంభ బౌలర్లు భువనేశ్వర్, పాండ్యాలను వీరిద్దరు సమర్థంగా ఎదుర్కొంటూ తొలి పవర్ ప్లేలో 55 పరుగులు జోడించారు. చివరకు యజువేంద్ర చహల్ ఈ జోడీని విడదీశాడు. రివర్స్ స్వీప్ ఆడబోయిన గుణతిలక ఎక్స్‌ట్రా కవర్‌లో రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత చహల్ వేసిన మరో ఓవర్లో మూడు ఫోర్లు కొట్టి కుషాల్ మెండిస్ (37 బంతుల్లో 36; 5 ఫోర్లు) జోరు ప్రదర్శించాడు. మరో ఎండ్‌లో డిక్‌వెలా కూడా ధాటిగా ఆడాడు. ఈ క్రమంలో 65 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఈ దశలో డిక్‌వెలాను అవుట్ చేసి జాదవ్ శ్రీలంక పతనానికి శ్రీకారం చుట్టాడు. అంపైర్ ఎల్బీ డబ్ల్యూగా ప్రకటించిన తర్వాత డిక్‌వెలా రివ్యూ కోరినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత లంక టపటపా వికెట్లు కోల్పోయింది. జాదవ్‌తో పాటు బుమ్రా, అక్షర్ పటేల్ పరిస్థితులను చక్కగా ఉపయోగించుకొని ప్రత్యర్థి పని పట్టారు. మెండిస్‌ను అక్షర్ బౌల్డ్ చేయగా, కెప్టెన్ తరంగ (13) జాదవ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. మరోవైపు మాథ్యూస్ (50 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) పోరాడే ప్రయత్నం చేసినా ఇతర బ్యాట్స్‌మెన్ నుంచి ఎలాంటి సహకారం లభించలేదు. ఫలితంగా 6.4 ఓవర్ల ముందే లంక ఆట ముగిసింది. 11 ఓవర్ల వ్యవధిలోనే ఆ జట్టు చివరి 7 వికెట్లు కోల్పోయింది.

కోహ్లి సహకారం...

సునాయాస లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. వైస్ కెప్టెన్‌గా తొలిసారి బరిలోకి దిగిన రోహిత్ శర్మ (4) రనౌటయ్యాడు. సింగిల్‌కు ప్రయత్నించిన సమయంలో బ్యాట్ చేజారిపోగా రోహిత్ గాల్లోకి ఎగిరి క్రీజ్‌లోకి చేరే ప్రయత్నం చేశాడు. అయితే ఆలోపే కపుగెడెర డైరెక్ట్ త్రో వికెట్లను తాకడంతో అతను వెనుదిరగక తప్పలేదు. శ్రీలంక గడ్డపై ఆడిన గత పది వన్డే ఇన్నింగ్స్‌లలో కలిపి రోహిత్ 37 పరుగులు మాత్రమే చేయగలిగాడు! అయితే ఆ తర్వాత భారత్ వెనుదిరిగి చూడాల్సిన అవసరమే రాలేదు. ధావన్, కోహ్లి కలిసి ఆడుతూ పాడుతూ బ్యాటింగ్ చేశారు. ఫెర్నాండో, పెరీరా వేసిన రెండు ఓవర్లలో కలిపి వీరిద్దరు చెరో మూడు బౌండరీలు బాదారు. ఈ క్రమంలో 36 బంతుల్లోనే ధావన్ అర్ధ సెంచరీ పూర్తయింది. 87 పరుగుల వద్ద ధావన్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను కీపర్ డిక్‌వెలా వదిలేశాడు. అనంతరం డి సిల్వ వేసిన ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన ధావన్ 71 బంతుల్లోనే సెంచరీ సాధించడం విశేషం. కోహ్లి కూడా సరిగ్గా 50 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోగా... 118 పరుగుల వద్ద తరంగ క్యాచ్ వదిలేయడంతో ధావన్ మళ్లీ అవుట్ కాకుండా తప్పించుకున్నాడు. సందకన్ ఓవర్లో కోహ్లి వరుసగా 4, 4, 6 కొట్టి జట్టును విజయానికి మరింత చేరువగా తెచ్చాడు. చివరకు సిల్వ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి ధావన్, భారత్‌కు భారీ విజయాన్ని అందించాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్‌వెలా (ఎల్బీ) (బి) జాదవ్ 64; గుణతిలక (సి) రాహుల్ (బి) చహల్ 35; కుషాల్ మెండిస్ (బి) పటేల్ 36; తరంగ (సి) ధావన్ (బి) జాదవ్ 13; మాథ్యూస్ (నాటౌట్) 36; కపుగెడెర (రనౌట్) 1; డి సిల్వ (సి) జాదవ్ (బి) పటేల్ 2; తిసార పెరీరా (బి) బుమ్రా 0; సందకన్ (ఎల్బీ) (బి) పటేల్ 5; మలింగ (స్టంప్డ్) ధోని (బి) చహల్ 8; ఫెర్నాండో (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (43.2 ఓవర్లలో ఆలౌట్) 216.
వికెట్ల పతనం: 1–74; 2–139; 3–150; 4–166; 5–169; 6–176; 7–178; 8–187; 9–209; 10–216.
బౌలింగ్: భువనేశ్వర్ 6–0–33–0; పాండ్యా 6–0–35–0; బుమ్రా 6.2–0–22–2; చహల్ 10–0–60–2; కేదార్ జాదవ్ 5–0–26–2; అక్షర్ పటేల్ 10–0–34–3.
భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (రనౌట్) 4; ధావన్ (నాటౌట్) 132; కోహ్లి (నాటౌట్) 82; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (28.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 220.
వికెట్ల పతనం: 1–23.
బౌలింగ్: మలింగ 8–0–52–0; ఫెర్నాండో 6–0–43–0; మాథ్యూస్ 2–0–9–0; తిసార పెరీరా 2–0–18–0; సందకన్ 6–0–63–0; డి సిల్వ 4.5–0–35–0.



మిషన్ 'గ్లాస్గో'

ఆశల పల్లకిలో శ్రీకాంత్, సింధు ● నేటినుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

గత నాలుగు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లలో భారత క్రీడాకారిణులు కనీసం కాంస్య పతకంతో తిరిగి వచ్చారు. 2011లో మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాల–అశ్విని పొన్నప్ప ద్వయం... 2013, 2014లలో పీవీ సింధు కాంస్య పతకాలు నెగ్గగా... 2015లో సైనా నెహ్వాల్ రజత పతకం గెల్చుకుంది. ఒలింపిక్స్ క్రీడలు జరిగే ఏడాదిలో మాత్రం ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించరు. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటివరకు భారత్ ఖాతాలో రజత, కాంస్య పతకాలు చేరగా... స్వర్ణ పతకం మాత్రం ఇంకా అందని ద్రాక్షగా ఊరిస్తోంది. కొన్నాళ్లుగా చైనా, కొరియా, జపాన్, ఇండోనేసియా, మలేసియాలాంటి అగ్రశ్రేణి దేశాలకు దీటుగా రాణిస్తున్న భారత క్రీడాకారులు అదే జోరును ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ కొనసాగించాలని... ఈసారి పసిడి పతకంతో తిరిగి రావాలని ఆశిద్దాం, ఆశీర్వదిద్దాం!

గ్లాస్గో (స్కాట్లాండ్): ఈ సంవత్సరంలో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై మెరుపులు మెరిపిస్తున్నారు. కిడాంబి శ్రీకాంత్ వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్స్ సాధించగా... సాయిప్రణీత్ సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్, థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టైటిల్స్‌ను... సమీర్ వర్మ సయ్యద్ మోదీ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీలో టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. మరోవైపు పీవీ సింధు సయ్యద్ మోదీ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీలో, ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్ టోర్నీలో విజేతగా నిలిచింది. సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీలో చాంపియన్ అయింది. వేదిక ఏదైనా, టోర్నీ స్థాయి ఏదైనా భారత క్రీడాకారులు బరిలోకి దిగితే ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో మొదలయ్యే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అందరి దృష్టి భారత క్రీడాకారులపైనే కేంద్రీకృతమై ఉంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి ఏకంగా 22 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) 21 మందిని ఎంపిక చేసినా... మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కే చెందిన ప్రజక్తా సావంత్ మలేసియా ప్లేయర్ యోగేంద్రన్ కృష్ణన్‌తో కలిసి విడిగా పోటీపడనుంది.

ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న శ్రీకాంత్ సోమవారం జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్యాకు చెందిన సెర్గీ సిరాంత్‌తో; పాబ్లో అబియాన్ (స్పెయిన్)తో సమీర్ వర్మ తలపడతారు. మంగళవారం జరిగే మ్యాచ్‌ల్లో వీ నాన్ (హాంకాంగ్)తో సాయిప్రణీత్; లుకా వ్రాబెర్ (ఆస్ట్రియా)తో అజయ్ జయరామ్ ఆడతారు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కు ఇప్పటివరకు ఒకే పతకం వచ్చింది. 1983లో ప్రకాశ్ పదుకొనే సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాన్ని సాధించారు.


శ్రీకాంత్


సాయిప్రణీత్


సింధు


సైనా

మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లకు తొలి రౌండ్‌లో 'బై' లభించడంతో వీరిద్దరూ నేరుగా రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో బరిలోకి దిగుతారు. భారత్‌కే చెందిన రితూపర్ణ దాస్ తొలి రౌండ్‌లో ఐరీ మికెలా (ఫిన్‌లాండ్)తో; చోల్ బిర్చ్ (ఇంగ్లండ్)తో తన్వీ లాడ్ పోటీపడనున్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలను లెక్కలోకి తీసుకుంటే ఈసారి భారత్‌కు సింగిల్స్ విభాగంలో పతకాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. డబుల్స్ విభాగంలో మాత్రం అంతగా అంచనాలు లేవు. ఒకవేళ డబుల్స్‌లో ఏదైనా పతకం వస్తే అది బోనస్ అవుతుంది.

పతకాలే... ప్రైజ్‌మనీ లేదు...

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అన్ని స్థాయి టోర్నమెంట్‌లలో ప్రైజ్‌మనీ ఉంటున్నా... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం పతక విజేతలకు ఎలాంటి ప్రైజ్‌మనీ ఇవ్వరు. సెమీఫైనల్‌కు చేరిన వారికి కాంస్య పతకాలు, ఫైనల్లో ఓడిన వారికి రజత పతకాలు, చాంపియన్స్‌కు స్వర్ణ పతకాలు అందజేస్తారు. 1977లో తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ జరిగింది. స్కాట్లాండ్‌లోని గ్లాస్కో నగరం ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇది రెండోసారి. 1997లో గ్లాస్గోలో జరిగిన ఈ పోటీల్లో భారత్ తరఫున సింగిల్స్‌లో పుల్లెల గోపీచంద్ పోటీపడగా... 20 ఏళ్ల తర్వాత అదే వేదికపై ఆయన భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తుండటం విశేషం.

భారత జట్టు వివరాలు

- **పురుషుల సింగిల్స్:** కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, అజయ్ జయరామ్, సమీర్ వర్మ.
- **మహిళల సింగిల్స్:** పీవీ సింధు, సైనా నెహ్వాల్, రితూపర్ణ దాస్, తన్వీ లాడ్.
- **పురుషుల డబుల్స్:** సుమీత్ రెడ్డి–మనూ అత్రి; అర్జున్–శ్లోక్ రామచంద్రన్; సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి.
- **మహిళల డబుల్స్:** సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప; ఆరతి సారా సునీల్–సంజన సంతోష్; మేఘన–పూర్వీషా రామ్.
- **మిక్స్‌డ్ డబుల్స్:** సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా; సుమీత్ రెడ్డి–అశ్విని పొన్నప్ప; సాత్విక్ సాయిరాజ్–మనీషా.

మధ్యాహ్నం గం. 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

పట్నాపై పుణేరి పల్టన్ పైచేయి

ప్రొ కబడ్డీ లీగ్

లక్నో: పట్నా పైరేట్స్ రైడర్ పర్దీప్ నర్వాల్ అద్భుతంగా రాణించినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు. ప్రొ కబడ్డీ లీగ్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 47–42 స్కోరుతో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. ఈ లీగ్‌లో పుణేరి జట్టుకిది నాలుగో విజయం. రైడింగ్‌లో అదరగొట్టిన పట్నా... డిఫెండర్ల వైఫల్యంతో మూల్యం చెల్లించుకుంది. పర్దీప్ 24 సార్లు రైడింగ్‌కు వెళ్లి 19 పాయింట్లు తెచ్చిపెట్టాడు. ఓవరాల్‌గా ఇరు జట్లు రెండు సార్లు ఆలౌటయ్యాయి. అయితే పుణేరి పల్టన్ ఆటగాళ్లు టాకిల్‌లో రాణించడంతో విజయం దక్కింది. టాకిల్‌లో పట్నా 6 పాయింట్లు సాధిస్తే... పల్టన్ జట్టు 12 పాయింట్లు చేసింది. ఇదే మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. రైడింగ్‌లో పుణేరి (29)తో పోలిస్తే... పట్నా (31)దే పైచేయి. పల్టన్ ఆటగాళ్లలో డిఫెండర్ జియావుర్ రెహమాన్ (6) ఆకట్టుకున్నాడు. రైడింగ్‌లో రాజేశ్ మోండల్ 10 పాయింట్లు చేశాడు. దీపక్ హుడా 9, సందీప్ నర్వాల్ 5, మోను 5 పాయింట్లు సాధించారు. అనంతరం జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 24–22తో యూపీ యోధపై గెలిచింది. నేడు లీగ్‌కు విశ్రాంతి రోజు. మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో పుణేరి పల్టన్, యూపీ యోధతో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.


పట్నా రైడర్‌ను నిలువరిస్తున్న పుణేరి ఆటగాళ్లు

రాణించిన సమర్థ్: భారత్ 'ఎ' 181/3

పోష్‌స్ట్రూమ్: దక్షిణాఫ్రికా 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' నిలకడగా ఆడుతోంది. మ్యాచ్ రెండో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. రవి సమర్థ్ (77), శ్రేయస్ అయ్యర్ (56 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు సాధించగా, సుదీప్ ఛటర్జీ (46) రాణించాడు. కెప్టెన్ కరుణ్ నాయర్ (1) విఫలమయ్యాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 258/5తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో షాబాజ్ నదీమ్ నాలుగు, నవదీప్ సైని 3 వికెట్లు పడగొట్టారు. భారత్ ప్రస్తుతం మరో 141 పరుగులు వెనుకబడి ఉంది.

ఏడో రౌండ్‌లో హారిక గెలుపు

న్యూఢిల్లీ: అబుదాబి ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మూడో విజయం సాధించింది. ఐదిన్ సులేమాన్లి (అజర్‌బైజాన్)తో ఆదివారం జరిగిన ఏడో రౌండ్‌లో హారిక 40 ఎత్తుల్లో గెలిచింది. ఏడో రౌండ్ తర్వాత హారిక 4.5 పాయింట్లతో మరో పది మందితో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉంది.


ఇంగ్లండ్‌కు ఇన్నింగ్స్ విజయం

విండీస్‌తో మూడు రోజుల్లోనే ముగిసిన డే నైట్ టెస్టు

బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 209 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఇంగ్లండ్ గడ్డపై జరిగిన ఈ తొలి డే–నైట్ టెస్టును ఆతిథ్య జట్టు మూడు రోజుల్లోనే ముగించింది. ఇంగ్లండ్ బౌలర్లు అండర్సన్ (3/34, 2/12), స్టువర్ట్ బ్రాడ్ (2/47, 3/34), రొలాండ్ జోన్స్ (2/31, 2/18) రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ విండీస్ బ్యాట్స్‌మెన్‌ను సమష్టిగా దెబ్బతీశారు. దీంతో ఒక్క మూడో రోజు ఆటలోనే 19 వికెట్లు నేలకూలాయి. శనివారం 44/1 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 168 పరుగులు చేసి ఆలౌటైంది. బ్లాక్‌వుడ్ (79; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. తర్వాత ఫాలోఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన విండీస్ 45.4 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. ఈ ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ బ్రాత్‌వైట్ (40; 7 ఫోర్లు). తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 514/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1–0తో ఆధిక్యంలో ఉంది. ఈనెల 25 నుంచి లీడ్స్‌లో రెండో టెస్టు జరగనుంది.

దేవుడు ఆదేశించాడు.. 'తలైవా' వస్తున్నాడు!

- తమిళరువి మణియన్ ప్రకటన
- రజనీకి ప్రస్తుతం 25 శాతం ఓట్లు
- మూడు నినాదాలతో ప్రజల్లోకి



సాక్షి, చెన్నై: దక్షిణ భారత చలన చిత్ర సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి రాబోతున్నారని గాంధేయ మక్కల్ ఇయక్కం నేత తమిళరువి మణియన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రజనీకి 25 శాతం ఓటు బ్యాంక్ ఉందని, రాజకీయాల్లోకి రాగానే ఆ సంఖ్య 45 శాతానికి చేరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తిరుచ్చి వేదికగా 'రజనీ' రాజకీయ నినాదంతో మహానాడు తమిళరువి మణియన్ నేతృత్వంలో జరిగింది. ఈ మహానాడుకు రజనీ అభిమానులు పెద్ద ఎత్తున రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చారు. ఎక్కడ చూసినా మహాత్మా గాంధీ, తమిళనాడు మాజీ సీఎం కామరాజర్ చిత్ర పటాలతోపాటుగా రజనీకాంత్ చిత్ర పటాల్ని హోరెత్తించారు. పెద్ద ఎత్తున అభిమానులు తరలి రావడంతో తమిళరువి మణియన్ చేసిన ప్రసంగం రజనీ రాజకీయాల్లోకి రావడం ఖాయమనే సంకేతాలిస్తోంది. రజనీ కాంత్‌తో తాను సమావేశమైన సమయంలో ఆయన మాటలు, వ్యాఖ్యలు నిజమైన నాయకుడిని గుర్తు చేసినట్టు మణియన్ తెలిపారు. ఇది దేవుడు ఇచ్చిన ఆదేశం.. ఇదే సరైన తరుణం.. అని రజనీ తనతో చెప్పినట్టుగా వివరించారు. తమిళుల జీవనాధారం పరిరక్షణ కోసం నదుల అనుసంధానం, అవినీతిరహిత పాలన, పారదర్శక పాలన అనే మూడు నినాదాలతో రజనీ రాజకీయాల్లో రావడం ఖాయం అని స్పష్టం చేశారు.

సైబరాబాద్‌లో 'థాయ్ మసాజ్'

వ్యవస్థీకృతంగా సాగుతున్న స్పా దందా

- ఏకకాలంలో దాడులు చేసిన అధికారులు
- 34 మంది థాయ్ మహిళల రెస్క్యూ
- సూత్రధారి సిద్ధార్థ్ సహా 19 మంది అరెస్ట్



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్లు.. ఇన్‌సెట్‌లో స్పా నిర్వహిసున్న సిద్ధార్థ్

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్‌లోని ఐటీ సెక్టార్‌లో హైటెక్ వ్యభిచార దందా జోరుగా సాగుతోంది. స్పా, మసాజ్ సెంటర్ ముసుగులో నిర్వాహకులు వ్యవస్థీకృతంగా ఈ వ్యవహారాలు నడుపుతున్నారు. దీనికోసం థాయ్‌లాండ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి యువతుల్ని అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు ఆదివారం వరుస దాడులు చేశారు. మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి ఠాణాల పరిధిలో ఉన్న 12 స్పా, మసాజ్ సెంటర్లపై ఈ దాడులు జరిగినట్లు కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు. 34 మంది థాయ్, 21 మంది ఈశాన్య రాష్ట్రాలు, ఒక పంజాబ్, నగరానికి చెందిన 9 మందితో కలిపి మొత్తం 65 మంది యువతులను రెస్క్యూ చేశామన్నారు.

థాయ్ యువతులకు గాలం...

ఐటీ జోన్‌లోని మూడు ఠాణాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 12 స్పా, మసాజ్ సెంటర్లను బంజారాహిల్స్‌కి చెందిన ట్రైపాడ్ వెర్నస్ అండ్ హీలింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని దాసరి సిద్ధార్థ్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి కొన్నాళ్ల క్రితం ముంబైలో థాయ్‌లాండ్ మహిళ కకేతో పరిచయమైంది. ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్న సిద్ధార్థ్ ఆ దేశం నుంచి యువతుల్ని అక్రమ రవాణా చేయిస్తున్నాడు. హైదరాబాద్‌లో ఉన్న మసాజ్ సెంటర్లలో ఉద్యోగాలంటూ థాయ్ యువతులకు కకే గాలం వేస్తోంది. ఆపై వ్యాపార, విజిట్ వీసాలపై వారిని పంపిస్తోంది.

నెలకు రూ.90 లక్షల ఆదాయం: ఇలా ఉద్యోగం కోసం ఇక్కడకు వచ్చే థాయ్‌లాండ్‌తో పాటు దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు, నగరానికి చెందిన యువతుల్ని సిద్ధార్థ్ వివిధ ప్రాంతాల్లో ఉంచుతున్నాడు. విదేశీయుల నుంచి పాస్‌పోర్టులు తీసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నాడు. ఆపై తాను నిర్వహించే స్పా, మసాజ్ సెంటర్లకు వీరిని తరలించి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నాడు. ఇతడికి మాదాపూర్, బంజారాహిల్స్, బెంగళూరుల్లోనూ స్పాలున్నాయి. ఈ వ్యవహారాల్లో సిద్ధార్థ్‌కు సర్ఫరోజ్ అలీ, వినయ్, అజయ్ సహకరిస్తున్నారు. వెంకటరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం ప్రధాన భాగస్వాములు. సిద్ధార్థ్ ప్రతి నెలా రూ.90 లక్షల దాకా సంపాదిస్తున్నాడని పోలీసులు గుర్తించారు.

నిబంధనలకు విరుద్ధంగా...

ఒక్కో స్పాలో అనేక మందికి సభ్యత్వాలు ఇస్తున్న సిద్ధార్థ్.. వారి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నాడు. ఒక్కో సంస్థలో ప్రసుత్తం 300 నుంచి 500 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి గోల్డ్, సిల్వర్, రెగ్యులర్ పేర్లతో గుర్తింపు కార్డులూ జారీ చేస్తున్నాడు. స్పా, మసాజ్ సెంటర్లలో ఉండే గదుల్లోని అన్ని ప్రాంతాలు పారదర్శకంగా ఉండాలి. అయితే సిద్ధార్థ్ స్పాల్లో ఇవి పట్టించుకోవట్లేదు. సెంటర్లకు వెనుక భాగంలో కొన్ని రహస్య గదులూ ఏర్పాటు చేశారు. దీంతో సైబరాబాద్ పోలీసులు ఆదివారం ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి ఏకకాలంలో దాడులు చేశారు. దీంతో ఈ వ్యవహారాలన్నీ వెలుగులోకి రావడంతో పాటు భారీగా కండోమ్స్ స్వాధీనమయ్యాయి. సిద్ధార్థ్‌తో పాటు మొత్తం 19 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ స్పా, మసాజ్ సెంటర్లను సీజ్ చేయనున్నారు. ప్రస్తుతం రెస్క్యూ చేసిన వారిని బంజారాహిల్స్‌లోని ఓ ఫ్లాట్‌లో పర్యవేక్షణలో ఉంచారు.

దాడులు చేసింది ఈ సెంటర్లపైనే...

గచ్చిబౌలిలోని సప్తా, తంత్ర, వీ, మందర, మోహ, ఔరా స్పాల్లో. మాదాపూర్‌లోని ఔరా, సప్తా, తంత్ర, బ్లిజ్, మోహ, న్యూ రివైవ్ స్పాలపై దాడులు నిర్వహించి ల్యాప్‌టాప్, కంప్యూటర్లు 10, రూ.3.38 లక్షల నగదు, 28 సెల్‌ఫోన్లు, 11 స్వైపింగ్ మిషన్లు, 27 బిల్ బుక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు అన్నాడీఎంకే అత్యవసర సమావేశం

- చిన్నమ్మకు వ్యతిరేకంగా తీర్మానం?
- ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని కూల్చేస్తాం: స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులో అన్నాడీఎంకే అమ్మ శిబిరం కార్యవర్గ సమావేశానికి సీఎం పళని స్వామి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం పదిన్నర గంటలకు జరిగే ఈ సమావేశంలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళ, ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్‌లను పార్టీ నుంచి సాగనంపేందుకు తీర్మానం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్నాడీఎంకే సీఎం పళని స్వామి నేతృత్వంలోని అమ్మ, మాజీ సీఎం పన్నీరు సెల్వం నేతృత్వంలోని పురట్చి తలైవి శిబిరాలు ఒకే వేదిక మీదకు వచ్చేందుకు ప్రయత్నాలు వేగవంతమైన విషయం తెలిసిందే. విలీనం విషయంగా ఇరు శిబిరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో సోమవారం అత్యవసర భేటీకి పళని పిలుపునివ్వడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పన్నీరు పెట్టిన షరతుల్లో తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళ, ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్ తొలగింపు అంశం ప్రధాన డిమాండ్. దీనిని అమలు చేయడం లక్ష్యంగా తాజాగా అత్యవసర భేటీకి పళని పిలుపునిచ్చినట్టుగా సంకేతాలు వెలువడుతున్నాయి. అన్నాడీఎంకే నియమ నిబంధనల్లో చట్టపరంగా సవరణలతో ఆ ఇద్దరినీ సాగనంపే తీర్మానం తీసుకొచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. సోమవారం అమావాస్య కావడం, ఈ రోజును తమిళులు శుభ దినంగా భావిస్తారు. అందుకే ఈ రోజున ఆ ఇద్దర్నీ సాగనంపడంతో పాటుగా పన్నీరును పార్టీ కార్యాలయంలోకి ఆహ్వానించేందుకు ఈ సమావేశం జరగవచ్చన్న ప్రచారం సాగుతోంది. ఇక, తమను బయటకు సాగనంపితే చట్టపరంగా ఎదుర్కొనేందుకు తగ్గ కసరత్తుల్లో దినకరన్ నిమగ్నం కావడం గమనార్హం. ఈ విషయంగా దినకరన్ మద్దతు ఎమ్మెల్యే వెట్రివేల్ మాట్లాడుతూ, దుబాయ్ వేదికగా సెటిల్‌మెంట్లు ముగియడంతో రెండు కంపెనీలు ఏకం కాబోతున్నాయని విమర్శించారు. ఇందుకుగాను పన్నీరుకు రూ.500 కోట్లు ముట్టినట్టు ఆరోపించారు.

ప్రభుత్వాన్ని కూల్చేస్తాం



అన్నాడీఎంకేలో సాగుతున్న పరిణామాలను తనకు అనుకూలంగా మలచుకునేందుకు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు, ప్రధాన ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్ తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. గత వారం ఆయన లండన్‌కు వెళ్లారు. ఆదివారం వేకుజామున రెండున్నర గంటలకు చెన్నై చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల్ని బెదిరిస్తున్నారని, వారితో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ వేదికగా కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం సాగుతున్నదని, ఇందుకు తగ్గట్టుగా తమిళనాట ఈపీఎస్, ఓపీఎస్‌లు నాటకాన్ని రక్తికట్టిస్తూ మంచి నటులుగా గుర్తింపు పొందే పనిలో పడ్డారని మండిపడ్డారు.

మూడోరోజుకు మురుగన్ దీక్ష

ఆహారం తీసుకోకుండా జైలు గదిలోనే ధ్యానం

వేలూరు(తమిళనాడు): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ మూడో రోజు కూడా ఆహారం తీసుకోకుండా ధ్యానం చేస్తున్నాడు. గత 26 సంవత్సరాలుగా జైలు శిక్ష అనుభవిస్తున్న మురుగన్ జీవితంపై తనకు విరక్తి పుట్టిందని, జీవ సమాధి అయ్యేందుకు అనుమతించాల్సిందిగా జైలు అధికారులకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశాడు. అధికారులు అనుమతి ఇవ్వకున్నా, ఈనెల 18 నుంచి మురుగన్ జైల్లో ఎటువంటి ఆహారం తీసుకోకుండా నీరు మాత్రమే తాగుతూ ఉత్తర దిశలో కూర్చొని ధ్యానం చేస్తున్నాడు. మూడో రోజు ఆదివారం కూడా మురుగన్ ఆహారం తీసుకోకుండా నీళ్లు మాత్రమే తీసుకుని ధ్యానంలో ఉన్నాడు. మురుగన్ దీక్ష విరమింపజేసేందుకు జైలు అధికారులు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కుదరలేదు. ఉదయం నుంచి ఎవరితోనూ మాట్లాడకుండా, ఆహారం తీసుకోకుండా జైలు గదిలోనే ధ్యానం చేస్తూ ఉన్నాడు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని జైలు అధికారులు మురుగన్‌పై ప్రత్యేక నిఘా ఉంచి పరిశీలిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి
ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం ။ 21-8-2017



ఫైర్ ఉన్న ఫైటర్

ఈర్ష్యను మించిన నిప్పు ఉండదు.
అందులోనూ మగ అహంకారం
నివురుగప్పిన నిప్పు.
ఏ మహిళ అయినా ఇలాంటి నిప్పులో
దహించుకుపోవాల్సిందే.
నిజమే...
హర్షిణి కన్వేకర్ ఫస్ట్ ఉమన్ ఫైర్ ఫైటర్.
తను కాకపోతే... మరో మహిళ
ఫస్ట్ ఫైర్ ఫైటర్ అయ్యే అవకాశం ఉంది.
మరి... తన గురించే
ఎందుకు మాట్లాడుకుంటున్నాం?
భవనాలకు అంటుకున్న నిప్పుని ఆర్పడం
మహిళలు చేయగలరు.
హర్షిణి వ్యవస్థకు పట్టిన
జెండర్ నిప్పును ఆర్పింది.
మహిళలు 'దీనిని చేయలేరు' అని అంటే...
దానినే చేసి చూపించింది హర్షిణి.
ఒక రగులుతున్న సమస్యను ఆర్పింది.

2005.. దీపావళి రోజు..
న్యూఢిల్లీలోని శాస్త్రినగర్..
బాంబులు, రాకెట్లు, కాకరపువ్వొత్తులు, భూచక్రాలు, విష్ణుచక్రాలు, చిచ్చుబుడ్ల వెలుగులు, జిలుగులు, మోతలతో మారుమోగుతోంది ఆ ప్రాంతం. అందరూ ఆనందంలో మునిగి ఉన్నారు. ఏ టపాకాయ ఎటు వెళుతుందో.. ఏమవుతుందో పట్టించుకునే స్థితిలో లేరెవరు! కాలుస్తున్నామా.. ఆస్వాదిస్తున్నామా అంతే! ఈ సందడిలోనే ఒక రాకెట్ వెళ్లి అక్కడే ఉన్న షూ ఫ్యాక్టరీలోని షూ మెటీరియల్ మీద పడింది. క్షణాల్లో ఫ్యాక్టరీ అంతా మంటలు వ్యాపించాయి. ఆ వేడికి బిల్డింగ్ పగుళ్లు రావడం ప్రారంభించింది. ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. వెంటనే ఫైర్ ఫైటర్స్ రంగంలోకి దిగారు. దాదాపు ఆరుగంటలు శ్రమించి మంటలను ఆర్పేశారు. చుట్టుపక్కల వాళ్లంతా ఆ ఫైర్ దళాన్ని, వాళ్లు చూపిన చాకచక్యం, ధైర్యసాహసాలను మెచ్చుకున్నారు. క్యాప్ తీసి చేతిలో పట్టుకుంటూ వస్తున్న ఫైర్‌దళపతిని అమ్మాయిలైతే అడ్మయిరింగ్‌గా చూడ్డం మొదలుపెట్టారు. కొందరైతే షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి ఉవ్విళ్లూరసాగారు. పెద్దవాళ్లంతా సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నారు. ఆ పాజిటివ్ ఎక్స్‌ప్రెషన్స్‌కు రీజన్.. అడ్వంచరస్ దళపతి.. స్త్రీ కావడమే. పేరు హర్షిణి కన్వేకర్. మన దేశపు తొలి మహిళా ఫైర్ ఫైటర్!

2002 వరకు ఫైర్ ఫైటర్ ఉద్యోగాలు కేవలం పురుషులకే పరిమితం. ఆ యేటి నుంచే స్త్రీలకు ప్రవేశం దొరికింది. అది ప్రభుత్వం సడలించిన నియమం కాదు! హర్షిణి సృష్టించిన చరిత్ర. సాధారణంగా ఏ రంగంలోనైనా లేదా ఉద్యోగాల్లోనైనా ఆడవాళ్లకు అవకాశం.. ప్రభుత్వం లేదా వాటిని నిర్వహిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాల నియమాలననుసరించి ఉంటుంది. కాని నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్‌లో మాత్రం దాన్ని బ్రేక్ చేసింది హర్షిణీయే. రోమాంచితంగా ఉందికదా! అందుకే ఆమె బయోగ్రఫీ!

దిగులుపడ్డ ఫేజ్

హర్షిణి సొంతూరు మహారాష్ట్రలోని నాగ్‌పూర్. పుట్టడమే కాదు.. పెరిగింది, చదివింది కూడా అక్కడే. మెరిట్ స్టుడెంట్ ఏమీ కాదు. యావరేజ్. కాని ఆటలు, పాటలు వంటి ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌లో ఫస్ట్. ఏ పోటీల్లో పాల్గొన్నా మొదటి బహుమతి ఆమెకే. సాహస క్రీడలంటే ఎగిరి గంతేసేది. ఈ నైజంతోనే హర్షిణి స్కూల్లో పాపులర్ అయింది. పిల్లలకు, టీచర్లకు ఫేవరెట్‌గా నిలిచింది. ఇంత ఉత్సాహం ఇంటర్‌లో ఆల్ గర్ల్స్ కాలేజ్.. లేడీ అమృతాబాయి కాలేజ్‌లో చేరగానే చప్పున చల్లారిపోయింది. కారణం.. ఆల్ గర్ల్స్ అన్నది ఆమెకు నచ్చకపోవడమే. ఆటలు, పాటలు అన్నీ బంద్. చదువులోనూ పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. బోర్‌గా అనిపించింది. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా ఉండే తను.. ఎవరితో మాట్లాడకుండా తనలో తానే ఉండేది. ''నా జీవితంలో నేను దిగులుపడ్డ ఫేజ్ ఏదైనా ఉందంటే అది నా ఇంటర్మీడియేట్ రెండేళ్ల టైమే'' అంటుంది హర్షిణి. అయితే డిగ్రీకి కూడా అదే కాలేజ్‌లో దరఖాస్తు చేసుకొమ్మని తల్లిదండ్రులు చెప్పడంతో ఇక ఆల్ గర్ల్స్ కాలేజే దిక్కు.. ఉత్సాహంగా ఉండక తప్పదు'అనుకుంది. మళ్లీ ఆటలు, పాటలు, పోటీలు.. మొదలుపెట్టింది. ఉల్లాసానికి చిరునామా అయింది. ఎన్‌సీసీలో కూడా చేరింది.

లక్ష్యాన్ని ఛేదించే శక్తి..

యూనిఫామ్ ఉన్న సర్వీసెస్ అంటే ఇష్టం ఏర్పడింది కూడా అప్పుడే. ఒకరకంగా చెప్పాలంటే ఆమెకు ఒక లక్ష్యాన్ని.. దాన్ని ఛేదించే శక్తి ఎన్‌సీసీయే. ఆ సమయంలోనే విదర్భకు చెందిన శివాని కులకర్ణి గురించి చదివింది. శివాని కులకర్ణి ఎయిర్ ఫోర్స్ ఫస్ట్ విమెన్ పైలట్. ఆమె కథనం యూనిఫామ్ సర్వీసెస్ పట్ల హర్షిణీకి ఉన్న అభిమానాన్ని ఆరాధనగా మార్చింది. ఆ బాధ్యత, హుందాతనం, ప్రైడ్.. చేస్తే అలాంటి ఉద్యోగమే చేయాలనే నిశ్చయాన్ని కలిగించాయి. ఆర్మీకి దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించుకుంది. డిగ్రీ అయిపోయాక తల్లిదండ్రుల కోరికమేరకు ఏంబీఏలో చేరింది. పేరుకే ఏంబీఏ చదువుతోంది కాని ఆమె చిత్తమంతా ఆర్మీవైపే. అందుకే ఆ పరీక్షలకోసం ప్రిపేర్ అవసాగింది.

నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్

రోజులు చాలా నిరాసక్తిగా గడిచిపోతున్నాయి హర్షిణీకి. ఒకరోజు హర్షిణి స్నేహితురాలు శిల్ప చెప్పింది ఆమెతో.. ''నీకు నచ్చిన సర్వీస్ ఒకటుంది. మొన్ననే దాని గురించి ఓ ఎంప్లాయ్‌మెంట్ పోర్టల్‌లో చదివా'' అని చెప్పింది. 'ఆ.. ఏముంటుందిలే అంత ఎగ్జయిట్‌మెంట్' అని మనసులో అనుకొని అదే నిర్లప్తత మాటల్లోనూ వినిపించేలా 'ఏంటది' అని అడిగింది. ''నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్. ఇది ఇంచుమించు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్‌తో సమానం తెలుసా'' అంటూ ఆ ఎంప్లాయ్‌మెంట్ పోర్టల్‌ను చూపించింది. హర్షిణి కళ్లల్లో ఒక్కసారిగా వెలుగు. ''ఏదీ చూద్దాం'' అంటూ శిల్ప చేతుల్లోంచి లాక్కుని దాని గురించి సింగిల్ కాలమ్‌లో ఉన్న మ్యాటర్ చదివింది. ''ఈ సర్వీస్‌కు యూనిఫామ్ ఉంటుందా?'' ఆత్రంగా అడిగింది హర్షిణి తన స్నేహితురాలిని. ''ఊ.. ఉంటుంది. రేపే లాస్ట్ డేట్. 30 సీట్స్ ఉంటాయట. బాగా కష్టపడాలి. ఇదిగో అప్లికేషన్. ఈరోజు ఫిలప్ చేసేయ్. రేపు వెళ్లి ఇచ్చేద్దాం'' అని దరఖాస్తు పత్రం ఇచ్చి వెళ్లిపోయింది శిల్ప. ''యూనిఫామ్ ఉంటుంది'' అన్న మాట ఆమెలోని నిర్లిప్తతను పటాపంచలు చేసింది. ఆ రాత్రి శ్రద్ధగా దరఖాస్తు పూర్తిచేసింది.

ఇది మగవాళ్ల ప్రపంచం..

నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్ ఆఫీస్. ఎర్రరంగులో చాలా ఆకర్షణీయంగా కనిపించింది ఆ భవనం హర్షిణికి. తనకు సెల్యూట్ చేసి.. ఆహ్వానిస్తున్నట్టనిపించింది. గేట్‌లోంచి లోపలికి నడుస్తున్నంతసేపు తెలియని ఆనందోద్వేగం ఆమెలో. అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లోకి వెళ్లి దరఖాస్తు ఫారాలు ఇచ్చారిద్దరూ. గుమాస్తా వీళ్లను చూసి.. 'ఇది ఆల్ మెన్స్ కాలేజ్. ఈ రంగం మీకు సరిపడదు. ఏ ఆర్మీకో లేదంటే ఎయిర్‌ఫోర్స్‌కో అప్లయ్ చేసుకోండి.. అక్కడైతే అమ్మాయిల కోసం ప్రత్యేక సౌకర్యాలుంటాయి' అని సలహా ఇచ్చాడు. ఆ మాటలు హర్షిణికి మరింత బలాన్నిచ్చాయి. ఆల్ మెన్స్ కాలేజ్ అన్న పదం ఆమెలో పోటీతత్వాన్ని నిద్రలేపింది. ''అయితే నేను తప్పకుండా చేరాలన్నమాట.. థాంక్యూ ఫర్ గైడింగ్ మీ సర్'' అని నవ్వుతూ అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చింది హర్షిణి. పరీక్ష రాసింది.

ది ఫస్ట్ ఉమన్

ఒకరోజు టెలిగ్రామ్ వచ్చింది ఇంటికి ఎన్‌ఎఫ్ఎస్‌సీలో సెలెక్ట్ అయినట్టు. ఆనందం.. ఆశ్చర్యం.. హర్షిణిలో. వెంటనే విచారం.. అసలు తనకు ఈ సర్వీస్ గురించి చెప్పి, పరీక్ష రాయడానికి కారణమైన తన స్నేహితురాలు శిల్ప సెలెక్ట్ కాలేదని తెలిసి. ఆ బాధతోనే ఇంటర్వ్యూకి హాజరైంది. మెడికల్ ఎగ్జామినేషన్‌కు వెళ్లినప్పుడు.. 'ఇది చాలా కష్టమైన సర్వీస్. నువ్వు చేయగలవా?' అని అడిగారు. తలూపింది. ఫైనల్ ఇంటర్వ్యూలో ప్రశ్నల పరంపర మొదలైంది. ప్యానల్‌లో కొంతమంది ప్రోత్సహించారు. ఇంకొంతమంది వెనక్కి లాగారు. ఎలాగైతేనేం.. నెగ్గింది. ప్రోత్సాహం అందించిన ప్యానలిస్టులు ఫైర్ సర్వీసెస్‌లో కిరణ్‌బేడీవి అంటూ కితాబు ఇచ్చారు. యూనిఫామ్ ఉన్న సర్వీసెస్‌లో తాను పనిచేయబోతున్నానన్న ఆనందంలో నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్‌కి ఎన్నికైన తొలి మహిళ తనేనన్న ఘనతను గుర్తించలేకపోయింది. ఆ రెడ్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ గుమాస్తా వచ్చి.. ''శభాష్.. బేటా! నువ్వు రికార్డ్ సృష్టించావ్! నేషనల్ ఫైర్ సర్వీస్ కమిషన్‌కు సెలెక్ట్ అయిన ఫస్ట్ ఇండియన్ లేడీవి నువ్వే' అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. అప్పుడు ఆ ఆవరణను పరిశీలించింది. అన్నట్టుగానే అందరూ మగవాళ్లే. ఒక్క స్త్రీ లేదు. గర్వంగా పెదవుల మీదకు వచ్చి చేరింది చిన్న నవ్వు!

పాపులారిటీ.. ప్రెషర్

ఫైర్ ఇంజనీరింగ్‌లో ఫస్ట్ ఉమన్ కీర్తి బాగానే ఉంది. సవాళ్లూ అంతకన్నా బాగా కనిపించాయి. ఇటు హర్షిణికి... అటు ఫైర్ సర్వీసెస్‌కి. ఏడు సెమిస్టర్ల ఫైర్ ఇంజనీరింగ్ కోర్స్ చదవాలంటే ఎన్ఎఫ్ఎస్‌సి బిల్డింగ్‌లోని రెసిడెన్షియల్‌లోనే ఉండాలి. ఆ కోర్స్ పుట్టినప్పటి నుంచి హర్షిణి సెలెక్ట్ అయ్యేవరకు అందరూ మగవాళ్లే కాబట్టి ఆ కోర్సే కాదు.. ఆ బిల్డింగ్, రెసిడెన్షియల్ అన్నిటినీ పురుషులకు అనుగుణంగానే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆమె ఒక్కదాని కోసం వాటిని మార్చాలి.. సడలించాలి.. ఇది సర్వీసెస్‌కు సవాలు. మగవాళ్లతోపాటు ఆమె రెసిడెన్షియల్‌లోనే ఉండాలన్న నియమాన్ని కఠినంగా అమలుచేస్తూనే సెలవుల్లో ఇంటికి వెళ్లొచ్చు అనే వెసులుబాటునిచ్చారు. దీనికోసం హోమ్‌శాఖ నుంచి ప్రత్యేక అనుమతి తెచ్చుకోవాల్సి వచ్చింది ఎన్ఎఫ్ఎస్‌సీకి. ఇందులో ఒక్కో తరగతి ఒక్కోరకంగా ఉంటుంది. ప్రతి తరగతికి ఒక్కో యూనిఫామ్. దాంతో ప్రతి రోజును కొత్తగా ఆస్వాదించసాగింది. డ్రిల్స్, ఎక్సర్‌సైజెస్, సాహసాలు.. వేటిలోనూ మగవాళ్లకు తీసిపోలేదు. 29 మంది మగవాళ్లలో ఒకే ఒక్క స్త్రీ.. ఎంత పాపులారిటీని తెచ్చిందో అంత ప్రెషర్‌ను పెంచింది. మీడియా అటెన్షన్, పబ్లిసిటీ.. అంతా ఆమె పైనే.. ఆమెదే! ఇది ఆమె క్లాస్‌లోని మగవాళ్లకు కంటకింపుగా ఉండేది. 'మేం చదివేదే తను చదువుతోంది. మేం చేసే డ్రిల్స్.. అడ్వంచర్సే ఆమే చేస్తోంది. ఇందులో ఆమె ప్రత్యేకతేముంది? ఆమె మీదే ఎందుకంత అటెన్షన్.. ఆమెకే ఎందుకంత పబ్లిసిటీ అని ఉడుక్కునేవాళ్లు. కాని మగవాళ్ల కంచుకోటగా ఉన్న ఎన్ఎఫ్ఎస్‌సీలోకి హర్షిణి ప్రవేశించడమే పెద్ద బ్రేకింగ్ అనేది వాళ్లకు అర్థంకాలేదు. అదే ఆమె ప్రత్యేకతని వాళ్లు గ్రహించలేదు. భారీ నీటి పైపులను, సక్షన్ పైపులను సంభాళించడం, మోక్ డ్రిల్స్ వంటివి చేయడం దేహదారుఢ్యం ఉన్న మగవాళ్లకు కూడా కష్టం. అలాంటి ఇబ్బందులన్నిటినీ హర్షిణి అధిగమించింది.. ఆ పనిపట్ల ఉన్న భక్తి, గౌరవం, ఆత్మవిశ్వాసంతో! 'ఏ కొంచెం తప్పు చేసినా.. ఏ పని చేయలేకపోయినా ''ఆడవాళ్లు ఇలాంటి చేతకావు'' అని ఎక్కడ అంటారో.. ఈ రంగంలో స్త్రీలు పనికిరారు అని ఎక్కడ స్టేట్‌మెంట్స్ ఇచ్చేస్తారోనని కొత్తలో చాలా ప్రెషర్ ఫీలయ్యేదాన్ని. తర్వాత తర్వాత సెల్ఫ్‌కాన్ఫిడెన్స్‌తో అన్నిటినీ ఓవర్‌కమ్ చేశా' అని నాటి రోజులను గుర్తుచేసుకుంటుంది హర్షిణి.

సిలెండర్ బ్లాస్ట్..

ప్రాక్టికల్ ఇయర్‌లో తను ఫస్ట్ డీల్ చేసిన ఫైర్‌యాక్సిడెంట్.. సిలెండర్ పేలిన ఘటనే. ఇది షిరిడీలో జరిగింది. ఆ మంటలు ఆర్పడం చాలా తేలిక. పెద్ద పెద్ద ఫైర్ యాక్సిడెంట్స్ జరిగినప్పుడు తనకు 'ఆ ఆపరేషన్స్ ఇస్తే బాగుండు..' అని ఉవ్విళ్లూరేది. ఫైర్ స్టేషన్ కమాండర్‌ను అడిగేది తననెప్పుడు బిగ్‌ఫైర్స్‌కి పంపిస్తారు అని. జాయిన్ అయిన మూడేళ్లకు కానీ దొరకలేదు ఆ చాన్స్. ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబైలలో పనిచేసినప్పుడు బిగ్ ఫైర్స్‌ని డీల్ చేసింది. హర్షిణీ చేసిన పెద్ద ఆపరేషన్ ఢిల్లీ శాస్త్రినగర్‌లో దీపావళి ఘటనే. ఆ మంటలను ఆర్పడానికి దాదాపు ఆరు గంటలు పట్టింది. దాని కోసం ఆ షూ ఫ్యాక్టరీ పక్కనున్న బిల్డింగ్ ఎక్కాల్సి రావడం.. ఆ బిల్డింగ్‌కూ మంటలు అంటుకొని అదీ పగుళ్లు తీస్తుంటే ఆగమేఘాల మీద దిగేసి ఫ్యాక్టరీకి ఇటు పక్కనున్న బిల్డింగ్ గోడ కూల్చి దాని పైకెక్కి మంటలను ఆర్పింది. ఇది హర్షిణీ ధైర్యసాహసాలకు మచ్చుతునక. ఇవే కాక వరదలు వచ్చి నదులు పొంగినప్పుడు, వన్యప్రాణులు ఊళ్ల మీద దాడిచేసినప్పుడు అత్యంత చాకచక్యంగా పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. మనుషుల ప్రాణాలను కాపాడి ఫైర్ ఉన్న ఫైటర్‌గా పేరు తెచ్చుకుంది.

- శరాది

బైకర్...

ప్రస్తుతం ఫైర్ సర్వీసెస్ డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న హర్షిణికి బైక్ రైడింగ్ అంటే చాలా ఇష్టం. లేహ్ నుంచి కార్గిల్ వరకు బైక్ నడిపింది. తన తోటి బైకర్‌నే పెళ్లి చేసుకుంది. 'నా పెళ్లి క్రిస్మస్ రోజు జరగడం వల్ల పెళ్లికి లీవ్ పెట్టే అవకాశాన్ని కోల్పోయా' అని జోక్ చేస్తుంది హర్షిణి.



ఓఎన్‌జీసీలో..

2006లో ఓఎన్‌జీసీలో చేరింది హర్షిణి. ఈ కంపెనీ ఆమెకు గుజరాత్‌లోని 'మెహసనా'లో ఉన్న తన ఫైర్‌స్టేషన్‌కి ఇన్‌చార్జిగా పోస్టింగ్ ఇచ్చింది. ఓఎన్‌జీసీకి చెందిన రెండవ అతి పెద్ద ఆన్‌షోర్ ప్రొడక్షన్ ప్రాంతం అది. హర్షిణి గురించి ఎరుక ఉన్న ఓఎన్‌జీసీ 2013లో ఆఫ్‌షోర్ రిగ్స్‌నూ ఆమెకు అప్పచెప్పింది. అదీ రికార్డే. అప్పటిదాకా ఆఫ్‌షోర్ రిగ్స్‌లో మహిళలకు అనుమతి లేదు. ఆ రూల్‌ని బ్రేక్ చేసిందీ ఆమెనే. ఆఫ్‌షోర్ రిగ్స్ కోసం హెలికాప్టర్‌లో వెళ్లాలి.. ఆడిటింగ్ చేయాలి.. ఫాలోఅప్‌లు చూసుకోవాలి.. ఇలా బాధ్యత మొత్తం వహించాలి. ఈ పనిని ఎంతో చక్కగా నిర్వహించింది హర్షిణి.



'నా మీద నమ్మకం ఉంచి.. క్రూషియల్ ఆపరేషన్స్‌అప్పగించి.. ఎప్పటికప్పుడు నన్ను ప్రోత్సహిస్తున్న మేనేజ్‌మెంట్‌కి కృతజ్ఞురాలిని. ఫస్ట్ ఉమన్ ఫైర్ ఫైటర్ అన్న క్రెడిట్ వల్ల ఎంత గర్వంగా ఉంటుందో అంతే రెస్పాన్సిబులిటీ పెరుగుతుంది. అసలు ఆ మాటకొస్తే చేసే పనికి జెండర్ ఏంటి? ఇది మగవాళ్ల పని, ఇది ఆడవాళ్ల పని అంటూ ఏమీ ఉండదు. క్వాలిఫికేషన్.. కేపబులిటీయే ప్రధానం. ఉదాహరణకు బైక్ తీసుకుంటే.. తనను నడుపుతోంది స్త్రీనా? పురుషుడా అని దానికి తెలుస్తుందా? ఆ భేదం ఏమన్నా చూపిస్తుందా? వర్క్ కూడా అంతే! ఏ రంగానికీ స్త్రీ, పురుషులనే జెండర్ డిస్క్రిమినేషన్ ఉండదు. అదొక మిత్. జీవితం ఒకటే... లక్ష్యాన్ని ప్రేమించాలి.. ప్యాషన్‌తో ఛేదించాలి. కలలను సాకారం చేసుకోవాలి.. కలలను కనడం మాత్రం ఆపొద్దు!

- హర్షిణీ కన్వేకర్

ఆత్మీయం

అంతటా ఆ దైవమే కానీ...

పర్వదినాలు, పండుగలలో సంగతలా వుంచి మామూలు రోజులలో ముఖ్యంగా సెలవు దినాలలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కారణం ఈ యాంత్రిక జీవనంలో ఒత్తిడి అంతకంతకూ పెరిగిపోతుండడమే. అలాగే ఇంట్లో ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా ఆలయ సందర్శనం చేయడం వల్ల మంచి జరుగుతుందన్న నమ్మకం, పాపభీతి, దేవుని పట్ల గల నమ్మకం అంతకంతకూ పెరిగి పోతోంది. అందుకే ఇప్పుడు వయసు మళ్లిన వారిలో కంటే యువతలో ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులలో ఎక్కువగా కనపడుతోంది. కొందరు సరదా కోసం గుడికెళితే, మరి కొందరు మనశ్శాంతికి, ఇంకొందరు కోరికలు కోరడానికి, మరికొందరు మొక్కులు తీర్చుకోవడానికి– ఇలా ఏదో ఒక కారణాలతో గుడికెళ్లి, దైవదర్శనం చేసుకునేవారు ఎక్కువ. కారణం... ఇంట్లో పూజగదిలో లభించని



ప్రతీకాత్మక చిత్రం

ప్రశాంతత ఆలయంలో లభిస్తుంది. ఇంట్లో పూజించేది ఆ మూర్తినే అయినా, మనం దేవాలయానికి వెళ్లినప్పుడు ఒక పవిత్రమైన భావన, మాటలకందని అనుభూతి, మనశ్శాంతి కలుగుతాయి. కారణం ఏమిటి? దేవాలయాలలో దేవుని విగ్రహాన్ని ప్రతిష్ఠించేటప్పుడే యంత్రాన్ని కూడా ప్రతిష్ఠాపన చేస్తారు. అది యోగులు, యోగుల వంటి స్వామీజీల చేతుల మీదుగా జరుగుతుంది. ఆ యంత్రాలలోని బీజాక్షరాలు స్వరబద్ధమైన మంత్రాల ద్వారా మన చెవులను చేరి మన కోరికలను తీరుస్తాయి. ఆ సమ్మోహన శక్తే మనల్ని వందలు, వేల మైళ్ల దూరం ప్రయాణించి ఆయా ఆలయాలలోని దేవతల దర్శనం చేసుకునేలా చేస్తుంది. మనం చేసే పూజల వల్ల, ఆలయంలో నిత్యధూపదీప నైవేద్యాల వల్ల ఆ శక్తి చెక్కుచెదరకుండా ఉంటుంది. కారణం ఏమైతేనేం, విగ్రహం నిగ్రహం కోసమే అన్నారు సామాన్య పరిభాషలో చెప్పాలంటే... ఇంట్లో సిస్టమ్‌లో సీడీలోనో, టీవీలోనో చూసేదీ సినిమానే. అదే పెద్ద పెద్ద థియేటర్లలో పెద్ద తెరమీద చూసేదీ అదే సినిమా. అనుభూతిలోనే తేడా. అందుకే ఆలయం ఆలయమే... పూజగది పూజగదే; మందిరం మందిరమే!

సందర్భం

అమ్మ కడుపే చల్లగా..!



నాక్కొంచెం గడువివ్వండి
అమ్మకు నచ్చజెప్పుకుంటా
ఇంకొన్నిరోజులు ఇక్కడే ఉంటా

ఉమ్మనీరు మింగను
పేగు మెడకు మెలేసుకోను
అల్లరి చేయను... అడ్డం తిరగను
నాక్కొంచెం గడువివ్వండి

ఒక పూట పస్తుంటా
ఒకలెక్క పడుకుంటా
బరువు పెరగను... బాధపెట్టను
నాక్కొంచెం గడువివ్వండి

గోరఖ్‌పూర్ ఘోరం విన్నాను
నాబోటివాళ్ల ప్రాణాలు
గాలి అందక గాల్లో కలిసిపోయాయి

గుంటూరులో గుండెకోత గుర్తుంది
ఆస్పత్రిలో ఎలుకలు కొరికిన శిశువు
రక్తమోడుతూ ప్రాణం విడిచింది

మీ దవాఖానాల్లో ఆక్సిజన్ నింపండి
ప్రసూతి వార్డుల్లో ఎలుకల్ని తరమండి
పందికొక్కలపై కొరడా ఝుళిపించండి
డాక్టర్లను డ్యూటీలో పెట్టండి
ఏలేవారి మెదడువాపుకి మందేయండి

అప్పటివరకూ...
నాక్కొంచెం గడువివ్వండి
అమ్మకు నచ్చజెప్పుకుంటా
ఇంకొన్నిరోజులు ఇక్కడే ఉంటా
గర్భంలో..!

- పూడి శ్రీనివాసరావు

ఎంత పని చేశావ్ బిగ్ బాస్

సమ్‌సారం
సంసారంలో సినిమా



టీ కప్పులో తుఫాన్లు ఆ కప్పును గానీ ఇంటి కప్పును గానీ ఏమీ చేయలేవు.

కాని ఏ తప్పూ చేయకపోయినా కొన్ని తుఫాన్లు తలకు చుట్టుకుంటాయి. మెడకు బిగుసుకుంటాయి.

గొడవ బిగ్‌బాస్‌తో వచ్చింది.

'మా టీవీ'లో ఆ షో మొదలయ్యాక లక్ష్మి, లక్ష్మి భర్త శ్యామల రావు, వాళ్ల ఇద్దరు పిల్లలు టింకూ రీచా తరచూ చూస్తున్నారు. ధన్‌రాజ్, వేద, సమీర్, మధు ప్రియ... అలా మెడలో మైకులు వేసుకుని నాలుగు గోడల మధ్య వాచీలు లేకుండా టీవీలు లేకుండా న్యూస్ పేపర్ కూడా లేకుండా అన్నాళ్లు ఇంటికి దూరంగా ఉండటం, పైగా వారి ప్రతి కదలికా చూసే వీలు ప్రేక్షకులకు ఉండటం థ్రిల్లింగ్‌గా అనిపించి చాలా మందిలాగే లక్ష్మి, శ్యామలరావు కూడా చూస్తున్నారు.

షో నాలుగు వారాలు గడిచి ఐదో వారంలో పడ్డాక లక్ష్మి అంది–

'అబ్బ... ఎలా ఉంటున్నారో వాళ్లంతా ఇళ్లకు దూరంగా. అదే మీరైతే ఉండగలరా'

శ్యామలరావు కాస్త బుర్ర వాడి ఉంటే పోయుండేది. కాని ఏదో పరధ్యానంలో ఉండి 'ఎందుకు ఉండను. ఉంటాను' అన్నాడు.

లక్ష్మి ఫీలింగ్స్ మారాయి. అప్పుడైనా శ్యామల రావు అలెర్టవ్వాల్సింది.

'అదేంటండీ... ఇంటినీ పిల్లలనూ వదిలి మీరుండగలరా?' అని రెట్టించింది.

ఆమె ప్రశ్నలో 'ఇంటిని' బదులు 'నన్ను' అని శ్యామలరావు అర్థం చేసుకోవాల్సింది.

'ఎందుకు ఉండను. వాళ్లు డబ్బులిస్తారు కదా' అని మాట జారాడు.

అంతే. టక్కున టీవీ ఆఫ్ అయ్యింది. టక్కున లేచి నిలబడింది. పిల్లల వీపుల మీద బదా.. బదా మని దెబ్బల సౌండ్ వచ్చింది.

'పదండి... ఇరవైనాలుగ్గంటలు టీవీయే మీకు. పడుకోరా' అని గదిలోకి తీసుకెళ్లింది.

శ్యామలరావుకు ఫీజులెగిరిపోయాయి. ఇప్పుడేం జరిగిందని ఇలా మారిపోయింది అని చూపుడువేలూ మధ్యవేలుతో నెత్తిని కాసేపు గీరుకున్నాడు.

లోపల పిల్లలు నిద్రపోతున్న నిశ్శబ్దం, లక్ష్మి వెక్కిళ్లు పెడుతున్న చప్పుడు...

'దేవుడా' అని చేష్టలుడిగి, కాళ్లు చేతులు ఆడక హాల్లో అలానే కూలబడి కూచున్నాడు శ్యామలరావు.

కాసేపు తర్వాత లక్ష్మి బయటకు వచ్చింది. కళ్లు ఎర్రగా అయ్యాయి. ముక్కు దొండపండులా కందిపోయింది.

'ఏమిటి లక్ష్మి.. ఇప్పుడేమైందని'...

'మీకేమండీ.. మీరు మగమహారాజులు. అన్ని విధాలా నష్టపోయేదీ నాశనమయ్యేది మేమేగా. ఆడవాళ్లమేగా'...

'ఏమన్నానని నువ్వు'...

'ఇంక మాట్లాడవద్దు మీరు. అసలు పెళ్లెందుకు చేసుకున్నట్టు. నువ్వంటే నాకిష్టం లేదు నేను చేసుకోను అని చూపుల నాడే చెప్పకపోయారా? ఎగిరి గంతేసుకొని ఎందుకు చేసుకున్నారు? చేసుకున్న నాటి నుంచి ఒక అచ్చటా లేదు ముచ్చటా లేదు. పుట్టిన రోజు నాడు పండగరోజు నాడు ఇదిగో ఈ చీర తీసుకో అని ఒక్కటన్నా తెచ్చిచ్చారా?'...

'అదేమిటి.. మొన్నే కదా ఆర్ ఎస్ బ్రదర్స్‌లో ఆరు వేలు బిల్లు చేశావు'...

'నేను అడిగితే కొనివ్వడం వేరు. మీకై మీరు తెచ్చివ్వడం వేరు'

'అదొకటుందా'

'ఉండదా. మీ చెల్లెలికి బాగ లేదు... నాలుగు రోజులు వెళ్లి దాని సంగతి చూసి రా తల్లీ అని మా అమ్మ ఫోన్ చేస్తే వెళ్తే మీరెక్కడ అవస్థలు పడతారో, ఇడ్లీ బదులు నీళ్ల ఉప్మా చేసుకుని ఎక్కడ తింటారో అని మీ మీద ప్రేమతో నేను వెళ్లలేదే... అలాంటిది నన్ను వదిలేసి నా పిల్లలను వదిలేసి ఇంటిని వదిలేసి బిగ్‌బాస్‌కు వెళతానని వెళ్లగలనని ఎలా అంటారండీ మీరు. ఏ నోటితో అంటారు. హు.. అందుకే అంటారు.. మనసులో ఉన్నవి మరుపున బయటపడతాయి అని. ఇవాళ మీ మనసులోదంతా బయట పడింది'....

'అలా అర్థమైందా.. నా టైమ్ బాగలేదు'...

'హు.. మిమ్మల్ని చేసుకున్నప్పటి నుంచి నా టైమ్ బాగలేదు. పెళ్లయి పద్నాలుగేళ్లేగా అయ్యింది. అప్పుడే మొహం మొత్తి పోయానా మీకు. నా కన్నూ ముక్కూ పనికి రాకుండా పోయాయా మీకూ? అయినా నాలుగేళ్లుగా గమనిస్తున్నాను. నేనంటే అసలు లెక్కే లేనట్టుగా ఉంటున్నారు. మొన్నటికి మొన్న దువ్వాడ జగన్నాథం చూసి సినిమా సంగతి ఏమోగాని హీరోయిన్ మాత్రం అదుర్స్ అనలేదు మీరూ'...

'అలా అంటే నీ మీద మనసు లేనట్టేనా'

'మనసుంటే అలాంటి మాటలు మాట్లాడతారా? నేనేమన్నాను? బిగ్‌బాస్‌కు వెళ్లి ఎవరైనా ఎలా ఉండగలరు మీరుండగలరా అని అడిగాను. మీరేమనాలి? అమ్మో... నేనెందుకు వెళతాను. నిన్ను చూడకుండా ఒక్కరోజైనా ఉండగలనా అనాలి. అలా అనగలిగారా మీరు? అలా అనే ప్రేమ మీకుంటే కదా. లేనిది ఎక్కణ్ణుంచి వస్తుంది. నన్ను వదిలి డెబ్బై రోజులు ఉండగలనని అంటున్నారే. ఇలాంటి మనిషి రేపు నాకు అన్యాయం చేసి చల్ మోహనరంగా అని వేరే ఎవత్తోనో వెళ్లడని గ్యారంటీ ఏమిటి? ఎవరిస్తారు గ్యారంటీ... నాకు తేలాలి ఇప్పుడు'

'పిచ్చిమొహమా. చంపకే నీ గోలతో'...

'అంతే... మీరు చేస్తే మంచి. నేను చేస్తే గోల. జీవితమే నాశనమైపోయాక ఇక ఎన్నుకొని ఏం లాభం లేండి. ఏమండీ... ఒక్క మాట ఇవ్వండి. రేపు పెద్దల ఎదుట పంచాయితీలో మనం విడిపోయాక పిల్లలు కావాలని మాత్రం అడక్కండి. వాళ్లు లేకుండా నేను బతకలేను'...

'ఓరి నాయనో.. ఇంకాపవే నువ్వు'

'ఊ...ఊ...ఊ...'

'ఏడవకు. నువ్వంటే నాకు ప్రాణం. మా ఆఫీస్ వాళ్లు పూణే ఆఫీసుకు డెప్యుటేషన్ మీదు ఆర్నెల్లు వెళ్లిరా డబుల్ పేమెంట్ ఇస్తానంటే వెళ్లానా? ఎందుకు వెళ్లలేదు... నీ మీద ప్రేమతో కాదూ? ఫ్రెండ్సందరూ జాలీ ట్రిప్ వేసుకొని థాయ్‌లాండ్ వెళుతుంటే వెళ్లానా? మా ఆవిడ లేకుండా నేను రాను గురూ అని తప్పించుకోలేదూ? నీ కోసం పర్సనల్ లోన్ అప్లయ్ చేశానే? దేనికి? చాలా రోజులుగా కొనివ్వాలనుకుంటున్న మామిడి పిందెల గొలుసు కోసం కాదూ? నెక్స్ట్ వీక్ శుక్ర, శనివారం అరకుకు టికెట్లు బుక్ చేశానే... కొత్తగా అద్దాల రైలు వేశారట చూపిద్దామని కాదూ... సాయంత్రం ఆఫీసవ్వగానే టక్కున ఇంట్లో వాలి పోయేది ఎవరి కోసం నీ కోసం కాదూ. రేపు సాయంత్రం చీర కొనిద్దామనుకుంటున్నాను. నీ మీద ప్రేమతో కాదూ'....

వెక్కిళ్లు ఆగాయి.

'అంతేనా'

'ముమ్మాటికీ అంతే'.

'సరే.. లేవండి... నిద్ర పోదాం' అంది లక్ష్మి ఏడుపు ఆపి.

శ్యామలరావు లేచాడు.

లక్ష్మి ఫ్రిజ్‌లో ఉన్న పూలు తీసుకుని తలలో పెట్టుకుంది.

శ్యామలరావు చిన్న చిర్నవ్వుతో చేయి పట్టుకున్నాడు.

గండం ఆవేళకు గట్టెక్కింది.

ఎంత పని చేశావు బిగ్‌బాస్.

- ఎస్.వి.ఎస్

ప్రతి సంసారంలోనూ కొన్ని ఇబ్బందులుంటాయి. అప్పటికవి పెద్దవే. ఎలాగోలా గట్టెక్కుతాం. వాటివల్లనే సంసారం బలపడుతుంది. ఆ అనుభవంతో చిన్న, పెద్ద ఇబ్బందులను దాటుకుని హాయిగా జీవించడం నేర్చుకుంటాం. కొంతకాలం తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే అదసలు సంకటమే కాదనిపిస్తుంది, పొట్ట చెక్కలయ్యేలా నవ్వొస్తుంది కూడా. అలాంటి సరదా సంఘటనలను అక్షరాలతో కళ్లకు కట్టండి. సాక్షి పాఠకులతో పంచుకోండి.

ఈ మెయిల్: samsaaram2017@gmail.com

సినిమాలో సంసారం

మనం ఎప్పుడు కొనుక్కుంటామో? ఏమిటో?

మధు(జగపతిబాబు) ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. నెలకి మూడు వేలు జీతం. డబ్బు ఆశ లేకుండా ఉన్నదానితో తృప్తి పొందుతాడు. పైగా నిజాయతీ పరుడు. మధు వివాహం రాధతో (ఆమని) జరుగుతుంది. రాధకు బాగా డబ్బు, నగలు పిచ్చి. 'వచ్చే జీతం సరిపోవడం లేదు.. లంచాలు తీసుకోండి.. అప్పుడు ఎంచక్కా మనకు కావాల్సినవి కొనుక్కోవచ్చు' అని ఎప్పుడూ భర్తను దెప్పిపొడుస్తుంటుంది. భార్య మాటలకి నవ్వి ఊరుకుంటాడే కానీ తన నిజాయితీని మాత్రం కోల్పోడు మధు. సంపాదించడం చేతకాని నా మొగుణ్ణి అనాలి అని ఎప్పుడూ విసుక్కుంటూ ఉంటుంది రాధ. ఓ రోజు పొద్దున్నే పడుకుని ఉన్న భర్త వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చి, 'ఏవండోయ్.. వెనకింటి కాంతంగారు నాలుగు కాసుల గొలుసు చేయించేసుకుంది. పక్కవీధి తాయారమ్మగారు కలర్‌టీవీ కొనుక్కున్నారు. పచ్చ మీది వాళ్లమ్మాయి పట్టీలు కొనుక్కుంది. అందరూ అన్నీ కొనేసుకుంటున్నారు. మనం ఎప్పుడు కొనుక్కుంటామో? ఏమిటో?' అని చెబుతుంది. 'శుభలగ్నం' సినిమాలోని ఇలాంటి దృశ్యాలు మన నిజ జీవితంలోనూ ఉండేవే. అయితే కొంచెం అటూఇటూగా.



లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సర్! నేను ముస్లిం. నేను ఒక ప్రైవేట్ స్కూల్‌లో జాయిన్ అయ్యాను. నాకన్నా ఒక రోజు ముందుగా ఒక అమ్మాయి జాయిన్ అయ్యింది. కొన్ని రోజులకు మా ఇద్దరి మధ్య స్నేహం కుదిరి... అది ప్రేమగా బలపడింది. వన్ ఇయర్ పాటు మేము చాలా హ్యాపీగా ఉన్నాం. ఇంట్లో ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నాం. అయితే... ఎలా తెలిసిందో మా విషయం వాళ్ల ఇంట్లో తెలిసిపోయింది. వాళ్ల అమ్మ నాకు ఫోన్ చేసి ఏంటి విషయం అని అడిగారు. నాకు తనంటే ప్రాణమని, తన కోసం నేను కన్వర్ట్ అవుతానని చెప్పాను. అలా కుదరదు అన్నారు. వాళ్ల డాడీ అయితే తనపై చేయికూడా చేసుకోబోయారు. 'ఏది ఏమైనా మేము ఒప్పుకోం.. కావాలంటే మా శవాలపై నుంచి వెళ్లి పెళ్లి చేసుకోండి' అన్నారు. దాంతో తను మారిపోయింది. 'నన్ను వదిలెయ్యి' అంటోంది. ఆ రోజు నుంచి నేను డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. వన్ ఇయర్‌గా తన ఆలోచనలతోనే బతుకుతున్నా. తను లేకపోతే నేను బతకలేను. తనతో జీవితాన్ని కోరుకున్న పాపానికి ప్రాణంగా ప్రేమించిన అమ్మాయే నన్ను చచ్చిపో అంది. నీ కారణంగా నేను, నా కుటుంబం చావాలా అని తిరిగి ప్రశ్నించింది. ఒకప్పుడు నీ కోసం అన్నీ వదిలేయడానికి సిద్ధమన్న తనే ఇలా మాట్లాడం తట్టుకోలేకపోతున్నా. నేను కనిపించకపోతే కన్నీళ్లతో కంగారు పడిపోయే తను ఇలా మారిపోతుందని ఊహించలేదు. తనకోసం వన్ ఇయర్‌గా హిందువులా బతుకుతున్నాను సార్! తిరగని గుడి లేదు. ఎంత దూరమైనా సరే నడిచి వెళ్లి మరీ మొక్కుతున్నా. కానీ ఏ దేవుడూ కరుణించలేదు. ఇంత ప్రాణంగా ప్రేమించడమేనా నేను చేసిన తప్పు? కాల్ చేస్తే పోలీస్ కంప్లెంట్ ఇస్తామని, అంతా కలిసి చస్తామని బెదిరించారు. వాళ్ల పేరెంట్స్‌ని ఎలా ఒప్పించాలో అర్థం కావడంలేదు సార్. వాళ్లకి ఎలా అర్థమయ్యేలా చెప్పాలో తెలియడంలేదు. తిండి, నిద్ర ఏదీ లేదు. ప్లీజ్ సార్ ఏదైనా సలహా ఇవ్వండి.

- ఆతీక్

ఆతీక్ నువ్వు బంగారం!
మేలిమి బంగారం!!
అంతకంటే మంచి బంగారం ఉంటే ఆ బంగారం!!
అబ్బా నీ బాధ చూస్తుంటే నాకు గుండె పట్టేస్తోంది.
వెరీ సారీ నీలాంటి బంగారానికి ఇలా జరగకూడదు.
నో ప్రాబ్లమ్ దేవుణ్నీ, ప్రేమని దూషించకు.
అంతా నీ మంచికే జరిగింది.
ఈ బాధను కూడా ఒక అందమయిన పాఠంలాగా భావించు.
సాడ్‌నెస్ ఈజ్ ఏ పోయెమ్! ఫీల్ ఇట్!!
వర్రీ కావద్దు. ఏ బాధ ఉన్నా నవ్వడం నేర్చుకో...
భలే బాగుంటుంది బాధలో నవ్వడం!!
దేవుడు మనలో ఉండి నవ్వించినంత బాగుంటుంది.
నీకు తప్పకుండా తొందరలో మంచి వార్త వస్తుంది.
దాంతో జీవితం మళ్లీ అందంగా అనిపిస్తుంది!!
డోంట్ గివ్ అప్!
సలాం భాయ్ నేను కూడా నీ కోసం ప్రార్థిస్తాను!
ప్రామిస్!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

క్రియేటివ్ ఇమాజినేషన్ మీలో ఉందా?

రచయితలు, పెయింటర్స్, శాస్త్రవేత్తలు, ఇంజనీర్స్, గాయకులు, నృత్య కళాకారులు, సినిమా దర్శకుల వృత్తిలో కొత్త పంథా ఏర్పాడాలంటే దానిలో ఊహ భాగమై ఉంటుంది. మనిషిలో ఉన్న ప్రత్యేక లక్షణం ఊహ. శక్తివంతమైన ఊహ ద్వారానే మనిషి అద్భుతాలు సృష్టిస్తున్నాడు. మీలో ఎంత ఊహాశక్తి ఉందో ఒకసారి చెక్ చేసుకోండి.

1. ప్రపంచంలో అనేక ఆసక్తికర అంశాలున్నాయని మీకు తెలుసు. వాటిని తెలుసుకుంటూ మీలో సృజనను పెంచుకోవటానికి ప్రయత్నిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. సమస్యను పరిష్కరించటానికి ఒకే పద్ధతిని ఫాలో అవ్వరు. వివిధరకాల మార్గాలను అన్వేషిస్తారు. ఓపెన్ మైండ్‌తో ఉంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. సృజనాత్మకంగా ఉండే వ్యక్తులతో ఎక్కువసేపు గడుపుతారు. వినూత్నంగా ఆలోచించేవారితో మీ ఆలోచనలను పంచుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. కొత్తకొత్త వస్తువులు తయారు చేస్తుంటారు. పాడైన వస్తువులను రిపేర్ చేయటం అంటే మీకిష్టం.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. కళలతో మీకు టచ్ ఉంటే వాటిలో వైవిధ్యం చూపించటానికి ప్రయత్నిస్తారు. భిన్నత్వం చూపటానికి ట్రై చేస్తూ ఉంటారు.
   ఏ. అవును ☐ బి. కాదు ☐
6. మీ అభిరుచులు, నైపుణ్యాలను స్నేహితులతో పంచుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. మీకు కావలసిన దాని గురించి పూర్తి స్థాయిలో జ్ఞానాన్ని సంపాదిస్తారు. అసంపూర్తిగా వదిలేయరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. మీ ఆలోచనలకే పరిమితం కాకుండా ఇతరుల ఆలోచనలను ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

'ఎ' లు నాలుగు వస్తే మీలో ఊహాశక్తి ఉంటుంది. కాని అది పూర్తిస్థాయిలో ఉండదు. ప్రాక్టీస్ మేక్స్ మేన్ పెర్ఫెక్ట్ అన్నారు. సాధించలేని పనిని పదేపదే రకరకాలుగా చేయటానికి ట్రై చేయండి. 'ఎ' లు ఆరు దాటితే మీలో ఊహాశక్తి అధికం. దీనివల్ల జీవితంలో వైవిధ్యతకి, ప్రత్యేకతకి తెరతీస్తారు. క్రియేటివ్‌గా ఉంటారు.



కాసుకో సుడోకు

6	5		9	3			4	
		3		4		7		
			7	2	5		9	
	4			6			1	
		2	4		3	5		
	3			1			7	
	1		3	7	2			
		9		5		1		
	2			9	6		3	5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

1	6	2	9	8	3	5	4	7
3	8	5	4	6	7	2	9	1
4	7	9	1	5	2	8	3	6
2	4	8	3	9	6	1	7	5
5	3	6	2	7	1	9	8	4
9	1	7	8	4	5	3	6	2
6	2	3	7	1	8	4	5	9
8	5	4	6	2	9	7	1	3
7	9	1	5	3	4	6	2	8

నిన్నటి జవాబు

ఈ వారం YouTube హిట్స్

సయ్యా తేరా.. ట్రిప్పీ ట్రిప్పీ

ట్రిప్పీ ట్రిప్పీ సాంగ్ : సన్నీ లియోన్

నిడివి:
హిట్స్



బాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'భూమి' చిత్రంలోని ఫస్ట్ సాంగ్ రిలీజ్ అయింది. నేహా కక్కర్, బెన్ని దయాళ్, బ్రిజేష్ శాండిల్య, బాద్షా.. అంతా కలసి ఈ గుంపు పాటను పాడారు. సచిన్–జిగార్ పాటను రాశారు. ఈ నీరసమైన వివరాలకేం గానీ.. పాటలోని ఒక మహత్తరమైన సంగతి ఏంటంటే.. సన్నీ లియోన్ ఈ ఐటమ్ సాంగ్‌కి స్టెప్పులేసి.. ఉప్పూకారం యాడ్ చేశారు. ఇకనేం.. హిట్స్‌లు యూట్యూబ్ నషాళానికి అంటేశాయి! 'సయ్యా తేరా ట్రిప్పీ ట్రిప్పీ.. హిక్కీ హిక్కీ హిక్కీ హిక్కీ' అంటూ ఒకలాటి గమ్మత్తు రిథమ్‌లో లియోన్ తన ఒంటిపై ప్రణయ గాయాలను చూపెడుతూ, 'నీ లవర్ నన్ను చంపేశాడు' అని కంప్లెంట్ చేస్తుంటుంది. బృందగానంలోని ఓ వ్యసన ప్రేమికులు ఆమెకు జోడీగా.. నువ్వు నా తుపాకీ.. ఓ బేబీ, నువ్వు నా మురికి ఆలోచన. హాట్‌గా ఉన్నావు. చెప్పు నన్నేం చేయమంటావ్.. అని ఒక చెయ్యి చెవికి ఆన్చి, ఇంకో చేతిని సాగదీసి అడుగుతుంటారు. ఇక్కడితో స్టాప్ చేద్దాం. అన్నీ చెప్పేస్తే, ఇక మేం చూడ్డానికి ఏముంటుంది అనే కదా మీరు అనేయబోతున్నారు. సినిమా సెప్టెంబర్ 22న విడుదల అవుతోంది. సినిమా మొత్తం సన్నీ లియోన్‌ని చూసేయాలన్న ఆశ ఉంటే దాన్ని తక్షణం వదులుకోండి. ఆమె ఈ ఒక్క ఐటమ్‌సాంగ్‌లో మాత్రమే మీకు సాక్షాత్కరించి అదృశ్యమైపోతారు. మిగతా మూవీ అంతా సంజయ్‌దత్‌దీ, అదితి రామ్ హైదరీదీ. ఒకే దెబ్బ. మరి ఈ ట్రిప్పీ ఏంటి? హిక్కీ ఏంటి? ట్రిప్పీ అంటే డ్రగ్ ఎఫెక్ట్‌తో వచ్చే తల తిరుగుడు భ్రాంతి. హిక్కీ అంటే 'లవ్ బైట్'.

నిడివి
4 ని. 2 సె.
హిట్స్
90,46,625

అయ్య బాబోయ్ అంత పని చెయ్యకు

బాద్షాహో : సోచా హై సాంగ్



నిడివి:
2 ని. 16 సె.
హిట్స్
62,70,330

ఎమర్జెన్సీ కాలం నాటి కథాంశంతో వస్తున్న బాలీవుడ్ థ్రిల్లర్ 'బద్షాహో' చిత్రంలోని ఓ థ్రిల్లింగ్ సాంగ్ 'సోచా హై యే కే తుమ్నే రాస్తా భులాయే'. ఇది ఇంత థ్రిల్లింగ్‌గా ఎందుకు ఉందంటే ఈ పాటలో ఎమ్రాన్ హష్మీ ఉన్నాడు. అతడితో పాటు ఈషా గుప్తా! బాద్షాహో అంటే 'కింగ్స్' అని అర్థం. మూవీలోని మూడో పాటగా టీసీరీస్ ఈ 'సోచా హై'ని యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేసింది. వెరీ మచ్ రొమాంటిక్. 1975 నాటి 'దీవార్' చిత్రంలోని 'కే దూన్ తుమ్హే' పాటకు ఇది రీమిక్స్. అప్పటి ఆర్డీ బర్మన్ మ్యూజిక్‌ని ఇప్పుడు తనిష్క్ బాగ్చీ 'న్యూమిక్స్'ని అందించాడు. 'నిన్ను దారి మర్చిపోయేలా చేయాలని నిర్ణయించుకున్నాను. ఒక ఎడారి ప్రాంతంలో నిన్ను వదిలిపెట్టి భయపెడతాను' అంటాడు హీరో అలంకరించిన పల్లకిలాంటి ఓ మోడ్రన్ త్రీ–వీలర్ వాహనంలో విహారానికి తీసుకెళుతూ. 'అయ్య బాబోయ్.. అంత పని చెయ్యకు' అని హీరోయిన్ వేడుకుంటుంది. ఇక పాటంతా రోడ్డు మీదే ఉల్లాసంగా, ఉత్సాహంగా. ఈ సినిమాలో అజయ్‌దేవగణ్, ఇలియానా కూడా ఉన్నారు. సెప్టెంబర్ 1న రిలీజ్ అవుతోంది. డైరెక్షన్ మిలాన్ లూథ్రియా. ఎవరీయన? 'వన్స్ అప్ ఆన్ ఎ టైమ్ ఇన్ ముంబై' చిత్రం గుర్తుందా?

జీవిత సత్యాల జోల పాట

మైలీ సరస్ - యంగర్ నౌ

మైలీ సైరస్ కొత్త సింగిల్ వీడియో ట్రాక్ 'యంగర్ నౌ' విడుదలైంది. ఈ ఇరవై నాలుగేళ్ల అమెరికన్ సింగర్‌కు రోజురోజుకూ వయసు తగ్గినట్లుగా అనిపిస్తోందట! నిద్ర లేస్తూనే, పడక మీద అలా పడుకునే ఉండి.. 'ఫీల్స్ లైక్ ఐ జస్ట్ వోక్ అప్. లైక్ ఆల్ దిస్ టైమ్ ఐ హ్యావ్ బీన్ అస్లీప్..' అంటూ పొద్దం మొదలుపెడుతుంది. 'నిద్రపోతున్నంత సేపూ ఇప్పుడే లేచిన అనుభూతిని పొందుతున్నాను' అనే మాట అనాలంటే.. పెద్ద జీవితాన్నే చూసి ఉండాలి. ఈ వయసులో ఈ పిల్లకేమిటి ఇంత ఫిలాసఫీ?! ఇంకా ఏమంటోందో వినండి. 'నేనెవరో నాకు తెలియకపోయినప్పటికీ, ఒకప్పుడు నేనేమిటన్న దాని గురించి నాకు భయం లేదు' అంటోంది. 'ఎవరూ ఎప్పుడూ ఒకేలా ఉండిపోరు. అయినప్పటికీ ఐ ఫీల్ మచ్ యంగర్ నౌ' అని కూడా. ఎలా సాధ్యం? ఎప్పుడూ కలల్లో ఉంటుందట. నిద్రకు చోటు లేనంతగా అదే పనిగా కలల్లో. సో.. మైలీ.. మీకు కలల్లో నిద్ర వస్తుంది తప్ప, నిద్రలో కలలు రావు. అంతేనా?! షి ఈజ్ యంగ్ ఇన్ ఏజ్. అండ్ యంగర్ ఎట్ హార్ట్. పాట మార్దవంగా ఉంది. జోల పాటలా. బాయ్స్ అండ్ గర్ల్స్.. మిస్ అవకండి ఈ సాంగ్‌లో మైలీ సైరస్‌నీ, సైరస్ వాయిస్‌నీ.



రాజ్‌కుమార్ రావ్ చంద్ర బోస్

బోస్ : డెడ్ ఆర్ ఎలైవ్

సుభాస్ చంద్రబోస్! ఓ లెజెంట్. ఓ మిస్టరీ. ఆయన చనిపోయాడా? బతికే ఉన్నాడా? ఏళ్లుగా అంతుచిక్కని ప్రశ్న. ప్రభుత్వాలు కమిటీలు వేశాయి. బోస్ అభిమానులు అన్వేషణ సాగించారు. ఏదీ తేల్లేదు. ఈ మధ్యే భారత ప్రభుత్వం.. బోస్ విమాన ప్రమాదంలో 1945 ఆగస్టు లోనే చనిపోయాడని అధికారికంగా ప్రకటించింది. ఆ ప్రకటన మీదా అనుమానాలున్నాయి. ఇప్పుడు బోస్ మిస్టీరియస్ డెత్ మీద ఏక్తా కపూర్ వెబ్ సీరీస్ వస్తోంది. 'బోస్: డెడ్ ఆర్ ఎలైవ్' ఆ వెబ్ సిరీస్ పేరు. అందులో బోస్‌గా బాలీవుడ్ అప్‌కమింగ్ హీరో రాజ్‌కుమార్ రావ్ నటిస్తున్నాడు. ట్రైలర్‌లో అతడిని చూడగానే బోస్‌లా భలే సెట్ అయ్యాడు అనిపిస్తుంది. అయితే వెబ్‌లో ఇది ఎప్పుడు మొదలయ్యేదీ ఇంకా తేదీ ఖరారు కాలేదు. టెలీఫిల్మ్ చందాదారులకు వారి కోరికపై వీడియోలను ప్రదర్శిస్తుండే సంస్థ ఎ.ఎల్.టి. బాలాజీ 'బోస్'ను నిర్మిస్తోంది.

నిడివి
హిట్స్



సాక్షి ఫ్యామిలీ
సినిమా
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం
21-8-2017



● '2.0'లో రజనీకాంత్

మనసు మారిందా?

రోబోలకు మనసుంటుందా? ఎందుకు ఉండదు... కావాలంటే రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'రోబో' (తమిళంలో 'యందిరన్') చూడండి. చిట్టి రోబో అందాల ఐశ్వర్య మనసు దోచేయాలని ఎంత తాపత్రయపడుతుంటుందో! ఇప్పుడా సిన్మాకు సీక్వెల్‌గా రూపొందుతోన్న సినిమా '2.0'. రజనీ హీరోగా శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇందులో చిట్టి రోబో లవ్ లేడీగా అమీ జాక్సన్ నటిస్తున్నారు. అయితే... ఇక్కడ మనసు మారిందని చెబుతున్నది ప్రేమ విషయంలో కాదు, పాటల్ని విడుదల చేసే వేదిక విషయంలో! సినిమా విడుదల తేదీ విషయంలో! వచ్చే ఏడాది జనవరి 25న సినిమా విడుదలవుతుందని చిత్రబృందం ఎప్పుడో ప్రకటించింది. అయితే... విడుదలను జనవరి నుంచి ఏప్రిల్‌కు వాయిదా వేశారనే వార్తలొచ్చాయి. వీటిపై '2.0' యూనిట్ స్పందించింది. ''మా మనసు ఏం మారలేదు. జనవరిలోనే సినిమాను విడుదల చేస్తాం'' అని స్పష్టం చేశారు. అలాగే, ఏఆర్ రెహమాన్ సంగీతమందించిన ఈ సినిమా పాటల్ని దుబాయ్‌లో విడుదల చేయాలనుకుంటున్నట్టు, అభిమానుల సమక్షంలో భారీ వేడుక నిర్వహించనున్నట్టు వార్తలొచ్చాయి. దుబాయ్‌లో కాకుండా, మన దేశంలోనే పాటల్ని విడుదల చేయాలనుకుంటున్నారని తాజా ఖబర్. బహుశా... చెన్నై, ముంబయ్, హైదరాబాద్ నగరాల్లో తమిళ, హిందీ, తెలుగు పాటల్ని విడుదల చేసి దుబాయ్‌లో స్పెషల్ ఈవెంట్ ఏదైనా నిర్వహిస్తారేమో! ఈ సినిమా తెలుగు వెర్షన్ హక్కులను గ్లోబల్ సినిమా సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే.


● అఖిల్

హలో... టైటిల్ ఇదే!?

హలో... హలో... హలో... అక్కినేని అభిమానుల్లో ఇప్పుడీ సౌండ్ ఎకోలో వినిపిస్తోంది. ఎందుకంటే... అఖిల్ హీరోగా విక్రమ్ కుమార్ దర్శకత్వంలో అక్కినేని నాగార్జున నిర్మిస్తున్న సినిమా టైటిల్ 'హలో' అట! నేడు ఈ సిన్మా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే... రెండు రోజుల క్రితం 'నిర్ణయం'లోని 'హలో గురూ ప్రేమ కోసమే రోయ్ జీవితం...' పాటను ట్వీట్ చేసిన నాగార్జున... ''ఇందులో అఖిల్ సినిమా టైటిల్ ఉంది. కనుక్కోండి'' అన్నారు. ఆదివారం నాగచైతన్య 'ఏ మాయ చేసావె'లో 'ఈ హృదయం' పాట ర్యాప్‌ను పోస్ట్ చేసి సెకండ్ క్లూ ఇచ్చారు. రెండిటిలోనూ కామన్‌గా ఉన్నది 'హలో' అనే పదం ఒక్కటే. సో, అదే అఖిల్ సినిమా టైటిల్ అయ్యుంటుందని అక్కినేని అభిమానులు, ప్రేక్షకులు ఫిక్సయ్యారు. వాళ్ల అంచనా నిజమో? కాదో? ఈ రోజు తెలుస్తుంది.

ప్రభాస్ నమ్మాడు

ఇప్పుడు ప్రభాస్‌తో ఫైట్లు–ఫీట్లు చేయడానికి ముచ్చటగా ముగ్గురున్నారు. సుజీత్ దర్శకత్వంలో ఆయన హీరోగా చేస్తున్న 'సాహో'లో హిందీ నటులు నీల్ నితిన్ ముఖేశ్, చంకీ పాండేలు విలన్లుగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ లిస్టులోకి మరో హిందీ నటుడు చేరారు. ఆయనే... జాకీ ష్రాఫ్. తెలుగులో 'అస్త్రం, శక్తి, పంజా' సినిమాల్లో విలన్‌గా చేసిన జాకీ, 'సాహో'లో నటిస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమా గురించి జాకీ ష్రాఫ్ మాట్లాడుతూ– ''ఐయామ్ హ్యాపీ టు బి పార్ట్ ఆఫ్ ప్రభాస్ 'సాహో'. సినిమాలో కీలక పాత్రను నేను చేయగలనని ప్రభాస్ నమ్మాడని తెలిసి ఇంకా సంతోషపడ్డా'' అన్నారు. ప్రస్తుతం ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రద్ధా కపూర్ హీరోయిన్.


● ప్రభాస్


● జాకీ ష్రాఫ్


● 'వివేకం'లో అజిత్, కాజల్ అగర్వాల్

మళ్లీ వైఫ్‌గా...

నుదుట కుంకుమ బొట్టు... మెడలో తాళిబొట్టు... హుందాగా చీరకట్టు... కొత్తగా కనిపిస్తూ కాజల్ అగర్వాల్ కనికట్టు చేస్తారట. ఎందులోనంటే... అజిత్ 'వివేకం'లో. రీసెంట్‌గా రిలీజైన 'నేనే రాజు నేనే మంత్రి'లో హీరో వైఫ్ క్యారెక్టర్‌లో కనిపించిన కాజల్, ఈ సినిమాలోనూ హీరో వైఫ్‌గా కనిపించనున్నారు. అయితే... రెండు క్యారెక్టర్స్ మధ్య చాలా డిఫరెన్స్ ఉందట! ''కళలను అభిమానించే వ్యక్తిగా, 'వివేకం'లో టిపికల్ సౌతిండియన్‌గా నటించా. నటనకు మంచి స్కోప్ ఉన్న క్యారెక్టర్'' అన్నారు కాజల్. ఇందులో ఒకటి, రెండు పాటల్లో తప్పితే... సినిమా అంతా ఫుల్ హ్యాండ్స్ బ్లౌజులు, ట్రెడిషనల్ శారీల్లో కాజల్ కనిపిస్తారట. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌లో యాక్షన్ హాలీవుడ్ రేంజ్‌లో ఉంది. ముఖ్యంగా అజిత్ మేకోవర్, స్టైల్‌కు మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఇందులో ఆయన సిక్స్ ప్యాక్‌తో కనిపించనున్నారు. యాక్షన్‌తో పాటు హ్యూమన్ ఎమోషన్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని చెబుతున్నారు కాజల్. తమిళంలో 'వివేగం'గా రూపొందిన ఈ సిన్మాను వంశధార క్రియేషన్స్ పతాకంపై నిర్మాత నవీన్ శొంటినేని (నాని) తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. హిందీ హీరో వివేక్ ఒబెరాయ్ విలన్‌గా, అక్షరా హాసన్ ముఖ్య తారగా నటించిన ఈ సినిమాకు శివ దర్శకుడు. ఈ నెల 24న తెలుగు, తమిళ భాషల్లో సినిమా విడుదల కానుంది.


● త్రిష

గుడ్‌మార్నింగ్ టీచర్

యస్... ఇప్పుడు కొంతమంది చెన్నై చిన్నారులు త్రిషను ఇలానే పిలుస్తున్నారట! వాళ్లంతా ఎవరంటే... త్రిష స్టూడెంట్స్. ఇన్ సెట్ ఫొటోలో చిన్నారి ఆ స్టూడెంట్స్‌లో ఒకరు. చెన్నైలోని కిడ్స్ స్కూల్ ఎందులోనైనా త్రిష పాఠాలు చెబుతున్నారేమో అనుకోవద్దు. సినిమా కోసమే ఆమె టీచర్‌గా మారారు. విజయ్ సేతుపతికి జోడీగా నటిస్తున్న తమిళ సినిమా '96'లో త్రిష టీచర్‌గా కనిపిస్తారని చెన్నై టాక్. ఆల్రెడీ ఇందులో త్రిష లుక్ ఎలా ఉంటుందనేది బయట కొచ్చింది. ఇన్ సెట్ ఫొటో అదే అంటున్నారు. ఈ ఫొటో బయటకు రావడంతో త్రిష చాలా బాధపడుతున్నారు. ''దర్శకులు ఎంతో కష్టపడి సినిమాల్లో నటీనటుల లుక్స్‌ను రెడీ చేస్తారు. వాళ్లకు నచ్చిన సందర్భాల్లో వాటిని విడుదల చేస్తారు. కానీ, సోషల్ మీడియా వచ్చిన తర్వాత దర్శకులు విడుదల చేయడానికంటే ముందే ఆయా లుక్స్ బయటకొచ్చేస్తున్నాయి. ఈ ధోరణి దర్శకులను అగౌరవపరచడమే. నా అభిమానులను నేనెంతో ప్రేమిస్తా. వాళ్లతో ఫొటోలు దిగుతానంటే హ్యాపీగా ఓకే చెబుతా. ఆన్ సెట్స్‌లో దిగే ఫొటోలను సోషల్ మీడియాలో ఎవరితోనూ పంచుకోవద్దని రిక్వెస్ట్ చేస్తున్నా. ఆ చిన్నారి నా ఫ్యాన్. సిన్మాలో నటించడం లేదు'' అన్నారు త్రిష.


● చిన్నారి అభిమానితో త్రిష

హేయ్... పిల్లగాడ

...'ఫిదా'లోని ఈ పాట, అందులో సాయిపల్లవి డ్యాన్స్‌కు తెలుగు ప్రేక్షకులు 'మేము ఫిదా' అన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడీ పాటలోని తొలి రెండు పదాలనే సాయిపల్లవి కొత్త సినిమాకు టైటిల్‌గా పెట్టారు. మలయాళంలో దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి జంటగా సామీర్ తాహిర్ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'కలి'. ఈ సినిమాను తెలుగులో 'హేయ్... పిల్లగాడ' పేరుతో విడుదల చేస్తున్నారు లక్ష్మీ చెన్నకేశవ ఫిలింస్ అధినేత డీవీ కృష్ణస్వామి. ఈ సినిమా లోగోను దర్శకులు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''మలయాళ, తమిళ భాషల్లో మంచి విజయం సాధించిన ఈ సినిమా తెలుగులో కూడా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''ఇదొక టిపికల్ లవ్ స్టోరీ. దుల్కర్, సాయిపల్లవిల నటన, గోపీసుందర్ సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. సెప్టెంబర్ 8న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు డీవీ కృష్ణస్వామి. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దక్షిణ్ శ్రీనివాస్, సహ నిర్మాత: వి. చంద్రశేఖర్.


● సాయిపల్లవి

ప్రేమకు కొత్త నిర్వచనం!

శ్రీకరణ్, అమృత, ప్రీతి ముఖ్యతారలుగా నంది వెంకట్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బెస్ట్ లవర్స్'. శ్రీకరణ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత గొంటి శ్రీకాంత్ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలకు సిద్ధమైంది. గొంటి శ్రీకాంత్ మాట్లాడుతూ– ''ప్రేమకు సరికొత్త నిర్వచనం తెలిపే చిత్రమిది. ప్రేమికులు తప్పనిసరిగా చూడాల్సిన చిత్రం. దర్శకుడు సినిమాను చక్కగా తెరకెక్కించారు. సాయికిరణ్ అందించిన పాటలకు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం'' అన్నారు.


● శ్రీకరణ్, అమృత

పల్లెటూరి ప్రేమకథ

'చూడాలని ఉంది, ఇంద్ర, యువరాజు' సినిమాల్లో బాలనటుడిగా నటించిన తేజను లక్కీ మీడియా సంస్థ హీరోగా పరిచయం చేస్తోంది. బెక్కం వేణుగోపాల్ (గోపి) నిర్మిస్తున్న ఈ సినిమాకు హరి దర్శకుడు. సెప్టెంబర్ 15న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నారు. నిర్మాత గోపి మాట్లాడుతూ– ''పల్లెటూరి యువత నేపథ్యంలో జరిగే అందమైన ప్రేమకథా చిత్రమిది. కుటుంబమంతా చూసేలా ఉంటుంది. మా దర్శకుడు ప్రముఖ నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిగారి సంస్థలో దర్శకత్వ విభాగంలో ఎనిమిదేళ్లు పనిచేశారు. 'ఉయ్యాలా జంపాలా, స్వామిరారా' ఫేమ్ యంఆర్ సన్నీ మా సినిమాకు స్వరకర్త'' అన్నారు.


● బెక్కం వేణుగోపాల్


● తేజ

మనుషులను ప్రేమించే దెయ్యం

సుజయ్, తనిష్క, చంద్రకాంత్, రష్మీ, సోని ముఖ్యతారలుగా రాజశేఖర్ దర్శకత్వంలో దేవశంకర్ గౌడ్ నిర్మించిన సినిమా 'నాకూ మనసున్నది'. ఉదయ్‌కిరణ్ స్వరపరచిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''పాటలు వినసొంపుగా ఉన్నాయి. ఈ సిన్మా విజయవంతమై నిర్మాతకు లాభాలు రావాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''దెయ్యం మనుషుల్ని ప్రేమించడమనేది కొత్త కాన్సెప్ట్. ట్రైలర్ బాగుంది'' అన్నారు సాయి వెంకట్. నటి కవిత, నటుడు బానుచందర్, నిర్మాత టి. రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పెద్దాడ వెంకట రమణ.


● తనిష్క



ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన సమాధి వీర్‌భూమి వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, కార్యక్రమంలో తన కోడలు మిరయా వాద్రాతో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ. మరోవైపు రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. రాజీవ్ దేశానికి ఎంతో సేవ చేశారంటూ మోదీ ట్వీట్ చేశారు.

మైనారిటీ బాలికలకు 40% సీట్లు

100 నవోదయ తరహా పాఠశాలల్లో రిజర్వేషన్: కేంద్ర మంత్రి నక్వీ



న్యూఢిల్లీ: మైనారిటీలకు మెరుగైన విద్యనందించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ప్రతిపాదిత 100 నవోదయ తరహా పాఠశాలలు, ఐదు ఉన్నత విద్యా సంస్థల్లో మైనారిటీ బాలికలకు 40 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. మైనారిటీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ విద్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ చెప్పారు. ఈ వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని, ఈ క్రమంలోనే బాలికలకు 40 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించామని తెలిపారు. బహురంగాల అభివృద్ధి కార్యక్రమం (ఎంఎస్‌డీపీ) కింద భవనాల నిర్మాణం జరుగుతుందని, సాధ్యమైనంత వరకు వచ్చే ఏడాది ఈ పాఠశాలలను ప్రారంభిస్తామని నక్వీ వెల్లడించారు. ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ ప్రభుత్వాలు ఆసక్తి చూపాయన్నారు. మైనారిటీల్లో, ముఖ్యంగా ముస్లింలలో విద్యా వెనకబాటుతనాన్ని అధిగమించేందుకు మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (ఎంఏఈఎఫ్) నియమించిన ఉన్నత స్థాయి కమిటీ మూడంచెల విధానాన్ని ప్రతిపాదించింది. కేంద్రీయ/నవోదయ తరహా బోధనా విధానంతో ప్రాథమిక, సెకండరీ, ఉన్నత స్థాయిలో 211 పాఠశాలలు, 25 కమ్యూనిటీ కాలేజీలు, ఐదు విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

ఎంపీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ విభాగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు ఇవ్వనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రకటించారు. ఆదివారం భోపాల్‌లో మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇప్పుడు వివిధ ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగాల్లో మన కూతుళ్లకు (యువతులకు) 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించాం' అని పేర్కొన్నారు. అయితే.. అటవీ శాఖకు మాత్రం ఈ రిజర్వేషన్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. 12వ తరగతిలో 75 శాతం లేదా, సీబీఎస్‌ఈలో 85 శాతం పొందిన విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడిసిన్ విద్య ఖర్చును బీజేపీ భరిస్తుందని చౌహాన్ ప్రకటించారు.

'బీజేపీ సీఎం'లతో మోదీ, షా భేటీ నేడు



న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాలు సోమవారం సమావేశం కానున్నారు. ఆయా రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు తీరు, అభివృద్ధి గురించి భేటీలో చర్చిస్తారు. ఈ సమావేశానికి 13 మంది ముఖ్యమంత్రులు హాజరవుతుండగా మరో ఆరు రాష్ట్రాల నుంచి ఉప ముఖ్యమంత్రులు వస్తున్నారు. కొందరు కేంద్ర మంత్రులు కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలిపాయి. 2014 ఎన్నికల్లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోదీ సమావేశమవడం ఇది మూడోసారి.

'విదేశీ కోర్టులు విడాకులు ఇవ్వకూడదు'

ముంబై: భారతీయ దంపతులు విదేశాల్లో నివసిస్తున్నంత మాత్రాన వారికి విడాకులు మంజూరు చేసే పరిధి సదరు దేశాల్లోని కోర్టులకు లేదని బాంబే హైకోర్టు పేర్కొంది. దుబాయ్‌లో ఉంటున్న ఓ భారతీయుడికి అక్కడి కోర్టు అతని భార్య నుంచి విడాకులు ఇచ్చిన కేసును విచారిస్తూ కోర్టు ఇటీవల ఈ వ్యాఖ్యలు చేసింది. 'హిందూ వివాహ చట్టం ప్రకారం పెళ్లి చేసుకున్న భారతీయ జంటలకు సంబంధించిన కేసులను విచారించే పరిధి విదేశీ కోర్టులకు లేదని చట్టం పేర్కొంటోంది' అని జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ అనుజా ప్రభుదేశాయ్‌ల ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుత కేసులో భార్యాభర్తలిద్దరూ భారతీయులేనని, పుట్టుకతోనే హిందువులై, హిందూ వేద పద్ధతి ప్రకారం పెళ్లిచేసుకుని, హిందూ వివాహ చట్టం పరిధిలోకే వస్తున్నారని కోర్టు తెలిపింది.

'పీఐవో'ల ప్రచారంపై సలహా కోరిన ఈసీ

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి వ్యక్తులు(పీఐవో) పర్యాటక వీసాపై భారత్‌కు వచ్చి ఇక్కడ జరిగే ఎన్నికల్లో ప్రచారం చేయొచ్చా? అన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) న్యాయశాఖను కోరింది. ప్రస్తుతమున్న ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఈ విషయమై ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో ఈసీ కేంద్రాన్ని ఆశ్రయించింది. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పలువురు పీఐవోలు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తరఫున ప్రచార నిర్వహించడంతో ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఈ విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సంఘం వెంటనే విదేశాంగ శాఖను సంప్రదించింది.. ఈ అంశంపై న్యాయశాఖ అభిప్రాయం తీసుకోవాల్సిందిగా సూచించింది.

టీ-90 ట్యాంకులను ఆధునీకరిస్తున్న సైన్యం



న్యూఢిల్లీ: భారత సైన్యం వినియోగిస్తున్న రష్యన్ తయారీ టీ-90 యుద్ధ ట్యాంకుల్ని మరింత ఆధునీకరిస్తున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ ట్యాంకుల్లో వాడుతున్న ఇన్వర్ లేజర్ గైడెడ్ మిస్సైల్ స్థానంలో మూడోతరం గన్ లాంచింగ్ మిస్సైళ్లను అమర్చే ప్రక్రియ చేపట్టినట్లు ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ మిస్సైళ్లు దాదాపు 8 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని తుత్తునియలు చేస్తాయని తెలిపారు. 125 ఎంఎం బ్యారెల్ గన్ల ద్వారా ప్రయోగించే ఈ క్షిపణులు ముందస్తు ప్రోగ్రామింగ్ ద్వారా లక్ష్యాన్ని ఛేదిస్తాయన్నారు. స్థిరంగా ఉండే శత్రు స్థావరాలతో పాటు కదులుతున్న వాహనాలను ఇవి ఏ సమయంలోనైనా లక్ష్యంగా చేసుకోగలవని వెల్లడించారు.

డార్జిలింగ్‌లో పేలుళ్లు.. జీజేఎం చీఫ్‌పై కేసు

డార్జిలింగ్ (పశ్చిమబెంగాల్): ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్న గూర్ఖా జనముక్తి మోర్చా అధ్యక్షుడు బిమల్ గురుంగ్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కలింపాంగ్ పోలీస్ స్టేషన్ వద్ద గ్రెనేడ్ దాడి, డార్జిలింగ్ పట్టణంలో బాంబు పేలుడు ఘటనలకు సంబంధించి గురుంగ్‌పై ఈ కేసు నమోదు చేశారు. కలింపాంగ్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం రాత్రి జరిగిన హ్యాండ్ గ్రెనేడ్ దాడిలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు గాయపడ్డారు. దుండగులు బైక్‌పై వెళ్తూ గ్రెనేడ్‌ను విసిరినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అలాగే డార్జిలింగ్‌లోని చౌక్‌బజార్‌లో శనివారం అర్ధరాత్రి భారీ తీవ్రత గల మరో బాంబు పేలింది. మరోవైపు కలింపాంగ్‌లోని గూర్ఖాలాండ్ టెరిటోరియల్ అడ్మినిస్ట్రేషన్ (జీటీఏ) కార్యాలయాన్ని గూర్ఖాలాండ్ మద్దతుదారులు శనివారం రాత్రి తగులబెట్టారు.

యాచకుల పునరావాసం కోసం ప్రత్యేక చట్టం



న్యూఢిల్లీ: సమాజంలో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న యాచకుల పునరావాసం కోసం ప్రత్యేక చట్టం అవసరమని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి మేనకా గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి తేవర్‌చంద్ గెహ్లాట్‌కు లేఖ రాశారు. యాచించే పిల్లలతోపాటు వారి కుటుంబాలకు కూడా పునరావాసం ఏర్పాటు చేసి సామాజిక రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల అమల్లోకి వచ్చిన జువెనైల్ జస్టిస్ 2015 చట్టాన్ని ప్రస్తావిస్తూ యాచిస్తున్న పిల్లల రక్షణ, భద్రతను పరిగణనలోకి తీసుకుని బాలల సంక్షేమ సంఘాల ద్వారా వారికి పునరావాసం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఢిల్లీ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ప్రకారం 2015 ఆగస్టులో 5,727 మంది పిల్లలు యాచకులుగా ఉన్నారని గుర్తుచేశారు.

'భీమ్ క్యాష్‌బ్యాక్' మార్చి 31 దాకా

న్యూఢిల్లీ: భీమ్(భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ) యాప్ ద్వారా వ్యాపారులకు ప్రోత్సాహకాలిస్తున్న పథకం గడువును కేంద్రం వచ్చే మార్చి 31 వరకు పొడిగించింది. ఈ యాప్‌తో లావాదేవీలు జరిపే వ్యాపారులకు నెలకు రూ.వేయి దాకా క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి ఏప్రిల్ 14న ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇందుకు సంబంధించి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఆదివారం ప్రకటన జారీ చేసింది. ఈ పథకం ప్రకారం...తొలి 20–50 నగదురహిత లావాదేవీలకు వ్యాపారి రూ.50 క్యాష్‌బ్యాక్ పొందుతాజుజీ. ఆ తరువాత జరిగే ప్రతి లావాదేవీకి రూ.2 చొప్పున నెలకు గరిష్టంగా రూ.వేయి లభిస్తుంది.

105 ఏళ్ల క్రితమే కేరళలో నెలసరి సెలవులు

తిరువనంతపురం: మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలన్న అంశంపై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుండగా.. 105 ఏళ్ల క్రితమే కేరళలోని ఓ ప్రభుత్వ బాలికల పాఠశాలలో నెలసరి సెలవులు ఇచ్చినట్లు ప్రభుత్వ రికార్డులు తెలుపుతున్నాయి. 1912లో కొచ్చిన్ రాజ్యం(ఇప్పటి ఎర్నాకులం జిల్లా)లోని త్రిపునిథురలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు నెలసరి సమయంలో సెలవులు ఇచ్చేవారని చరిత్రకారుడు పి.భాస్కరనుణ్ణి '19వ శతాబ్దంలో కేరళ' పుస్తకంలో రాశారు. ఈ సెలవుల మంజూరును అప్పటి విద్యాశాఖ డైరెక్టర్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

ఉత్తరాదిన వరద విలయం

బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రం అస్సాంలో 473 మంది మృతి
- సహాయక చర్యల్లో ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

లక్నో: దేశ ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. బిహార్, ఉత్తర ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో వరదలకు 473 మంది ప్రాణాలు కోల్పోగా కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. ఆర్మీతో పాటు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో చురుగ్గా పాలుపంచుకుంటున్నాయి. మరోవైపు ఆదివారం కూడా ముంబై నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు

ఉత్తర ప్రదేశ్‌లో వరద పరిస్థితి ఆదివారం నాటికి మరింత విషమించింది. మృతుల సంఖ్య 69కి చేరగా.. రాష్ట్రంలోని మొత్తం 24 జిల్లాల్లో 20 లక్షల మంది వరదల్లో చిక్కుకున్నారు. 2,523 గ్రామాలు నీట మునిగాయని పునరావాస శాఖ వెల్లడించింది. పశ్చిమ యూపీ జిల్లాల్లో మొత్తం 39,783 మందిని సహాయక శిబిరాలకు తరలించామని, నేపాల్ వైపు నుంచి వరద ప్రవాహం తగ్గకపోవడంతో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని ఆ శాఖ పేర్కొంది. వరదలకు తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ చర్యల్లో ఎన్డీఆర్‌ఎఫ్, పీఏసీ(యూపీ ఆర్మ్‌డ్ కానిస్టేబుల్స్) సిబ్బంది చురుగ్గా పాల్గొంటున్నారు. 20 కంపెనీల ఎన్డీఆర్‌ఎఫ్, 29 కంపెనీల పీఏసీ సిబ్బందితో పాటు ఆర్మీ కూడా సాయమందిస్తోంది. ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ముంపు ప్రాంతాలకు ఆహారం, నీరు చేరవేస్తున్నారు. యూపీలో శారద, ఘాఘ్రా, రాప్తీ, బుధి రాప్తీ, రోహిణ్ నదులు ఇంకా ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయని కేంద్ర జల సంఘం వెల్లడించింది.

బిహార్‌లో 202 మంది మృతి


బిహార్‌లో వరద మృతుల సంఖ్య 253కి చేరింది. అరారియా జిల్లాలో అత్యధికంగా 57 మంది మరణించారు. 18 జిల్లాలో 1.21 కోట్ల మంది వరదల్లో చిక్కుకున్నారు. 1,336 కేంద్రాలు ఏర్పాటు చేసి 4.22 లక్షల మందికి పునరావాసం కల్పిస్తున్నారు. 28 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, 16 రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, ఆర్మీ సిబ్బంది సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారు. అస్సాంలో మూడుసార్లు సంభవించిన వరదలకు ఇంతవరకూ 151 మరణించారు. తాజాగా ధుబ్రి, మోరిగావ్, గోలాఘాట్ జిల్లాలో మూడు మరణాలు సంభవించాయి. 16 జిల్లాల్లో 22 లక్షల మంది ఇంకా ముంపులోనే ఉన్నారని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ తెలిపింది. మొత్తం 328 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు వెల్లడించింది. కాగా వరుసగా రెండో రోజు ఆదివారం కూడా ముంబైని భారీ వర్షాలు ముంచెత్తాయి. పల్లపు ప్రాంతాలు నీటమునగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందని అధికారులు తెలిపారు.



బిహార్‌లో వరదలకు నీట మునిగిన ఓ గ్రామం

25 శాతం భూభాగంలో లోటు వర్షపాతం

న్యూఢిల్లీ: ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో ఇప్పటివరకు దేశంలోని నాలుగింట ఒక వంతు (25%) భూ భాగంలో లోటు వర్షపాతం నమోదైంది. అయితే రుతుపవన కాలం ముగిసే సెప్టెంబర్ లోపు ఆ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ వర్షా కాలంలో ఇప్పటికి దేశవ్యాప్తంగా సగటున 5 శాతం లోటు వర్షపాతం నమోదైంది.



నాలుగింట ఒక వంతు భూ భాగంలో మాత్రం లోటు మరింత ఎక్కువగా ఉందని ఐఎండీ వెల్లడించింది. మహారాష్ట్రలోని విదర్భ, మరత్వాడ ప్రాంతాల్లో 32%, కర్ణాటకలోని ఉత్తర, దక్షిణ భాగాల్లో 20 నుంచి 25% వరకు లోటు వర్షపాతం నమోదైందనీ, కేరళ, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ వర్షాలు సరిగా కురవలేదని ఐఎండీ పేర్కొంది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలయ్యాయనీ, సెప్టెంబర్ ఆఖరు కల్లా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

కజిరంగ పార్కులో 346 జంతువులు మృతి



ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన అస్సాంలోని ప్రఖ్యాత కజిరంగ జాతీయ పార్కులో వరద ధాటికి 346 జంతువులు మృత్యువాత పడ్డాయి. బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉండటంతో ఈ పార్కుకు వరద తాకిడి ఎక్కువగా ఉంటుంది. గతనెల నుంచి ఇప్పటికి మూడు సార్లు పార్కుకు వరద రాగా మూడోసారి 239 జంతువులు చనిపోయాయి. వాటిలో 200కు పైగా జింకలే ఉండటం బాధాకరం. 15 ఖడ్గ మృగాలు, ఒక బెంగాల్ పులి, నాలుగు ఏనుగులు, నాలుగు అడవి పందులు, రెండు అడవి దున్నలు కూడా వరదల్లో చిక్కుకుని మరణించాయి. 430 చ.కి.మీ ఉన్న కజిరంగా పార్కులో వరదఉధృతంగా ఉన్నప్పుడు 87 శాతం భూభాగం నీట మునిగింది. ఇప్పటికీ 22 శాతం భూభాగం నీటిలోనే ఉంది. 1988లో వరదలు వచ్చినప్పుడు ఈ పార్కులో అత్యధికంగా 1,203 జంతువులు చనిపోయాయి.

నిర్లక్ష్యమే నిండుప్రాణాలు తీసింది!

'ఉత్కళ్' ప్రమాద కారణాలపై విచారణ
- నిర్లక్ష్యం, సమాచారలోపమే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- 'నిర్వహణ నిర్లక్ష్యం'పై వైరల్ అవుతున్న ఆడియోక్లిప్
- మృతులు 22.. క్షతగాత్రులు 156: సర్కారు అధికారిక ప్రకటన



మీరట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైలు ప్రమాద బాధితులు

న్యూఢిల్లీ/ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ రైలు ప్రమాద దుర్ఘటనకు మానవతప్పిదమే కారణమని రైల్వే శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ ప్రాంతంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నట్లు తెలియటంతో.. ఈ పనులకు అనుమతి ఉందా? స్టేషన్ మేనేజర్‌కు సమాచారం ఇచ్చారా? అనే అంశాలపై విచారణ జరుగుతున్నట్లు స్పష్టం చేసింది. కాగా, రైల్వే ఇంజనీరింగ్ విభాగం వెల్లడించిన సమాచారం ప్రకారం.. ప్రమాదం జరిగిన ట్రాక్‌పై చిన్నపాటి మరమ్మతు పనులు జరుగుతున్నందున 20 నిమిషాల పాటు ఈ ట్రాక్‌పైకి అనుమతించకూడదని సూచించినట్లు తెలిసింది. అయితే తనకు మరమ్మతులకు సంబంధించిన సమాచారమేదీ లేదని స్టేషన్ సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం, సమాచారలోపమే ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఘటన జరిగిన తర్వాత ఇద్దరు రైల్వే ఉద్యోగుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఆడియో క్లిప్ లభ్యమైంది. 'ఘటన జరిగిన ట్రాక్‌పై వెల్డింగ్ పని నడుస్తోంది. సమీపంలోని క్రాసింగ్ వద్ద గేట్లను మూసేశారు. కార్మికులు ట్రాక్‌పై ఓ బ్లాక్‌ను వెల్డింగ్ చేస్తుండగానే.. ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. 14 బోగీలు పట్టాలు తప్పాయి' అని వారిద్దరు మాట్లాడుకున్నట్లు ఆడియో క్లిప్ ద్వారా స్పష్టమైంది. విద్రోహ కోణమా? సాంకేతిక లోపమా? పూర్తి మానవ తప్పిదమేనా? అనే అంశాలపైనా విచారణ జరుగుతుందని రైల్వే బోర్డు (ట్రాఫిక్) సభ్యుడు జంషెడ్ మహ్మద్ తెలిపారు. కాగా, శనివారం నాటి ఈ దుర్ఘటనలో 22 మంది మృతి చెందారని.. 156 మందికి గాయాలైనట్లు యూపీ సర్కారు అధికారికంగా ప్రకటించింది. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉందని యూపీ సమాచార శాఖ ప్రధాన కార్యదర్శి అవనీశ్ కుమార్ తెలిపారు. క్షతగాత్రులందరికీ ముజఫర్‌నగర్, మీరట్‌లలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సనందిస్తున్నారు. ఈ ఘటనపై రైల్వే శాఖమంత్రి సురేశ్ ప్రభు విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణ ఆధారంగా ఈ ఘటనకు బాధ్యులెవరనేది ఆదివారం సాయంత్రం కల్లా తనకు తెలపాలని రైల్వే బోర్డు చైర్మన్‌ను మంత్రి ఆదేశించారు. కాగా, రైలు ప్రమాద ఘటనల్లో ఎక్కువ ప్రాణనష్టం జరగకుండా లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌బీహెచ్) కోచ్‌లను దశలవారిగా తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ కొంతకాలంగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

వేర్పాటువాదులకు నిధుల కొరత: జైట్లీ



ముంబై: నోట్ల రద్దు తర్వాత కశ్మీర్‌లోని వేర్పాటువాదులకు, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో మావోయిస్టులకు నిధుల కొరత ఏర్పడిందని రక్షణ, ఆర్థిక శాఖల మంత్రి అరుణ్ జైట్లీ ఆదివారం పేర్కొన్నారు. నోట్లరద్దుకు ముందు కశ్మీర్‌లో వేలాది ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి భద్రతా దళాలపైకి రాళ్లు విసిరేవారనీ, ఇప్పుడు వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని జైట్లీ అన్నారు. ముంబైలో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. జమ్మూ కశ్మీర్‌లో ఆందోళనలు, ఉద్రిక్తతలు ఉండకూడదని కేంద్రం దృఢనిశ్చయంతో ఉందని జైట్లీ పేర్కొన్నారు. కాగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అనుసరిస్తున్న తీరు కారణంగానే జమ్మూ కశ్మీర్‌లో రాళ్ల దాడులు తగ్గాయని లక్నోలో హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

10 మందికి ఉరిశిక్ష

హసీనాపై హత్యాయత్నం కేసులో బంగ్లాదేశ్ కోర్టు తీర్పు



ఢాకా: బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాపై హత్యాయత్నం కేసులో పది మంది హుజీ ఉగ్రవాదులకు స్థానిక కోర్టు మరణ శిక్ష విధించింది. దీంతోపాటు నిషేధిత ఉగ్ర సంస్థలకు చెందిన 9 మందికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 లక్షల జరిమానా విధిస్తూ ఆదివారం తీర్పునిచ్చింది. 'దోషులకు హైకోర్టు అనుమతితో ఉరి తీసి లేదా కాల్చి గానీ మరణశిక్ష అమలు చేయవచ్చు'అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. 2000లో హసీనా పాల్గొనబోయే బహిరంగ సభాప్రాంగణంలో ఉగ్రవాదులు 76 కేజీల బాంబును అమర్చారు. భద్రతా దళాలు ముందే పసిగట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దీనికి హర్కతుల్ జిహాద్–ఈ–ఇస్లామి బంగ్లాదేశ్ (హుజి) చీఫ్ ముఫ్తీ హన్నన్ సూత్రధారిగా గుర్తించారు.

విభజించు.. పాలించు!

- ఇదే బీజేపీ సరికొత్త వ్యూహం?
- కాంగ్రెస్‌ను వీడేలా భూపీందర్ సింగ్ హూడాపై ఒత్తిడి

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికలు, రాష్ట్రాల ఎన్నికల్లో ఘనవిజయం కోసం బీజేపీ కొత్త వ్యూహాలతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సీనియర్లు పార్టీ నుంచి బయటకొచ్చి కొత్త పార్టీ పెట్టేలా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. హరియాణా మాజీ సీఎం భూపీందర్ సింగ్ హూడా కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేలా బీజేపీ తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. హూడాపై ఉన్న కేసులను బూచిగా చూపుతూ.. ఆయన కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత బీజేపీలో కలవకుండా హూడాతో సొంతపార్టీ పెట్టించి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చాలని బీజేపీ వ్యూహం రచిస్తోందని తెలిసింది. అటు హూడా క్యాంపులోని ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్టానంపై విమర్శలు చేస్తున్నారు. హూడాను కాకుండా అశోక్ తన్వర్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించటంపైనా మండిపడుతున్నారు. ఇటీవల పార్లమెంటు సెంట్రల్ హాల్లో జరిగిన ఓ కార్యక్రమంలో హూడాతో మోదీ ప్రత్యేకంగా మాట్లాడారు. గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో బీజేపీపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్‌ను వీడిన శంకర్ సింగ్ వాఘేలాను చేర్చుకోకుండా కొత్త పార్టీ నెలకొల్పేలా బీజేపీ వ్యూహరచన చేస్తోందని సమాచారం. ఇదే వ్యూహాన్ని హరియాణాలోనూ అమలు చేయాలనేది కమలదళం ఆలోచనగా కనబడుతోంది. యూపీఏ హయాంలో పౌరవిమానయాన మంత్రిగా ఉన్న ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ పైనా కేసులను బూచిగా చూపుతూ కేంద్రం ఒత్తిడి పెంచుతోందని తెలుస్తోంది.

ఐఐటీ టాపర్ కల్పిత్ లిమ్కా రికార్డు



న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్స్‌లో వంద శాతం మార్కులు సాధించిన కల్పిత్ వీర్వాల్ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన కల్పిత్ ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో 360 మార్కులకుగాను 360 మార్కులు సాధించి రికార్డ్ సృష్టించాడు. ఐఐటీ అడ్వాన్స్‌లో 109వ ర్యాంకు సాధించిన కల్పిత్ ప్రస్తుతం ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. అయితే, దేశంలోనే కోచింగ్ హబ్‌గా పేరొందిన కోట పట్టణం ఉదయ్‌పూర్‌కు 300 కిలోమీటర్ల దూరమే ఉన్నా ఆయన అక్కడ కోచింగ్ తీసుకోకుండానే ఈ ఘనత సాధించడం గమనార్హం. 'రోజుకు 15 గంటల కూడా చదవలేదు, కోటలో కోచింగ్ తీసుకోలేదు., కానీ, స్థిరంగా, పట్టుదలగా చదివాను.' అని కల్పిత్ పేర్కొన్నాడు. కల్పిత్ తండ్రి మహారాణా భూపాల్ ప్రభుత్వ ఆస్పత్రిలో నర్స్ కాగా, తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

వాటర్‌మార్క్‌ని తొలగించవచ్చు..



లాస్ ఏంజిలెస్: ఆన్‌లైన్‌లోని ఫొటోలకు కాపీరైట్‌లా భావించే వాటర్‌మార్క్‌ని ఆటోమేటిక్‌గా తొలగించేయవచ్చని గూగుల్ శాస్త్రవేత్తలు నిరూపించారు. దీనికి సంబంధించి ఓ అల్గారిథమ్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా వినియోగదారుడి ప్రమేయం లేకుండానే ఆన్‌లైన్ సైట్లలోని ఫొటోలపై ఉన్న వాటర్‌మార్క్‌ని తొలగించగలమని గుర్తించారు. వివిధ కంపెనీలు వాటి లోగోలు, పేర్లను డిజిటల్ ఇమేజ్‌లపై వాటర్‌మార్క్‌లా ముద్రించేవి. వీటిని తొలగించడం అసాధ్యమని కంపెనీలు భావించేవని, ఇది తప్పని నిరూపించామన్నారు. వీటి విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫొటోషాప్‌లో నిపుణులైన వారికి కూడా వాటర్‌మార్క్‌ని తొలగించేందుకు చాలా సమయం పట్టేదని, కొత్త అల్గారిథమ్ ద్వారా ఈ అభిప్రాయాన్ని మార్చామని వివరించారు.

'చైల్డ్ జీనియస్' విజేత రాహుల్!



లండన్: భారత సంతతికి చెందిన ఓ పన్నెండేళ్ల బాలుడు తన ఐక్యూ (ఇంటెలిజెంట్ కోషియంట్)తో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. యూకేలోని చానెల్ 4లో ప్రసారమవుతున్న 'చైల్డ్ జీనియస్' అనే ప్రఖ్యాత క్విజ్ పోటీల్లో రాహుల్ దోశి విజేతగా నిలిచాడు. ఈ కార్యక్రమంలో అడిగిన ప్రతి ప్రశ్నకు సులభంగా సమాధానాలు చెప్పి చైల్డ్ జీనియస్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. గతరాత్రి జరిగిన ఫైనల్స్‌లో తన ప్రత్యర్థి రోనన్ (9)ను ఓడించి విజయం సాధించాడు. రాహుల్ ఐక్యూ స్కోర్‌ను 162గా నిర్ధారించారు. అయితే ఇది అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల ఐక్యూ స్కోర్ కంటే ఎక్కువ కావడంతో రాహుల్ పాపులర్ అయ్యాడు. అంతేకాకుండా వరల్డ్ ఐక్యూ సొసైటీ మెన్సా క్లబ్‌లో సభ్యుడు అయ్యేందుకు రాహుల్ అర్హత సాధించాడు. కాగా, ఫైనల్స్‌లో ఎడ్వర్డ్ జెన్నర్‌కు సంబంధించిన వైద్య ఆవిష్కరణలు, విధానాలను గురించి రాహుల్ చెప్పిన అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి.